

యౌవనశ్రీ

చిత్రకారుడు : శ్రీ దేవీప్రసాదరాయచౌదరి.

భారతి

సంపుటము 23 | మే, 1946 | వ్యయ వైశాఖము | సంచిక 5

అభయముద్ర

●

=‘రంగనాధ్’=

అంధకార సందిగ్ధకాల హృద
యాంతరాళకల్లోల క్లేశినీ !
శిథిల మానసిక వ్యథాధారుణీ !
ఛిన్నభిన్న సుప్తిస్వరూపిణీ !
భయపడకమ్మా భయపడకు !

చల్లని వెన్నెల కాంతి ధరించి స
ముల్లాసినివై వచ్చె సుమస్విని
అంతరమ్మున జ్వలించు మంట చ
ల్లార్చి నొసట కుంకుమ రేఖలనిడు
భయపడకమ్మా భయపడకు !

కాలమాన పర్యాలోకన సం
ఘటిస్మృతి విస్మృతిపథమ్మునకు
తిలాంజలిడి జయఘంటా నాద
స్వరమ్ముతో స్వాగతమ్ము పట్టెను
భయపడకమ్మా భయపడకు !

వాగులు వరదలై ప్రవహించిన ప్రా
పంచిక హాహాకారమ్ములు తొల
గించి అభయముద్రా గీతికలం
దమృతబిందువులు చిలికిరి అమరులు
భయపడకమ్మా భయపడకు !

ఉద్యమమూర్తి దేశోద్ధారకుడు *

— శ్రీ రుక్మిణీనాథ్ —

ఒరులేయవి యొనరించిన - నరవర యప్రియము తన మనంబున కగు తా
నొరులకు నవి సేయకునికి - పరాయణము పరమధర్మపథములకెల్లన్.

ఈ పద్యాన్ని ఏరికోరి తనపత్రికకు లక్ష్యవాక్యం [Motto]గా చేసుకొన్న మనిషిని - మనీషిని జాగ్రత్తగా అర్థంచేసుకోవలసి ఉంటుంది. ఈ పద్యంలో వ్యక్తంఅయిన అర్థం బహు వినసొంపైనది. చాలా ఉన్నతమైన సంస్కారాన్ని ప్రబోధించేది. కాని, ఆచరణలో కష్టసాధ్యం అయినది.

సాధారణంగా వినసొంపైన ఉన్నతభావాలు ఆచరణసాధ్యాలుగా కనబడవు. ఆకాశంలో చుక్కలన్ని ఉన్నతభావాలను విరజిమ్ముకుంటూ జీవిస్తుంటాము. ఏ ఒక్కటీ ఆచరణలో కనబడదు. ఓ. చెంపను నోటితో సూక్తిసందోహాన్ని వెదజల్లి పారేస్తూనే, ఆచరణలో మరింత అధ్వాన్నంగా ఉండే మహామహుల్ని రోజూ నిత్యకృత్యంలో చూస్తూఉంటాం. తినగాతినగా వాజీకరమైన గారెలు చేదెక్కినట్లు, వినగావినగా ఉన్నతభావాల వాగ్జాలం అంటే వెక్కసం వేసిపోతుంది. ఉన్నతభావాల వాగ్జాలం బుర్రఖాలాగా తయారై నిత్యజీవితం మరింత కపటపూర్ణం అవుతుంది. అలాంటప్పుడు ఒక మనిషి, మనీషి మహోన్నతమైన ఒకే ఒక సూక్తిని చేపట్టుతాడు. ఆ అస్త్రంతో అవతరిస్తాడు. తన జీవితాన్ని ఆ సూక్తికి వ్యాఖ్యానప్రాయంగా నడుపుతాడు. చెప్పింది చేస్తాడు. ఆచి తూచి మాట్లాడుతాడు. 'తాను, నేను' అనే రొంపిలో ఇరుక్కోడు. ఏది ఆలోచించినా, పదిమందికీ కలిపి ఆలోచిస్తాడు. పదిమంది శ్రేయస్సుకు కలిసివొచ్చేది ఏమన్నా ఉంటే 'నేను' అంటూ ముందుకొస్తాడు. పదిమందితో తన జీవితాన్ని పెనవేసుకుంటాడు. తన వ్యక్తిత్వాన్ని ఆ సూక్తికి లక్ష్యంగా నిలుపుకుంటూనే పదిమందిలో కలిసిపోయి, వాళ్లకోసమే తను అన్నట్లుంటాడు.

ఎన్ని తీవ్రమైన ప్రతిఘటనలనో ఎదుర్కొంటాడు. వాళ్లకోసం తనంటూ, వాళ్లు పెడుతూన్న ప్రతిఘటనలను ఎదుర్కోవలసిరావటం మనిషి చేసుకున్న పూజకు ప్రతిఫలం. ఇదే మనిషిని బలపరచేది. తపస్సులాంటి ఈ పరీక్షలో తప్తమైతేనేగాని మనిషికి బలం చేకూరదు. ఈ ప్రతిఘటనలను ఆ వ్యక్తి తేలిగ్గా ఎదుర్కుంటాడు. హృదయాన్ని దివ్యాస్త్రంగా ప్రయోగించి హృదయాలను జయిస్తాడు. ఉన్న మంచి ఉద్యమాలకు కలిసివొస్తాడు. ఉన్నవి సాధారణంగా చాలవు. తన శక్తి పెంచుకుంటాడు. దీక్షాబలంతో కొత్త ఉద్యమాలను స్థాపిస్తాడు. వాటిని తానై నడుపుతాడు. వాటి విజయాన్ని ఆయన కళ్లారా తాను చూడచ్చు; చూడలేకపోవచ్చు. కాని ఉద్యమమూర్తిగా ఆయన శాశ్వతంగా ప్రజాహృదయాలను అధిష్ఠించి ఉంటాడు.

శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు, ఆంధ్రమహాపురుషుల్లో ఉద్యమమూర్తిగా కనిపిస్తారు. ఏ ఒక్క ఉద్యమానికో ప్రతినిధిగా ఆయన

*బహుధాన్య చైత్రశుద్ధ ద్వాదశినాడు ఈ యాత్ర చాలించిపోయి శివసాయుజ్యములో చిన్మూర్తులైయున్న 'భారతి' జనకులు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి నవమ వర్ధంతి (12-4-46) సందర్భములో ఇది శ్రీవారి పుణ్యస్మరణ.—సం. భారతి

కనబడరు. అనేక అభ్యుదయకరాలయిన ఉద్యమాలకు ఆయన మూర్తిగా కనబడతాడు. తెలుగుజీవితానికి ఆయన త్రివేణీతీర్థం.

నాగేశ్వరరావుపంతులుగారి చిన్నతనపురోజులు ఎలా గడిచాయో మనకు తెలీదు. ఆ పసితనంలో ఏ ఏ సంఘర్షణలు వారిలో ఉండేవో, వేటిని చూచి ఆయన చెక్కుచెదరకుండా ఉన్నాడో, ఏ ఏ భావాలవైపుకు ఆయన ఆకర్షింపబడ్డాడో తెలిపే గ్రంథాలుగాని, రచనలుగాని లేకపోటం మన దురదృష్టం. చదువుకొనే రోజుల్లో ఏ ఏ తీవ్రభావాలకు ఆయన తన హృదయాన్ని కేంద్రం చేసుకున్నాడో, ఏ ఏ మల్లాగుల్లాలు పడ్డాడో, మథన పడిపడి ఎలా నిర్ణయాలకు వొచ్చేవాడో చదువుకోటానికి వీలులేదు ఇప్పుడు. చిన్నతనంలో నాటకాల్లో వేషం వేసేవాడని మాత్రమే తెలుస్తుంది. ఆ రోజుల్లో నాటకాలు మన దేశానికి కొత్తగా దిగుమతి అయినవి. ధార్వాడువారు ఆ విత్తనాలను వెదజల్లారు. యువకులు ఆకర్షింపబడ్డారు. నాగేశ్వరరావు పంతులుగారూ ఆకర్షింపబడ్డారు. సింపథైజర్ గా ఉండకుండా, సేరుగా రంగస్థలంమీదికి వొచ్చారు. ఇది గమనించుకో తగింది.

ఆరోజుల్లో నాటకాల్లో వేషాలు వేయడం అంటే సామాన్యమైన పని కాదు. ఎంతో సాహసంతో కూడుకున్నది. నటుల్నీ, విటుల్నీ కలిపి అపాంక్తేయులకింద జమకట్టేసిన సంప్రదాయం చిత్తుకాని రోజులవి. మరి నాగేశ్వరరావుగారు వేషాలు వేసినందువల్ల ఏఏ ఇబ్బందుల్ని అనుభవించారో, ఏ ఏ విధంగా ఆయన బాధపడాలిసొచ్చిందో, ఎలా ఎలా రిఆక్టు అయినారో, ఎలా ప్రతిఘటించారో తెలీదు. ఆయనకు ఏనొప్పి కలిగిందో, ఆయనకోసం యితరులు ఎంత బాధ పడ్డారో, ఆబాధ మరి ఇక కలిగించకూడదని ఎంతగా దీక్షపట్టాడో ఆయన, బాధల విలువ కొలుచుకోటానికి ఆయన ఏ ఏ ఎక్స్పెరిమెంట్లు చేశాడో తెలీదు.

చదువు అయిపోయింది. తన అదృష్టరేఖను పరిశీలించుకోవాలిసి ఉంది. ఆయన బొంబయికి ప్రయాణంకట్టాడు. కొలువులోకి కుదిరాడు. దీక్షతో లోకవృత్తాన్ని ఆకళించుకున్నాడు. ఆంధ్రుడన్నవాడు పడుతూన్నపాట్లు కళ్లారా చూచాడు. తాను దూరదేశంలో ఉండి, తన తెలుగువాళ్లు బొంబయి వచ్చినప్పుడు ఉన్న ఆకాస్తలో వాళ్లకు కలిసి వొచ్చాడు. ఇది యివాళ్టిమాట కాదు. ఆనాటిమాట.

చైత్రయాత్రకు ప్రారంభించాడు. దేశంలో జాతీయభావాలు ఉద్యమిస్తున్నవి. బెంగాలువిభజన దేశాన్ని ఉర్రూతలూపింది. ప్రజలు ఎదురుతిరిగి తమ ఆదర్శాన్ని సాధించుకున్నారు. బెంగాలీలు ముందుకువచ్చారు. మనవాళ్లు గూడా నిద్రమత్తులోంచి లేవాలి. కట్టుబాటులోకి రావాలి. కలిసికట్టుగా నిలబడాలి. అనేకరంగాలలో ఎంతో సంపన్నులు కావాలి. ఆంధ్రులకు పత్రికను స్థాపించాడు. ఆయన మాటల్లో చెప్పాలంటే—

"ఆంధ్రులు సకలరంగములందును జేయవలసిన కార్యములు పెక్కులు గలవు. ఆంధ్రులు తమ నిద్రావస్థను పరిత్యజించి వ్యవసాయపరాయణులైనపుడే వారి సంకల్పము లీడేరునని గ్రహించుట భావ్యము"

[1919 మే 28. ఉగాదిసంచిక ప్రస్తావన]

"వంగదేశ విభజనసమయమునందు బహిర్గతమైన జాతీయ ప్రబోధముతో నాంధ్రోద్యమమును, నాంధ్ర పత్రికయు వెడలినవి" [విభవ ప్రస్తావన]

కీలకనామ సం. ఆశ్వీజశుద్ధ దశమి (విజయదశమి) నాడు ఆంధ్రపత్రిక ప్రారంభింపబడింది. ఇతరులు ఏంచేస్తే నీమనస్సుకు ఇష్టంకాదో, ఆపని యితరులకు చేయకపోవడం ఉన్నతమైన ధర్మం అన్న సూక్తిని అస్త్రంగా చేసుకుని ఆంధ్రపత్రిక చైత్రయాత్రకు ఉపక్రమించింది. సకలరంగాలలోనూ ఆంధ్రులు అజయ్యులు కావడంకోసం ఉద్యమించింది.

ఆంధ్రులు సంస్కృతిపరంగా వెనకబడ్డారు. కళాపరంగా వెనకనే ఉన్నారు. ఆంధ్రజీవితం దెబ్బ తింటూన్నది. ఆంధ్రప్రజానీకం తాము పడుతూన్న పాట్లనుగూడా తెలుసుకోలేని మైకంలో పడివుంది. ఒక ప్రత్యేకత, వ్యక్తిత్వం ఉన్న జాతి నిద్రాణమై పడివుంది. మన కోవ్యక్తిత్వం ఉందన్న ఇదిగూడా లేదు. రాష్ట్రం అంటూ లేదు. విశ్వవిద్యాలయం లేదు. కేంద్రం అంటూ లేదు. కేంద్రం అంటూ ఉం

చేసేగాని ఎంతో సాధన జరిగి, సిద్ధి చేపడదు. ఆంధ్రులకు రాష్ట్రం కావాలని ప్రబోధించింది ఆంధ్ర పత్రిక.

మనకు రాష్ట్రం కావాలన్న - సహజమైన - యోగ్యమైన కోరికలోగూడా దుష్టలక్షణాలను చూచారు మన పెద్దలు. తర్జనభర్జనలు ఎంతెంతగానో జరిగాయి. పంతులుగారు—

" ఆంధ్రులు ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణమును కోరుటకు కారణము ప్రజాపరిపాలనవాంఛయే గాని స్వలాభము గాదు. జాతిద్వేషము గాదు, అప్రయోజకత్వము గాదు, ఉద్యోగాభిలాష గాదు. ప్రజావికాసమునకు పరమసాధనంబులైన మాతృదేశవికాసమును, మాతృభాషా వికాసమును ఆంధ్రోద్యమమునకు మూలబీజములు. ఈధర్మమునవలంబింపని రాజ్యముల వికాసము దుర్లభము" [1918 మే 1 ఉగాది ప్రస్తావన]

అని స్పష్టంచేశారు. ఆంధ్రరాష్ట్ర వాంఛలో దుష్టగుణాలను చూచిన అభివృద్ధినిరోధకులు మారక తప్పలేదు. మతం మార్చుకున్నారు. పూర్తిగా మారారు. ఉద్యమాన్ని బలపరచారు. రాష్ట్రవాంఛ, రాష్ట్ర వాంఛ నినాదాలుగా బయలుదేరినవి. రాష్ట్రం ఒక్కటి రావడంతో, చాలదు. అనేకరీతులలో మనం ముందడుగు వెయ్యాలిసిఉన్నాం.

"ఆంధ్రరాష్ట్ర నిర్మాణ మాంధ్రోద్యమ ప్రాప్తికి బాహ్యసాధనమైనను నాంధ్రవ్యక్తిత్వము కేవలము రాష్ట్రమువలన గలుగజాలదు. ఒకవేళ కలిగినను నది ప్రత్యభిజ్ఞానము లేని వ్యక్తిత్వముగ పరిణమించును. ఆంధ్రహృదయమునందు సర్వతోముఖమైన ప్రత్యభిజ్ఞానమును నుదయింపజేసి పోషించుటకు సకలోద్యమములను నాంధ్రమహాసభయందు కేంద్రస్థము జేయుట సాధనము." [1920 మే 20. ప్రస్తావన]

అని పంతులుగారు దారిచూపించారు. ఒక్క వాంఛను వ్యక్తపరచి ఊరుకోలే దాయన. అల్లా ఊరుకోలేదు ఆమనిషి. అది సిద్ధించాలి. అందుకు దీక్షతో పనిచేయాలి. అదీ ఆయనతత్వం.

ఆంధ్రుల కాణాచికి తను దూరంగా ఉన్నాడు. కార్యక్షేత్రానికి దూరంగా ఉండి పనిజరపడం సుకరం కాదు. కార్యస్థానాన్ని మార్చాడు. 1914 లో మద్రాసులో పత్రికను నెలకొల్పాడు. వారపత్రికను దినపత్రికను చేశాడు. ఆంధ్రులకు దినపత్రిక వొచ్చిందన్న రోజున ఎంత సంతోషంగా ఉందో. మనస్సులో ఎంతమంది పండగగా భావించి మురిసిపోయారో... అసాధ్యప్రాయం ఐన దినపత్రిక సలక్షణంగా రోజు రోజూ వస్తూంటే, ఎంతమంది తమ కొక పెద్ద అండ కలిసివొచ్చినట్లు సంతోషించారో. పట్టువిడవకుండా చదువుకొని 'అమ్మయ్య' అని తృప్తిపడ్డారో. ఆంగ్లం రాని నాలాంటి సోదరులు ఆనాడు ఎంతమంది ఆంధ్ర దినపత్రిక చదివి సంగతులు తెలుసుకున్నారో. పత్రిక ఉపదేశం అర్థంచేసుకొని ఆలోచించుకున్నారో. ఆలోచించి ఇదే మనదారి అని ముందుకడుగు వేశారో. నాగేశ్వరరావుగారికి మనసారా చేయెత్తిదణ్ణం పెట్టారో!

దినపత్రికతో ఆయన ఆగిపోలేదు. అక్కడితో గిడసబారికూచోటం ఆయనతత్వంలో లేదు. ఆంధ్రాభ్యుదయం ఆయనవాంఛ. ఉన్న ఇబ్బందులు, కావలసిన పని, చేయవలసిన సాధన, పొందవలసిన సిద్ధి ఇవీ ఆయనకు అహర్నిశలూనూ. ఒక్క దినపత్రికతో సాధ్యము కావు అనేకపనులు. సమస్తరంగాలలోనూ ముందు కడుగు వేయాలని ఆయనవాంఛ. సహజంగా ఆయన కళాపరుడు. సంస్కృతిరంగంలో ఎంతో పనిచేయాలి. గమ్యం ప్రజావికాసం. ప్రజలు వికసించాలి. అందుకు విజ్ఞానవ్యాప్తి అవసరం. "ప్రజాహృదయమునందు విజ్ఞానము లేక వికాసము సాధ్యముకాదు."(విభవ ప్రస్తావన) అన్నది ఆయన గుర్తించాడు. ఇందు కిందుకు బహుభంగుల ఉద్యమించాడు. ఉగాదిసంచికలు ప్రారంభించాడు. సాధారణ సంవత్సరం నాటికి ఉగాది సంచికలనేవి ఆంధ్రులకు సరిక్రొత్త సంగతి. రాజకీయాలగాని, మరే ఒక్కరంగానగాని జీవితం సరిదిద్దబడదు. అనేకరంగాలలోగాని జీవితం నడవదు. జీవితము నడిచే ప్రతిరంగంలోనూ సంస్కారం జరగాలి. ఉగాది సంచికలలో అనేక విషయాలకు చెందిన ప్రచోదనలు వ్యక్తంఅయ్యేవి. అవుతూన్నవి.

ఆర్థికంగా కుంగిపోయినవారిలో అజ్ఞానం పెచ్చు పెరిగిఉంటం అబ్బురమైన సంగతిగాదు. అత్యాశ

ఎంత దుర్భరమైనదో, దానికంటె ఎక్కువ దుర్భరమయినది అతిదరిద్రం. దరిద్రంవల్లనే వ్యక్తి, జాతి, దేశం నిమ్నగామి అవుతుంది. గిడసబారుతుంది. వక్రరీతుల సంచరిస్తుంది. ఏ కలిసివొచ్చే మంచికీ పూనుకోదు. తెలియజెప్పినా వినదు. సుఖపడమన్నా సుఖపడదు. సుఖపడనీదు. దీనికి విరుగుడు అన్నివిధాలా చేయాలి. ఆర్థికరంగానా చక్కబడాలి. హృదయాన్నీ రాపాడాలి. పంతులుగారు తాను బలపడడంతో ఆగలేదు. చెప్పినట్టు చేశాడు. చెప్పినదానికంటే కూడా ఎక్కువ చేశారేమో. లేనివాళ్లకు మిత్రుడై నిలిచాడు. యోగ్యమైన కారణం చెప్పి అడిగినవాళ్లకు తాను ఆర్జించిన ధనాన్ని ఇచ్చాడు. వైజ్ఞానికంగా ఎంతమందో కలిసి రాపాడి తేల్చుకోవలసిన నిగ్గును సుష్ఠుగా ప్రకటించాడు.

తాను రచనలకు పూనుకోన్నాడు. పద్యాలు వ్రాశాడు. అవి ఆయనకు బాగున్నవి, బాగానే ఉన్నవి, ఫరవాలేదు అనిపించిఉండవు. అల్లా ఆయన అనుకుని ఉంటే ఇంకా ఎన్నెన్నో వ్రాసి ఉండేవాడు. వ్రాసినట్లు కనబడదు. వాటిమీద ఆయనకు అభిమానం ఉండిఉండదు. కథ, నాటకం, గీతం, గేయం మొదలయిన వివిధసాహిత్యరూపాలతో సృష్టిచేశాడేమో తెలియదు. ఆపద్యాలయినా ఆయన చనిపోయాక అచ్చయినవి. ఆయన వ్యాసాలద్వారానే తన ప్రబోధనను వ్యక్తంచేశాడు. శరపరంపరలుగా వ్రాశాడు. ప్రతిదీ ఆచి తూచి తీర్చిదిద్దినట్లు ఉంటుంది. బహు సుబోధకంగా వ్రాసేవాడు. దూరాన్వయాలు, వ్యాకరణపు, అలంకారాల మసలతేచీలు లేకుండా చూచేవాడు. లక్ష్యాన్ని పలుసారులు నిర్దేశించి చెప్పాడు:

"ప్రజలయందు విజ్ఞానవ్యాపనమునకు సర్వతోముఖమైన వచనవాఙ్మయము నిర్మాణమును, వ్యాపనమును నత్యంతావసరములుగ నున్నవి."

పత్రికల్లో విజ్ఞానవ్యాపనానికి ఎన్నెన్ని విషయాలలోనో తెలుసుకోవలసిన సంగతులను ప్రస్ఫుటం చేసి ప్రకటించారు.

గద్యవాఙ్మయానికి చాలా ప్రాధాన్యం ఇచ్చాడు. ముందు ప్రజలకు భాషపై రుచిపుట్టాలి. భాషపై అభిమానం కలగాలి. 1914 లో పంతులుగారు వ్రాసిన ఈమాటలు గమనించడం అవసరం. ఆనాటి పరిస్థితి సువ్యక్తం అవుతుంది. అంతే కాదు. ఈనాడు మనం ఉన్న స్థితికీ, ఆనాటి స్థితికీ తేడా ప్రస్ఫుటం అవుతుంది. ముందు మనం ఏం చేసుకోవాలో ఆకేదానికి వీలు కలుగుతుంది ఆమాటలు ఇవి :

"భాషాభిమానము ప్రబలుచున్నది. భాషాభివృద్ధి కనుకూలములైన యత్నములు చేయబడుచున్నవి. నూతనభావములు వికసించుచున్నవి. నూతనభావపూరితములైన గీతములును, కథలును రచింపబడుచున్నవి. నూతన శైలి సంక్షిప్తము. నూతనభావములు గంభీరములు. నూతనసంప్రదాయము లపరిచితములు. నూతనాదర్శములు సదాశాభరితములు. శైలియు, భావములును, సంప్రదాయములును విపరీతాభిప్రాయమును కలిగించుట సహజము. కాలక్రమమున నివి పరిపాటియై భాషకు నూతనాలంకారముల సమకూర్పగలవు. రాయప్రోలు సుబ్బారావుగారు రచియించిన తృణకంకణము, కష్టకమల మొదలగు రాగగీతములు భావరసభరితములు. సభలయం దధ్యక్షులు, సభ్యులు తెలుగుబాసయం దుపన్యసించుట యావశ్యకమయినది. ఆంధ్రభాషాభిమాన వ్యాపన మత్యద్భుతము."

జరుగుతూన్న కృషికి సంతోషిస్తూ ఆయన ఇంకోచోట ఇలా అన్నారు : "బ్రిటిషుయుగమునం దాంధ్రావని భిన్న రాష్ట్రములందు జీలికలయి సహజబలమును గోల్పోయినను ఆంధ్రాభ్యుదయ మవిచ్ఛిన్నముగ జరుగుచున్నది."

ఇకముందు చేసుకోవలసిన పనినీ ఆయనే వ్యక్తంచేశాడు. అంతకంటె ఈనాటికీ మనం వేరే అనుకునేదిగాని, ఆమాటలకే మరికొత్త కలిపేదిగాని ఉండదనుకుంటాను.

"భాషాసంపద మానవజాతుల కుత్తమసంపద. దేశాభివృద్ధి భాషాయత్తము. భాష దేశకాలవ్యవహారాయత్తము. దేశకాలవ్యవహారముల కనుగుణ్యముగ భాషయును మారుట సహజము. అవసరమున కనురూపముగ

ఘకలమును మారుట ప్రకృతిధర్మము. అనవసరమైన మార్పు లసహజములు. అసహజనిర్మాణములు నిరుపయోగములు. అనుపయోగవిషయవినాశనము ప్రకృతిధర్మము. సజీవభాషయును ఈ నియమబద్ధమే. తన్నియమానుసారముగ భాషలకును పరివర్తనము సంసిద్ధము. గ్రాంథికభాషయందును, వాడుకభాషయందును దేశకాలవ్యవహారానుసారముగా మార్పులు జరుగుచున్నవి. ఆ మార్పుల నాపుట యసాధ్యము. భరతఖండమునందితరోద్యమములకుంబలె భాషాభివృద్ధికిని నిది సంధి సమయము. భావియౌవనసంపదకు బాలక్రీడలు బలదాయకములు. నిర్బంధ మభివృద్ధికి ప్రతిరోధకము. పాశ్చాత్యసారస్వతమును, శాస్త్రములను తెలుగునందు జేరవలయును. అపారమైన యభివృద్ధి భాషయందు కావలసియున్నది. ఆంధ్రభాష కపారమైన వాఙ్మయ నిర్మాణ మవసరము." [1914 ఏప్రిల్ 2 ప్రస్తావన]

నేను నాగేశ్వరరావుగారి దానసముద్రంలో మునకలు వేయలేదు. తొలినుంచీ నేను ఆయన్ని రచయితగానే చూస్తున్నాను. రచయితగా ఆయనది మహోన్నతమైన స్థానం. సందేహం లేదు.

రచయితలంటే కథలూ, కావ్యాలూ వ్రాసేవాళ్లే, వ్యాసాలు మున్నగునవి వ్రాసేవాళ్లను రచయితలుగా గుర్తించలేని దశలో మనం ఉండటం విచారించవలసిన స్థితి. వ్యాసాలు వ్రాసేవాళ్లు మనలో చాలా తక్కువమంది ఉన్నారు. కలిపికొట్టడానికి ఆరంగంలో వీలు బహు తక్కువ. పిండి ఉంటేనేగాని రొట్టె సాగదు. అనేక విషయాలమీద అధికారం వచ్చిన పరిస్థితిని పరిపరి దృక్కోణాలనుంచి చూచి సమన్వయించగల ఓర్పూ, ఇదమిత్థం అని విప్పి చెప్పగల నేర్పూ ఉన్నవాళ్లుగాని వ్యాసకర్తలుగా రాణించలేరు. రాజకీయంగా ఆయన చేసిన సమన్వయాన్ని నేను కొలవలేను. సాహిత్యపరంగా ఆయన చెప్పిన విషయాలను చూచుకోగలను. సాహిత్యవిమర్శకుడుగా ఆయన వ్రాసిన వ్యాసాలూ, చెప్పిన పీఠికలూ నిస్తులాలు. కళాపూర్ణోదయాన్ని మంత్రశాస్త్రపరంగా ఆయన వ్యాఖ్యానించినది స్థలంలో కొద్దిది కావచ్చుగాని విషయంలో కాదు. నన్నయతిక్కనలను గూర్చి ఆయనచేసిన వ్యాఖ్యానం శిరసాధార్యం. మనుచరిత్రకారుణ్ణిగురించి చెప్పిన ముక్కలు ఆయనసమీక్షాపాటవాన్ని వెల్లడిస్తవి. పోతరాజునుగూర్చి ఆయన వ్రాసిన భాగం ఆయనహృదయాన్ని సువ్యక్తంచేసేది. వసుచరిత్రను గూర్చి చెప్పినమాటలు నిజాలు. పాల్కురికి సోమనారాధ్యుణ్ణిగూర్చి ఆయన అన్న మాటలు మననంచేయతగ్గవి. బసవపురాణానికి ఆయన వ్రాసిన పీఠికను ప్రతివారూ చదివితీరాలి. సౌందర్యమంజరికి ఆయన వ్రాసిన పీఠిక ఓపట్టాన బోధపడకపోయినా—విషయం అలాంటిది—చదివి మననం చేసుకోతగింది. కుండలినీ శక్తి ఇలాంటిదీ అని మాటల్లో విప్పిచెప్పిన వాళ్లను ఆయన్ని మినహాయిస్తే నే నింకా వెతుక్కోవలసివుంది. అనాహతచక్రం మున్నగు మంత్రశాస్త్ర విషయాలను లోతుకు దిగి తేలికగా విప్పిచెప్పిన వాళ్లల్లో ఆయన ప్రథమ గణ్యుడు.

విపులంగా విస్తరించి చెప్పాలిసిన సాహిత్య చరిత్రను క్లుప్తంగా చక్కగా కొద్దిపేజీల్లో చెప్పిన ఆయనపూనిక గణ్యమైంది. వాఙ్మయాని కొక సూచిక తయారుచేసిపెట్టిన మహత్త ఆయనదే.

"భాషకు ప్రయోజనము భావప్రకాశనముగాని శబ్దనిర్ణయము గాదు. ప్రజలకు సులభగ్రాహ్యమైన భాషను వాడుటయే విజ్ఞానవ్యాపనకు సాధనము. సులభగ్రాహ్యములైన పదములు తత్సమపదములైనను దేశ్యములైనను వన్యభాషాపదములైనను సమానాదరణమును బొందతగియున్నవి." అని రచయితలకు భరవసాయిచ్చాడు.

"కవిత్వమునకు హృదయము భావమైనపుడు మాటల ప్రతిబంధకమును తొలగించుటవలనను కావ్యమునందు రసానందమున కభ్యంతరములు కలుగజాలవు" అన్నాడు.

మహాదీక్షాపరాయణులు కానివారు మహాకావ్య నిర్మాణాధికారులు కారన్నాడు. శృంగారరసాన్ని గూర్చి గమనార్హం, శిరసాధార్యం అయిన వ్యాఖ్యానం చేశాడు.

"ప్రజాహృదయమునందు వ్యాసరచనాభిలాష వృద్ధిపొందినటులు జిజ్ఞాసాభిలాష వృద్ధిపొందకుండుట

శోచనీయము. ప్రజల చిత్తవృత్తి స్వల్పవిషయము లందు లగ్నమౌచున్నటుల మహద్విషయములందు లగ్నము కాకున్నది" అని హెచ్చరిక చేశాడు.

"పురాణయుగమునందు వర్తిల్లిన భక్తిహృదయము ప్రబంధయుగమునందు శృంగారహృదయముగ పరిణమించినది. విజయనగర రాజుల విజయములు, సామ్రాజ్యసంపదలు, యోధుల సాహసపరాక్రమములు, ప్రభువుల భోగపరాయణత్వము, ప్రజల విషయవాంఛలు, కవుల రాజసప్రవృత్తి శృంగారరసవికాసమును కలుగజేసినవి....వాఙ్మయలక్ష్యము కామపరాయణమైనది. కవు లస్వతంత్రులై రాజాశ్రయజీవులై స్వీయప్రతిభను గోల్పోయిరి." అని వెనకటి సంగతిని నివేదించి చెప్పాడు.

ఒకరికోసం, ఒకరి మెరమెచ్చులకోసం కాదుస్మా నీ పని అని రచయితకు ఆయన చేసిన హితబోధ ప్రతి రచయితా సంస్మరించుకోతగింది.

"వర్తమానయుగమునందు ప్రజలు వాఙ్మయపోషకులు. ప్రజలయందు విజ్ఞానవ్యాపనమునకుసాధనమైన వాఙ్మయ మవసరంబగుచున్నది" అనీ, "శ్రీమంతుల కంటెను వర్తమానయుగమునందు ప్రజాదరణము వాఙ్మయాభివృద్ధికి సాధనముగ నున్నది" అనీ ఆయన చెప్పిన మాటలు ఇవాళకూడా రచయితలు తెలుసుకోతగిఉన్నవి.

"గ్రంథకర్తలు ప్రజాపోషణము లేక కృశించుచున్నారు. ప్రజాపోషణమువలన వాఙ్మయాభివృద్ధి కవకాశములు గలుగగలవు" అని యిటు ప్రజలకు విశదపర్చి చెప్పాడు.

"పండితుల దృష్టి సంస్కృతముమీద నిలిచి నటులు తెనుగుమీద నిలువలేదు" అనీ, "వైదికమతమునకు కర్మప్రాధాన్యము, బ్రాహ్మణాధిక్యము కీలకములు. వీనిని దేశకాలపాత్రములు శిథిలము చేసినవి" అనీ, "వైదిక మతోద్ధరణమును చేయుటకు వైదికమతప్రియు లెంత పాటుపడినను నది శిథిలమైన దనియే యొప్పుకొనవలయును" అనీ వెల్లడిచేశాడు.

"ఆచారపాశబద్ధమైన ప్రపంచము జ్ఞానప్రదమైన స్వాతంత్ర్యమును బడయుట కపారమైన దుఃఖానుభవ మవసరమగుచున్నది" అని నొక్కి చెప్పాడు.

అభ్యుదయకారి అయిన ప్రతి ఉద్యమాన్ని గూర్చి ఆయన కలగజేసుకొని కలిసివచ్చాడు. రచయితగా ఆయన ఎంత అభ్యుదయ రచయితో ఆయన పంక్తు లెన్నో వెల్లడిస్తవి. మిగతా రంగాల్లోకూడా ఆయన అభ్యుదయపంథాకు నిలబడి, కలిసివచ్చి ఆ ఆ రంగాలను సంపన్నంచేశాడు.

భారతి వచ్చింది. ఆనాటికి మన దేశంలో శిల్పమంటే అభిరుచి చాలా తక్కువ అని ఒప్పుకు తీరాలి. చిత్రాలమీద, శిల్పంమీద మానవునికి ఉండే సహజాభిలాషతప్ప పక్వమైన అభిరుచి లేదు. అంతే కాదు. పక్వమైన మన కళాసంప్రదాయం దెబ్బతిన్నది. దాన్ని పునరుద్ధరించుకోవలసిన స్థితిలో ఉన్నాము. ప్రాచ్యశిల్పసంప్రదాయం మరుగునపడిపోయింది. పాశ్చాత్యసంప్రదాయానికి అనుకరణం తలెత్తి విజృంభించింది. పాశ్చాత్యుల శిల్పసంప్రదాయంలో రూపపుష్టికి ప్రాధాన్యం, భావపుష్టికీ రేఖాసౌందర్యానికీ అప్రాధాన్యమున్నూ. భావపుష్టికీ, లావణ్యపుష్టికీ, రేఖాసౌందర్యానికీ భారతీయసంప్రదాయం వాసిగాంచింది. ఇది మరుగయింది. మాడెల్ పద్ధతీ, రూపపుష్టీ తలెత్తినవి. రవివర్మ ఈపద్ధతిని అనుసరించి అనుకరించాడు. రవివర్మ చిత్రాలు ఇందువల్లనే ఉన్నతమైన ప్రయోజనాలను సాధించలేకపోయినవి. అరుచిని కలిగించేవి. 1924 ప్రాంతాల్లో మన తెలుగుగడ్డను యింటింటా రవివర్మబొమ్మలూ, దర్బారుబొమ్మలూ వేలాడుతూండేవి. చందనపుబొమ్మలూ, పాత్రసామగ్రిమీద చెక్కబడిన శిల్పపు నైపుణ్యమూ తేలికగా చూడబడేది. దేవాలయ సౌందర్యం, విగ్రహాలకీవీ తక్కువగా పరిగణింపబడేది. ఈ అరుచిని పోగొట్టుకోడానికీ, సరి అయిన శిల్పుల్ని తయారు చేసుకోడానికీ అఖిల భారతమూ తపస్సుచేస్తోంది. వంగీయుల్లో అవనీంద్రాదులు అఖండమైన కృషి చేశారు. రాజమండ్రిలో దామెర్ల రామారావుగారూ, బందరులో ప్రమోదకుమారఛటోపాధ్యాయులూ ప్రయత్నాలుచేస్తున్నారు. భారతి వచ్చింది. రామారావుగారి బొమ్మలు విరివిగా వచ్చై. తెలుగుచిత్రకారులకు నాగేశ్వరరావుపంతులుగారు కలిసివచ్చారు. చిత్రకళనుగూర్చి వ్యాసాలు

వ్రాయించారు. చిత్రాలను సుష్ఠుగా ప్రకటించారు. అజంతా చిత్రాలమీద తానై స్వయంగా విపులవ్యాసం వ్రాశారు. చిత్రకళమీద పుస్తకమే—తెలుగులో అది ఒక్కటేనేమో ఇప్పటికీ—తెచ్చారు.

ఈ నాడు మనం చిత్రకళవిషయంలో ఫరవా లేదు, సంపన్నమైన అభిరుచినే కలిగియున్నాము. ఆయన అన్నమాటలు ఉద్యమం నడిపి ఫలితాన్ని చూస్తున్న సంతోషానికి చెందినవి. అవి ఇవి: "పదేళ్లయందు చిత్రకళ ఆంధ్రదేశమునం దత్యద్భుతముగ వికసించినది. ఆంధ్రచిత్రకళ వ్యక్తిత్వమును గలిగి ప్రత్యేక వైఖరిని గలిగియున్నది." [విధవ. ప్రస్తావన]

సంగీతాన్ని గూర్చి మనం యింకా ఓ తీరుగా సంపన్నులం కాలేదు. మన పండితులూ, మన పత్రికలూ సంగీతాన్ని విరివిగా ప్రచారంచేసుకుని, అభిరుచిని పెంపొందించుకోవలసివుంది. భారతి తొలిసంచికలలోనే ప్రామాణికమైన వ్యాసాలు ప్రకటింపబడుతూండేవి. సంగీతశాస్త్రాన్ని సుబోధం చెయ్యాలన్న దీక్ష స్ఫుటంగా కనబడేది. సంగీతానికి సంబంధించిన రాగరాగిణుల చిత్రాలుకూడా ప్రకటింపబడేవి.

చదువుకొన్నవారికే అవి ఉపయోగపడవచ్చు. నిజమే. చదువుకొన్నవారినిగూడా చదివించుకోవలసిన స్థితిలో ఉన్నాము ఇంకా మనం.

ఆయన వ్రాసిన వ్యాసాలను గమనించక కొందరూ, గమనించి, ఏం చెప్తున్నాడు, ఏంచేస్తున్నాడు అన్నది తలపెట్టక కొందరూ ఆయన్ను రచయితగా ఎంచుకోలేకపోయారు. గమనించినవారు ఇది వాడుకభాషా, గ్రాంథికమా అన్న మీమాంసలో పడి, అదీ ఇదీ కాకపోయేసరికి ఆంధ్రపత్రికభాష అని అనేసుకున్నారు.

గ్రాంథికభాష వాడుకభాషలోకి మారేప్పుడు అటు గ్రాంథికమూ ఇటు వ్యావహారికమూ కాని ఒక స్థితి ఉంటుందని గమనించాలి. ఒక విధానం మరొక విధానంలోకి మారటానికి మధ్య ఒక ప్రత్యేకస్థితిని గడవాలిసుంటుంది. గ్రాంథికం అనకోగానే వాడుకభాషలోకి మారదు.

ఈపద్ధతి అటు వాడుకభాష కుండే తియ్యదనమూ, సజీవతా, ఇటు గ్రాంథికాని కుండే బింకమూ ఉండాలని యత్నిస్తుంది. దీనికి ప్రధానమైన గుణం స్పష్టత. సంధులు, ఔపవిభక్తికాలు, గసడదవాదేశాలు, అరసున్నలు, బండిరాలూ మొదలయినవి పకడ్బందీగా పడవు. అల్లాగని ఉపేక్ష చెయ్యబడవు. ఇది మధ్యస్థితి. ఈ స్థితికి కొమర్రాజు లక్ష్మణరావు, కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, కాశీనాథుని నాగేశ్వరరావుగారలు లక్ష్యప్రాయులైన రచయితలు. ఇలా సమన్వయించుకుంటేనేగాని తత్వం బోధపడదు.

నాగేశ్వరరావుపంతులుగారు శిరపరంపరలుగా వ్యాసాలు వ్రాశారు. వాటివాటి అవసరాలను బట్టి అవి ప్రకటించబడినవి. వాటిని ఏకత్రా సిద్ధపెట్టి గ్రథనం చెయ్యడం అవసరం. ఆయనవ్యాసాలు ఒక్కచోట లభ్యపడి, సమీక్ష జరిగి, వివేచనలోకి వస్తేనే గాని ఆయన్ను పూర్తిగా ప్రజ బోధపరచుకోలే దనిపిస్తుంది. ఆనాటి సంగతులమీద వ్రాసినా వాటి మహత్తు మాసిపోనిది. లోతుకు దిగి వ్యాఖ్యానించడం జరిగింది కనుక వాటి ప్రయోజనం అంత తీరిపోనిది. తాత్వికుడుగా ఆయన చెప్పిన సంగతుల పటిష్ఠతా, దృష్టివైశాల్యమూ మహోన్నతములైనవి. ఆయన వ్యాసాలు గ్రంథరూపేణా రావడం అవసరం.

మనం బాగుపడాలనీ, మన కళలూ, మన సంస్కృతీ మూడుపువ్వులూ ఆరుకాయలూ కావాలనీ, మన సంఘం మహోన్నతపథాలలో విహరించాలనీ వాంఛిస్తాం. అందుకు ఏమేమి చేసుకోవాలో చూడం. చూచినా పనిచేయం. పనిచేసి చూపించారు పంతులు గారు. ఎంత విజ్ఞానాన్ని ప్రజలకు సుగమం చేసుకుంటామో, ప్రజానీకానికి ఉత్తమవిద్య ఎంత అందుబాటులో ఉంటుందో అంతగా మన కళలూ, సంస్కృతీ, సంఘమూ వికసిస్తవి. మద్రాసు విశ్వవిద్యాలయం వచ్చేదాకా సంస్కృతమూ, ఆ తరువాత ఆంగ్లమూ ఉత్తమవిద్యను గుత్తకొన్నవి. ఆంధ్రం నెత్తిఎక్కి పిండికొట్టినవి. వాటి సత్తాధికారాన్నుంచి తెలుగును తప్పించాలి. తెలుగు ఉత్తమవిద్యాద్వారం



కావాలి. దుబాషీల ప్రాభవం పోవాలి. మాతృభాషలో చదువను వ్రాయను నేర్చినవారికి ఉన్నతమైన విజ్ఞానం లభ్యపడాలి. చదువుకొన్న కొద్దీ, అనంతమైన విజ్ఞానం మాతృభాషాద్వారా ప్రజలకు అబ్బే అవకాశం కలగాలి. దీనికి ప్రభుత్వసహాయం అవసరం అన్న మాట నిజమే. కాని ఈలోగా మనం చాలా చేసుకోవచ్చు. యిందుకుగాను తలపెట్టినదే కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారి విజ్ఞానసర్వస్వం. విజ్ఞానసర్వస్వానికి నాగేశ్వరరావుగారు కలిసివొచ్చారు. దాన్ని సంపన్నం చేశారు. పంతులుగారి హయాంలో విజ్ఞానసర్వస్వం పూర్తికాకపోవడం మన దురదృష్టం.

కాంగ్రెస్ వెల్లువ మహాతీవ్రంగా వచ్చింది. దేశం దేశం ఊగింది. దేశజీవనంలోనే మార్పువచ్చింది. గాంధీజీ ఉప్పుసత్యాగ్రహం స్థాపించాడు. మట్టిలోంచి మనుష్యశక్తి లేచింది. దేశభక్తి తొణికిసలాడింది. వీరులు-నాగేశ్వరరావుగారి మాటల్లో అయితే, త్యాగధీరులు దేశంకోసం ఇల్లువాకిళ్లు విడిచారు. సంసార తాపత్రయం మరిచారు. సభలు చేశారు. తకిలీలు వడికారు. లాటీదెబ్బలు తిన్నారు. పికెటింగ్ చేశారు. తాళ్లుకొట్టారు. ఉప్పు తెచ్చారు. అరెస్టయ్యారు. బోర్సాదులో ఆడవాళ్లకు అపరాధం జరిగింది. పంతులుగారు కాంగ్రెస్‌లో మునిగిపోయారు. ఉప్పుసత్యాగ్రహాన్ని నాగేశ్వరరావుగారు స్వయంగా నడిపారు. జైలుకెళ్లారు. జైలులోకూడా ఆయన తన అభిమతమైన పద్ధతిని విడవలేదు. జైలుకెళ్లివచ్చిన సోదరులు ఈ సంగతి చెప్పుకుంటారు: ఒక ప్రముఖాంధ్రనాయకుడూ, నాగేశ్వరరావుగారూ జైలులో రోజూ టవర్ దాకా షికారుకు వెళ్లేవారట. తక్కినక్లాసు నిర్బంధితులు ఎక్కడ కనబడతారో, ఏం కష్టం, ఏం బాధ వెళ్లదీస్తారో అని పక్కనవున్న ప్రముఖనాయకుడు పత్రిక చాటుచేసుకొనో, మరోదిక్కు చూస్తూనో దాటుకెళుతూండే-నాగేశ్వరరావుగారు ఎవరైనవాడి కుశలం కనుక్కొని, యోగక్షేమం విచారించి, ఆరోగ్యంసంగతి ముఖ్యంగా అడిగి, అవసరమైన సహాయం చేసిపంపేవారట. పంతులుగారి క్యావలి ।ంది ఇదే. ఆయన లేనివాళ్లకు బంధువు.

"దురదృష్టవంతు లెల్లప్పుడును దురదృష్టవంతులుగను, పాపు లాజన్మాంతము పాపులుగను, దరిద్రులు దరిద్రులుగను, అజ్ఞాను లజ్ఞానులుగను నుండవలయునని శాసించెడి సనాతనవర్ణాశ్రమధర్మములు మానవజీవిత ప్రయోజనములకు నిరర్థకములు."

ఈపంక్తులు వ్రాసిన పంతులుగారు ఎన్నికలలో సనాతనపక్షపుఅభ్యర్థిని చిత్తుచేశారు. ఇల్లాగే ఆయన వ్రాసినదీ చేసినదీ సమన్వయంచేసుకుచూచుకుంటేగాని ఆయనతత్వం బోధపడదు.

హరిజనాభ్యుదయానికి ఆయన చేసిన పని ఎంతమందో వ్యక్తులు కలిసి చేయాలిసినంత పని. వాళ్లమీద నాలుగుపద్యాలు వ్రాసో, సభల్లో వాళ్లను గుళ్లల్లోకి రానివ్వాలని కంఠశోష పెట్టో ఆయన ఉండలేదు.

అసలుగోల ఇదీ:

"భరతఖండమునందును ప్రజల దుర్దశకు మొదటి కారణ మార్థికమని కన్నులు తెఱచి చూచువారు గ్రహింపగలరు. నిమ్నజాతుల దుర్దశకు కారణము వారి గర్భదారిద్ర్యము, పరమాజ్ఞానము...విద్యావివేకవంతులు పంచములైనను సన్మానమును పడయుచున్నారు. సన్మానమునకు పాత్రుడుగాకపోయినను సుఖజీవనము గల పంచము డితరుల ప్రమేయము లేకుండ సుఖముగ జీవయాత్ర గడుపగలడు. దేశమునందు గర్భదరిద్రులు నిమ్నజాతులందును, నితరకులములందును గలరు. వర్తమానవాణిజ్యయుగమునందు ధనగౌరవము సకలగౌరవములను జయించి విజయధ్వానమును పూరించుచున్నది. కులము, విద్య, ధర్మము, మతము, ధనము కరియప్పములు కట్టుచున్నవి. నిర్ధనులు మృతప్రాయులు. నిర్ధనులకు సుఖము లేదు." [1919 మే 28. ప్రస్తావన]

ఇవాళ పైమాటలు వ్రాస్తే వారు అతివాదులుగా పరిగణింపబడుతారు. 1919 లో వ్రాసిన పంతులుగారు ఈనాటి అతివాదులకు ఎంత సన్నిహితుడో తెలుసుకోవచ్చును. లేనివాళ్లయెడల అంత సానుభూతీ, అభిమానమూ ఉన్నది కనుకనే ఆయన అంతంతగా వితరణశాలి అయినాడు. తెలుగునాట ఆయన ఈవి నెరగని మనిషి, మనీషి ఉండటం అసంభవం అయింది.

తోటి జాతీయనాయకులం కవులను, సంగీత పాటకులను, శిల్పులను, చిత్రకారులను, స్థపతులను, లలితకళలకు సంబంధించేవాళ్లను ఎక్కిరించి, హేళన చేసి ఉస్కారించి, నొప్పించి, బాధించుతూన్నా—పంతులుగారు వాళ్లకు అండఅయినారు. ఎంతదాకా యీ అభిమానం వెళ్లిందంటే—'పంతులుగారున్నారులే' అని వాళ్లు గుండెమీద చేయివేసుకుని నిద్రపోయేవారు. రైలుటిక్కెట్టు కొంటేచాలు, పంతులుగారుంటారని పట్నానికి ప్రయాణంకట్టుకునేదాకా వచ్చింది. అది పంతులుగారికి వాళ్లయందున్న అభిమానాన్నీ, వాత్సల్యాన్నీ తెలుపుతుంది.

సైన్సు అపారంగా పెరుగుతూన్నది. మానవునికి ప్రతిదీ ఉపయోగపడాలి. ప్రకృతికి ఎదురుతిరిగి మనిషి మనీషి అయినాడు. సుఖంకోసం ఎంతకృషి చేశాడు. యంత్రాన్ని సృష్టించాడు. సుఖపడుతున్నాడు. ఇది యంత్రం, పెనుభూతం, దీన్ని విసర్జించాలి అన్న ఇది కుతరామూ పనికిరానిది అని క్షిప్తించడం మూర్ఖం. నాగేశ్వరరావుగారు మరనాగళ్లతో సేద్యంప్రారంభంచేశారు. దాని లగువుబిగువులు తెల్సుకొని దాన్ని వ్యాప్తిలోకి తేవాలని సంకల్పించారు. మానవునికి సౌకర్యాలు కలగాలి. విశ్రాంతి కావాలి. కడుపునిండా తిండి, ఒంటినిండా గుడ్డ కలిగి, అతను సుఖపడాలి. సుఖపడి ఇతరుల్ని సుఖపెట్టడం నేర్చుకోవాలి. జాతిజాతి, దేశం దేశం అంతా బాగుపడాలి అన్న దృష్టి ఉన్న పంతులుగారికే అది చెల్లింది.

ఉద్యమం నిర్మించినవారు దానితో గిరిగీసుకూర్చుంటారు. అక్కడితో వారికి తృప్తి. ఆపరిహద్దు దాటి ఆలోచించరు. ఒకవేళ ఆలోచించినా ఒప్పుకోరు. వారు ఒప్పుకున్నా ఇతరులు మాతిమురకటిస్తారు. పంతులుగారు అన్ని అభ్యుదయ ఉద్యమాలనూ కలిపి రావడం, అండగా నిలవడం, నడపడం చేశారు. రష్యాలో జరుగుతూన్న మానవాభ్యుదయ ఉద్యమాలను గూర్చి ఆలోచించి వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యానం ప్రతిఆంధ్రుడూ పతకమాలవలె ధరించతగింది.

"సోవియటు ప్రభుత్వము మతశిక్షణమునందును దైవారాధనమునందును వివాహసంబంధమందు వ్యవసాయపరిశ్రమ నిర్వహణమునందు సంగ్రామ సన్నాహములందు యంత్రాద్యుపకరణోపయోగములందు వైద్యసహాయమునందు చూపుచున్న సాహసధైర్యములు నిరర్థకములైన ప్రాచీనాచార సంస్కారములను విడచి ప్రయోజనకరములైన సంస్కారసాధనముల నవలంబించుటకు ప్రపంచమునకు వినియోగపడగలవు. సోవియటు పరివర్తనము భావికాలమునం దెటులు పరిణమించినను మానవస్వాతంత్ర్య సంరంభమునందు నూతన శకనిర్మాణమునకు వినియోగపడగలదు."

[భావసంవత్సరాదిసంచిక ప్రస్తావన]

- మరుసటి సంవత్సరం ఇల్లా వ్రాశారు:

"సోవియటు రాజ్యాంగారాధనము ప్రథమమున బలవంతారాధనమైనను క్రమముగను నభిమానారాధన పరిణామమును పొందుచున్నది. స్త్రీలు పురుషులు చిరకాల సంచితములైన ఆచారపాశబంధములను విసర్జించి సోవియట్ ధర్మారాధనమునందు భక్తిపరాయణు లగుచున్నారు. సంసారబాధ్యతాభారములు దంపతులకు తగ్గిపోవుచున్నవి. పిల్లల సంరక్షణభారమును ప్రభుత్వము పూనుచున్నది. స్త్రీలు పురుషులవలెను సైన్యరక్షణాది సకలవృత్తులయందును నధికారు లగుచున్నారు."

[యువ సంవత్సరాది సంచిక ప్రస్తావన]

మహామహులు నాగేశ్వరరావు పంతులుగారు తమ జీవితాన్ని ఒకలక్ష్యానికిగా నడిపించారు. అనేక అభివృద్ధి ఉద్యమాలలో ఆయన ప్రాణంగా పనిచేశారు. తీచికొద్దున పిచ్చికగూడు కట్టి చెరిపివేసినట్లు పలువుర జీవయాత్ర వెళ్లమారిపోతుంటే - ఇది కాదని లక్ష్యం నిర్దేశించుకుని, సౌధం కట్టుకొచ్చినట్లు జీవితాన్ని నడిపారు. తన దేశానికి, జాతికి ఆయన బలంగా నిలబడ్డారు. తన జాతిజీవనంలో ఆయన పాలలో పంచదారగా కలిశారు. లేనివాళ్ల బంధువుగా నిలబడి దేశోద్ధారకు లైనారు.

ఆయన నిర్మించిన ఉద్యమాలు ఉన్నవి. ఆయన పరమపదించారు. ఆయన నావాడు, ఆయనవల్ల మా ఉద్యమం ఇంత బలపడిందనుకున్న ప్రతివారికీ ఆయనఉద్యమాలను ముందుకు తీసుకెళ్లడమే కర్తవ్యం. అప్పుడే ఆయనయందు మనం నిజంగా భక్తిని ప్రదర్శించినవార మౌతాము.

శ్రీనాథుఁడు - చంద్రభూష క్రియాశక్తిరాయలు

= శ్రీ బండారు తమ్మయ్య =

సుప్రసిద్ధాంధ్రకవిసార్వభౌముఁ డను శ్రీనాథుని జీవితమునందలి యుత్కృష్ట విషయములలో నాతఁడు కర్ణాటకభూపాలాస్థానమునఁ బడసిన కనకాభిషేకసత్కారము పరిగణింపఁదగినది. కర్ణాటరాజాస్థానియందలి విద్వత్కవిసార్వభౌముఁడు, అష్టదిగ్విజయశోవిష్టంభుఁడు నగు గౌడడిండిమభట్టారకుని నుద్భట వివాదమునఁ దన కవితాపాండిత్యశౌండీర్యమున నోడించిన సందర్భమునన శ్రీనాథున కీసువర్ణస్నానసత్కారము జరుగుటయు, డిండిమభట్టారకుని కవిసార్వభౌమ బిరుదము నడంచి దానిని శ్రీనాథుఁడు స్వీకరించుటయుఁ బొసఁగియుండు నని శ్రీనాథకృతమని నిర్వివాదముగ నంగీకరింపఁబడు నీక్రింది చాటుపద్యమువలన వ్యక్తము కాఁగలదు.

"సీ. దీనారటంకాలఁ దీర్థమాడించితి
  దక్షిణాధీశు ముత్యాలశాలఁ
బలుకుఁదోడైతాంధ్ర భాషామహాకావ్య
  నైషధగ్రంథసందర్భమునను,
బగులఁగొట్టించి యుద్భటవివాదప్రౌఢి
  గౌడడిండిమభట్టు కంచుఢక్క
చంద్రభూషక్రియాశక్తిరాయలయొద్దఁ
  బాదుకొల్పితి సార్వభౌమబిరుద

గీ. వెలుఁగు మెప్పించెదో నన్ను నింకమీఁద
  రావుసింగమహీపాలు ధీవిశాలు
నిందుకోలువున నెలకొనియుండు నీవు
  సరసుసద్గుణనికురంబ! శారదాంబ."

దీనినిబట్టి కర్ణాటకాస్థానమున శ్రీనాథ డిండిమ భట్టారకులకు జరగిన యుద్భటవివాదమునఁ జంద్రభూష క్రియాశక్తిరాయలు అనువారు 'మాధ్యస్థ్యము వహించి డిండిమభట్టారకుని కవిసార్వభౌమబిరుదమును శ్రీనాథునకుఁ బాదుకొల్పిరని దోఁతకము కాఁగలదు. "క్రియాశక్తి రాయ" లనునది "క్రియాశక్తియొడయరు" అనుటకుఁ బర్యాయము. ఒడయఁడు, రాయఁడు అనునవి ప్రభు వాచకములు. 'ఒడయఁడు' అనుదాని కన్యదేశబహువచనమే 'ఒడయరు'. ఆకాలమునఁ గర్ణాటకరాజధానియగు విద్యానగరమునఁ గ్రియాశక్తిమఠ మను శైవమఠము నెలకొనియుండెననియు, ఆమఠాధిపతుల నామములచివర 'క్రియాశక్తియొడయరు' అను నుపపదమును జేర్చుట పరిపాటియనియు, నీమఠస్వాములే కర్ణాటరాజ్యాధీశులకు దీక్షాగురువులుగా నుండెడివారనియుఁ జరిత్రజ్ఞులకు సుపరిచితములయిన ప్రఖ్యాతవిషయములు. కావునఁ బయిపద్యమునుబట్టి శ్రీనాథునకుఁ గర్ణాటక భూపాలునిచేఁ గనకాభిషేకగౌరవము చేయఁబడినప్పుడు చంద్రభూషక్రియాశక్తియొడయరు రాజగురువుగానుండెనని తెలియనగును. ఈతఁ డెప్పటివాఁడు, ఆతనికి శిష్యుఁడుగానుండి శ్రీనాథునికిఁ గనకాభిషేకసత్కార మొనర్చిన కర్ణాటభూపాలుఁ డెవరు అను విషయమునఁ జరిత్రజ్ఞులలో నింతవఱకు సరియైన నిర్ణయ మేర్పడలేదు. మొదటిబుక్కరాయల (క్రీ.శ. ౧౩౫౦-౧౩౭౭) కాలములో ములికినాటిసీమయందలి కొండూరుగ్రామము నగ్రహారముగాఁ బడసి చంద్రభూషణాచార్యుఁడు నిజగురుఁ డను దేవేశక్రియాశక్తియతీంద్రుని యిరువదిరెండవయాబ్దికసందర్భమున సాధారణసంవత్సర శ్రావణ బ ౧౨ సోమవారమునాఁడు ఆగ్రామమునకు దేవేశపురమని పేరుపెట్టి యేఁబదియిద్దఱు బ్రాహ్మణులకుఁ బంచియిచ్చెనని మెకంజీదారవారు సేకరించిన లోకలురికార్డులలోని యొకశాసనపు నకలునుబట్టి తెలియవచ్చుటచే దాని నాధారముచేసికొని, శ్రీ డాక్టరు నేలటూరు వేంకటరమణయ్య గారు మొదటి బుక్కరాయలకాలమున నున్న చంద్రభూషణ

క్రియాశక్తిరాయలే శ్రీనాథుని కనకాభిషేకకాలము నాఁటికిఁగూడ జీవించియుండు ననుతలంపుతో శ్రీనాథుఁడు డిండిమభట్టు నోడించి కనకాభిషేకమును బడసినది మొదటిప్రౌఢదేవరాయల కాలమున క్రీ. శ. ౧౪౦౬ ప్రాంతమున నయియుండునని నిర్ణయించుచు శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారి సన్మానసంపుటములో "కవిసార్వభౌముఁడు - కనకాభిషేకకాలము" అను వ్యాసమును బ్రకటించియున్నారు. వీ రుదాహరించిన యీ కొండూరు శాసనముయొక్క అసలు ప్రతి శ్రీ మెకంజీదొరగారికిఁగాని, వారి యుద్యోగులకుఁగాని దొరకియుండలేదు. అగ్రహారికులయిన రాయపెద్ది కృష్ణశాస్త్రులు మొదలయినవారివద్దఁ గాగితముపయిని లిఖించియున్న నకలునుబట్టి నకలు వ్రాసికొంటి మని మెకంజీదొరగారి యుద్యోగులే నోటుచేసియున్నారు. ఈ శాసనపునకలులో లేఖక ప్రమాదములు చాలఁగలవు. వీనిని బరామర్శించుచు శ్రీ వేంకటరమణయ్యగారి వ్యాసమందలి విషయముల విమర్శించుచు నేను ౧౯౩౭ సంవత్సరములో "శ్రీనాథుని కనకాభిషేక కాలము" అను శీర్షికగల వ్యాసమును శ్రీ అయ్యంకి వేంకటరమణయ్యగారి సన్మానసంపుటములోఁ బ్రకటనమునకయి పంపియుంటిని. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు తా మొనర్చిన కాలనిర్ణయము సరికాదని చెప్పిరనియు, అయినను కొండూరుతామ్రశాసనము కేవలము కల్పితము గాకుండినఁ దానినిబట్టి తా మొనర్చిన కాలనిర్ణయమే సరియైనదను తలంపు తమ్ము విడనాడకున్నదనియు విన్నవించుచుఁ దత్సమర్థనముకయి శ్రీ డాక్టరు గారు "చంద్రభూషణక్రియాశక్తి" అనువ్యాసమును దమపూర్వనిర్ణయమును మఱికొన్ని యుపపత్తులతో బలపఱచుచు భారతి - అక్టోబరు ౧౯౪౫ సంచికలోఁ బ్రకటించియున్నారు. ఇట్టిసందిగ్ధవిషయములలోఁ దగిన బలవత్ప్రమాణములు లేనప్పుడు తా మొనర్చునిర్ణయము శ్రీనాథుని కావ్యములందలి సుసంగతవిషయములు పెక్కింటికి సాధకము గాక బాధకముగాఁ బరిణమించుచున్నప్పుడు, ఆవిషయముల ప్రశంసయే యెత్తక శ్రీ వేంకటరమణయ్యగారు కేవలము వాదాభినివేశముచే యాలంబించుట సహ్యాదయసమ్మతము కాకేరదేమో యని నేను తలఁచుచున్నాను.

ఆంధ్రకవు లందఱిలోను శ్రీనాథుఁడు మిక్కిలి యశోభిలాష గలవాఁడనియు, నిజజీవితమునఁ దనకుఁ బ్రాపించిన వైభవప్రాభవములను, అనుభవములను దన గ్రంథములందేమి, చాటుపద్యములందేమి సాధారణముగా నెప్పటికప్పుడు ప్రకటించుకొనెడి స్వభావము కలవాఁడనియు నాతనికృతులఁ జదువువారికెల్ల సులభముగా గోచరించుచుండును. శ్రీనాథునికృతులలో మనకింతవఱకు దొరకినట్టియు, దొరకకున్నను దద్రచితములుగా నాతఁ డుదాహరించినట్టియుఁ గృతులను బరీక్షించినచో వాని పౌర్వాపర్యము నీక్రిందివిధమున మనము సులభముగ నిర్ణయింపవచ్చును. (౧) మరుత్తరాట్చరిత్ర (౨) శాలివాహనసప్తశతి (౩) పండితారాధ్యచరిత్ర (౪) శృంగారనైషధము (౫) హరవిలాసము (౬) భీమఖండము (౭) కాశీఖండము (౮) శివరాత్రిమాహాత్మ్యము. గౌడడిండిమభట్టారకు నోడించి కర్ణాటకాస్థానమునఁ జంద్రభూషక్రియాశక్తిసమక్షమున శ్రీనాథుఁడు పాదుకొలిపిన కవిసార్వభౌమబిరుద మాతని కృతులలో మనకుఁ గాశీఖండ, శివరాత్రిమాహాత్మ్యము లందుమాత్రమే కానవగును. తత్పూర్వరచితగ్రంథములలో నాతఁ డెచ్చటను దానిని జేర్కొనియుండలేదు. మఱియుఁ గర్ణాటకాస్థానమున దానొనరించిన విబుధరంజనమును, గైకొనిన కనకాభిషేకసత్కారమును ముక్తకంఠమున నాతఁడు కాశీఖండమందలి యీక్రింది పద్యములందు మాత్రమే ప్రకటించియున్నాఁడు.

"సీ. చిన్నారిపొన్నారి చిఱుతకూకటినాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూఁగుమీసాల నూత్నయౌవనమున
శాలివాహనసప్తశతి నొడివితి
సంతరించితి నిండు జవ్వనంబునయందు
హర్షనైషధకావ్య మాంధ్రభాష
ప్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁ గొని
యాడితి భీమనాయకుని మహిమ
గీ. ప్రాయ మింతకు మిగులఁ గైవ్రాలకుండఁ
గాశికాఖండ మను మహాగ్రంథ మేను

దెసఁగు గావించెఁ గర్ణాటదేశకటక
పద్మవనహేళి శ్రీనాథభట్టసూరి.

శా. కర్ణాటక్షితిపాలమౌక్తికసభా
గారాంతరావర్తిత
స్వర్ణస్నానజగత్ప్రసిద్ధకవిరా
ట్సంస్తుత్యచారిత్ర! దు
గ్ధార్ణోరాశిగభీర! ప్రాహ్ణాముఖమ
ధ్యాహ్నపరాహ్ణార్చితా
పర్ణావల్లభ! రాజశేఖరమణీ!
పంటాన్వయగ్రామణీ!"

ఇట్టి జగత్ప్రసిద్ధవిషయము భీమఖండరచనమునకు ముందే జరిగియున్నచో, శ్రీనాథుఁడు కొండవీటిరెడ్ల రాజ్యము కూలిపోయినతరువాత రాజమహేంద్రవర రెడ్లయాస్థానమున కేతెంచి వారిమంత్రియగు బెండపూడి అన్నామాత్యుని కంకితముగా నాతనికోర్కెపయి భీమేశ్వరపురాణము రచించునవసరమున అన్నమంత్రి తన్నుఁ బ్రశంసించినట్లుగా నాగ్రంథావతారికలో లిఖించిన యీక్రిందిపద్యములో నది తప్పక యుదాహరింపఁబడియే యుండును. దీని నందు విస్మరించుటకుఁ దగిన కారణము కానరాదు.

"సీ. వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణవిద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకంబైన
హర్షనైషధకావ్య మాంధ్రభాష
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యాపరీక్షణవేళలందు
వెదచల్లినాఁడవు విశదకీర్తిస్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందు

గీ. పాకనాటింటివాఁడవు బాంధవుఁడవు
కమలనాభుని మనుమఁడ వమలమతివి
నాకుఁ గృపసేయు మొక్క ప్రబంధంబు నేఁడు
కలితగుణగణ్య శ్రీనాథకవివరేణ్య".

కావున శ్రీనాథుఁడు కర్ణాటాస్థానమున కేఁగి డిండిమభట్టు నోడించి కవిసార్వభౌమబిరుదమును బొందుకొనిన నది భీమఖండరచనముపిమ్మటను, గాశీఖండరచనమునకుఁ బూర్వమునను జరిగియుండునని స్థూలదృష్టివలననే సులభముగ నిర్ణయింపవచ్చును. భీమఖండమునఁ దత్కృతిపతి యన్నమంత్రి దక్షారామభీమేశ్వరాలయమున నంతకుమున్నొనర్చిన గోపురమండపనిర్మాణము నీక్రింది పద్యమునఁ జేర్కొనఁబడినది.

"సీ. ....
దక్షవాటికయందుఁ దరుణేందుమౌళికి
మొంగలివాకిటధామమును రచించె

గీ. ప్రాగ్దిశావప్రగోపుర ప్రాంగణమున
సప్తమునిసింధుసోపానసరణి కలవఁ
దీర్చె భవనంబు భీమయదేవునగర
మంత్రి దేవయయన్న యామాత్యవరుఁడు."

ఈనిర్మాణములు క్రీ. శ. ౧౪౧౬లో జరిగినట్లు భీమేశ్వరాలయమున అన్నమంత్రిశాసనము కలదు.

"శా. శాకేపుష్కరబాణవిశ్వ గణితే
సంవత్సరేకీలకే
కార్తిక్యాం శనివాసరే సుకృతధీ
శ్శ్రీ యన్నమంత్రీశ్వరః
దక్షారామజభీమలింగ పురత
శ్శ్రీసప్తగోదావరే
ప్రాచీగోపురమండపం సముకరో
ద్రమ్యం శిలానిర్మితమ్."

దీనినిబట్టి భీమఖండరచనము క్రీ. శ. ౧౪౨౦ ప్రాంతమున జరిగియుండు ననుట విస్పష్టమగును.

వినుకొండదుర్గమునఁ గర్ణాటకాధీశ్వరుల భాండాగారాధ్యక్షుఁడుగా నుండిన వల్లభరాయఁడు రచించినట్లుగాఁ గానవచ్చు క్రీడాభిరామ మను వీథినాటకము శ్రీనాథకృతమే యని కొందఱు, వల్లభరాయకృతమే యని మఱికొందఱు వివదించుచున్నారు. ఆ వివాదములతో మన కిచ్చటఁ బ్రసక్తి లేదు. శ్రీనాథుఁడు భీమఖండరచనానంతరము డిండిమభట్టు నోడించుటకయి కర్ణాటకాస్థానమున కేఁగునపుడు మధ్యేమార్గమున వినుకొండలోఁ గర్ణాటాధీశ్వరుల యుద్యోగి యగు వల్లభామాత్యుని దర్శించి యప్పుడే క్రీడాభిరామరచనమునఁ దనచేయికూడ వైచి వల్లభా

మాత్యున కా గ్రంథరచనమునఁ దోడ్పడెనని నా యభిప్రాయము. ఏదియెట్లున్నను భీమఖండరచనమున వ్యాసాగస్త్యుల సంభాషణములో మూలమందలి యీ క్రింది శ్లోకములఁ* దెలిఁగించుటలో సందర్భోచిత్యమును పాటించి యందలి వ్యాసమతముమాట విడిచి యా శ్లోకములలో నుదాహృతములయిన తక్కిన నాలుగుమతములను చేర్కొనుచు శ్రీనాథుఁ డీ క్రిందిపద్యమును గూర్చినాఁడు.

"సీ. గార్గ్యసిద్ధాంతమత ముమాకాలకలన
శకునమూనుట యది బృహస్పతిమతంబు
విప్రజనవాక్యమరయంగ విష్ణుమతము
సర్వసిద్ధాంత మభిజిత్తు సమ్మతమగు."

ఈ పద్యమే భీమఖండపద్యమున విడువఁబడిన వ్యాసమతమును గయికొనుచు నందలి యభిజిత్సిద్ధాంతమును విడుచుచుఁ గ్రీడాభిరామమున నందలిపాత్రములు మంచనశర్మ, టిట్టిభసెట్టి యుమాకాలభుహూర్తమున నొనర్చు నాంధ్రనగరప్రయాణసందర్భమున నీ క్రిందివిధమునఁ గూర్పఁబడినది.

"సీ. గార్గ్యసిద్ధాంతమతముమాకాలకలన
శకునమూనుట యది బృహస్పతిమతంబు
వ్యాసమతము మనఃప్రసాదాతిశయము
విప్రజనవాక్యమరయంగ విష్ణుమతము."

ఇది శ్రీనాథునిపనియే యని సహృదయులకుఁ దోఁపకపోదు. ఇందుఁగూర్చిన సవిమర్శచర్చ నా శృంగారశ్రీనాథవిమర్శనమునందును, "క్రీడాభిరామకర్తృత్వము" (భారతి, సం ౯, సం ౫) అను వ్యాసమునందును జూడఁదగును. దీనినిబట్టి క్రీడాభిరామరచనము, విజయనగరప్రయాణమున శ్రీనాథుని వల్లభరాయ సందర్శనము భీమఖండరచనానంతరమే జరిగియుండుననుట విస్పష్టమగును. కాశీఖండకృతిపతియగు వీరభద్రారెడ్డి రాజ్యపాలనము రాజమహేంద్రవరమున క్రీ. శ. ౧౪౪౦ ప్రాంతమునాఁటికే యంతరించినది. అందుచేఁ బ్రాయ మింతకుమిగులఁ జెల్లాలకుండ శ్రీనాథుఁ డొనర్చిన యా గ్రంథము భీమఖండరచన జరగిన నాలుగైదు సంవత్సరములలోపుననే క్రీ. శ. ౧౪౩౫ ప్రాంతమున రచింపఁబడెననుట వివాదము కాఁగలదు. ఈ విషయములనెల్లఁ బర్యాలోచించినచో శ్రీనాథుఁడు కర్ణాటకాస్థానమునఁ గనకాభిషేకసత్కారము, కవిసార్వభౌమ బిరుదస్వీకారము నొందినది, కర్ణాటరాజధాని నుండి రాజమహేంద్రవరమునకుఁ దిరిగివచ్చునపుడు రాచకొండలో రావుసింగభూపాలుని సందర్శించినది క్రీ. శ. ౧౪౩౦ - ౧౪౩౫ మధ్య జరిగియుండు నని సహృదయులకుఁ దోఁపఁగలదని నా యభిప్రాయము. పలువు రిట్లే తలఁచుచున్నారు. అప్పటి కర్ణాటసార్వభౌముఁడు రెండవ ప్రౌఢదేవరాయలు (క్రీ. శ. ౧౪౨౨-౧౪౪౬) కావున నాతని యాస్థానమునవే శ్రీనాథునకుఁ గనకాభిషేకము జరగియుండును. అప్పుడుగూడఁ జంద్రభూషక్రియాశక్తిరొడయరునామాంకితుఁ డను పీఠాధ్యక్షుఁ డొకఁడు విజయనగరమునఁ గ్రియాశక్తి మఠమున నుండియుండును. శృంగార శ్రీనాథమున శ్రీ ప్రభాకరశాస్త్రిగారు ప్రతిపాదించినది, యస్మదాదులామోదించినది యీ నిర్ణయమే.

ఇప్పటికి దొరకిన రెండవప్రౌఢదేవరాయలనాఁటి శాసనములలోఁ జంద్రభూషక్రియాశక్తి నామోల్లేఖనము గల శాసన మొకటియుఁ గానరానందునను, మొదటి బుక్కరాయలనాఁటి కొండూరు శాసనములోఁ జేర్కొనఁబడిన చంద్రభూషణ క్రియాశక్తియే యటుతరువాత స్వల్పకాలములో క్రీ. శ. ౧౩౭౮ సంవత్సరములో బెంగుళూరుజిల్లా హోసకోటతాలూకా నోగలగ్రామములో నొకశాసనమును వ్రాయించినట్లు గానవచ్చుటవలనను, ఆం దాతని కుపయుక్తములయిన బిరుదవిశేషములే మొదటి (ప్రౌఢ) దేవరాయలు క్రీ. శ. ౧౪౧౦ న వెలయించిన యొక శాసనములో నుదాహృతుఁడయిన యొక్క క్రియాశక్తిగురునకుఁ బ్రయుక్తములగుటచేతను నీ కడపటిశాసనమునందలి క్రియాశక్తిగురుం డు చంద్రభూషణక్రియాశక్తియే కాఁదగునని తలంచి, శ్రీ వేంకటరమణయ్యగారు పూర్వోక్తమయిన

* అగస్త్యుఁడు వ్యాసు నుద్దేశించి పలుకునవి:—
శ్లో. ఉమసాన్నశ గార్గిసిద్ధాంత శ్శకునంతు బృహస్పతేః,
త్వన్మతం చిత్తనైర్మల్యం విప్రవాక్యం హరేర్మతం,
క్షీర్తనీమాభిజిత్కాలః సర్వసిద్ధాంతసమ్మతః.

అక్టోబరు ౧౯౨౧ భారతి సంచికలోని తమవ్యాసమున శ్రీనాథుని కనకాభిషేకము మొదటి ప్రౌఢదేవరాయల రాజ్యారంభములో క్రీ. శ. ౧౪౦౬ ప్రాంతముననే జరిగియుండునని తమ తొల్లింటి నిర్ణయమును సమర్థించిరి. కొండూరుశాసనమునందలి ప్రధానభాగమును వీరు తమవ్యాసమున నుదాహరించిరే యున్నారు. అందు "కలికాలే" యనునది "శకకాలే" యనుటకుఁ బ్రమాదజనితమయియుండు నని వారు వ్రాసిరి. అది యట్లేయగుఁగాక. కాని శాలివాహనశక వత్సరము నుదాహరించుసందర్భములో సాధారణముగా "శకే" అనియో, "శాకే" అనియో, "శాకాబ్దే" అనియో శాసనములలోఁ బ్రయోగించుటయేగాని "శకకాలే" యని వ్రాయుట గానరాదనుసంగతి మనము గుర్తింపఁదగును. అయినను కొండూరుశాసనమునందలి వత్సరము "ఏకసప్తత్యధిక ద్విశతాధిక సహస్రాబ్దపరిమితే"— అనఁగా ౧౨౭౧ కలియుగవత్సరమానమున మొదటి బుక్కరాయలకాలమునకు సంగతము కానందున శాసనమున నిర్దేశింపఁబడినది కలియుగవత్సరముగాక శాలివాహనశకవత్సరమే యని యంగీకరింతము. అప్పుడు గూడ శాసనకాలవిషయమున శ్రీ వేంకటరమణయ్యగారు వ్రాసినవాక్యములు సరిగావనియే నాయభిప్రాయము. శాలివాహనశకవత్సరము ౧౨౭౧ విరోధిగాని చంద్రభూషణాచార్యుఁడు కొండూరును బ్రాహ్మణులకుఁ బంచియిచ్చిన సాధారణ కాఁజాలదు. సాధారణసంవత్సరమునకు సరియైన శకవర్షము ౧౨౯౨. శాసనమందలి వాక్యములకు నందున్న ప్రక్రమమునుబట్టి సరిగా నర్థము చెప్పుకొన్నచో శాసనవత్సరమును, జంద్రభూషణాచార్యుని గురువరుఁడగు దేవేశక్రియాశక్తి ద్వావింశత్యాబ్దికసంవత్సరమును నొక్కటియనియే యేర్పడును గాని శ్రీ వేంకటరమణయ్యగారు చెప్పినట్లు ౧౨౭౧ సంవత్సరము దేవేశక్రియాశక్తిగురుని నిర్యాణవత్సరమనియు, శాసనకాలము మాత్రము ౧౨౯౨ అనియు నేర్పడఁజాలదు. "ఏకసప్తత్యధిక ద్విశతాధిక సహస్రాబ్దపరిమితే గతే వత్సరే పర్యాయస్య ద్వావింశత్యావర్తే సాధారణనామసంవత్సరే వర్తమానే శ్రావణమాసే కృష్ణపక్షే చతుర్దశ్యా మిందువాసరే యతీంద్రస్య క్రియాశక్తిగురోః పర్వణి తస్యైవం ప్రీతయే శ్రీచంద్రభూషణాచార్య......ప్రాదాత్" అనుచో "పర్యాయస్య" అనుపదమునకు "అనఁగా = in other words" అనియే యర్థము చెప్పఁదగునని నాయభిప్రాయము. శాసనము నెల్లఁ జదివిచూడఁగా బుక్కరాయలు దండయాత్రనుండి విజయసమేతుఁ డయి రాజధానికి మరలి వచ్చినంతనే కొండూరుగ్రామమును జంద్రభూషణాచార్యునకు సమర్పించెననియు, దానినే యాతఁడు నిజగురుఁడగు దేవేశక్రియాశక్తినామమునుబట్టి "దేవేశపురము పేరిడి యాగురువరుని ౨౨-వ యాబ్దికసందర్భమున ౧౨౭౧ శకసంవత్సరమున నేఁబదియిద్దఱు బ్రాహ్మణులకు విభజించియిచ్చెననియు బోధపడఁగలదు. అంతియేగాని దేవేశక్రియాశక్తి యెప్పుడు సిద్ధిపొందెనో అందు స్పష్టముగ నుదాహృతము కాలేదు. శాసనవత్సరము పర్యాయమున దేవేశక్రియాశక్తి యిరువదిరెండవయాబ్దికవత్సరమని చెప్పినప్పుడాతని నిర్యాణవత్సరమును వేఱుగాఁ జెప్పకుంట పునరుక్తియే యగును. కావున సాధారణసంవత్సరముతో నైక్యము గుదురవలెనన్నచో "ఏకసప్తత్యధిక" అనునది "ఏకనవత్యధిక" అనుటకు శాసనమున దొరలిన మతియొక ప్రమాదమని తలఁచుటయే సంగతముగా నుండును. అట్లయిన శకవత్సరములు ౧౨౯౧ గతింపఁగా నప్పుడు ప్రవర్తిల్లుచున్న ౧౨౯౨ (సాధారణ) సంవత్సరము శాసనకాలమని యేర్పడును. ఈకొండూరుశాసనమందలి చంద్రభూషణక్రియాశక్తిగురుఁడును, వోగటుశాసనము వ్రాయించిన చంద్రభూషణుఁడును శ్రీ వేంకటరమణయ్యగారు సెలవిచ్చినట్లు ఏకవ్యక్తియే కాఁదగును. కాని మొదటి ప్రౌఢదేవరాయల శక ౧౩౩౨ సంవత్సర శాసనమునందలి క్రియాశక్తిగురుఁడు నామోల్లేఖనము స్పష్టముగా లేనప్పుడు కొండూరు వోగటుశాసనములందలి చంద్రభూషణక్రియాశక్తియే కాఁదగునని నొక్కి వక్కాణించుట యెట్లు? "స్వయంభూత్ర్యంబకచరణారవిందారాధక, రాజగురుమండలాచార్య, ఆచార్యవర్య, అభంగరాహుత్తరాయ" మున్నగు బిరుదవిశేషములు పారంపర్యముగ విద్యానగరమందలి ప్రధానక్రియాశక్తిమహాచార్యు లందఱకుఁగూడ వహించెడివే యని యేల తలఁపరాదు? ఈమఠాధీశ్వరులలో నొక్కచంద్రభూషణక్రియాశక్తియేగాని యాతనిపూర్వులు దేవేశ

క్రియాశక్తి మున్నగువారుగాని, యాతనితరువాత నా ప్రధానపీఠమున కధిష్ఠితులయినవారుగాని యీబిరుదములను వహింపలేదనిగాని, వారి కవి చెల్ల నేరవనిగాని శ్రీవేంకటరమణయ్యగారు నిర్ణయింపఁగలరా! చంద్రభూషణక్రియాశక్తియెడఁ గొండూరుశాసనములోఁ బూర్వోక్తబిరుదములు మఱికొన్నియుఁ బ్రయుక్తములయియున్నను వంశే యాతఁడు క్రియాశక్తిగురుని శిష్యప్రశిష్యుఁడని చెప్పఁబడియున్నది. రాజవంశావళులను, రాజగురువంశావళులను బరికించినచోఁ బూర్వుల బిరుదావళులను దరువాతివారుగూడ వంశానుగతముగ వహించుచుండుట పరిపాటిగాఁ గానవగును. శ్రీవేంకటరమణయ్యగారి కిది తెలియనివిషయముకాదు. విద్యానగరమందలి క్రియాశక్తిమఠమునకుఁ జెక్కు లుపమఠములుకూడ దేశమున నెలసియుండును. ఆయుపమఠాధిపతులుమాత్రము ప్రధానమఠాధీశ్వరుల బిరుదావళులను వహింపఁజాలరు. రాజమంత్రులు, దండనాథులు మున్నగువారికి గురువులుగానుండిన కాశీవిలాసక్రియాశక్తిప్రభృతు లీయుపమఠములకుఁ జెందినవారు కాఁదగును. "క్రియాశక్తి" యను పదము ప్రధానపీఠాధ్యక్షులు, ఉపమఠాధిపతులుగూడ సామాన్యముగాఁ దమ నామముల చివరఁ జేర్చుకొనుచుండినట్లు కానవగును. నా మైక దేశగ్రహణమునఁ గొన్ని యెడల శాసనములందును, గావ్యములందును గూడ నా క్రియాశక్తిగురుల యసలునామముల నుదాహరింపక యూరక "క్రియాశక్తిగురు" పదమునుమాత్రమే యుపయోగించుటకూడ జరుగుచుండినట్లు కానవగును. మఱికొన్ని తావులలో వారికున్న బిరుదములుగూడఁ జేర్కొనుట మానియుండవచ్చును. కావున శ్రీవేంకటరమణయ్యగా రుదాహరించిన శక ౧౩౩౨ సంవత్సరము నాఁటి ప్రథమ (ప్రౌఢ) దేవరాయల శాసన మప్పటి ప్రధానమఠాధీశ్వరుఁడు చంద్రభూషణనామాంకితుఁడు కాఁడనిగాని, యగునని కాని యిదమిత్థముగ నిర్ణయించుట కుపకరింపనేరదని నా మనవి. అట్లే రెండవప్రౌఢదేవరాయలకాలమందలి యుపలబ్ధశాసనములలోఁ జంద్రభూషణనామోల్లేఖనము లేనంతమాత్రమున నాతనికాలమునఁ జంద్రభూషక్రియాశక్తినామాంకితుఁ డను రాజగురుఁడు లేఁడని రూఢిగాఁ జెప్ప వలనుపడదు. ఇంతకుఁ గొండూరు వోగటశాసనములలో నుదాహృతుఁడయిన చంద్రభూషణక్రియాశక్తి మొదటి ప్రౌఢదేవరాయలకాలమునకుమాత్రమే యుండి, రెండవప్రౌఢదేవరాయల కాలమునకు మరణించియుండునని మన మేల తలఁపవలెను! క్రీ. శ. ౧౪౧౦ నాఁటికి జీవించియున్న యాతఁడు తరువాత మఱి యిరువదియైదు సంవత్సరములవరకు —నఁగా శ్రీనాథుని కనకాభిషేకకాలమని యస్మదాదులు నిర్ణయించు క్రీ. శ. ౧౪౩౫ వరకుఁగూడఁ జీవించియుండు ననుటలోఁ బ్రత్యవాయమేమి? పూర్వోక్తములయిన క్రీ. శ. ౧౩౭౦, ౧౩౭౮, ౧౪౧౦ శాసనములలో నుదాహృతుఁడయిన క్రియాశక్తిగురుఁడు చంద్రభూషణనామాంకితుఁ డగు నేకవ్యక్తియే యని తలఁచుచో నాతఁడే వయోవృద్ధుఁడయి రెండవప్రౌఢదేవరాయలకాలమునఁగూడఁ గ్రీ. శ. ౧౪౩౫ వఱకు జీవించియుండునని తలఁచుట కభ్యంతర మంతగాఁ గానరాదు. ఇప్పటివలెఁ గాక పూర్వులు దీర్ఘాయురారోగ్యములతో వర్ధిల్లుచుండిరనుట కనేకాధారము లున్నవి. లౌకికవ్యాపారధురీణులయిన శ్రీనాథుఁడు, అవచి తిప్పయసెట్టి, సర్వజ్ఞసింగభూపాలుఁడు బహుసంవత్సరములు జీవించినట్లు గ్రంథప్రమాణములవలనఁ దెలియుచుండఁ దపోరాజ్యము నేలుచు నిజతపశ్శక్తిచేఁ గాయసిద్ధి నొందు చంద్రభూషణక్రియాశక్తి మున్నగువారిమాట చెప్పనేల! ప్రౌఢనిర్భరవయఃపరిణతిలో శ్రీనాథుఁడు రాజసభలో నొనర్చిన యుద్భటవివాదమున మాధ్యస్థ్యము వహించి నిష్పక్షపాతనిర్ణయ మొనర్చుటకుఁగూడ విద్యావయఃపరిణతిగలసమర్థుఁడే కావలయునుగదా!

శ్రీ వేంకటరమణయ్యగారివ్యాసముల బాగుగఁ బరిశీలింప శ్రీప్రభాకరశాస్త్రిగారివలెఁ గాక వీరు శ్రీనాథుని జన్మకాలము క్రీ. శ. ౧౩౬౫-౧౩౭౦ ప్రాంతమయియుండు ననెడి యస్మదాదులవాదమునే యంగీకరించినట్లు గోచరించును. అపక్షములో మొదటిప్రౌఢదేవరాయల రాజ్యారంభకాలమున క్రీ. శ. ౧౪౦౬ నాఁటి కాతఁడు నలుబదియేండ్లవాఁడు మాత్రమే యైయుండును. (శ్రీనాథుని జన్మకాలము క్రీ. శ. ౧౩౬౫

అయియుండునెడల ప్రభాకరశాస్త్రిగారి వాదప్రకార మయినచో ౨౧ సంవత్సరముల లేఁబ్రాయమువాఁడగును.) శ్రీనాథుఁ డెంత ప్రతిభాశాలియైనను నలుబదియేండ్లవయస్సులో, అష్టదిగ్గజయశోవష్టంభుఁడగు డిండిమభట్టారకునిపై దాడి వెడలునంతటి ధైర్యసాహసములు గలిగియుండుననుట యంత సంగతముగాఁ దోఁపదు. మఱియు నాతఁడు క్రీ. శ. ౧౪౦౪ నాఁటికే కొండవీటిలోఁ బెదకోమటి వేమారెడ్డియాస్థానమున విద్యాధికారిగాఁ బ్రవేశించినట్లు లాతఁడు లిఖించిన వేమారెడ్డి దానశాసనములవలనఁ దెలియవచ్చును. అచ్చట విద్యాధికారిగానున్న ౧౪౦౪–౧౪౨౦ మధ్యకాలములో నాతఁడు రాజాస్థానిని విడిచి దూరదేశముల కేఁగు నవకాశములుకూడ నుండనేరవు. విద్యానగరరాజులకుఁ, బెదకోమటి వేమనకు నంతగా సామరస్య మున్నట్లు గూడఁ గానరాదు. కావున రాజమహేంద్రవరము చేరినతరువాతఁ బ్రౌఢనిర్భరవయోవిద్యానుభవపరిపాకములు గలిగిన ప్రాయముననే-నఁగా నలువదియేండ్లు నిండినతరువాతనే యాతఁ డిట్టియుద్యమమునకుఁ గడఁగియుండునని తలఁచుటయే సంగతముగా నుండును. సాధారణముగ జనులు దీర్ఘాయుష్మంతులుగ నుండిన యా దినములలో శ్రీనాథునివంటివానికఱువదియేండ్లప్రాయము పెట్టిమనబోంట్లకువలె ముదిమిగా గణింప నవకాశము లేదు. వైదుష్యదర్ప మప్పుడే యతనికిఁ బండువారియుండును. భవభూతిమహాకవి చెప్పినట్లు "కాలో హ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ" రెండవప్రౌఢదేవరాయలకాలమునఁగూడఁ జంద్రభూషనామాంకితుఁడను క్రియాశక్తిగురుఁ డొకఁడుండెననుట కుపకరించు శాసనప్రమాణముగూడ భావిపరిశోధనమున లభింపవచ్చును. అందుకయి ప్రయత్నించుటయే యుక్తముకాని శ్రీనాథుని గ్రంథస్థసాక్ష్యములకు విరోధమునుగూర్చి నిర్ణయములఁ జేయఁబూనుట సమంజసము కాదని నా మనవి. ఈ కాలమునకుఁ బ్రసక్తించు చంద్రభూషనామాంకితశాసన మొకటి తాము నూతనముగ గుర్తించినట్లుకూడ నా మిత్రులు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ప్రసంగవశమునఁ జెప్పియున్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయపక్షమున వారు ప్రకటించు రెడ్డియుగచరిత్రములో నది ప్రకటితము కాఁగలదని యాశించుచున్నాను.



చందమామ రాక

— శ్రీ విశ్వనాథ శ్రీకృష్ణదేవరాయులు —

ఏడనుండీ రాక చందమామా ?
ఎన్నాళ్లకొచ్చావు చందమామా !
ఇన్నాళ్లనుంచీను
ఏవాడకెళ్లావు
వాడవాడల్లోని
వర్తమానాలేవి ?
ఏడనుండీ రాక చందమామా !
ఎన్నాళ్లకొచ్చావు చందమామా ?

ఇప్పుడొస్తావాని
అప్పుడొస్తావాని
ఎదురుచూచీచూచి
చెదరిపోయెను మనసు !
ఏడనుండీ రాక చందమామా
ఎన్నాళ్లకొచ్చావు చందమామా.

చందమా మేడంచు
చుక్కల్ని అడిగాను
చుక్కలన్నీ కలిసి
బిక్కమొగ మేశాయి.
ఏడనుండీ రాక చందమామా
ఎన్నాళ్లకొచ్చావు చందమామా.

వెళ్లిపోయావంటె
వెక్కెక్కి ఏడ్చాను
మళ్లి వస్తావంటె
మంచి దనుకున్నాను.
ఏడనుండీ రాక చందమామా
ఎన్నాళ్లకొచ్చావు చందమామా.

ఇరుగుపొరుగూవారి
ఇండ్లకెడదామంటె
నాతోడి మాటాడు
నాజూకువారెవరు?
ఏడనుండీ రాక చందమామా
ఎన్నాళ్లకొచ్చావు చందమామా !

ఉపలబ్ధ, అముద్రిత ప్రాచీనాంధ్రగ్రంథములు

— శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి —

[ఎన్ని మంచిమంచి ప్రాచీనాంధ్రగ్రంథములు ఆదరించు నాథుడులేక, వెలుగు ముఖముచూడనోచక, తాటాకులలో చివికిచివికి చెదలపాలై రూపరిపోవుచున్నవో లెక్కలేదు. అట్టివానిలో కొన్నిటిని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు ఇందు పేర్కొనియున్నారు. వస్తుగౌరవమునను, కవితాగౌరవమునను, కవిగౌరవమునను కూడ ఇవి సర్వథా సత్వరముద్రణ గాంచవలసి యున్నవని శ్రీ శాస్త్రిగారి ఆకాంక్ష. సంకల్పశుద్ధులైన వారి ఈ ఆకాంక్ష వృథాపోదని మా విశ్వాసము.

సం—భారతి]

౧. పావులూరి గణితము:

తెలుగుకవితారచనలలో ఇప్పటికి దొరకియున్న ప్రాచీనతరశాస్త్రరచన పావులూరిగణితము. ఇది నన్నయకు ఏబదేండ్ల తర్వాతిది. సంస్కృతమున మహావీరాచార్యుడు రచించిన గ్రంథము ననుసరించి మల్లన దీనిని పద్యమయముగా రచించినాడు. ఇందులో చాలా చోట్ల అర్వాచీనరచనలు ఇటీవల చేర్పబడినవి. వాని నన్నింటినీ సమాకలించి, యిప్పుడు తిరుపతి దేవస్థానము ప్రాచ్యపరిశోధనశాఖవారు సంస్కరించి ప్రకటించబూనియున్నారు. కొలదికాలములోనే అది ముద్రితమవుతుంది.

౨. భాగవత దశమస్కంధము:

ఇది మడికిసింగన రచించిన ద్విపదరచన. పదునైదవ శతాబ్దియారంభకాలపుది. పోతరాజుగారి కాలమునకే రచింపబడినది. తంజావూరిలైబ్రరీలో దీని ప్రతి యున్నది. మైసూరిలోకూడా ఉన్నదని విన్నాను. దీనిని కపిలేశ్వరపురపురాజాగారు శ్రీ బులుసు సర్వారాయడుగారు ముద్రింపయత్నించుచున్నారు.

3. భేతాళపంచవింశతి:

రచననుబట్టి చూడగా నిది పదునాల్గవశతాబ్దికింకను పూర్వపుది గాదనిపించును. లక్షణగ్రంథకర్తలు దీనిని కవిభల్లటుడు రచించినదానినిగా నుదాహరించినారు. ఇది కథాసరిత్సాగర భాగమయియుండును. ఏలనగా నీగ్రంథము సమగ్రముగా దొరకినను గ్రంథకర్త పేరుగాని, ఆశ్వాసవిభాగముగాని యందు గానరాదు. దీని ప్రతి తప్పులతో, గ్రంథపాతములతో దొరతనమువారి లైబ్రరీలో నున్నది. అనేక స్థలముల ప్రత్యంతరముల తోడ్పాటుతో దీనిని నేను సరిగా సమకూర్చినాను. ఇది ముద్రితము గావలసియున్నది. పిఠాపురాస్థానకవులు శ్రీ ఓలేటి వేంకటరామశాస్త్రిగారి కథాసరిత్సాగరాంధ్రీకరణమున నీకథ లున్నవి. ఎఱ్ఱన నీతికథానిధానమునను నీకథ లున్నవి. మఱియొక భేతాళపంచవింశతిరచనము తంజావూరిలైబ్రరీలోనున్నది. అది వేఱయినది.

౪. శివలీలావిలాసము:

శివలెంక నిశ్శంకనామాత్యుని కుమారుడయిన కొమ్మనామాత్యుడు దీని కర్త. ఈకవి శ్రీనాథుని సమకాలమువాడు. కాశీఖండకృతిపతి వీరభద్రారెడ్డిమంత్రికిది యంకితము. ఈగ్రంథము లభించిన తీరు వింతయినది. కొంత చెప్పెదను.

౧౯౦౭-౮ సంవత్సరమున నేను మదరాసులో తిరువల్లిక్కేణిలో నుండిన వెస్లీమిషన్‌హైస్కూలులో (నేటి కెలెటుహైస్కూలు) తెలుగు పండితుడుగా నుంటిని. శని, ఆదివారములలో గవర్నమెంటులైబ్రరీకి వెళ్లి సంస్కృతాంధ్రగ్రంథములు పరిశీలిస్తూ ఉండేవాణ్ణి. అక్కడ ఒకనాడు శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు అగపడినారు. వారి పరిచితి కదే ఆరంభ

"శివలీలావిలాస మని యొక గ్రంథము కొమ్మనామాత్యుడు రచించినది దొరకవలసియున్నది. శ్రీ వీరేశలింగము పంతులుగారు అది తిక్కనతండ్రి రచించిన దనుచున్నారు. నిశ్శంక కొమ్మన అని అతని పేరు. దానినెక్కడనైనా మీరు సంపాదింపగలరా?" అనిరి. "శివలీలావిలాసము కూచిమంచి తిమ్మకవిది ఉన్నదిగదా! ఇది ఇంకొకటా?" అంటిని. "అబ్బే! ఇది మొన్నటిది! నేను చెప్పిన శివలీలావిలాసము తిక్కననాటిదో, అంతకు పూర్వపుదో తెలియదు. అది చాలా ప్రాచీనమయినది" అనిరి. "గ్రంథసంపాదనవిషయమే ఎఱుగని నేను ఎక్కడ సంపాదింపగల్గుదు" నంటిని. "మీ దేశము వెళ్లినపుడు వెదకిచూడండి!" అనిరి. నాటినుండీ శ్రీ కవిగారికీ, నాకూ పరిచితి మైత్రిగా పరిణమించినది. ఈ సంభాషణ జరిగినపిదప ఒకనెలకే నేను వేసంగి సెలవులకు బందరుమీదుగా స్వగ్రామము వెడలుచుంటిని. బందరులో అలంకారచంద్రోదయ మను రసవదాంధ్ర ప్రబంధము రచించిన యమ్మాసేని వీరేశలింగము నాయనింగారి కుమారుడు వీరేశలింగము నాయుడుగారు నాకు మిత్రులు. గురువర్యులు శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి గారు నివసించిన బచ్చుపేటలోనే వారినివాసము నగుటచే అమిత్రుని జూడబోయితిని. సంభాషణలో మదరాసు ప్రాచ్యలిఖితపుస్తకశాల విషయము రాగా వారు "మాతండ్రి గారు జాగ్రత్తగా దాచియుంచిన గ్రంథమిది! కం. వీరేశలింగముగారి కవులచరిత్రలో దీని ప్రస్తావము కానరాదు. లేఖకప్రమాదములతో నిండియున్నది. దీనిని ప్రాచ్యలిఖితపుస్తకాలయమునకు అర్పించండి" అని రెండు కాగితపుపుస్తకములను తెచ్చియిచ్చిరి. చూడగా నది నిశ్శంకునికొమ్మన శివలీలావిలాసమే! నే నాశ్చర్యము చెంది కవిగారి సంభాషణవిషయము వీరేశలింగముగారి కెఱిగించితిని. వారును వింతచెందిరి. నాడే కవిగారికి గ్రంథోపలబ్ధివిషయము కార్డువ్రాసి యాగ్రంథమును గైకొని నేను స్వగ్రామము పెదకళ్లేపల్లి వెళ్లితిని. ఇంటికి చేరిన మర్నాడో, మూడోనాడో నాకు టెల్లిగ్రామో, జాబో శ్రీకవిగారి దగ్గఱనుండి వచ్చినది: 'శివలీలావిలాసము' పోస్టులో రిజిస్టరుచేసి పంపవలసినదని. నేను చదివి పంపుదునుగాకని తలచితిని. చదువుచుంటిని. జాబు వ్రాసితిని. మరల టెల్లిగ్రాము వచ్చినది. పుస్తకము పంపితిని. ఇది ౧౯౦౭ లో జరిగినది. ఆగ్రంథము మరల నాచేతికి రాలేదు. శ్రీకవిగారి దగ్గఱనే యుండెను. శ్రీవీరేశలింగమునాయుడుగారు దానిని లైబ్రరీకి ఈగోరిరి. కాని వారి కోరిక నెరవేరలేదు. నాయుడుగారు కనపడ్డప్పుడెల్ల నడుగుచునే యుండిరి. నేనును గవిగారి నడుగుచునేయుంటిని. ౧౯౨౧-౨ సంవత్సరములో బహుక్లేశమున మరల కవిగారి దగ్గఱనుండి గైకొని దాని కొక కాపీ ప్రాచ్యలిఖితపుస్తకశాలలో వ్రాయించియుంచితిని. అటుతర్వాత మాతృకను తెలుగుఅకాడమీవారి కిచ్చితిని. ఇటీవల అక్కడి మాతృకను ఎవరో దొంగలించిరని అకాడమీ మేనేజరుగారు నాకు తెల్పిరి. అసమగ్రముగా, తప్పులతో నున్న యాగ్రంథము ముద్రింప వీలుగాకున్నది. ఓరియంటల్ లైబ్రరీలోని ప్రతిలో నాకు చేతనయినంతవఱకు సంస్కరణములు జరపియుంచితిని. సమగ్రముగా దొరకెనని, అది నైజాంరాజ్యమున నొక మిత్రునిదగ్గఱ నున్నదని శ్రీ సోమశేఖరశర్మగా రొకతూరి చెప్పిరి. అది బయల్పడుగాక. లేకున్న నున్నదేని ముద్రితముగావలెను.

౫. కృష్ణమాచార్య సంకీర్తనములు:

ఇది విశిష్టాద్వైతమతసంప్రదాయము చొప్పున సింహాగిరి నరహరిస్వామి స్తుతిరూపమగు వచనగ్రంథము. దీని కర్త కృష్ణమాచార్యులు కాకతీయప్రతాపరుద్రుని నాటివాడు. సమగ్రమయిన, నిర్దుష్టమయిన ప్రతి దీనికి దొరకలేదు. ప్రాచ్యలిఖితపుస్తకశాలలో దీని వ్రాతప్రతులు కొన్ని యున్నవి. ఉన్నంతమట్టుకు, శక్యమయినంతవఱకు సేకరించి దిద్దియుంచినాను. మంచివి, ప్రత్యంతరములు దొరకకనేని యిది ముద్రింపవీలుపడును. శైవవైష్ణవ మతవిషయకములు, ప్రార్థనాత్మకములు, వచనరచన లిట్టివింకను చాల గలవు. అందు గొన్నియేని ముద్రణార్హములు. 'యతిరాజశేఖరా' అని నూటఎనిమిదివచనములు శ్రీ పరవస్తు రామానుజాచార్యులు రచించినవి మంచి రచన గలవి ఉన్నవి.

౬. నయనరగడ:

ఇది చక్రపాణి రంగన యను కవి ప్రతాపరుద్రుని నాటివాడు రచించినది. దీనికి 'శివభక్తిదీపికా' యని

నామాంతరము. ఇది చిన్న రగడగ్రంథము. ఈతడే రంగనాథరామాయణకర్త యని ప్రాచీనచరిత్రలలో నున్నది. శివద్వేషముచే గన్నులు పోగా శైవుడై యీరగడతో శివస్తుతి చేసి శివానుగ్రహమున నయనములు పడసెనట.

౭. శివయోగసారము :

కొలని గణపతిదేవుడు దీనిని రచించినాడు. ఇతడు క్రీ. శ. ౧౫౦౦ నాటివాడు. ఈతని గ్రంథము పూర్వభాగమనియు, నుత్తరభాగమనియు రెండుభాగములు గలది. పీఠికవినాగా బూర్వభాగము నాలుగాశ్వాసములను ఓరుగంటిలో శైవప్రచారిణీగ్రంథమాల ప్రెస్సువారు ముద్రించిరి. పీఠిక చాల చరిత్రాంశములు గలది. అది వెనుక సుభాషి యను పత్రికలోను, తరువాత 'కాకతీయసంచిక' లోను ముద్రితమయినది.* ఆపీఠికనుబట్టి వెనుక 'సుభాషి'లో నేను వ్రాసిన వ్యాస భాగము నిక్కడ బ్రకటించుచున్నాను. దీనిలో ద్వితీయాశ్వాసము, నెనిమిదాశ్వాసము లింకను ముద్రితములు కాలేదు. ఇది చాల బ్రశస్తమయిన రచనము.

౮. హయలక్షణవిలాసము :

మనుమంచిభట్టు రచించినది. సాళువ గౌబళ్ కంపభూపాలున కంకితము. ప్రశస్తరచనము. ౧౫-వ శతాబ్దినాటిది. ఇందు కొంతభాగము మంజువాణి ప్రెస్సులో ముద్రితము.

౯. కేదారఖండము :

ఇది పెదపాటి సోమనాథకవి రచించినది. ఈతడు చాల గొప్పకవి. పదునైదవ శతాబ్ది తుదికాలము వాడు. ఈతని యీగ్రంథమును తెనాలితాలూకా 'ఈమని' గ్రామమున శ్రీపతి పండితారాధ్యుల శరభ సాశ్వయ్యవార్లంగారి యింట నుండెగా (వారి యింట నుండియే పెదపాటి యొఱ్ఱన మల్హణచరిత్రమును ప్రాచ్యలిఖితపుస్తకశాలకు జేర్చితిని.) చిత్తూరులో నిపుడు వకీలుగానున్న శ్రీ రామకృష్ణరాజుగారు తమ పూర్వులెవ్వరో యంకితము గొన్న దన్న తలంపుతో గోరి ౧౯౧౯ సం. ప్రాంతమున దెప్పించుకొనిరి. శ్రీ శరభ సాశ్వయ్యవార్లంగారు దానిని వారియొద్దనుండి ఓరియంటల్ లైబ్రరీకి చేర్పగోరి జాబు వ్రాసియిచ్చిరి. వారి నప్పుడే కోరితిమి. కాని వారు దానిని ప్రకటింపలేదు. ఎవరికిగాని యిచ్చినట్లైని తెలియవచ్చుటలేదు. అది యంతరించిపోకుండుగాక !

౧౦. తారకబ్రహ్మరాజీయము :

రాధామాధవమును, విష్ణుమాయావిలాసనాటకమును రచించిన చింతలపూడి ఎల్లయ, రాధామాధవకవి దీనిని రచించినాడు. ఆదినుండి నాలుగవ యాశ్వాసము సగముదాక నీగ్రంథము దొరకియున్నది. దీని ప్రతులు ప్రాచ్యలిఖితపుస్తకశాలలోను, బరిషత్పుస్తకభాండాగారమునను నున్నవి. అసమగ్రముగా దప్పులతో నుండుటచే, దీనిని బ్రకటింపవీలుకాలేదు. ఉన్నంతదాక నే నొక ప్రతి వ్రాయించియుంచుకొన్నాను. సమగ్రప్రతి దొరకనిచో నున్నంతవఱకేని ముద్రింపవలెను.

---

* "క. ఆసమశివభక్తిరసమా
నసునిం బాల్కురికి సోమనాథుని గవిరా
జసమున్నతయశు సద్యః
ప్రసాదియగు చక్రపాణిరంగన గొలుతున్."

అని కవిస్తుతిలో గలదు. ఈపద్య మెంతయు నాకు సంతోషము గొల్పినది. పాల్కురికి సోమనాథునితో స్పర్ధించి చక్రపాణి రంగనాథుడను వైష్ణవుడు (రామాయణకవి) శివనిందచేయగా నాతని కన్నులు రెండును బోయెననియు, అహోబలనృసింహస్వామి కలలో శివనిందచే నీకన్నులు పోయినవని తెలుపగా నాతడు శ్రీగిరికిబోయి మల్లికార్జును నారాధించి యాస్వామిమీద సంస్కృతాంధ్రములలో గొన్ని కృతులను జెప్పి మరల రెండు కన్నులను బడసెననియు గర్ణాటక కృతులలోను, ఏకశిలానగరవృత్తాంతాదులందును గలదు. పైకథార్థమును రూపించుచు 'రంగన'కృతిగా ప్రాచ్యలిఖితపుస్తకశాలలో 'నయనరగడ'యని యొక గ్రంథము గలదు.

క. శ్రీపార్వతీకుచాంచక
పాపాత్ముడ నగుచు బోవ బథమున జక్షుల్
దీపించు దృష్టి దొలగిన
శ్రీపతి నడుగంగ జెప్పె శివు గర్తనుగాన్.

(తరువాయి ప్రక్క పుటలో)

౧౧. అన్నమాచార్యచరిత్రము :

తాళ్లపాక అన్నమాచార్యచరిత్ర మిందు ద్విపద రూపమున వర్ణితమైయున్నది. ఈగ్రంథమును అన్నమాచార్యుల మనుమడగు తిరువేంగళనాథుడు (చిన్నన్న) రచించినాడు. ఇది తిరుపతి శ్రీవేంకటేశ్వరప్రాచ్య విద్యాపరిశోధనాలయభాండాగారమున నున్నది. దీనిని, ఇతనిదే ఉషాపరిణయము ద్విపదను శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనశాఖవారు ప్రకటింతురు.

౧౨, ౧౩. శ్రీపాదరేణుమాహాత్మ్యము, శకుంతలాపరిణయము :

మొదటిగ్రంథము తిరుపతిదేవస్థానములోను, రెండవగ్రంథము ఓరియంటల్ లైబ్రరీలోను నున్నది. రెండును ముద్రితములు కాలేదు. ఈగ్రంథములను రచించినవాడు శేషమారి వేంకటకృష్ణకవి. తాళ్లపాక వంశమువారి మేనల్లుడు.

౧౪. శృంగారామరుశతకము :

దీనికర్త తాళ్లపాక తిరువేంగళప్ప. తాళ్లపాక వంశములోనివాడు. ఇది అమరుశతకాంధ్రీకరణము. ఇది ప్రాచ్యలిఖితపుస్తకశాలలో గలదు.

అని దాని యారంభమున బద్యము గలదు. బసవపురాణపీఠికలో నీగ్రంథమునుగూర్చి హెచ్చుగా వ్రాసితిని. నాల్గుచరణము లిక్కడ—

"శ్రీశైలవల్లభుని శిఖరంబు జూడగంటి
సభలందు భక్తులకు జయవాదమని కంటి
గౌరికడ దేవర్వకర్తగా జూడగంటి
బహుపాపములు నన్ను బట్టువిడుచుటగంటి
నయనముగా నయనములు నాకియబోడగంటి
ఇంక శ్రీగిరిశేర నేగందునని కంటి
తనర శ్రీరంగకవిదాత యని పాడగంటి"

ఇత్యాదులు. వైష్ణవమప్పుడు రంగనాథుడే శైవుడై రంగకవియయ్యెను. "ఘనుడు రంగన దూషకరగండడని కంటి"యనియు గలదు. శైవవిషయములు నీగణపతిదేవకవి కృత్యవతరణిక యథార్థపఱుచుచున్నవి."

—"శివయోగసారము-అవతరణిక" అనువ్యాసము (సుభాషి. నవంబరు ౧౯౨౬)నుండి.

౧౫. కవిలోకచింతామణి :

దీనిని వెల్లంకి తాతంభట్టు రచించెను. ఈతని పేరనే 'ఛందోదర్పణ'మను గ్రంథాంతరమును గలదు. ఈ రెండును ముద్రితములు కాలేదు. తంజావూరు, ఓరియంటల్ లైబ్రరీ, అకాడమీలలో దొరకుచున్న ప్రతులన్నింటితో జ్వాటులోను నీగ్రంథమును సంస్కరించియుంచినాను. త్వరలో ముద్రింపనున్నాను.

౧౬. బాలభాగవతము :

దోనేరు కోనేరునాథకవి దీనిని రచించెను. ఇతడు భాగవతమును ద్విపదరూపముగాను, పద్యరూపముగానుగూడ రచించినాడు. ద్విపదరచనమున గొంత భాగ మిదివఱకు ముద్రితమయినది. అది సమగ్రముగా ముద్రితము కావలసియున్నది. ఇతని పద్యభాగవతరచన మిక్కిలి ప్రశస్తమైనది. దీనికి ఒకటేప్రతి ప్రాచ్యలిఖితపుస్తకశాలలో గలదు. ఈగ్రంథకర్త క్రీ. శ. ౧౫౩౦ నాటివాడు. ఇతని పద్యభాగవతమును శ్రీవేంకటేశ్వరప్రాచ్యవిద్యాపరిశోధనాలయమువారు ప్రకటింపనున్నారు.

౧౭. పలనాటి వీరచరిత్రము :

ఇందు ముగ్గురు నలుగురు కవుల రచనములు కలగలుపుగా నున్నవి. ఈరచనము లెల్ల ద్విపదమంజరీ రూపములు. బాలుని కథాభాగపు రచనములలో నొకటి మాత్రమే శ్రీ ఉమాకాంతముగారు ముద్రించినారు. ఇందు గొంత శ్రీనాథుని రచనము కలదు. ఈగ్రంథమెల్ల ముద్రితము కావలసియున్నది. ఇది పామరులయిన పాటగాండ్ర నోళ్ల బడి చాల రూపుచెడి వ్రాతకెక్కియున్నది. దీనిని ముద్రించుటకు జాల సంస్కరింపవలెను. ఈగ్రంథమున నింకను గొన్ని రచనాభాగములు దొరకవలసియు నున్నవి.

౧౮. కాటమరాజుకథ :

ఈగ్రంథముగూడ మంజరియో, తద్వికారమో యనదగిన పదరచనలో నున్నది. శ్రీనాథుని రచన మిందు నున్నట్లు కలదు. పల్నాటివీరచరిత్రము, కాటమరాజుకథ, ఈరెండును తెలుగునాటి ప్రాచీనవీరకథాగేయములు. వీనిలో అచ్చము పల్నాటి, పాకనాటి

ప్రజల ప్రాచీనాచారవ్యవహారములు పరిష్కరించుచుండును. కాటమరాజుకథను సమగ్రముగా నేను సంస్కరించి ముద్రణార్హము గావించినాను.

౧౯, ౨౦. లీలావతీగణితము, పంచతంత్రము:

ఈ రెండు గ్రంథములును శ్రీకృష్ణరాయల నాటివి. సమగ్రప్రత్యంతరములు దొరకనిచో సమగ్రముగా వేఱుగా ముద్రింపగుదురదు. పంచతంత్రము-బండారు లక్ష్మీనారాయణఅన్నకవి రచించినది. అతి శిథిలముగా వెంకటగిరిసంస్థానమున దొరకిన ప్రతినిబట్టి యిది ఓరియంటల్ లైబ్రరీలో వ్రాయింపబడినది. లీలావతీగణితభాగమును తిరుపతిప్రాచ్యపరిశోధనశాఖవారు పావులూరిగణితముతో జేర్చి ముద్రింపనున్నారు.

౨౧. సులక్షణసారము:

ఇది లింగముగుంట తిమ్మకవి రచించినది. ఇది యింతదాక ముద్రితము కాలేదు. సమగ్రముగా, పసిగా నేను దీనిని ముద్రింపనున్నాను. ఏతద్గ్రంథకర్త తెనాలి రామకృష్ణుని మేనల్లుడు.

౨౨, ౨౩. చదలువాడ మాహాత్మ్యము, ఆనందకానన మాహాత్మ్యము:

ఈ రెండు గ్రంథములను లింగముగుంట తిమ్మకవియన్నయగు రామకవి రచించినాడు. మంచి రచనము గలవి. ఈరామకవి తెనాలిరామకృష్ణకవికి అల్లుడు, మేనల్లుడును. ఈ రెండు గ్రంథములును ప్రాచ్యలిఖితపుస్తకశాలలో నున్నవి. రామకవి సంస్కృతమున నొక భాణమునుగూడ రచించినాడు. అదియు ఓరియంటల్ లైబ్రరీలో నున్నది.

౨౪. కామందకము:

అర్థశాస్త్రగ్రంథ మిది. పదునాఱవ శతాబ్దివారగు వెంకటరామకృష్ణకవులు రచించిరి. దీని ప్రతి తంజావూరిలైబ్రరీలో నున్నది. పలువురు ప్రతులు వ్రాయించుకొన్నారు. తిరుపతిదేవస్థానపు లైబ్రరీలోను దీని కాపీ ఉన్నది. వెంటనే తప్పక ముద్రింపవలసిన గ్రంథ మిది. దీనినిగూర్చి ఉద్భటారాధ్యచరిత్రపీఠిక (నేను వ్రాసినది) చూడదగును.

౨౫, ౨౬. ఆంధ్రాష్టాంగహృదయము, చంద్రికాపరిణయము:

ఈ రెండు గ్రంథములు ఎలకూచి బాలసరస్వతి మహోపాధ్యాయుడు రచించినవి. అష్టాంగహృదయము కొన్ని ప్రతులలో బాలసరస్వతిశిష్యుడు చుంచి లింగయారాధ్యుడు ఇప్పగుంట సహస్రలింగస్వామి కంకితముగా రచించినాడని యున్నది. దీనిలో కొంతభాగము ఓరియంటల్ లైబ్రరీలోను, తిరుపతిదేవస్థానము లైబ్రరీలోను ఉన్నవి. అవి ముద్రింపదగినవి. చంద్రికాపరిణయము మద్రాసుఓరియంటల్ లైబ్రరీలో నున్నదిగాని అసమగ్రము, శిథిలముగాన ముద్రింపవీలు లేదు.

౨౭. వామనపురాణము:

పొన్నతోట ఓబళకవి రచితము. ఈతడు మంచి కవి. ఈగ్రంథము పదునాఱవ శతాబ్దిమధ్యనాటిది. ఇది ఓరియంటల్ లైబ్రరీలో నున్నది.

౨౮. భాగవతము:

రత్నాకరము గోపాలకవిరచన. ప్రకీర్ణమయినది. ద్విపద. పదునాఱవశతాబ్దిమధ్యనాటిది. ఓరియంటల్ లైబ్రరీలో నున్నది.

౨౯. భాగవతము:

తరిగొండ వెంకమాంబరచనము. మహనీయురాలగు స్త్రీ రచించినది. ద్విపదరచన.

౩౦. భాగవతము:

రంగశాయికవికృతి. ద్విపదరచన. అతిశిథిలము కాన ప్రత్యంతరము దొరకినగాని ముద్రింపగుదురదు. ఇది ఓరియంటల్ లైబ్రరీలో నున్నది.

౩౧. ఉషాపరిణయము:

దామెర్ల అంకభూపాలరచనము. చిత్రకవితావిశేషము లిందుగలవు. ఇతడు బహుళాశ్వచరిత్రరచయిత దామెర్ల వెంగళరాజున కన్నకొడుకు.

౩౨. సకలకథాసారసంగ్రహము:

ఈగ్రంథము శ్రీకృష్ణదేవరాయల కంకితముగా రామభద్రకవి రచింపబూనినది. అసమగ్రము. ఈ రామ

భద్రకవి రామాభ్యుదయకర్త యయ్యలరాజు రామభద్ర కవికంటె భిన్నుడన్న విషయమును శ్రీ రామకృష్ణకవి గారు సమర్థించినారు.

33. సకలనీతికథానిధానము :

ఇదియు శ్రీకృష్ణదేవరాయలనాటిదో, అంత కించుక పూర్వపుదో! మంచిరచన. కొక్కొకము రచించిన యెర్ర్యనయే దీనిని రచించినాడు. ఇందులో బేతాళ పంచవింశతికథలు, కేయూరబాహుచరిత్రకథలు చేరి యున్నవి. గ్రంథపాతము లుండుటచే ముద్రింపనగుదుర లేదు. ప్రత్యంతరము దొరకనిచో నున్నదే ముద్రింప దగినది.

3౪. చారుచంద్రోదయము :

చెన్నమరాజు రచించినది. క్రీ. శ. పదునాలుగ శతాబ్దికుదినాటివాడు. మంచిరచన.

3౫. శుకసప్తతి :

ముద్రితమయిన భాగముగాక మతికొంతరచన మధికముగా నున్నది. ఇది చాల ప్రశస్తరచన యగుట విస్పష్టవిషయము. ఈ యధికగ్రంథభాగము ముద్ర ణార్హము. తిరుపతిదేవస్థానములైబ్రరీలో నున్నది.

3౬. శుకసప్తతి :

ఇది మఱొక ప్రశస్తరచనము. దీని రచన శ్రీ కృష్ణదేవరాయల కించుక పూర్వపుది కాదగును. ఇందలి పద్యములు ప్రబంధరత్నావళిలో నున్నవి. దీని కర్త సింగయ. ఇది యసమగ్రముగా ప్రాచ్యలిఖితపుస్తక శాలలో గలదు.

3౭. ధనుర్విద్యావిలాసము :

శకుంతలాపరిణయకర్తయగు కృష్ణకవియే దీనిని రచించినాడు. ఇది శాస్త్రీయగ్రంథమగుటచేతను, కవి తాయోగ్యతచేతనుగూడ ముద్రణార్హము. ఇది ఓరి యంటల్ లైబ్రరీలో నున్నది.

3౮. ఇందుమతీపరిణయము :

కర్త తెనాలిరామభద్రకవి. ఈతడు తెనాలి రామలింగని మనిమనుమడు. ఇది తంజావూరిలైబ్రరీలో నున్నది.

3౯. ఉదయనోదయము :

మంచి ప్రబంధము. కర్తపేరు సూరన. తంజా వూరిలైబ్రరీలో నున్నది. శ్రీరామకృష్ణకవిగారిదగ్గఱ కాపీ ఉన్నది. దాని కాపీ మదరాసు యూనివర్సిటీ వారు, ఆకాడమీవారుకూడ కైకొన్నారు కాబోలును! వెంటనే ముద్రింపవలసినది. 'వనమాలివిలాస' మని మఱొక ప్రశస్తప్రబంధ మసమగ్రము ఉన్నది. దాని కాపీ శ్రీకవిగారిదగ్గఱనుండి ఓ. లై. కి వ్రాయింపబడి నది. అసమగ్రమయినను ముద్రణార్హము. దానికర్తయు సూరనయే. ఇద్దఱు సూరన్నలు వేరయినవారగుదురేమో!

౪౦. నైషధపారిజాతీయము :

కృష్ణాధ్వరికవి తంజావూరి రఘునాథనాయని కంకితముగా రచించినది. ద్వ్యర్థికావ్యము. మంచి రచన. సవ్యాఖ్యానముగా దీనిని నేను ముద్రింప నున్నాను. ఇది తంజావూరిలైబ్రరీలో నున్నది.

౪౧. భక్తజనపారిజాతము :

తంజావూరిలైబ్రరీలో నున్నది. అచ్చుకెక్క వలసిన దివ్యకావ్యము. కర్త గుంటూరి రాజగోపాలకవి వాగ్గేయకారాగ్రణి.

౪౨. శ్రీకృష్ణవిలాసము :

దీనికి గర్త చల్లపల్లి వెంకన్న. ప్రశస్తరచనము. తంజావూరిలైబ్రరీలో నున్నది. 'తాళదీపిక' రచించిన పోలూరి గోవిందన ఈతనికి మిత్రుడు. వీరిద్దఱు తంజా వూరిప్రాంతాల నెలకొన్నవారే అనుకొంటాను. గోవింద మంత్రి 'తాళదీపిక' కూడా ముద్రణార్హము. శ్రీ విస్సా అప్పారావుగారు తన్ముద్రణయత్నము జరుపుతున్నారు.

౪3. విప్రనారాయణచరిత్ర :

ఇదియు నాయకరాజులనాటి పద్యకవితారచన. వెంకనకవి రచించినది.

౪౪. రఘునాథనాయకాభ్యుదయము, ద్విపద రచనము, ౪౫. ఈశ్వరాత్రివి యక్షగానములు, ౪౬. కాళియమర్దనము, ౪౭. తంజావూరన్నదాన మహా నాటకము, ౪౮. ప్రహ్లాదచరిత్ర, ౪౯. పూతనాహర ణము, ౫౦. రాజగోపాలవిలాసము, ౫౧. విప్రనారా

యణచరిత్ర, ౫౨. విజయరాఘవకల్యాణము, ౫౩. విజయరాఘవచంద్రికావిహారము, ౫౪. హేమాబ్జనాయకాభ్యుదయంపరము, ౫౫. ఉషాపరిణయము, ౫౬. మన్నారుదాసవిలాసము అను గ్రంథములు - తంజావూరునాయకరాజులు, వారికాలపు ఆస్థానకవులూ రచించినవి. ఇవి యన్నియు ముద్రితములు కావలసియున్నవి. ఇందులో గాఁయ రచించిన రాజగోపాలవిలాసము మిక్కిలి ప్రశస్తప్రబంధము. రఘునాథరాయల యాస్థానమునను, విజయరాఘవరాయల యాస్థానమునను నున్న శ్రీకవయిత్రులకు గొండలి కీతడు గురువు.


ఇవిగాక మద్రాస్ ఓరియంటల్ లైబ్రరీలోనివి. కాశీనాథుని వీరనారాధ్యుడు రచించిన ౫౮. ధర్మసుప్తాభ్యుదయము, ౫౯. భద్రాయుశ్చరిత్రము, ఈ వీరనారాధ్యుని దౌహిత్రుడు వీరశరభకవి రచించిన ౬౦. హరిశ్చంద్రోపాఖ్యానము ముద్రితములు కావలెను. వీరనారాధ్యుని గ్రంథములకు పూర్వ మెప్పుడో బందరు వైరవప్రెస్సులో ముద్రణప్రయత్నములు జరుగుచుండుట తెలియుచున్నది. ధర్మసుప్తాభ్యుదయము ఓ. లై. లో నున్నది. శ్రీనాగేశ్వరరావుగారు దానిని ప్రకటింతు మనగా వారి కొక కాపీ వ్రాయించియిచ్చితిని.

దామెర చినవెంకటరాయనింగారు రచించిన ౬౧. వేంకటాచలమాహాత్మ్యము, ములుపాక బుచ్చయ్యశాస్త్రి గారు రచించిన ౬౨. వేంకటాచలమాహాత్మ్యము, శ్రీష్ములూరి వెంకటాచార్యులను కవి రచియించిన ౬౩. శ్రీనివాసవిలాససేవధి ముద్రణార్హములు.

౬౪. ఆకాశరావణసంహారము, ౬౫. భద్రాకల్యాణము - కార్లకూరి లక్ష్మీపతి, ౬౬. గాథేయోపాఖ్యానము (ఇది సమగ్రముగా ముద్రితము గాలేదు.) ౬౭. రఘురామవిజయము - ఆవంచభావన, ౬౮. నిరోష్ఠ్య సీతాకల్యాణము, ౬౯. అనర్ఘరాఘవము - బిజ్జలతిమ్మభూపాలుడు, ౭౦. మార్కండేయపురాణము - ద్విపద, పద్మసాలెవారిచరిత్ర, ౭౧. కూర్మపురాణము, ౭౨. బృహన్నారదీయము, ౭౩. బ్రహ్మోత్తరఖండము, ౭౪. యథావాల్మీకిరామాయణము, ౭౫. రామాయణము - ద్విపద - కట్టా వరదరాజు, ౭౬. హరిభట్టు భాగవతభాగములు, ౭౭. వరాహపురాణము, ౭౮. మాఘమాహాత్మ్యము - ఒడ్డెపూడి పెద్దన, ౭౯. నీలకుంతలావిలాసము - తోణగాల నీలకంఠకవి, ౮౦. గౌతమీమాహాత్మ్యము - తాడూరి కృష్ణశాస్త్రి, ౮౧. జానకీరాఘవము - బేతపూడి కృష్ణయ్య, ౮౨. భాగవతసారము - వచనము - పుష్పగిరి తిమ్మన్న, ౮౩. కంకంటి పాపరాజు, విష్ణుమాయావిలాసయక్షగానము, ౮౪. నాగ్నజితీపరిణయము - వల్లూరి నృసింహము, ౮౫. పృథుచరిత్రము - పట్టమెట్ట సరస్వతీసోమయాజి, ౮౬. ప్రబంధరాజశిరోభూషణ ప్రకృష్ట బలరామచరిత్ర - గుణ్ణారు వెంకటదాసకవి, ౮౭. రత్నావళీపరిణయము - ధూర్జటి వెంకటరాయకవి, ౮౮. రాఘవవాసుదేవీయము - చిత్రకవి సింగరాచార్యులు, ౮౯. వాణీవిలాసవనమాలిక, ఇది ఎన్సైక్లోపీడియావంటిది. ౯౦. విష్ణుమాయావిలాసము - ఎఱ్ఱగుడిపాటి వెంకటకవి, ౯౧. శివమృగయావిలాసము - హార్యపరాజు రంగశాయికవి, ౯౨. శృంగారరాఘవము - చెరుకుమూడి కృష్ణయ్యకవి, ౯౩. సూర్యతనయాపరిణయము - తక్కెళ్లపాటి లింగయకవి, ౯౪. ఖలకర్ణవిపాయనము - పన్నాల బ్రహ్మయకవి, ౯౫. పద్మినీపరిణయము - నృసింహాచార్యకవి, ౯౭. పట్టాభిరామాయణము - వెంకటరామకృష్ణకవి, ౯౮. అహల్యాసంక్రందనవిలాసము - ములుగు పాపయారాధ్యుడు, ౯౯. కృష్ణాభ్యుదయము, ౧౦౦. ప్రద్యుమ్నచరిత్ర - రెంటికి గర్త ముప్పిరాల సుబ్బరాయకవి, ౧౦౧. కృష్ణార్జునసంవాదము - కస్తూరి రంగకవి, ౧౦౨. కృష్ణార్జునసంవాదము - నాదెండ్ల గోపమంత్రి. కృష్ణరాయలనాటిది. ద్విపద. ఇది తంజావూరి లైబ్రరీలో నున్నది. ౧౦౩. అధ్యాత్మరామాయణము - కంచర్ల శరభనకవి. ౧౦౪. సుత్తెనదీవి రామాయణము, ౧౦౫. రాఘవదాసురామాయణము (శోధనాద్రి నృసింహాంకితము), ౧౦౬. వీరరాఘవకృతులు రామతీర్థ శ్రీరామసేవ - గోగులపాటి కూర్మనాథకవి, ౧౦౭. ఏకాంటివారి పాటలు(ఈనాల్గును ప్రశస్తమైన గేయ రచనములు) ౧౦౮. కుంటముక్కల తిమ్మరాజు శైవాచార సంగ్రహము. కృష్ణరాయలనాటికంటెను ప్రాచీన

గ్రంథ మిది. ౧౦౯. కాసె సర్వప్ప - ప్రతాపచరిత్ర, ౧౧౦. ఇందుమతీపరిణయము - పంతుల బ్రహ్మదేవకవి, ౧౧౧. బుక్కపట్టణము రాఘవాచార్యుల కువలయాశ్వ విజయము, ౧౧౨. చొక్కనాథచరిత్ర - తిరువెంగళ కవి, ౧౧౩. విద్వత్కవికర్ణరసాయన సకలవర్ణనాపూర్ణ రామాయణము - చిత్రకవి వెంకటరమణకవి. ఇతనిదే ౧౧౪. సాంబవిలాసము, ౧౧౫. రామాయణము(ద్విపద)- కట్టా వరదరాజు (ఇది తంజావూరిలైబ్రరీలో నున్నది) ౧౧౬. రామాయణము (ద్విపద) తంజావూరి మహారాష్ట్రప్రభువు సాహుజీ రచించినది.

తీరికగొల్పని కార్యాంతరములలో ఈవ్యాసము అందుకుకులుగా వ్రాసినాను. ఇంకనెన్నో గ్రంథముల గూర్చి తెలుపవలసియుండెను. ఇది దిఙ్మాత్రసూచన. ఇంకను గొన్ని గ్రంథములు సమగ్రముగా ముద్రింప వీలుగాని వున్నవి. దొరకలేదుగాన. ఆయా గ్రంథముల నుండి 'కంఠపట్టు'లనదగిన భాగములనేని ఉద్ధరించి కొన్ని సంపుటములుగా ప్రకటించి ఆయాకవుల యోగ్యతల వెల్లడింపదగును. ఇందు శతకములు, యక్షగానములు మొదలయిన లఘురచనలనుగూర్చి వ్రాయదగిన విశేషములు వ్రాయలేదు. ఇప్పుడు సమగ్రముగా దొరకకున్న గ్రంథములను జేర్పలేదు. అతి ముఖ్యములయిన గ్రంథములట్టివి కొన్నిమాత్రమే పేర్కొంటిని. ఈవ్యాసమును జ్ఞాపకమాత్రపు తోడ్పాటుతోనే వ్రాసితిని గాన ఎందేని కవికాలాదికము కొంచెము భిన్నముగా నుండునేమో. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు శ్రీవీరేశలింగముగారి కవులచరిత్రశేషమును రచించుచున్నారు. పదునేడవశతాబ్దినడిమి కాలపు కవులచరిత్రము దాక రచించుటయినది. దానిని తిరుపతిదేవస్థానపు ప్రాచ్యపరిశోధకశాఖవారు ప్రకటింపనున్నారు.



'ఆచార్య' రాఘవ

✽

= శ్రీ కల్లూరు సుబ్బారావు =

రాఘవు డస్తమించినా డను వార్త విన్నతోడనే పాదుకలోని "మారాఘవుడు లేమి మళినమై తోచు" నను భరత వాక్యము జ్ఞప్తికి వచ్చినది.

కాని యెవరేమిచేయగలరు! "పుట్టుట గిట్టుట కొఱకే"

ప్రతి జీవియు తన చేతలవలన చిరంజీవి యగు చున్నాడు. రాఘవుడుకూడ మనకు మరువరాని చిరంజీవియే.

* * *

రాఘవుడు రంగభూమిలో రాణించిన రాయల సీమరత్నము. అమూల్యమైనవాడు. రాఘవుడు పుట్టుకతో ఆచార్యుడు; విద్యావినయముల ఆచార్యుడు; అభినయములో ఆచార్యుడు! జీవితమే కళారాధనమునకు సమర్పించిన దిట్ట.

* * *

ఇంటిపేరు తాడిపత్రివారు. ఆంధ్రనాటకపితామహుడితని మేనమామ. వారి యింటనే పెరిగినాడు. చిన్ననాటనుండి మామగారికి నాటకరచనయందు, నాట్యకళయందు గల అభిరుచి వెలిగి, ఆనాడతడు తరిబీయతుచేయుచుండిన నాటకసభ్యుల సహవాసమున మెలగి, అభినయకళలో తన్మయుడై, రూపులో, చూపులో, నడకలో, నడవడిలో, మాటలో, మంతనములో అందచందాల జూపి అందర నాకర్షించినాడు మా రాఘవాచార్యుడు.

* * *

వృత్తిలో న్యాయవాది. సివిల్, క్రిమినల్ వ్యవహారములందు సమానప్రతిభ గలవాడు. తొమ్మిదిసంవత్సరములు పబ్లిక్ ప్రాసిక్యూటరు. అతని వాదమును, అద్భుతవాక్పటిమను వినుటకే చాలమంది ప్రేక్షకులుగా న్యాయస్థానముల కేగుట చే పెరుగుచుండు. అందులో కూడ వయ్యారమును, వ్యక్తిత్వమును చూపి, పేరు పొందిన పెద్ద.

* * *

'రాఘవ' నాటకరంగమున ఉత్తమశ్రేణికి చెందిన నటుడు. నిత్యజీవితమే అతనికి నాటకరంగము.



కీ. శే. నాట్యకళాప్రపూర్ణ,
బళ్లారి టి. రాఘవాచార్యులుగారు
(నిర్యాణము : 16-4-1946)

పాత్రౌచిత్యమును ప్రదర్శించు ప్రతిభ అతని సొమ్ము. రాజా మొదలు రౌతువరకు వేషములను ధరించి ఆయాపాత్రలకు దగిన రసపోషణమును, ఔచిత్యమును గుర్తెరిగి నటించి రక్తికట్టించుట అతనికే చెల్లును.

పఠానుపటిమ, భద్రాచలరామదాసుని భక్తి, దశరథుని దుఃఖము, దుర్యోధనుని దురభిమాన దర్పము,

హిరణ్యకశిపుని ఆర్భాటము, చాణక్యుని చతురత రసవత్తరముగ రంగస్థలమున జూపి ప్రేక్షకులను మయి మరపించి మరులుగొల్పిన మహానీయుడు.

సంగీతము నెక్కువగ పాడి, సాహిత్యమును పాడుచేయుటయు, సాహిత్యమునకే ప్రాధాన్యత నిచ్చి సంగీతమును వెనుకకొట్టి ప్రజలను విసిగించుటయు అతనికి దూరము. పద్యములలోని పదములను విడివిడిగా ప్రేక్షకుల కర్థమగునట్లు చెప్పి భావప్రదర్శనమునకు వలయునంత రాగము నుపయోగించి రక్తికట్టించుటలో రాఘువు అసమానుడు. ఎందరో అతనిని అనుకరించిరి. కాని వృథాప్రయాసయే. వన్నెకట్టలేదు, పరిమళించలేదు.

* * *

సినిమారంగమున మా రాఘవునకు తగిన మంచి స్థానము లభించలేదు. కొన్ని పాత్రలుమాత్రమే ప్రదర్శించి, ఆ నియమితవిధానమును అనుసరించుట అతని సహజ కౌశల్య ప్రకటనా ప్రతిభ కడ్డువచ్చుటచే విసిగి విరమించెను.

కాక, సామాన్యప్రజకు సినిమాకళ ఉపయోగపడుటకు వీలులేనందునను, సినిమామూలమున నాటకరంగమునకు కలిగిన నష్టమును గమనించియు తనకు గిట్టక దూరమైనాడు.

* * *

రాఘవునిలో Art (కళ)కంటె Heart (హృదయము) గొప్పది. ఉదారహృదయుడు.

దీనుల నాదరించుటలో, బంధువులను గౌరవించుటలో, స్నేహితులను చేరదీయుటలో అసమానవిశిష్టత అతనియందుండెను.

కన్నబిడ్డలకన్న కడుగారాబమున పరుల పిల్లలను తనయింట పెంచి పెద్దచేసి సంతోషించువాడు.

హరిజనోద్యమమును మహాత్మా గాంధీగారు ప్రారంభించి సవర్ణులను హెచ్చరించకముందే అస్పృశ్యులను దరిజేర్చి సోదరత్వమును, సమానత్వమును నెరపిన మహోదారుడు.

దీనుల దుఃఖనివారణయే అతని నిత్యదేవపూజ.

అట్టి రాఘవుడు నేడు లేడు...

అతని ఆత్మకు శాంతిచేకూరుగాక.

సేవామందిరం

జనవరి భారతిలో ప్రకటితమైన 'సేవామందిరం' అనే వ్యాసంలో సేవామందిర స్థాపకులు కల్లూరు సుబ్బారావుగారు అని ఉన్నది. సుబ్బారావుగారు ఒక ట్రస్టీమాత్రమే అనీ, స్థాపకులు, నిర్వాహకులు ఎ. యం. లింగణ్ణగారనీ ఆ ఉభయులనుండీ ఉత్తరాలు వచ్చినవి. పాఠకులు ఈసవరణ గ్రహింపవలెను.

—సంపాదకుడు

దేశభక్తులు

[కథానిక]

•

— శ్రీ సీతారాం —

"మధూ!"

ఎంత మధుర మాపిలుపు! ఆగొంతులో ఎన్ని కోయిలల గానమాధుర్యం యిమిడివుంది! ఒక వారం రోజులు ఆగొంతు వినబడకపోతే తన కెలా వుంది! ఎన్నాళ్లలో ఎంత స్నేహం! ఒకరిమీద ఒకరి కెంత గాఢానురాగం! భగవచ్చిత్రం. తా నెక్కడ పుట్టాడు, ఆమె ఎక్కడ పుట్టింది? ఈ కలయిక కేమిటి?—ఇలా మనసులో ఏమిటేమిటో అనుకుంటూ మధూ టాంగాలోనుంచి దిగాడు.

మధూ టాంగాలో వస్తూవుండడం దూరాన్నుంచే మేడమీదనుండి గమనించి శాంత గబగబా మెట్లమీదనుంచి నేలను ముద్దులాడే చీరకుచ్చెళ్లను ఎడమచేత్తో పైకిపట్టుకుని తొందరలో పడిపోకుండా వుండేట్టుగా వూతగా కుడిచేతిని గాలిలో ఆడిస్తూ పరుగెత్తుకొచ్చింది గుమ్మందగ్గిరికి.

ఆమెను చూచీచూడడంతోనే మధూకి పట్టరాని సంతోషం వచ్చింది. అతని చేతుల్లో పత్రిక దానంతటదే జారిపోయింది.

"శాంతా!"—ఆమెగద్దకు పరుగెత్తి, ఆమె ఆనందంకొద్దీ పైకెత్తిన చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని ఉద్రేకంకొద్దీ గట్టిగా నొక్కిపట్టుకున్నారు. ఆకరస్పర్శ వల్ల కలిగిన ఆనందంలో వారి మొహాలు తేవురించాయి. ఒకరినొకరు చూచుకుని తన్మయులై ప్రేమప్రవాహంలో యీదడం మొదలెట్టారు. వీళ్లిద్దరూ ఇలా నిలబడిపోవడం ఇంట్లోనుంచి శాంతతల్లి వచ్చిచూచి గుమ్మంలోపలే నిలబడిపోయింది. వెనకాల టాంగావాడు పెట్టే పరుపూ పట్టుకొచ్చి "ఎక్కడపెట్టాలి బాబూ" అనేవరకూ వారీప్రపంచంలో లేరు. ఉలిక్కిపడి మధూ శాంత చేతులు విడిచాడు. వెనక పెట్టే, పరుపూ పట్టుకునుంచున్న టాంగావాణ్ణి చూచి సిగ్గుపడి తనగదివైపు నడిచాడు. శాంత అతని వెనకే నడిచింది. టాంగావాడు పెట్టే, పరుపూ గదిలో పెట్టేసి డబ్బులు తీసుకు వెళ్లిపోయాడు. శాంత ఆప్యాయంతో అతను విడిచే గుడ్డల్ని అతను వారించినా వినకుండా అందుకుంటూ బొంబాయికబుర్లు చెప్పమంది.

మధుసూదనుడి బెజవాడదగ్గర ఓపల్లెటూరు. కాని ఆవూ రెప్పుడూ అతడు చూచే ఎరగడు. అతనికి జ్ఞానం వచ్చినప్పట్నుంచీ పట్టణాలలోనే వుండేవారతని తలిదండ్రులు. తండ్రి పోలీసుసర్కిల్ ఇన్స్పెక్టరు. అతనికి ప్రభుత్వంలో మంచి పేరుంది. మధూకి ఒక తమ్ముడూ, చెల్లెలూ. ఆఇంట్లో అందరూ రూపసులే. మధూ చిన్నప్పట్నుంచీ పెంకిగా వుంటూవుండేవాడు. ఎప్పుడూ ఇంటికి వేళకు రాకపోవడం, ఎక్కడన్నా ఏదన్నా సభలు, సమావేశాలు ఉన్నాయంటే చెప్పకుండా వుడాయించెయ్యడం అతనికి బాగా అలవాటయిపోయింది. తండ్రి అతన్ని ఎన్నిసార్లో వారించాడు. తిట్టాడు, కొట్టాడు. మధూ వింటేనా! మధూ కాలేజీలో చేరిందిమొదలు మరీ ముదిరింది వ్యవహారం. జిల్లాలో తను హాజరుకాని జాతీయవుత్సవమే లేదు. చిన్నతనంలో తను సరదాకి తిరిగినా రానురాను తను చేస్తున్న పని ఉత్తమమయినదని గ్రహించాడు. కమ్మటి గాత్రం అతనిది. ఊరేగింపుల్లో చక్కటి జాతీయగీతాలు పాడి ప్రజల శరీరాలు పులకరింపజేసేవాడు.

అతనికి తనదేశదారిద్ర్యం అతికంటకంగా కన్పించింది. ఎక్కడచూచినా బిచ్చగాళ్లు, రోగులు, తిండి

లేక ఎండిన పశువులూ, పాలులేక సొమ్మసిల్లే పిల్లలూ— ఇవన్నీ అతని మనస్సు కలచివేశాయి. దీనికి కారణాలు రాజకీయపెద్దల్ని అడిగీ, పుస్తకాలు చదివీ గ్రహించాడు. దాస్యం! దీన్ని బాపడం ఎలా? నలభై కోట్లమంది జనం బానిసలై పశువులకంటే హీనంగా చూడబడుతున్నారే! పంటలతో తులతూగే ఈ దేశంలో కట్ట గుడ్డలేక, తిన తిండిలేక వందలకువందలు మాడి చస్తున్నారంటే దీని కంతకూ కారణం పరపీడనమేగదా!

అతనికి తిండి సహించేది కాదు. రాత్రుల్లో నిద్రపట్టేదికాదు. ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తేనే కాని, ప్రజలంతా ఏకమయి ప్రభుత్వాన్ని ఇల్లువిడవమని చెప్పేస్థితికి వచ్చేవరకూ ఏమీ ప్రయోజనం లేదని గ్రహించాడు.

కాలేజీలో విద్యార్థిసంఘా న్నొకదాన్ని లేవదీశాడు. అతడి రూపం, గాత్రం చాలామందిని ఆకర్షించాయి. ఇతరవిద్యార్థులతో కలిసి వాడవాడల్లో, పల్లెపల్లెల్లో ప్రబోధంచేయడం ఆరంభించాడు. పెద్దపెద్ద దేశనాయకుల్ని పిలిపించి జాతీయవుత్సవాలు ఏర్పాటు చేసేవాడు. యువజనసేవాదళ మొకటి ఏర్పాటుచేశాడు.

మధూతండ్రి కిదేమీ గిట్టలా. ఈవిధంగా తన కొడుకు ప్రవర్తిస్తే ప్రభుత్వం తన నేం చేస్తుందో? తన కొడుకు చేసేది మంచిపనో, చెడ్డపనో అది వేరేమాట. విచ్చలవిడిగా మధూని విడిచేస్తే తన నోట్లో మన్నడి పోదూ? కొట్టే వయస్సు దాటిపోయిందిగనక మధూకి బతిమాలి చెప్పాడు. ఆవిషయంలో తన నడ్డుపెట్టొద్దనీ, తను చేస్తున్న పని ఉత్తమమయినదనీ తండ్రికి చెప్పాడు మధూ. ఇలాగయితే లాభంలేదని తండ్రి అతన్ని కాలేజీలోనుంచి మాన్పిస్తానని బెదిరించాడు. చదువులేకుండా చెడిపోతావని భయపెట్టిచూచాడు. తండ్రి ఆవిధంగా అన్న మర్నాడే తనే కాలేజీకి వెళ్లడం మానాడు మధూ.

కాలేజీకి వెళ్లకపోవడం మూలాన అతనికి రాజకీయవ్యవహారాల్లో పాల్గొనేందుకు బాగా వ్యవధి చిక్కింది. శృతిమించి రాగాన పడిం దనుకున్నాడు వ్యవహారం తండ్రి. మధూకి ఎన్నిసార్లో చెప్పాడు "వద్దురా బాబూ ఆపని" అని. చివరకి యథార్థ విషయంకూడా చెప్పాడు: ఈవిధంగా తను ప్రవర్తిస్తే తమ సంసారం ఏంకానని.

మధూ తన తండ్రిస్థితి గ్రహించలేని అజ్ఞాని కాడు. వెంటనే ఇల్లు విడిచిపెట్టాడు. తల్లి గోల పెట్టింది. తమ్ముడూ, చెల్లెలూ బతిమాలారు. ఊహూ— వినలా. తనను చూడాలని వుంటే త నెక్కడ వుంటే అక్కడకు వచ్చి చూచి వెళ్లమన్నాడు. ఆఇంటికి మాత్రం తను రాలేనన్నాడు.

ఇప్పుడు తన జీవనోపాధి ఎలా? అక్కడక్కడా ఏవో ప్రయివేట్లు కుదుర్చుకుని ఏదో కడుపున వేసుకుని రాజకీయకలాపాల్లో మిగిలిన కాలం వెళ్లబుచ్చేవాడు. అప్పుడప్పుడు తల్లి డబ్బుపంపేది. తిప్పిపంపేసేవాడు.

పూనాలో అఖిలభారత విద్యార్థిసమావేశ మొకటి జరిగింది. దానికి ఇంకా కొందరితోపాటు మధూ ప్రయాణమయ్యాడు. సమావేశం చాలా బాగా జరిగింది. పూనాలో అతనికి చాలామంది స్నేహితులయ్యారు. పూనారాష్ట్రవిద్యార్థిసభ అధ్యక్షుడు దేశ్‌ముఖ్, ఉపాధ్యక్షురాలు శాంత అతన్ని బాగా గౌరవించారు. అతని సంగతి మిగిలిన ఆంధ్రరాష్ట్రవిద్యార్థిసభ ప్రతినిధులద్వారా విని అతని త్యాగానికి చాలా అభినందించారు. కొద్దికాలం తమతోపాటు వుండి తమ రాష్ట్రంలో పర్యటనంచేయమని కోరారు. మధూ సంతోషంతో దానికి అంగీకరించాడు.

మహారాష్ట్రపర్యటనంలో అతను శాంతహృదయంలోకి చొచ్చుకుపోయాడు. ఒకరిమీద ఒకరికి ప్రేమ అంకురించింది. ప్రేమకు హద్దు వుందా? ఊళ్లు దాటుతుంది, జిల్లాలు దాటుతుంది, రాష్ట్రాలు దాటుతుంది—దేశాలే దాటిపోతుంది! ఇద్దరికీ పరస్పర ప్రేమ కలిగినా ఒకరికొక రాసంగతి చెప్పుకునేందుకు జంకారు.

శాంత తలిదండ్రుల కొక్కతే బిడ్డ. వారు మంచి ఆస్తిపరులు. ఆమె బి. ఏ. పరీక్షకు చదువుతోంది.

మహారాష్ట్రపర్యటనం అయినతర్వాత, తను వెళ్లిపోతానని మధూ శాంతతో చెప్పాడు. శాంత

ఒప్పుకోలా. కొంత కాలం తమతో వుండమని కోరింది. కొన్నాళ్లు సహవాసం చేసిన చనువుతో అసలు మహారాష్ట్రంలోనే అతనెందుకుండిపోకూడదని కూడా అడిగింది. ఏం? తన రాష్ట్రానికి వెళ్లిపోయినా తన తండ్రితో నివసించి అతనికి కష్టం కలిగించడం తన కిష్టం లేదుగా?

మధూ మౌనం దాల్చాడు.

అతడు మౌనంగా వుండటం మూలాన మరింత ధైర్యం కలిగి, అతడు వేరువిధంగా భావించకపోతే తమ ఇంట్లోనే వుండిపోవచ్చునని కోరింది. తన తలిదండ్రులకు మగపిల్లలెవ్వరూ లేరు. అతను వుండిపోవడానికి అంగీకరిస్తే తన తలిదండ్రులు అపరిమితంగా సంతోషిస్తారంది. తా మిరువురూ కలిసి ద్విగుణీకృతోత్సాహంతో దేశసేవ చెయ్యవచ్చునంది. ఉండిపొమ్మని మరీ మరీ బ్రతిమలాడింది. తలఎత్తి ఆమె వంక చూచి, కాదనలేకపోయాడు.

కాంత తలిదండ్రులు అతను వుండడానికి అంగీకరించినందుకు చాలా ఆనందించారు. ఆఇల్లు తన ఇల్లుగానే భావించుకొమ్మని చెప్పారు. తమ బిడ్డవలె చూచుకుంటాం, తమవద్దే వుండిపొమ్మన్నారు.

కాంతకూ, మధూకూ ఒకరిమీద ఒకరికి గౌరవాభిమానాలు పెరిగిపోయాయి. ఒకరిమీద ఒకరికి ప్రేమ దాచుకోవాలన్నా దాచుకోలేకపోయేవారు. కాంత ఏదన్నా పాట మొదలెట్టితే మధూ అందుకుని, మళ్లీ సిగ్గుపడి మానేసేవాడు. కాంత పాడమని బ్రతిమాలేది. ఇద్దరూ కలిసి చక్కగా పాడేవాళ్లు. మధూ మహారాష్ట్రభాషాభ్యసనానికి కాంత గురువు. అతడు ఎక్కడన్నా తప్పు చదివితే మళ్లీ చదవమనేది. మళ్లీ చదవమన్నప్పుడు తప్పు తెలుసుకున్నా కావాలని తప్పుచదివేవాడు. మళ్లీ మళ్లీ చదవమన్నా తప్పు చదివేవాడు. కాంత అతన్ని గట్టిగా కేకలేసేది. ఇలాగయితే ఇక చదువురాదు పొమ్మనేది. మొహం చిట్లించుకుని, ఇంత మొద్దబ్బాయికి చదువు చెప్పలేననేది. "ఆ, ఆ, కోపంవద్దు" అని సరిగా చదివేవాడు. ఇద్దరూ విరగబడేటట్లు నవ్వుకునే వారు.

ఇలా రోజులు చకచకా పరుగెత్తాయి. బొంబాయిలో రాష్ట్రవిద్యార్థి సమావేశం దగ్గరకొచ్చింది. దానికి మధూ ప్రయాణమయ్యాడు. కాంతకి పరీక్షలు దగ్గిరపడంమూలాన బయలుదేరలేకపోయింది.

౨

కాంతకు పరీక్షలయిపోయినాయి. మధూ బొంబాయినుంచి తిరిగివచ్చాడు. బొంబాయిలో సంగతులన్నీ విన్నది కాంత.

ఇద్దరూ వుత్సాహంతో వూరూరా ప్రచారం ఆరంభించారు. వారిద్దర్నీ చూచి జనం ముచ్చటపడేవారు. లేతవయస్కులు. అందగాళ్లు. విద్యావంతులు. మంచి వాగ్ధోరణి వుంది. ఇద్దరివీ చక్కటి గొంతులు. కమ్మటి జాతీయగీతాలు ఒళ్లు పులకరించేట్లుపాడేవారు. ప్రజలు వారి ఉపన్యాసాలు విని ఉద్రేకంపొందేవారు.

ఒకరోజు రాత్రి వారు తిరిగితిరిగి వచ్చి ఒక వూళ్లో ఒక సత్రంలో మకాం వేశారు. కాంత పూర్తిగా బడలిపోయింది. పల్లెటూళ్లలో తిరగడమంటే మాటా! మట్టిరోడ్లమీద, చేలగట్లంట, తుప్పల్లో, నీళ్ల మడుగుల్లో, మోకాటిలోతు రొంపిలో నడిచిపోవాలి. కాంత పూర్తిగా అలసిపోయివుంది. దానికితోడు ఆకలిలేదని తిండిమానేసింది. దానితో నీరసించి స్పృహతప్పింది. అప్పటికి బాగా చీకటిపడింది. తామున్న గదిలో ఓ మూల కూజాలో కాసిని నీళ్లున్నాయి. అవి తెచ్చి ముఖాన కొట్టాడు మధూ. ఆమెశిరస్సుదగ్గర కూచుని ఉపచారాలు చేశాడు. ఆమెనుదురు తన వేళ్లతో మెల్లగా నిమిరాడు. ఆమెతల తీసి తనతొడమీద పెట్టుకున్నాడు. ఆమె ఆమాదిరిగా నీరసపడడం, తానామెకు శుశ్రూష చెయ్యడం తటస్థించినందుకు, ఆమె కష్టపడడం ఇష్టంలేకపోయినా, సంతోషించాడు.

కాంత బలహీనంగా వున్నా ఎంత ముద్దుగా వుంది! స్త్రీ సహజంగా, శారీరకంగా పురుషునికంటే బలహీనగనక, సౌమ్యశరీర గనక మగవాడు సాధారణంగా స్త్రీని తన రక్షణలోకి తీసుకోడానికి గర్విస్తాడు. శరీరాన్ని మరచిన స్థితిలో కొంతసేపుండి కాంత మెల్లగా

తెప్పరిల్లి తన చెయ్యి నుదుటిమీద వేసుకుంది. ఆమె నుదురు సవరిస్తున్న మధు చెయ్యి తగిలిందామెచేతికి. అప్పుడు తన తల మధూ తొడమీద వుందని గ్రహించి సిగ్గుపడి లేచి కూర్చోబోయింది. మధూ వారించాడు. అతని చేతిని తన చేత్తో నొక్కిపట్టుకుని ఆనంద బాష్పాలు విడిచింది కాంత.

వెన్నెలరాత్రి...చల్లటిగాలి వీస్తోంది...మిణుగురుపురుగులు చంద్రుణ్ణి చూచి సిగ్గుపడి తుప్పల్లో దాక్కోడంకుకు ప్రయత్నిస్తున్నాయి.

కాంతా, మధూ ఇద్దరూ కలిసి ఒకపాట పాడారు. మధూ ఒక ఎత్తు అరుగుమీద కూర్చున్నాడు, ఇంటిచుట్టూ వున్న తోటలో ఒక మూల. కాంత దగ్గరకు వచ్చి అతని భుజంమీద చెయ్యి వేసి సిగ్గుతో తలవంచుకుంది. ఆమెచెయ్యి తీసి తన చేతుల్లో పెట్టుకుని "ఏమి, చెప్పుమ" న్నట్లు ఆమెవైపు చూచాడు మధూ.

కాంతబుగ్గల్లోకి రక్తం పరుగెత్తుకొచ్చింది. నును సిగ్గుతో అతనిని వివాహమాడాలని తన కోరిక అని చెప్పింది. మధూ తన చేతితో వున్న ఆమెచేతిని గట్టిగా నొక్కి తన సంతోషాన్ని తెలిపాడు. కాని వెంటనే తన స్థితి జ్ఞాపకానికొచ్చి ఆమెచెయ్యి జారవిడిచాడు. ఆమె నిర్ఘాంతపోయింది.

"మధూ!-నన్ను వివాహమాడడం నీ కిష్టంలేదా" అని తత్తరపాటుతో అడిగింది.

మధూ ఆలోచనలో పడిపోయి వెంటనే జవాబు చెప్పలేకపోయాడు.

"మధూ!" అతని భుజాలు పట్టుకు కదిలించింది.

"కాంతా! నిన్ను నేను నిజంగా ప్రేమిస్తున్నాను. నీలోటి సుగుణవతిప్రేమ సంపాదించడం నా అదృష్టం. కాని నాస్థితి నీకు తెలుసు. నేను ఇల్లూ వాకిలీ లేనివాడిని. నాచేత ఒక రాగిదమ్మిడీ అయినా లేదు. ప్రజల దారిద్ర్యనివారణకోసం, దాస్య విముక్తికోసం యుద్ధంచేసి జయం సంపాదిద్దామని ఇల్లూ వాకిలీ విడిచి, తల్లినీ తండ్రినీ ఎడబాసి నేను ఒకవిధంగా దరిద్రుణ్ణయ్యాను. ప్రజల ఆదరాభిమానాలే నా భాగ్యమయినప్పటికీ నీలోటి సుగుణతో సన్నిహిత సాంగత్యం ఏర్పరచుకోవడం కూడా ఓ పెద్ద అంతను కల్పించుకోవడమే. అయినా నాస్థితినిబట్టి నీకు నేను తగినవాణ్ణి కానని తోస్తూవుంది. ఈవివేకం నాకు ఇంతకుముందు కలగకపోయినందుకు చింతిస్తున్నాను. ఇన్నాళ్లూ ఒళ్లుమరచి చనువుతీసుకుని నీహృదయాన్ని అపహరించాను. క్షమించు. నేను చేసింది ఘోర తప్పిదమే. నన్ను తప్పక క్షమిస్తావనుకుంటాను—కాంతా!—అలా చూస్తున్నావేం? సరిగ్గా చూడు—క్షమించవూ? పోనీ దూషించు. నేను దూషణకే పాత్రుణ్ణి. నిన్ను చూచి ప్రపంచమే మరచిపోయాను. నన్ను నేను పోషించుకోలేని స్థితిలో వుండి నీవంటి వుత్తమురాలిని, శ్రీమంతురాలిని ప్రేమించాను. నీ సుగుణాలన్నీ నాకు తెలుసు. సర్వసుఖాలూ నీ ఆస్తి వల్ల పొందగలిగివుండీ కూడా దేశంకోసం త్యాగం చెయ్యడానికి నీవు సిద్ధంగా వున్నావని నాకు తెలుసు. నీవు వివాహమాడవలసివస్తే మాత్రం సామాన్యధర్మ ప్రకారం నీహోదాలోవున్న పురుషుని నీవు వివాహమాడాలి. లేకపోతే అది ప్రపంచానికి బాగా కన్పించదు. నేను నిన్ను వివాహమాడితే నాకు నామీదే ఒకవిధమైన హైన్యభావం అంకురిస్తుందని తోస్తోంది. అన్ని విషయాల్లో నీవు నాకంటే మిన్నవు. విద్యలోనా అంటే నీవే నాకంటే ఎక్కువ చదివావు. అందంలోనా నేను నీకాలి గోటికి పోలను. దేశసేవలోనా నీవు స్త్రీవయివుండీ, ఆగర్భశ్రీమంతవయి వుండీకూడా ప్రజలకోసం తిండీ, నిద్రాకూడా మాని కొండలూ, గుట్టలూ ఎక్కి, పల్లెపల్లెలూ తిరిగి జాతీయ ప్రబోధం చేస్తున్నావు. ఒక్కవయస్సులో తప్ప నీకంటే ఎందులోనయినా అధికుణ్ణి కాకపోలేమానె, నీతో సమానస్థితిలోకూడా లేని సందర్భంలో నిన్ను వివాహమాడడం నిన్ను ద్రోహం చెయ్యడం అవుతుంది. కాంతా! నీపాదాలమీద పడతాను. నన్ను క్షమించు. నన్ను దుర్మార్గుడను; క్రూరుడను; ద్రోహి అను. ఏమన్నా అను—నన్ను మాత్రం క్షమించానను."

కాంత మధూవుపన్యాసం శాంతంగా వింది. పెదవికొరుక్కుంది. కళ్లవెంట చిన్న ముత్యాలసేరు జారింది.

"మధూ! అయిందా నీవుపన్యాసం ?— విను, నిన్ను నేను క్షమించడం కాదు. నన్ను నీవు క్షమించాలి. నీవు నాకు తగనని చెప్పడంలోనే నీ వుత్తమలక్షణం కన్పిస్తోంది. నీకు ఆస్తిలేదనీ, నాకు ఆస్తివుందనీ, అందువల్ల నన్ను వివాహమాడననీ అన్నావు. నాకు డబ్బు వుండడం మూలానే నీవు నన్ను విసర్జించ నిశ్చయించుకున్నట్లయితే నేను మున్ముందుకీ దురదృష్టవంతురాలిని. సుఖం యివ్వని, కోరిన పురుషుని చేసుకోనివ్వకుండా అడ్డుపడే డబ్బు నాకెందుకు? దేశసేవలో నీకంటే నేను గొప్పదాననన్నావు. దేశంకోసం ఇల్లూ వాకిలీ, తల్లీ తండ్రీ విడిచి, వున్నపూట తిని లేనిపూట మాని నానా అవస్థలపాలవలేదే! చక్కగా చీకూ చింతా లేక తలిదండ్రులచాటున చక్కటి భవనంలో నివసిస్తూ అప్పుడప్పుడు, సరదాకి తిరిగినట్లుగా, పల్లెలవెంట ప్రచారంకోసం బయలుదేరుతున్నాను. నీత్యాగం ముందు నేను చేసిన పనికూడా మహాత్యాగమనే చెప్పుకోవాలా? ఏం మాట్లాడవు? చదువన్నావు. నీకంటే ఏవిషయంలో నాఘనత? నీవు నాకంటే ఎక్కువ అనుభవం గడించావు. అనుభవంలోకంటే పుస్తకాల్లో ఎక్కువ నేర్చుకోగలవా? నేను పరభాషా వ్యామోహంతో కాలేజిలో చేరాను. నీవు నీచదువుకూడా దేశంకోసం మాని కష్టాలనుభవించి ప్రజాసేవకుడి వయ్యావు. అందమంటావా? నీవు అందంగా లేవా? నీ అందం నీకేం తెలుస్తుంది? నాకళ్లకు నీఅందంతో సమానమయిన అందం మరోచోట కనిపించలేదు. నీకోసం ఏంచెయ్యమంటే అది చేస్తాను...... నా తలిదండ్రులకు మగపిల్లలు లేరన్న సంగతి నీకు తెలిసిందే. వారు నిన్ను గౌరవించడంలో ఏమన్నా తక్కువచేస్తున్నారా? నిన్ను తమ కన్నకొడుకులా చూచుకుంటున్నారు. నీవు వచ్చిన దగ్గరనుంచీ వారి కొక బంగారపుకొండ దొరికినట్లుంది. వారి సంతోషానికి అంతరాయం కలిగించడం నీకిష్టమా? ఈఇల్లు నీదిగా భావించుకోవా? నీవు మాతో వుండిపోతే నీవూ, నేనూ దేశంకోసం ఎంతో పనిచెయ్యగలం. మన జీవితాంతంవరకూ దేశంకోసం పాటుపడదాం—మధూ! ఊ అనవూ?" అతని రెండుచేతులూ తన చేతుల్లోకి తీసుకుని అతనికంత దీనంగా, ప్రేమతో చూచింది.

మధూ జవాబు చెప్పలేకపోయాడు. ఆనందంతో కళ్లవెంట నీరుబికి కాంతహస్తాలమీద పడింది. కాంత అతని చేతులు తన చెక్కిళ్లకు హత్తుకుంది.

కాంతతలిదండ్రులు మధూను అల్లుణ్ణిగా చేసుకునేందుకు కొంచెం శంకించారు. అతడు వుత్తముడని వారికి తెలుసు. కాని అతడు అంధ్రుడు. కాంతను అతనికిచ్చి వివాహంచేస్తే తమ బంధువు లేమంటారో!

కాంత మధూనితప్ప ఇంకొకళ్లని పెళ్లిచేసుకోనని పెంకిపట్టుపట్టింది. వాళ్లకి ఆవివాహం యిష్టం లేకపోతే ఇల్లువిడిచిపెట్టి అయినాసరే అతన్నే వివాహమాడుతానుగాని మాననంది. ఒక్కతే పిల్ల. మధూ కూడా కాంతకు తగిన యోగ్యుడు. కాంతతలిదండ్రులు కూడా అంత పూర్వాచారపరాయణులు కారు.

కాంతామధూల వివాహం వైభవంగా జరిగింది. పెళ్లికి కాంతబంధువులుగాని, మధూవైపువారెవరుగాని రాలేదు.

వివాహానంతరం కులాసాగా కాలంగడిపేందుకు బొంబాయి వెళ్లారు కాంతా, మధూ ఇద్దరూ.

అతిసరదాగా కొన్నినెలలు గడిచాయి.

3

౧౯౪౨ ఆగస్టు సమీపించింది. బొంబాయిలో అఖిలభారత కాంగ్రెసుసమావేశ మవడానికి కావలసిన ఏర్పాట్లు చేయబడుతున్నాయి. దేశనాయకులు ఒక్కొక్కరే బొంబాయి చేరుకుంటున్నారు.........

ఆగస్టు ౭, ౧౯౪౨. కాంగ్రెసుకార్యవర్గసభ సమావేశమయి బ్రిటిషు ప్రభుత్వం "ఇండియా వదలాలి" అనే తీర్మానాన్ని ఆమోదించింది.

ఆగస్టు ౮, ౧౯౪౨. అఖిలభారత కాంగ్రెసు సంఘసభ్యులు కార్యవర్గసభ ఆమోదించిన తీర్మానానికి

అంగీకారం తెలియజేశారు. మహాత్మున్ని ఉద్యమానికి నాయకున్ని గావించుకున్నారు. మహాత్ముడు వైస్రాయితో సంప్రదించి ఉద్యమాన్ని లేవదీస్తా నన్నాడు.

ఆరాత్రి అంతా పొద్దుపోయి ఇళ్లకు చేరారు. రాజకీయవాతావరణం బింకంగా వుంది. నాయకుల్ని అరెస్టుచేసి తీసుకుపోవచ్చునని వదంతులు బయలు దేరాయి. ప్రజలంతా సమరసన్నద్ధు లవుతున్నారు. మహాత్ముని కార్యక్రమ మెప్పుడూ అహింసాపద్ధతుల్లోనే నడుస్తుంది. ప్రజలు దానిని పూర్తిగా ఆమోదించి ఉద్యమాన్ని నడపడానికి సిద్ధులై వున్నారు.

ఆగస్టు ౯, ౧౯౪౨. తెల్లవారకముందే పిడుగులాటి వార్త బయలుదేరింది. నాయకులందర్నీ అరెస్టు చేశారు. కార్యవర్గసభ్యుల్ని ఎక్కడికి తీసుకెళ్లిపోయారో తెలియదు. మహాత్మున్నీ, ఇంకా కొందర్నీ పూనా ఆగాఖాన్ భవనానికి తీసుకెళ్లారు. ప్రజలు అదిరిపోయారు. వారి కేమీ తోచలా. ప్రభుత్వం తమకు నాయకుల్ని లేకుండాచేసి తమను అగాధంలో తోయడానికి సిద్ధమయిందని దద్దిల్లిపోయారు. ప్రజలు శాంతియుతంగాకూడా సభలు జరిపేందుకు వీల్లేదని ప్రభుత్వం ఆంక్ష వేసింది. ప్రజలు నిర్లక్ష్యంచేసి సభలు జరిపితే లాఠీలు, బాష్పవాయువు ప్రయోగించబడ్డాయి. ప్రజలకు వెర్రెత్తిపోయింది. వారి కేం చేయాలో తోచలా. ఏది మంచో, ఏది చెడ్డో విచారించుకునే స్థితిలో లేరు వారు. టెలిగ్రాఫ్, టెలిఫోన్ తీగలు తెంపారు. రైలుపట్టాలు లాగేశారు. పోస్టాఫీసులు ధ్వంసంచేశారు. ప్రభుత్వం ప్రజలమీద తుపాకులు కాల్చి వారిని మరీ రెచ్చగొట్టింది. అల్లర్లు బొంబాయి నుంచి దేశంలో మూలమూలకీ పాకిపోయాయి.

శాంతామధూలు బొంబాయిలో జరిగిన అల్లర్లు కళ్లారా చూచారు. ప్రభుత్వం ప్రజల్ని రెచ్చగొట్టి, వారు వెర్రెత్తినతర్వాత వారిని అణచివేసేందుకు చేసిన కృత్యాలు వారిని కంపితులను చేశాయి.

పత్రికల్లో రోజూ వార్తలు వస్తున్నాయి. పోలీసులు నిరాయుధప్రజలమీద తుపాకులు పేల్చడం, ప్రజలు ఒళ్లుమరిచి పోలీసుల్ని బ్రతికివుండగానే కాల్చడం— అరాచకం ప్రబలిపోయింది. దేశంలో నలుప్రక్కలా రక్తప్రవాహాలు కట్టాయి. ఎంతమందో ప్రజలు మరణించారు. ఎంతమందో అధికారులు జీవాల్తో తగలపెట్టబడ్డారు. దేశమంతా హింసలో మునిగి తేలి ఆడింది. ప్రజలు ఒక నిర్ణీతపద్ధతిలో తమ ఉద్యమాన్ని నడపలేరు. ఉద్రేకంతో ప్రాణాలుమాత్రం అర్పించారు.

శాంతా, మధూ ఇద్దరూ తాము బొంబాయిలో సుఖాలనుభవిస్తూ వుండేందుకు సమయం కాదని పూనా వచ్చారు. రాగానే పల్లెల్లో సంచారం మొదలుపెట్టారు. వీరిని కొన్ని గ్రామాలకు వెళ్లకుండా పోలీసులు ఆటంకపరిచారు. వీరు వీలయినన్ని చోట్లకు వెళ్ళి హింసాకాండ మాన్పడానికి యత్నంచేశారు. వృథాగా రక్తం ధారపొయ్యకద్దని హెచ్చరించారు.

ఒక పల్లెలో పోలీసువారి దుండగాలు విపరీతమయి ప్రజలంతా తిరుగుబాటుచేసి పోలీసులు మకాం చేసిన ఇంటికి నిప్పంటించారు. వాళ్ల డేరాలు తగలపెట్టారు. ఇదంతా ఒకరాత్రికి రాత్రి చేశారు. ఈవార్త చెవినిపడగానే శాంతా మధూలు ఆ గ్రామం బయలుదేరారు. ప్రజల్ని శాంతులుకమ్మని బోధించారు. కాని వాళ్ళమాట ప్రజలు మన్నించేందుకు అవకాశమేదీ? ప్రభుత్వపు విమానాలు ఆగ్రామంమీద ఆకాశంనుంచి మరఫిరంగులు పేల్చాయి. మిలిటరీ చుట్టుముట్టి నిరాయుధప్రజల్ని ఎడాపెడా కాల్చింది. ప్రజలు తమకు చేతనయిన పని రాళ్ళూ, సోడాబుడ్లూ విసిరారు. మిలిటరీముందు యివి ఆగుతాయా? ఆపల్లె లొంగిపోయింది. ఊరిలో వున్న మగవాళ్ల నందర్నీ అరెస్టుచేసి తీసుకుపోయారు. మధూని కూడా తీసుకుపోయారు. ఇక ఇళ్లలో మిగిలింది స్త్రీలూ, బాగా దెబ్బలుతిన్న ముదుసళ్ళూ, పిల్లలూ.

ఆరాత్రి ఆగ్రామం అంతా ఒక స్మశానవాటిక మాదిరి వుంది. ఏఇంట్లోనూ సరిగ్గా దీపంలేదు. కొన్ని ఇళ్లు మనుష్యులు లేక, దీపాలులేక దెయ్యాల కొంపల్లా వున్నాయి. ఏమూలచూచినా ఏడ్పులే. ఒక యువతి తన భర్తకోసం ఏడుస్తోంది. ఒక ముదుసలి తన కొడుకు మళ్లీ తిరిగి దక్కుతాడో లేదో అని ఎలుగెత్తి ఘోషపెట్తోంది. ఒక విధవాంగన తన కింకెవరు తిండి పెడ

శారు, తన అన్నను పొట్ట పెట్టుకున్నారని హోరున ఏడుస్తోంది. ఏమూలచూచినా ప్రళయరుద్ర తాండవమే.

శాంతకు నిద్రపట్టలా. ఒంటరిగా ఒక అరుగు మీద కూర్చుంది. ఆఇంట్లో ఎవరూలేరు.

తన మధూని తీసుకుపోయారు! మధూ చేసిన అపరాధ మేమిటి? అత నెవర్ని చంపాడు? మధూ ఏ నేరమూ చేయకపోయినా ఇతర ప్రజలతో పాటు శిక్షననుభవించడానికి సిద్ధపడి జోరత్తలేదు. మధూ దేశంకోసం ఎంత త్యాగం చేస్తున్నాడు! అలాటి మధూకి తను భార్యకావడం ఎంత అదృష్టం! తనకు ఏడ్పు తెప్పించుకోవాలన్నా రాదు. ఎందు కేడ్వాలి తను? మధూని చంపేస్తారా ప్రభుత్వం వారు? చంపనీ. అంతకంటే వా రేం చేయలేరుగదా? మధూ హృదయంలో వుద్భవించిన ఆ దీక్షాశక్తిని వారు అంతరింప చేయగలరా? వారివశం కాదు. అతని దెంత కోమలశరీరం! ఎంత రాయిలాంటి పట్టుదల! ప్రభుత్వం తన భర్తను తన నుండి శారీరకంగా వేరుచేయవచ్చు కాని తమ శాంధవ్యాన్నీ, తమ ప్రేమనీ, తమ దేశభక్తినీ వారు తెంచగలరా? కల్ల! మిలిటరీవాళ్లు తీసుకెళ్లేముందు అతనన్న మాట లింకా ఆమెచెవుల్లో రింగెత్తుతున్నాయి: “శాంతా! అధైర్యపడక. నేను నీదగ్గర లేనని చెదిరి మతి చెడవద్దు. నే నెప్పుడూ నీహృదయంలోనే వుంటా. నేను భౌతికంగా నీకు దూరంగా వున్నా మనమిద్దరం ఒకేచోట వున్నట్లుగా భావించుకుని దెబ్బలు తిన్న వారికి వుపచర్యలు చెయ్యి. ఒకవేళ మన మీజన్మలో మళ్లీ కలుసుకోలేకపోయినా ఇంకొక జన్మయినా ఎత్తి, మనవంటివారి త్యాగంతో వచ్చిన స్వతంత్ర భారతంలో హాయిగా విహరిద్దాం. నీవు దేశసేవలో ఏమాత్రం వెనకంజవెయ్యక. నిన్నూ నన్నూ ఎవ్వరూ ఎడబాపలేరు. ఆమాట ముమ్మాటికీ నమ్ము, శాంతా! నవ్వు-ఏదీ ? - ఆ-ఇప్పుడు రాణీఝాన్సీవి కా”— మిలిటరీవా ళ్లతన్ని ఇక మాట్లాడనివ్వకుండా లాక్కుపోయారు. ఆదృశ్యం తలుచుకుంటే శాంతకళ్లల్లోకి నీరు వచ్చింది. ఎంత రాయిగుండె అయితేమాత్రం-ఏడ్పు ఆపుకోలేకపోయింది. గబగబా కళ్లవెంబడి నీరు కాల్వలు కట్టింది. కాసేపు ఏడ్చి కళ్లు తుడుచుకుని ఏడ్చినందుకు సిగ్గుపడింది. ఏడ్చేందుకు సమయమా అది? తను అక్కడ ఒక్కతే కూర్చుని ఏంచెయ్యాలి? ఇళ్లల్లో ఏడ్పులు వినిపిస్తున్నాయి. ఓదారుద్దామని బయలు దేరింది. రోడ్డుపక్కన ఒక తుపాకీదెబ్బ తిని మరణించిన స్త్రీకళేబరం, ఆమెరొమ్ములను అంటిపెట్టుకుని పాలుత్రాగడానికి ప్రయత్నంచేస్తున్న ఒక పసిపాప కన్పించారు. ఆపిల్లను తీసుకుని భుజాన వేసుకుంది. పాపం! భుజాన వేసుకోగానే ఆపిల్ల నిద్రపోయింది.

అలా నడుస్తూవుండగానే ఆడవాళ్లు భయంతో వెర్రెత్తివేస్తున్న కేకలు, మగవాళ్ల రాక్షసనవ్వులు వినిపించాయి కొంచెందూరంలో. శబ్దంవినిపించిన వైపు పరుగెత్తింది. మిలిటరీవాళ్లు ఇళ్లల్లో దూరి స్త్రీలను బలవంతపరుస్తున్నారు. శాంత ఒక ఇంట్లో తొంగి చూచింది. దీపం సరిగ్గా లేక ముందు ఏమి జరుగుతున్నదీ స్ఫుటంగా గోచరించలా. కాని మెల్లగా ఆ ఘోరదృశ్యం తనకళ్లకు స్ఫుటంగా కనిపించింది. ముగ్గురు మిలిటరీవాళ్లు ఒకస్త్రీని...

ఆదృశ్యం శాంత చూడలేకపోయింది. ఆ గుమ్మంలో కత్తిబిగించిన తుపాకీ ఒకటి కన్పించింది. మిలిటరీవా డెవడో లోపలికెళ్లినప్పుడు దా న్నక్కడ విడిచిపెట్టిన ట్లున్నాడు. భుజంమీద పిల్లణ్ణి జారవిడిచింది. కెవ్వుమని కేకవేసి ఏడ్వడం మొదలెట్టాడు పిల్లడు. పిల్లడి అరుపు విని మిలిటరీవాళ్లు లేచారు. కాని ఈలోగానే తుపాకీ చేతపుచ్చుకుని భయంకర కాళిలాగా వారిమీదికి లంఘించింది శాంత. ముగ్గుర్నీ విపరీతంగా పొడిచింది. మానాపహరణ అయిన స్త్రీ ఆరాక్షసులబారినుంచి తప్పించబడగానే ఒక మూలకు పరుగెత్తిపోయి ఏదో చిన్నగుడ్డ చుట్టుకుంది. శాంత వీథిలోకి పరుగెత్తింది వాళ్లు చచ్చారుగదా అని. కాని అందులో ఒకడు చావలా. వాడికి దెబ్బ బాగానే తగిలింది కాని శాంత బయటికి పరుగెత్తడం చూచి లేవలేక లేవలేక లేచి, వెనక పరుగెత్తడానికి ప్రయత్నం చేసి, రెండడుగులు వేసి, ఇక నడవలేక కింద కూలిపోతూ ఈలవేశాడు. శాంత వెనక్కు తిరిగి మళ్లీ ఓపోటు పొడిచి వీథినపడింది. ఈల విని కొందరు మిలిటరీవాళ్లు పక్కయిళ్లల్లోంచి ఆయుధాల్తో పరుగెత్తుకొచ్చారు.

ఆమెను చుట్టుముట్టేశారు. పదిమంది సాయుధులైన మగవాళ్లలో తనొక్కతేం చేస్తుంది? లోబడిపోయింది. కాని లోబడేముందు అందులో నలుగుర్ని పొట్టబెట్టుకుంది. లోబడిపోగానే క్రోధంకొద్దీ ఆమెను బలవంతపరిచారు. ఆమెవంటిమీద గుడ్డలేకుండా లాగేశారు. ఆమెను జైలను పడేశారు. ఆమెను...

ఆమెకు వంటిమీద తెలివి వచ్చేటప్పటికి తెల్లవారి సమీపిస్తోంది. తెలివివొచ్చేటప్పటికి వంటిమీద ఒక గుడ్డయినా లేదు. తనను చూచి తనకే అసహ్యం కలిగింది. ఆశరీరంమీద తనకు రోత, ద్వేషం కలిగాయి. గబగబా పక్కనే ఒకకొంపలోకి పరిగెత్తింది. అందులో ఎవ్వరూ లేరు. ఆమూలా ఈమూలా వెదికి ఒక పాతచీర తీసుకుని కట్టుకుంది. తనను బలాత్కరించినవారిమీద ఒక్కసారి ప్రళయకోపం వచ్చింది. కాని అంతకంటే తన శరీరంమీద అసహ్యభావం వెంటనే మరింత ఎక్కువగా కలిగింది. మధూ జయం పొంది తిరిగివస్తే ఈశరీరాన్నా అతనికి వప్పజెప్పడం? ఝాన్సీరాణీవి కమ్మన్నాడే! రాణీ! ఛీ—అతడు పవిత్రుడు—తను కళంకిత. ఆవిషయాన్ని తలుచుకున్నకొద్దీ విషపుభావాలు కలిగినాయి ఆమెమనస్సులో. జీవితంమీద ఇచ్ఛ నశించిపోయింది. శరీరం కుళ్లిపోయినట్లుగా కన్పించింది. ఓమూల ఓ పాతగుడ్డ కన్పించింది. దాన్ని తీసుకుని ఆలోచిస్తూనే వుచ్చు వేసింది. ఇంటి నడిమిదూలం అంత ఎత్తుగా లేదు. చూచింది. కాళ్లకింద ఓమూలవున్న కొయ్యపెట్టె ఒకటితీసి ఎత్తుపెట్టుకుని నడిమిదూలానికి పాతగుడ్డ బిగించి వుచ్చులో తల దూర్చింది. మధూవిగ్రహం కళ్లకుకట్టినట్టు కనిపించింది. తల తీసివెయ్యబోయింది వుచ్చులోంచి. తను చచ్చిపోవాల్సిందే? తప్పు తను కావాలని చేసిందా? మధూ తనకు జరిగిన అవమానంసంగతి వింటే ఏం చేస్తాడు? తన దురదృష్టానికి చింతిస్తాడు. గతించినదానికి ఎందుకు ఏడవడ మంటాడు. అతడు ఉదారబుద్ధి కలవాడు. దేశభక్తుడు. తన ధైర్యానికి మెచ్చుకుంటాడు. తనను దగ్గరకుతీసి బుజ్జగిస్తాడు. దేశంకోసం అగచాట్లు పడినందుకు. కాని—ఛీ–ఆలాటి పవిత్రుడి చేతుల్లోనా తన మలినదేహాన్ని పెట్టడం?–మళ్లీ వుచ్చులో తల దూర్చింది. అతని కొక వుత్తరమన్నా రాయకద్దా? ఏమిటి రాయడం? పోనీ, తనెందుకు చచ్చిపోయిందో అతని కెందుకు తెలియాలి? తెలిసి లాభమేమిటి?—ఆమెబుర్ర ఈఆలోచనలో పడి నలిగిపోయింది. వెయ్యిసుత్తులు పెట్టి కొట్టినట్లయింది. బాధ కోర్వలేక కాళ్లు పెట్టెమీదనుంచి పక్కకి జారవిడిచింది—"ఆ–ఊ–ఆ–ఆ — —"

శాంత మరణించినవార్త వూరంతా వ్యాపించింది. ఈ ఆత్మహత్యసంగతి దేశందేశమంతా మూడు రోజుల్లో తెలిసిపోయింది. పత్రికల్లో ఆమెఫొటోలు ప్రకటించారు. ఆమెనుగురించి పొగడ్తలు వ్రాశారు.

మధూకికూడా శాంతమరణవార్త చెవినిపడింది. ఎందుకు చచ్చిందో తెలియకుండా వుంటుందా? అతని రక్తం వుడికిపోయింది. శాంత! తన శాంత చచ్చిపోయిందీ! నిజంగానే? ఇక తనకు శాంత కనపడదూ? చిన్నపిల్లడిలాగా ఏడ్చాడు. పెళ్లయి సంవత్సరం కాలేదే? అప్పుడే శాంత తననుండి దూరమయిపోయిందా? "శాంత, శాంత" అని అతని మనసు కలవరించింది. ఏమూల చూచినా శాంతే కనిపించింది అతనికి.

ఆరోజు మధ్యాహ్నం అన్నం తెచ్చినవాణ్ణి తనకు తెలియకుండానే పళ్లెమెత్తి నెత్తిన కొట్టాడు. బందిఖానాచట్టాలు జవదాటినందుకు కతన్ని ఆ రోజు కొరడాదెబ్బలు కొట్టారు.

రోజురోజుకీ శాంతను తలచుకుని అతను కృశించిపోవడం మొదలుపెట్టాడు. జైలులో బండపనులు చేయడంలో పూర్తిగా వెనకబడిపోయాడు. రానురాను కొరడాదెబ్బలు తినని రోజు లేదు. రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచిపోయాయి. ఇప్పుడు మధూ వెనకటి మధూ కాదు. ఈ నాలుగుసంవత్సరాల్లో అతనికి ముసలితనం వచ్చింది. అతని కిప్పుడు వుబ్బసం. ఒళ్లంతా చేపపొలుసుల్లా పొరలు లేచిపోయింది. మొహం గుంటలుపడిపోయింది. ఇంకొన్నాళ్లో బ్రతకడతను కూడా. కాని ఈప్రపంచాన్ని వీడేముందు మన మంతా ఏకమై స్వతంత్రం సంపాదించామన్న సంతోష వార్త అతనిచెవిని పడేస్తారూ? లేక........

ప్రయాణములో ఇంద్రమాయ

●

— శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు —

గడచిన విక్రమనామసంవత్సర పుష్యబహుళ తృతీయా బుధవారమునాఁడు (15-1-1941) ఆశ్లేషా నక్షత్రాంత్యభాగమున, రాత్రి రమారమి 8 గంటల వేళలో, కలకత్తానగరమున నొకగృహమునుండి ముస్లిము సోదరుఁ డొకఁడు ఒంటరిగా బయలుదేరి తనకై వేచి యుంచిన మోటారుకారులో హుటాహుటిగా ప్రయాణ మారంభించినాఁడు. అప్పటికి ఖగోళమున గ్రహస్థితి యిట్లుండెను:

పు. వ 22½	కే 5-24	గు 6-5 శ 7-56 వ 22.15 (వ) X 24-0	
	ప్రయాణకాలపు కుండలి [సాయనము]		
బు 27-25 ర 24-52 శు 1-54			చ 22-5 I 25-0
కు 7-11		రా 5-24	ఇ 27-37

తాత్కాలికలగ్నమగు సింహము పాంథుని మన కలోనున్న గాంభీర్యమును, రాజసమును సూచించఁ జాలినది. లగ్నమందలి చంద్రుఁడు ప్రయాణమందలి ఆత్రమును తెలుపుచున్నాఁడు. మఱియు, మన పాంథుని జీవితములో చంద్రుని కేదో సంబంధ ముండియే తీరును. కాని, ప్రకృత మది స్ఫురించకున్నది. మన ముస్లిముసోదరులు బాలచంద్రధ్వజాలుకదా! అంతే చాలు ననుకొని తృప్తిచెందుదముకాక!

మన పాంథుని పేరేమో మన మెఱుఁగము. ఆ ప్రాంతమువారి కతఁడు పరిచయములేని అన్యదేశీయుఁడుగ కన్పట్టుచుండెను. వయస్సు సుమారు నలువదిరెండు సంవత్సరముల ప్రాంత ముండును. వదులైన పైజమాలు తొడిగి షేర్వానీ వేసుకొని, మోఁడంసుకేములపొడవు నింకు గడ్డముతో నిగనిగలాడుచున్న ముఖమున కలంకారముగా నెరసున్న ఫెజుకుళ్లాయి ధరించియున్న యీ పాంథుఁడు మంచి ఆకారసౌష్ఠవము గల స్ఫురద్రూపి. దేశభాషలలో సంయుక్తపరగణాల ప్రాంతమున నివసించు మౌల్వీగా నతఁడు కన్పట్టుచుండెను. అది యట్లుండె.

ప్రయాణలగ్నాధిపతి గ్రహరాజు (రవి) స్వనవాంశలో, రాజ్యాధిపతి యగు శుక్రుఁడు వర్గోత్తమాంశలో నుండుటచే నీవ్యక్తి గౌరవనీయుఁ డనియు, ఇతని ప్రయాణోద్దేశము మున్నతాదర్శములు కలదనియు చెప్పవచ్చును. శుక్రుఁడు పంచమభావములో నుండి ఇతని యుద్యమములో గొప్ప మంత్రశక్తి యిమిడి యున్నదని సూచించుచున్నాఁడు. రవి షష్ఠభావములో నుండుటచే, సంకల్ప మేదయినా కానిండు, దానిలో జీవాదృష్టి కలదని స్ఫురించును. ఈరెండు గ్రహములును మకరరాశిలో శనియాజమాన్యములో నున్న కారణమున ప్రయాణకార్యములో దూరదృష్టి, జాగరూకత, పట్టుదల కలుగవచ్చును. ఇట్టికని మంత్రస్థానాధిపతి (పంచమాధిపతి) యగు బృహస్పతితో చేరి దూరదేశప్రయాణమును సూచించు ధర్మస్థానములో నున్నాఁడు. ఈ ప్రయత్నమందు మన పాంథునితపస్సు (నవమభావఫలము) ఉన్నదనియు, దూరదేశప్రయాణముపై అరవిందో దృష్టి కలదనియు సూచన కలదు. ఉద్యోగస్థానాధిపతియగు శుక్రుఁడు గురుశనుల త్రికోణ శుభదృష్టినభిలషించుచుండుటచే పైయర్థమునకు ప్రోది

కలదు. ఇట్టి శుక్రకరవులు హిందూదేశపు లగ్నమగు మకర రాశిలోనే యుండుట యొకవిశేషము!

ప్రయాణలగ్నాధిపతియగు రవిపైఁగల వరుణుని త్రికోణదృష్టి పాంథునికి ప్రముఖులగు బలవంతుల సాహాయ్య మున్నదని తెలుపఁగలదు. కాని, దశమ భావమందున్న వరుణగ్రహము సామాన్యముగా విప్లవ ద్యోతకుఁడు. చాలనందుకు, ఇచట వక్రిహు! ఇట్టి వరుణుని కేంద్రవేధను లగ్నమందలి చంద్రుఁ డభిల షించుచుండుటమాత్రము ప్రమాదకారియని చెప్పక తీరదు. ఇది యిట్లుండ, ఈచంద్రుఁ డుండునది ఆశ్లేషా నక్షత్రము. ఇది కాలసర్పమువంటిది. శాంతిక పౌష్టిక కర్మల కిది ఏమాత్రమును కొరగాదు. సాహసకార్యము, యుద్ధము, శత్రుమారణము ఇత్యాది క్రూరకర్మలకు మాత్రమే యిది అక్కరకువచ్చునని ప్రాచీనులు శాసించిరి.

"సాహసం దుష్టదమనం
ఘాతువా ఔషధా హవాః,
వివాద వధ వాణిజ్య
కర్మ క్రుజభే శుభం." (నారదుఁడు)

ఇది యిట్లుండ, లగ్నాధిపతి యగు రవి, రాజ్యాధిపతి యగు శుక్రుఁడు, ప్రయాణకారకుఁ డగు బుధుఁడు ఈముగ్గురు తాత్కాలికముగా నుండు ఖగోళభాగము (పంచమ షష్ఠభావములు) వాయవ్య దిక్కగుచున్నది. మనదూల్వి పెషావరురైలులో ప్రయాణము సాగించుటచే, అతనిగమ్యస్థాన మాదిక్కువనే దూరమునఁ గలదేమో యని తోఁచును. కాని, బుధ శుక్రులున్న దిక్కున కభిముఖముగా ప్రయాణము చేయ రాదని శాస్త్రము డంగోరా వేయుచున్నది. ఇట్టి గ్రహస్థితికే "చుక్క ఎదురు" అని వ్యవహారము.

"ప్రతిశుక్రం ప్రతిబుధం ప్రతిభౌమం గతో నృపః,
బలేన శక్రతుల్యోఽపి హతసైన్యో నివర్తతే."

అని ప్రాచీనసూత్రము. ఈయంశమునే వరాహ మిహిరాచార్యుఁ డిట్లు వర్ణించినాఁడు:—

"ప్రతిశుక్రబుధా శశి పృష్ఠగతా
దిగధీశయుతే నృపతింగమనే,
మదిరామదితా మదనాకులితా,
ప్రమదేవ కులం పరవేశ్మగతా."

ఇట్టిపరిస్థితులలో మనపాంథుని యుద్దేశము నెర వేరఁగలదా? గమ్యస్థానము నితఁడు చేరఁగల్గునా? మఱియు చంద్రుఁ డుండుట ఆశ్లేషాంతమున, అనఁగా గండసంధిలో! ఈప్రయాణమున మనపాంథుఁ డెన్ని గండములు కడచవలసియుండునో కదా? కాని, ప్రయాణ కారకుఁ డగు బుధుఁడుమాత్రము ఇంద్రునితో పూర్ణ మగు సానుకూల్యదృష్టిలో నుండి, ఇంద్రుని సాహాయ్య ముతో ప్రయాణము సాగింప ననుచున్నాఁడు. కర్మాధి పతియగు శుక్రుఁడు గురుశనుల త్రికోణదృష్టిని చేరఁ బోవుచు భయము లేదనుకొనుచున్నాఁడు. కాని, ఆగ్రహముల శుభదృష్టిసంబంధమును పూర్తిగా సంపా దించఁగల్గుటకు పూర్వమే యాశుక్రుఁడు రాహు కేతు బలకేంద్ర శత్రుదృష్టిఫలము ననుభవించక తీరదు. ఈ ప్రయాణమువలన ఏమాత్రపు ఫలమయినా లభించుటకు మునువు ఎన్నికష్టములు, నష్టములు ఉన్నవో యని పించుచున్నది. పుణ్యసహమము మీనరాశిలో $22\frac{1}{4}^{\circ}$ భాగలోనుండి రవివరుణులకు మిత్రదృష్టిలోనేయుం డుట ఆశాజనకమే కాని, ఆబిందువుయొక్క అష్టమ స్థానస్థితివలన భయమగుచున్నది. బుధునికి త్రికోణ దృష్టిలోనుండి ప్రయాణమున కనుకూలింతు నని వాగ్దానమునిచ్చిన ఇంద్రుఁడు పుణ్యసహమమునకు మాత్రము ప్రతికూలుఁడుగా సమసప్తకములో నున్నాఁడు. ఆ సహమబిందువునకు రవి, బుధ, వరుణుల ఆశ్రయ మున్నది. అయిననేమి, అది మృత్యుస్థానములో నుండుట! ప్రయాణపువిషయమున మాత్రము ఇంద్రుఁ డనుకూలించి మృత్యువును తెచ్చునా? చెప్పఁజాలము.

సరేకాని, తాత్కాలికప్రయాణలగ్నమునకు సంబంధించిన గ్రహసామగ్రిపై నాధారపడినవి పై యూహలు. ఆ క్షణమున వేయిమంది ప్రయాణము చేసి యుండిరేని వారందఱకు నిది అన్వయించును. కాని, ఆ వేయిమంది జీవితానుభవములలో సమానఫల ముండు ననుకొనుటమాత్రమే ప్రమాదము. ఆయావ్యక్తుల ప్రత్యేకజాతకములందలి గ్రహభావ సామగ్రితో తాత్కాలికగ్రహలగ్నములకు రాఁగల సంబంధముల


ననుసరించి ఆయావ్యక్తుల జీవితానుభవములలో భిన్న స్వరూపము లేర్పడగలవు. అనగా, ప్రయాణము వలన కష్టమో, ప్రమాదమో వచ్చునెడల, వ్యక్తిజాతక ధర్మముల ననుసరించి ఆ కష్టమో, ప్రమాదమో స్వరూపస్వభావములను మార్చుకొనునని యర్థము.

మన మౌల్వీ పర్వతదుర్గ మారణ్యమార్గములంబడి బహుప్రయాసతో కాబూలునగరము చేరి, అచట పఠాన్ వలె వేషభావములను ధరించుకొని, తనపేరును జియాఉద్దీన్‌గా మార్చుకొని, కొన్ని దినములు మూగవానివలె నటించియుండి, మరికొన్ని దినములు ఇతరులకంటఁ బడకుండ గదిలో దాఁగుకొని, అనేకసందర్భములలో లంచములిచ్చి తొందరలనుండి తప్పించుకొని, కన్న క్రమములోర్చి, కడకు 72 దినములకు బర్లిను నగరమును చేరుకోఁగలిగెనని వింటిమి. అతని జాతకచక్రములో ప్రయాణలగ్నమును పోల్చిచూతముగాక!

ఈ జియాఉద్దీన్ జాతక మిది:—

[సూచన:—చదువరుల సౌకర్యార్థమై 1941 జనవరి నెలకు ఈ జాతకమునకు సేవమానదశ ననుసరించి చలితగ్రహాలగ్నస్థానములు నెలుపలికుండలిలో చూపఁబడినవి.]

జన్మకాలమున రాజ్యస్థానమందున్న రవి చలనవశమున మీనరాశిలో 17°-54' కు వచ్చియుండుట పాశ్చాత్యమహాశయులు ముఖ్యముగా గమనించఁదగిన యోగము. జన్మశుక్ర సంయోగము నభిలషించుచు ఈ రవి ప్రయాణము చేయుచున్నాఁడు. లగ్నాధిపతియై ప్రబలగ్రహమగు శుక్రుఁడు లాభభావమందుండి జాతకునికి బలవంతులగు మిత్రులవలని సాహాయ్యసంపత్తిని సూచించఁగలఁడు. చలితరవి యీశుక్రునిసంయోగము నపేక్షించుటచే, మిత్రలాభము జాతకునికి త్వరలో రావలసినదని యిదియని స్పష్టమగుచున్నది. కాని, శనిగురువులకిని జన్మకాలమున అర్ధకేంద్రవిమనదృష్టిసంబంధ ముండుట మనము మరువరాదు. మిత్రులు లభించు



వచ్చును కాని, ఆమిత్రులసమాగమమున సుఖమున్నదా యని సంశయించుట కవకాశ మున్నది. ఇదియెట్లయినను, వీతస్మరణకాలమున నొకగండ ముండుటమాత్రము శోచనీయవిషయము. ఏమందురా? చూడుడు. ఇంద్రగ్రహమునుండి కేంద్రస్థానమును దాఁటి చనినతరువాతకాని ఈచలితరవికి జన్మశుక్రసంయోగము లభించదుకదా! ఇఁక ఈయింద్రుఁడో, కేంద్రవేధచే జన్మశుక్రుని ద్వేషించువాఁడు. సులభముగా చలితరవిని జన్మశుక్రసంయోగమునకు ఈయింద్రుఁడు పోనియ్యఁగలఁడా? మఱియొక్కటి! జన్మరవినిసయితము పార్ధకేంద్రప్రాతికూల్యదృష్టితో చూచుచున్నవాఁడీఇంద్రుఁడు! కనుక, మరింత కష్టమైన నీదశ!

పోనిండు. చలితశుక్రుఁ డెందున్నాఁడో తిలకింపుఁడు! చలితరవి ఇంద్రకేంద్రవేధ పాలగుచుండఁగా, ఆ దశాఫలము సమగ్రముగా తనకే రావలయునని తలఁచినట్లుగా ఈచలితశుక్రుఁడు ఆ గ్రహద్వయమునకు సరినడుమ —అనఁగా, సరి అర్ధకేంద్రములో— నిలిచినాఁడు. ఈ శుక్రుఁడు జాతకునికి లగ్నాధిపతి. ఫలము నింకెవరనుభవింతురు? ఇదియిట్లుండఁగా, ప్రయాణకారకుఁడగు బుధుఁడు చలించి జన్మవరుణశనులతో పూర్ణకేంద్రవేధకు త్వరలో పోనున్నాఁడు. ఈ బుధుఁడు దశమకేంద్రవర్తి యగుటచే, చలితశుక్రునికి పూర్ణకేంద్రవేధాఫలము ననుభవించుచు, మిత్రలాభమున కుద్యోగించినచో కష్టమున్నదని హెచ్చరించుచున్నాఁడు.

"గ్రహదౌష్ట్యే విశ్వాసం
పరగృహగమనంచ దూరతో యానం,
సాహస మకాలచర్యం
మృగయాం హయవాహనం త్యజేత్ భూపః"

అని లల్లునిమాత్రము.

ఇట్టి దుష్టదశావిశేషకాలమున జాతకుఁడు దూరదేశప్రయాణ మారంభించినాఁడు! పాపము! ముహూర్తముసయితము క్షేమంకరము కాదని కనుగొంటిమి. ఫలము భిన్నమెట్లగును?

జన్మకాలమున ఇంద్రుఁడు విశ్వసనీయుఁడు కాఁడు. దశలో వీనివేధ ప్రబలముగానుండి దౌష్ట్యమునే చూపుచున్నది. కాని, ప్రయాణకాలమునమాత్రము బుధునికి మిత్రుఁడై ఇంద్రుఁడు సౌకర్యమును సూచించుచున్నాఁడే? ఏమిదీనియర్థము? తాత్కాలికముగా సౌకర్యములను కల్పించినసేమి, ఇట్టి ఇంద్రునివలన మొత్తముమీఁద సత్ఫలమువచ్చుట స్వప్నవార్త. ఆశ కల్పించి, ఫలము పరిపక్వతకు వచ్చునపుడు మోసగించుట ఈ గ్రహపులక్షణము.

మన పంచాంగములలోలేని, మన కంటికి కానరాని ఇంద్రుని దుష్టదశ ఏమిచేయఁగలదు అనువారుందురు. ఇంద్రుఁడు మాయాగ్రహము. అతనికార్యములలో ఐంద్రజాలికుని పోల్కలపింపను కానవచ్చును. ఉన్నది లేనట్లుగా, లేనిదియున్నట్లుగా తోఁచును. సత్యాసత్యములు తారుమారగును. క్షణములో స్వర్గము నరకముగా, నరకము స్వర్గముగా పరిణమించును. మిత్రులు ద్రోహ మెంచెదరు. శత్రువులు మైత్రికి వత్తురు. పౌరుషవంతులు పిరికివారగుదురు. అబలలు సాటిలేని ప్రతాపమును చూపుదురు. వేషభాషలు విశ్వాసపాత్రములు కావు. పేరుప్రతిష్ఠలలో సత్యముండదు. నేఁటి ప్రవరుఁడు రేపు వరూథిని బిగికౌఁగిటిలో నానందించవచ్చును. నేఁటి నిగమశర్మ రేపు వశిష్ఠమహర్షియైనచో వింతలేదు. రేపటిబిచ్చగాఁడు మాపటికి కుబేరుఁడు కావచ్చును. నిన్నటిహిందువు నేఁడు ముస్లిముగామారి, రేపు క్రిశ్చియన్‌గా పరిణమించి, మరునాఁడు మరల హిందువైనచో, అందులో ఇంద్రునిమహిమ యుండఁగలదు. ప్రజాసామాన్యములో క్రమబద్ధముకాని విప్లవవాతావరణము నిండుకొననేని, అందులో ఇంద్రుని కైవాటమే యుండఁగలదు. సీ. ఐ. డి. వారి కటాక్షవీక్షణము లావలెనన్నచో, ఇంద్రుని అనుగ్రహమే కావలయును. మేక సింహమును చంపినా, లేడిని చూచి పులులు పరుగెత్తినా ఇంద్రునిప్రభావమే. రామరసమును సేవించి ప్రపంచమును మరచు యోగియు, మద్యరసము తలకెక్కఁగా ఒడలు మరచు భోగియు ఇంద్రునిదయకు లోఁబడినవారే. సీటీబుగ్గ లతనివే; ఎండమావు లతనిరాజ్యములోని వస్తువులే; సినీమారంగ మతనిసృష్టిలోని వింతయే! ఎంతని వ్రాయఁగలము? అంతా నాటకము, అంతా కనుకట్టు! జగన్నాటక

సూత్రధారియగు ఉపేంద్రుఁడు ఇంద్రుని తమ్ముఁడే యని మనము జ్ఞప్తిలో నుంచుకొన్నచో చాలును.

ఇట్టి పరిస్థితులలో మన ముస్లిమ్‌సోదరుఁడు దూరదేశప్రయాణము నారంభించు టెందులకో? అతని కార్యగౌరవ మెట్టిదో కదా?

మరచితిమి. ఈ జాతకము మొన్న మార్చినెల భారతిలో ప్రకటింపఁబడిన నేతాజీ సుభాషచంద్రుని జాతకమునుపోలియున్నదని పాఠకమహాశయులు గుర్తించియుందురు. లగ్నదశమకేంద్రములలోనున్న అత్యల్పమగు వ్యత్యాసముతప్ప ఇతరభేద మేమియు కానరాదు. సుభాషచంద్రుఁడు రమారమి నెలానరపట్టు ఇతరులకంటఁ బడకుండ ఇంటిలో నిలిచి, గడ్డము పెంచుకొని, మౌల్వీవేషముతో, అలక్షితుఁడుగా పెషావరు నగరము చేరి, కొండమార్గములలో కాబూలుచేరుకొని అచట జియావుద్దీన్ అను నామమున పఠాను వేషముతో కాలక్షేపముచేసి, ఎన్నియో ప్రయాసలపాలయి, కడకు బర్లిను నగరమును చేరుకొన్నాఁడను మహాద్భుతకథను విపులముగా చదువరు లిటీవల పత్రికలలో చదివి యుందురు. ఈ జాతకము నేతాజీ సుభాషచంద్రునిదే. "వంగదూత" పత్రికలో ప్రకటితమగు 0-15 P. M. (L. M. T.) కాలమునకు గడచిన మార్చి భారతిలోని చక్రము గుణింపఁబడియుండెను. నేతాజీజీవితమందలి విశేషవిషయములకు సంబంధించిన ముఖ్యదినములు కొన్ని ఇటీవల తెలియవచ్చుటచే ఆధానకాలపద్ధతి, దైనికజాతకపద్ధతి మున్నగు శోధనపద్ధతుల నుపయోగించి ఆ జన్మకాలమును 0-20 P. M. (L. M. T.)గా శుద్ధపరచుటచే ఈ కుండలిలో లగ్నము కొంచెముగా ముందుకు జరుగవలసివచ్చినది. కాలవ్యత్యాస మతిస్వల్పమగుటచే, ఉడుదశాక్రమము ననుసరించి ఫలాదేశముచేయు నభ్యాసము కలవారికీమార్పుతో నేమియు తొందరయుండదు. దేవమానదశ, దైనికజాతకము ఇవి ఉపయోగించువారు ఈ సూక్ష్మ వ్యత్యాసము విలువకలదని గ్రహింపఁగలరు. అది యట్లుండె.

ఇంద్రగ్రహప్రభావమున కింతకంటె చక్కని దృష్టాంత మబ్బుట యరుదు. దశమకేంద్రమందలి బుధుఁడు రాహుసంయోగములో నున్నాఁడనికాని, బుధునిపై శనిదృష్టికలదనికాని, గురువుపై శనికుజుల దృష్టి యున్నదనికాని కారణములు చెప్పి, జాతకుని జీవితకథయందలి మహాద్భుతసంఘటనలను కార్యకారణ సమన్వయము చేయుట సాధ్యమగునేమో చదువరులే ఊహింపుకోఁగలరు. ఇంతేకాదు. 18-8-1945 నాఁడు విమానప్రయాణమువలన ప్రమాదము పాలయినాఁడనుకథయందుసయితము ఇంద్రమాయ యున్నది. ఇతనిజీవిత మిప్పుడు అస్తినాస్తివిచికిత్సపాలయి యున్నదికదా?

ఇటీవలనే (13-3-1946) పానవాక్, సెహగల్ అనువారితో నీ విషయమై చర్చించునపుడు "మీ రింకకు భిన్నముగా ఏమైనా చెప్పండి. సుభాస్ సజీవుఁడుగా నున్నాఁడనే నే నింకా గాఢముగా నమ్ముచున్నాను." అని మహాత్మగాంధి చెప్పెనఁట! ఇంతటి దృఢవిశ్వాసమునకు కారణము లుండి తీరవలెనుకదా? ఆజాద్‌హింద్‌సేనలో సేనానాయకురాలుగా ఖ్యాతిగాంచిన కర్నలు లక్ష్మీస్వామినాథన్ గారి నొక రీవిషయమున తమ అభిప్రాయ మేమి అని ప్రశ్నించఁగా, "ఆ విషయమై నేనేమీ చెప్పలేను. అయితే, నేతాజీబాబుది జనరంజకమైన జీవితము. భారతదేశదాస్యబంధాలను పగులఁగొట్టఁగల వాఁడు ఆయనయే అన్న ఆశావిశ్వాసాలతో భారత హృదయాలు ముప్పిరిగొంటున్నవి. కనుక ఆయన జీవించియున్నాఁడనీ, స్వాతంత్ర్యముకోసరము భారతీయులు జరిపే పోరాటములో నాయకత్వము వహించడానికి తిరిగి వస్తాఁడనీ అనుకోవడమే నాకు ఇష్టము." అని పల్కగా, జాగరూకతతో తేలఁబలికినదఁట! ఏమి వాక్చాతుర్య మిది? మరియొక వింతవార్త! నేతాజీ సుభాస్‌చంద్రబోసు భారతదేశములోనే ఉన్నాఁడనీ, బైటపడడానికి సమయముకోసము వేచియున్నాఁడనీ రాడికలు డెమోక్రాటుపార్టీ వారి పత్రిక అగు "వ్యాన్‌గార్డు" పెద్దఅట్టహాసముతో ఒకవార్త నిటీవల ప్రచురించినదఁట! *ఇది సత్యమే అయినచో, "వంగ

* 15-8-46 నాఁటి ఆంధ్రపత్రిక చూడుఁడు.

అని కాలపురుషుఁడు మునుముందుగా హెచ్చరించినట్లుండలేదా ?

జర్మనీ హిట్లరుజాతకమునందు కుజుఁడు వృషభ రాశిలో 16°-23' లో, శుక్రుఁడు వృషభరాశిలో 16°-42' లో నున్నారు. వారిలో శుక్రుఁడతని లగ్నాధిపతి. ఈగ్రహసంయోగము సుభాషచంద్రుని జన్మలగ్నబిందువునందే పడుచున్నదని గుర్తించితిమేని, రష్యాలో లోలోపల యుద్ధప్రయత్నములో నున్న జర్మనునియంత మిత్రభేదతంత్రము నుపయోగించి జాతకుని బర్లినునగరమునకు రప్పించుకొనుట మనకర్థమగును. ప్రయాణలగ్నకాలపు గురుశనులు (నవమభావములో నున్నవారు —అనఁగా దూరప్రయాణమునకు సంబంధించినవారు) హిట్లరు జాతకమందలి గురుచంద్రులతో పూర్ణమిత్రదృష్టిలోనుండి, ఈప్రయాణమున సుభాషచంద్రుని నాకర్షించినారు. కనుకనే, ఫలమిట్లయినది.

పోనిండు. 28-3-41 నాఁటి మధ్యాహ్నమున గ్రహస్థితి యిట్లుండినది :

బు 9-51	కే 1-36 శు 1-50 ర 7-25 చ 14-25 కు 26-33	శ 12-54 గు 16-31 వ 23-21	
	బర్లిను ప్రవేశము [సాయనము]		
		రా 1-36	ఇ 26-1

ఈ కుండలిలో సుభాషచంద్రుని జాతకముతో నికరమగు సంబంధముగల గ్రహము బృహస్పతి యొక్కఁడే. ఒకవైపు శనినుండి, మఱియొకవైపు వరుణుని నుండి ఘర్షణములోనయి యీ బృహస్పతి సుభాషచంద్రుని జన్మలగ్నబిందువుపైననే నిలిచినాఁడు. స్వదేశక్షేమాభిలాషవలని నీతినియమములొకప్రక్క, ప్రపంచ విప్లవకరములగు పరిస్థితులవలని ప్రోత్సాహ మొకప్రక్క లగ్నమునకొత్తిడి యిచ్చుచుండఁగా, బృహస్పతి వచ్చి రక్షింతునని వాగ్దానమిచ్చినట్లు చూపట్టుచున్నది. వృషభలగ్న జాతకునికి అష్టమాధిపత్యముండుటచే బృహస్పతి అంతగా శుభుఁడు కాదనుమాట సత్యమేని సమయము వచ్చెనేని, మంచిమాటలతో కంఠమున కురిత్రాడు బిగించఁగలఁడీబృహస్పతి. కాని, పుణ్యసహమముపై జన్మకాలములో నితనికి శుభదృష్టి యుండుటచే, ఇతఁడు దుర్మరణము నీయఁజాలఁడు. మఱియు, జన్మకాలమున పంచమకోణములో నున్నవాఁడీబృహస్పతి. అశ్రేయస్కరమగు కాలధర్మము ఇట్టిగ్రహమునుండి వచ్చుననుకొనుట సాహసమగును.

సవరించిన జన్మకాలధ్రువము నుపకరణముగాఁ గొని 18-8-1945 నాఁటికి, అనఁగా విమానప్రమాదము వలన జాతకుఁడు కీర్తిశేషుఁడయ్యెనని ప్రవాదమున్న దినమునకు, సాధించిన దైనిక కేంద్రము లిట్లుండును:—

దైనికలగ్నము...వృశ్చికరాశిలో 26° వ భాగ
దైనికదశమము...సింహరాశిలో $29\frac{1}{2}$ వ భాగ

తాత్కాలికబుధుఁడు (సింహరాశి $27\frac{1}{4}$° వ భాగ) దైనికదశమకేంద్రమందే నిలిచి ప్రయాణమును సూచించుచున్నాఁడు. జన్మ శనివరుణులతో కేంద్ర వేధాస్థానమందున్న ఈ ప్రయాణకారకుఁడు రాజకీయ విప్లవకారణముల సంబంధమును, మంత్రశక్తితోఁటి దౌత్యధర్మమును, విమానప్రయాణమువలని ప్రమాదమును తెలుపఁజాలఁడా ? కాని, దైనికలగ్నము జన్మశని వరుణస్థానము నానాఁడే చేరుకొనియుండెనేని, "కాలోహి దురతిక్రమః" అనుకొనవలసినదే. అట్లు కాలేదు. ప్రమాదస్థానమునకు కొంతదూరముగానే నిలిచినది. అనఁగా, మరణమునకు తక్కువగా గండఫలమనుభవమునకు వచ్చియుండునని యర్థము చెప్పవచ్చును. చలితలగ్నము బృహస్పతిశుభదృష్టిలోనే యుండుట ఆశాజనకముగ నున్నది. ఏదోయొకరీతిగా రక్షణము వచ్చియుండరాదా ?

ప్రయాణపుకాలకుండలిలో ఇంకొక విశేషమున్నది. 1945 సంవత్సరపు ఆగష్టునెల ప్రాంతమునకు

చలితప్రయాణదశమము జన్మవరుణునినుండి సమసప్తక వేధనుపొంది వాయువిమానప్రమాదకథను సూచించు చున్నది. చలితప్రయాణచంద్రుడు ప్రయాణకాలరాహు సంయోగమును పొంది చలితప్రయాణశుక్రునికి పూర్ణ కేంద్రవేధాస్థానము నాశ్రయించి ప్రమాదమువలని క్లేశ మును తెలుపజాలియున్నాడు. తరువాత రమారమి ఎనిమిదినెలలకాలమునకుగాని చలితప్రయాణదశమము జన్మవరుణుని వేధను దాటిపోదు. శుభావచంద్రుడు జీవించియేయుండినచో, అంతవనుక అతనికి కష్టపరం పరలే! తరువాత చలితప్రయాణదశమము జన్మశని వేధను పొందుటవలని క్లేశ మనుభవమునకు రావలసి యున్నది. మరల కొన్ని నెలలు గడచినచో ఈ చలిత కేంద్రమునకు జన్మచంద్రుని శుభదృష్టి వచ్చుటచే సౌక ర్యము ఏర్పడవచ్చును. ఇది ఇట్లుండ, చలితప్రయాణ రవికిమాత్రము జన్మశనివరుణులు అర్ధకోణశుభదృష్టి నిచ్చుచు అనుకూల్యమును సూచించుచున్నారు. ఫలిత మేమనగా శుభావచంద్రుని జాతకమందలి శనివరుణులు ప్రయాణ లగ్నాధిపతికి అనుకూలురుగా, ప్రయాణదశమ కేంద్రమునకు ప్రతికూలురుగా ఉన్న దశ ఇది. ప్రయత్న ములలో కష్టములువచ్చినా, ఫలము చెడదేమోయను ఆశ కవకాశమున్నది. ప్రయాణలగ్నము చలనవశమున త్వర లోనే కన్యారాశిని ప్రవేశించగలదు. ఈప్రయాణము నకు సంబంధించినకథలో అప్పటినుండి పరిస్థితులు మారగలవు. చలితప్రయాణబుధుడుసయితము అప్పటికే జన్మ రవి జన్మదశమస్థానములను చేరుకోగలడు. అతని గమ్య స్థానమదేకదా!

పైచర్చయంతయు 'శంకదూత' చెప్పినఫలములకు అనుకూలపరిస్థితులను చూపుచున్నది. సత్యము ఏ సుహూంతరమున దాగియున్నదో మన మెరుగము. ఎప్పుడు బైటపడగలదో దైవమున కెరుక. సమయము నకై వేచియుందము గాక!



జీవనవ్యయపుఘాతసూచీసంఖ్యలు

(Cost of Living Index Numbers)

❀

— శ్రీ సీతంరాజు సుబ్రహ్మణ్యశర్మ —

ఏ వస్తువు విలువైనా దానియొక్క కొనుగోలుశక్తిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఏ వస్తువు విలువైనా ఆ వస్తువునుమార్చి దానిబదులు మనం తెచ్చుకొనగల వస్తువులవిలువతో కొలువవలెను. సామాన్యంగా వస్తువులవిలువలు ధనరూపంగా చెపుతారు. అంటే ఆ వస్తువును మనం తెచ్చుకోవాలన్నా, యిచ్చివేయాలన్నా ఎంతడబ్బు యివ్వాలో తీసుకోవచ్చునో దానినే ఆ వస్తువువిలువ అంటాము. డబ్బు వస్తువులవిలువలకు కొలతబద్ద అయిపోయింది. కాని ఆ డబ్బుకొనుగోలుశక్తినే తెలుసుకోవాలంటే వేరొక కొలతబద్ద కావలసి ఉంటుంది. మనం డబ్బును దానికొరకుగాక, దాని కొనుగోలుశక్తిని ఉపయోగించుకొనేందుకు కోరెదము గాబట్టి డబ్బుయొక్క విలువ దానితో మనం కొనే వస్తువులపై ఆధారపడి ఉంటుంది. ఒకే మొత్తము ధనముతో మనము ఒకప్పుడు ఒకమొత్తము వస్తువులను, ఇంకొకప్పుడు ఇంకా ఎక్కువమొత్తము వస్తువులను కొనగల్గినట్లయితే, ఆ రెండవపర్యాయము కొన్నప్పుడు డబ్బువిలువ హెచ్చినదని అర్థము. అంటే వస్తువులధర తగ్గిందన్నమాట. కాబట్టి డబ్బుయొక్క విలువ వస్తువులధరలకు వ్యతిరేకముగా మారుచుండును. కాని డబ్బును మనము అనేకరకముల వస్తువులను కొనుటకు ఉపయోగించెదము గాబట్టి, డబ్బువిలువ హెచ్చినదా తగ్గినదా తెలిసికొనుటకు ఆ వస్తువు లన్నింటి ధరలను మనము గమనింపవలెను. ఇదే మనము ధరలయొక్క ఘాతసూచీ సంఖ్య తయారుచేయునప్పుడు చేయునది.

ఒక్కొక్క వ్యక్తికి డబ్బుయొక్క విలువ ఆ వ్యక్తియొక్క ఆదాయముపై ఆధారపడియుండును. ఇరువది రూపాయిలు సంపాదించువానికి ఒక్కొక్క రూపాయికి గల విలువ రెండువందల రూపాయిలు సంపాదించువానికి ఒక్కొక్క రూపాయికి ఉండదు. అంటే ఇరువదిరూపాయలజీతగాడు ఒకరూపాయి ఖర్చుచేయటానికి ఎంత ఆలోచిస్తాడో, రెండువందల రూపాయల జీతగాడు అంత ఆలోచించడు. కాబట్టి డబ్బుయొక్క విలువ బీదజనులకు, భాగ్యవంతులకు ఒకటిగా వుండదు. డబ్బు జీవితానికి వ్యయము చేస్తాము గాబట్టి జీవితసౌఖ్యము డబ్బుయొక్క విలువపై ఆధారపడి ఉంటుంది. డబ్బుయొక్క విలువ హెచ్చుగావుంటే (వస్తువులధరలు తక్కువగావుంటే) ఒకేమొత్తముడబ్బు డబ్బువిలువ తక్కువగా నున్నప్పటికన్న (వస్తువులధరలు హెచ్చుగా వున్నప్పటికన్న) ఎక్కువసౌఖ్యము నిస్తుంది. ఒకవ్యక్తి ఎప్పుడూ ఒకేప్రమాణపుసౌఖ్యము ననుభవించాలంటే, అతని ఆదాయము ధరలనుబట్టి మార్పుచెందాలి. అట్లుగాక ఆదాయము ఒక్కటే అయితే అతడిసౌఖ్యము జీవనమునకు కావలసిన వస్తువులధరలకు వ్యతిరిక్తముగా మారుచుండును. జీవితమునకు కావలసిన వస్తువులధరలనన్నింటిని కనుగొని క్రమపద్ధతులద్వారా వానిని ఒక ఘాతసూచీసంఖ్యలోనికి తయారుచేసిన, అది ధరలలోనిమార్పులవలన వ్యక్తుల జీవనవ్యయములోని మార్పులను సూచించి, వేరొక కాలముతో పోలికకు తగియుండును. అట్టివానినే జీవనవ్యయపు ఘాతసూచీసంఖ్యలు అంటారు.

జీవనవ్యయపు ఘాతసూచీసంఖ్యలు సాధారణముగా కార్మికులజీవనవ్యయమును తెలియజేయుటకు తయారుచేయబడును. జీవనవ్యయమునకు అనుగుణ్యంగా జీతాన్ని మార్చటానికి యిది మార్గదర్శిగా వుంటుంది.

ఇటువంటి ఘాతసూచీసంఖ్యలు మొట్టమొదట లష్ప్లా ౧౮౯౯ సం.లో ఫ్రాంసు దేశములోని కార్మికుల జీవన వ్యయమునకు తయారుచేసినాడు. కాని ౧౯౧౪-౫ సం. వరకు తరువాతనే యిట్టిసంఖ్యల ఉపయోగము అన్ని దేశములకు వ్యాపించినది. ఈరోజున అన్ని దేశముల లోను, అన్ని పట్టణములలోని కార్మికుల జీవనవ్యయము లకు ఘాతసూచీసంఖ్యలు తయారుచేయబడుచున్నవి. మనదేశములో మొత్తము ౩౭ పట్టణములలో ఇవి తయారుచేయబడుచున్నవి. మనరాష్ట్రములో మద్రాసు, విశాఖపట్టణము, ఏలూరు, తిరుచునాపల్లి, బళ్లారి, కోయంబత్తూరు, మధుర, కడలూరు, కాలికట్టుపట్టణ ములలోని పనివారల జీవనవ్యయమునకు జీవనవ్యయపు ఘాతసూచీసంఖ్యలు మద్రాసు గవర్నమెంటువారిచే తయారుచేయబడుచున్నవి.

ఘాతసూచీసంఖ్యలు తయారుచేయటం ఒక కష్ట సాధ్యమైనపని. దానిని తయారుచేసేవిధము దానిని తయారుచేయటంలోగల ఉద్దేశ్యముపై ఆధారపడి ఉంటుంది. కార్మికుల జీవనవ్యయపు ఘాతసూచీసంఖ్య యితరగతులవారి జీవనవ్యయములోని మార్పులను సూచించుటకు పనికిరాదు. జీవనవ్యయపు ఘాతసూచీ సంఖ్య ఒక నిర్ధారితమైన జీవనప్రమాణమునకు అగు వ్యయమును తెల్పునేకాని అసలు ఆ జీవనప్రమాణము తగినదా లేదా అనిగాని, దానిని వృద్ధిచేయుటకు, లోటుపాట్లు సర్దుచేయుటకు మార్గములుగాని సూచింప నేరదు. జీవనవ్యయమును రెండుభాగములుగా విభ జింపవచ్చును. జీవనమునకు ఉపయోగింపబడినవస్తువులు, వాటిధరలు. ఘాతసూచీసంఖ్యలో మనము ధరలను గురించియే ఆలోచిస్తాము. కాని మనము ఉపయోగించే వస్తువులు క్రమేపి మార్పుచెందుతుంటాయి. అదేవస్తు వులో ఎక్కువ, తక్కువ మొత్తములను ఉపయోగిం చుటగాని, దానిబదులు వేరొకవస్తువును ఉపయోగిం చుటగాని జరుగవచ్చును. ఆధారకాలమునకు, ప్రస్తుత కాలమునకు దూరం ఎక్కువైనకొద్దీ ఇటువంటిమార్పు లకు ఎక్కువ అవకాశం వుంటుంది. కాని ఘాతసూచీ సంఖ్యలో యిటువంటిమార్పులను లెక్కలోనికి తీసి కొనము.

రెండు జీవనవ్యయపు ఘాతసూచీసంఖ్యలను పోల్చవలెనంటే, అవి సామాన్యముగా ఒకేవిధముగా తయారుచేయబడి, ఒకేతరగతివ్యక్తులకు చెందియుండాలి. మదరాసు, బొంబాయి, పంజాబురాష్ట్రములలో నెలకు రూ. ౫౦ లకంటె తక్కువ సంపాదించేవారి జీవన వ్యయమునకే ఘాతసూచీసంఖ్యలు తయారుచేస్తారు. కొన్ని మధ్యరాష్ట్రములలో నెలకు రూ. ౧౦౦ లకన్న తక్కువసంపాదించువారి జీవనవ్యయమును, బీహారులో రూ ౧౦౦ ల నుండి రూ ౩౫౦ లు సంపాదించువారి జీవనవ్యయమును సూచించు ఘాతసూచీసంఖ్యలు తయారుచేస్తారు. కాబట్టి ఇవి అన్నీ ఒకేతరగతి వ్యక్తులకు చెందవన్నమాట. **Royal Commission on Labour** వారు రూ. ౫౦ల కన్నా తక్కువ సంపా దించువారి జీవనవ్యయపు ఘాతసూచీసంఖ్యలు తయారు చేయవలసినదని సిఫార్సు చేసినారు.

ఘాతసూచీసంఖ్యలు తయారుచేయుటకు ముందు ఆధారకాలమును నిర్ణయింపవలసిన అవుసర మును గూర్చి యిదివరకే చూచినాము. బీహారులోను, పంజాబులోను ౫ సంవత్సరములకాలమును, కాన్పూరు, మధ్యపరగణాలలో ఒకనెలకాలమును, మిగిలినచోట్ల ఒకసంవత్సరకాలమును ఆధారకాలముగ నిర్ణయించి నారు. మదరాసురాష్ట్రములో అన్నిపట్టణములలోను ౧౯౩౬ జూన్ నెలతో అంతమైనసంవత్సరము ఆధార కాలముగ తీసికొనబడినది. బొంబాయిపట్టణములో ౧౯౩౪ జూన్‌తో అంతమైనసంవత్సరమును, అహమ్మదా బాదులో ౧౯౨౬ జూలైతో అంతమైనసంవత్సరమును ఆధారకాలములుగా నిర్ణయింపబడినవి.

మనదేశములోని జీవనవ్యయపు ఘాతసూచీ సంఖ్యలన్నింటిలోను చేర్చవలసిన పదార్థములసంఖ్య, వాటిప్రాముఖ్యతలు కుటుంబవ్యయపట్టికలను (**Family Budgets**)బట్టి నిర్ణయింపబడినవి. ఇందుకొరకై ప్రతి రాష్ట్రములోను కొన్నికొన్ని పట్టణములలో కొన్ని కుటుంబ వ్యయపట్టికలు పోసుచేయబడినవి. వానినుండి ఆతరగతినంతను సూచింపగల స్టాండర్డు బడ్జెటును తయారుచేస్తారు. మనరాజధానిలో మద్రాసుపట్టణ ములో ౧౯౩౫ సం. జూన్ నెలనుండి ౧౯౩౬ సం.

సెప్టెంబరువరకు సుద్దలఉత్పత్తికార్మికులు, రైల్వేపని వారు, ఇంజనీరింగ్‌పనివారు, నూనెపరిశ్రమల కార్మికులు, ముద్రాక్షరశాల కార్మికులు, బీడీపనివారు, కుట్టుపనివారు, లాగుడుబండ్లవారు - ఈతరగతులలో షుమారు ౧౫౦౦ కుటుంబములనుండి వ్యయపట్టికలను పోగుచేసినారు. ఇందుకొరకు ప్రత్యేకముగా కొందరు వ్యక్తులు నియమింపబడి, ఆయాకార్మికులయిండ్లకు పోయి, వారితో సంభాషణలద్వారా కావలసినసంగతులను గ్రహించారు. ఈ ౧౫౦౦ బడ్జెట్లనుండి ఒక స్టాండర్డు బడ్జెట్టు తయారుచేయబడినది. మన రాజధానిలోని మిగతా పట్టణములలోను ఒక్కొక్క పట్టణమునుండి షుమారు ౫౦ కుటుంబవ్యయపట్టికలు మాత్రమే గ్రహింపబడినవి. అట్లాగే బొంబాయి, షోలాపూరు, అహ్మదాబాదు, నాగపూరు, జబల్పూరు, జంషెడ్పూరు, ఝారియా, కాన్పూరు మొదలైనపట్టణములలోని కార్మికులబడ్జెట్లు సేకరింపబడి, ఆయాపట్టణములందు తయారుచేయబడుచున్న ఘాతసూచీ సంఖ్యలలోని వస్తువులను, వాటి ప్రాముఖ్యతలను నిర్ణయించుటకు ఉపయోగపడుచున్నవి.

జీవనవ్యయపు ఘాతసూచీ సంఖ్యలో చేర్చబడే వస్తువులను ౫ విభాగములుగా విభజింపవచ్చును. ౧. ఆహారము, ౨. గృహము, ౩. గుడ్డ, ౪. వంటచెరకు, దీపము, ౫. వివిధములు. జీవనవ్యయపు ఘాతసూచీ సంఖ్యలో ఆతరగతివారు డబ్బువంతనూ ఏఏవస్తువులకు ఖర్చుపెడతారో, అన్నివస్తువులనూ చేర్చవలెను. అట్లా అన్నివస్తువులను చేర్చుటకు వీలులేకపోయిన, వారిఖర్చులో ఎంత ఎక్కువభాగమునకు వీలైతే అంత ఎక్కువభాగమునకు కొనబడినవస్తువులను చేర్చవలెను. ఘాతసూచీ సంఖ్యలో ఎంతఎక్కువభాగము ఖర్చునకు వస్తువులు చేర్చబడలేదో, ఆఘాతసూచీసంఖ్య ఉపయోగం అంత తగ్గిపోతుంది. మనరాజధానిలో తయారుచేయబడే ఘాతసూచీ సంఖ్యలలో మొత్తం ౫౦ వస్తువులు చేర్చబడినవి (౩౧ ఆహారము; ౧ గృహము; ౪ వంటచెరకు, దీపము; ౫ గుడ్డ; ౯ వివిధములు తరగతులకు చెందినవి).

ఘాతసూచీసంఖ్యలు తయారుచేయుటలో ప్రాముఖ్యతలకు గల స్థానము యిదివరకే సూచింపబడినది. జీవనవ్యయపు ఘాతసూచీసంఖ్య తయారుచేయునపుడు ప్రాముఖ్యతలకు మరింత అవసరము వుంది. మనం అనేక వస్తువులను ఉపయోగించుచున్నప్పటికీ, కొన్ని వస్తువులను ఎక్కువగా ఉపయోగిస్తాము; వానిధరలలోని మార్పులవలన జీవితసౌఖ్యం ఎక్కువగా మారుతుంది. ఏ వస్తువు ధరమార్పువలననైనా మనము ఆ వస్తువును ఉపయోగించేపరిమితినిబట్టియే మనం లాభం పొందుతాము. అందుచేత ప్రాముఖ్యతలు జీవనవ్యయపు ఘాతసూచీసంఖ్యలో ఒక ముఖ్యస్థానము నాక్రమించుచున్నవి. మనరాజధానిలో మొత్తముఖర్చు ౧౦౦ అయిన పై ఐదు విభాగములలోను 'ఆది స్టాండర్డు బడ్జెట్టును బట్టి యీ విధంగా విభజింపబడింది: ఆహారము ౫౭.౨౩; గృహము (అద్దె) ౧౪.౫౬; వంటచెరకు, దీపము ౭.౪౨; బట్ట ౬.౧౦; వివిధములు ౧౨.౬౯; అంటే కార్మికులు ఖర్చుపెట్టేడబ్బులో నూటికి ౫౭.౨౩ పాళ్లు ఆహారముకొరకు; ౬.౧౦ పాళ్లు బట్టల కొరకు మొదలైనవిధములుగా నన్నదన్నమాట.

పై ఐదువిభాగములలోను ఒక్కొక్కవిభాగములోను చాలవస్తువులు చేర్చబడివున్నవి. ఉదాహరణకు: ఆహారవిభాగంలో ౩౧ వస్తువులు చేర్చబడివున్నవి. ఈ వస్తువులన్నీ ఒకేమొత్తములో ఉపయోగింపబడవు కాబట్టి వీనికికూడ వేర్వేరుప్రాముఖ్యతల చేర్చవలెను. అప్పుడు పై ఐదుభాగములలోను, ఒక్కొక్క విభాగములోని ఖర్చును ౧౦౦ అనుకొని, ఆ భాగములోని వస్తువులకు ప్రాముఖ్యతలను నిర్ణయింపవలెను. ఆ ప్రకారం మనరాజధానిలోని వివిధవిభాగములలోని వస్తువులకు యీ దిగువ ప్రాముఖ్యతలు నిర్ణయింపబడినవి: (౧) ఆహారము (మొత్తం ౧౦౦) బియ్యం ౪౫.౧౧; రాగులు ౧.౬౭; పప్పు ౨.౮౧; బంగాళదుంప ౧.౦౪; ఉల్లిపాయలు ౦.౬౯; వంకాయలు ౧.౧౮; చిక్కుడుకాయలు ౦.౯౮; బెండకాయలు ౦.౫౯; ఆకుకూరలు ౦.౯౮; ములగకాయలు ౦.౫౯; ముల్లంగి ౦.౭౯; గుమ్మడికాయలు ౦.౪౯; Elephant Yarn ౦.౭౯; చేపలు ౫.౪౩; మాంసం ౨౮.౪; కొబ్బరి ౧.౧౮; పాలు ౬.౭౭; ఉప్పు ౧.౨౪; మిరప

కాయలు ౨.౬; చింతపండు ౧.౯౩; పసుపు ౦.౯౨; ధనియాలు ౦.౩౯; ఆవాలు ౦.౩౯; Garlic ౧.౧౮; కొబ్బరినూనె ౧.౨౪; నువ్వులనూనె ౪.౯౭; నెయ్యి ౨.౫౦; పంచదార ౧.౩౭; బెల్లం ౧.౬౪; కాఫీ (పొడుగరకం) ౧.౪౧; తేయాకు ౦.౬౦; (౨) గృహము అద్దె ౧౦౦; (౩) వంటచెరకు, దీపము (మొత్తం ౧౦౦) వంటచెరకు ౭౪.౨౧; బొగ్గు ౩.౩౯; కిరసనాయిలు ౧౯.౬౮; నిప్పుపెట్టెలు ౨.౭; (౪) గుడ్డ (మొత్తం ౧౦౦) ధోవతులు ౨౨.౫౦; చొక్కాగుడ్డ ౧౬.౮౦; ఉత్తరీయం ౬.౨౫; చీరెలు ౪౫.౩౧; జాకెట్లు ౯.౦౬; (౫) వివిధములు (మొత్తం ౧౦౦) ఆకు, వక్క ౧౮.౦౨; విద్య ౧౧.౭౧; చాకలి, సబ్బు ౨౩.౪౨; మంగలి ౧౫.౬౨; వినోదములు ౬.౬౧; ప్రయాణము ౫.౧౪; పొగాకు ౨.౨౫; బీడీలు ౧౦.౫౧; వైద్యము ౬.౭౬; అంటే ఒక సామాన్య కార్మికుడు ఒక రూపాయి ఖర్చుపెడితే, సగటున అందులో (౫౮.౨౩) అర్ధరూపాయి ఆహారంకొరకు; అందులోను పావులా (౪౫.౧౧) బియ్యంకొరకు వన్నమాట; అట్లానే ప్రతిరూపాయి ఖర్చులోను ఒక అణా వంటచెరకువకు, ఒకటిన్నరదమ్మిడీ వినోదములకు వున్నదని అర్థం.

ఈ విధంగానే ప్రతిరాష్ట్రంలోని ఘాతసూచీ సంఖ్యలలోను అన్నివస్తువులకు ప్రాముఖ్యతలు యివ్వబడినవి. బొంబాయిపట్టణములోని ఘాతసూచీ సంఖ్యలోకూడ మొత్తము ౫౦ వస్తువులే చేర్చబడినవి (ఆహారము ౩౨; గృహము ౧; వంటచెరకు, దీపము ౪; గుడ్డ ౬; వివిధములు ౭). కాని వేర్వేరు భాగముల ప్రాముఖ్యతలుమాత్రము యీవిధంగా నిర్ణయింపబడినవి: ఆహారము ౪౭; గృహము ౧౩; గుడ్డ ౮; వంటచెరకు, దీపము ౭; వివిధములు ౧౪; మొత్తము ౮౯. (అంటే చేర్చబడ్డవస్తువులు మొత్తము ఖర్చులో ౮౯ పాళ్లకే కొనబడినవి. మిగత ౧౧ పాళ్లకు కొనబడిన వస్తువులు చేర్చబడలేదు). ఈవిధంగా వివిధపట్టణాలకు వేర్వేరువస్తువులు, వేర్వేరుప్రాముఖ్యతలు నిర్ణయింపబడుటవలన యీఘాతసూచీసంఖ్యలు ఒకదానితోనొకటి పోల్చుటకు వీలులేకయున్నది. మొత్తమువిూద అన్ని ఘాతసూచీసంఖ్యలలోను ఆహారపదార్థములలో వస్తువులు విరివిగా చేర్చబడ్డవి. కొన్నిచోట్ల దీపము ఖర్చులో నిప్పుపెట్టెలు చేర్చబడలేదు. ఒకచోట వంటచెరకుఖర్చు అసలు చేర్చబడనేలేదు; బట్టలవిభాగములో ఏఘాతసూచీ సంఖ్యలోను దర్జీచార్జీలు చేర్చబడలేదు. గుడ్డఖరీదుమాత్రమే చేర్చబడింది. కాని దర్జీఛార్జీలు ఎక్కువగానున్న యీకాలంలో అవి చేర్చకపోవటం పెద్దలోపమే అవాలి. బీహారు, ఒరిస్సా, మధ్యరాష్ట్రముల ఘాతసూచీసంఖ్యలలో ఇంటిఅద్దె చేర్చబడలేదు. అన్నివిభాగములలోను అతిముఖ్యమైనదీ, వస్తువులు చేర్చుటకు కష్టమైనదీ, ఎక్కువభేదాలు కనిపిస్తున్నదీ వివిధములు. బీహారు, ఒరిస్సాలలో ఇది మొదలే చేర్చబడలేదు. కాని మదరాసులోని ఘాతసూచీసంఖ్యలలో యిది చాల ఎక్కువ వస్తువులను చేర్చబడి సమంజసంగావుంది.

చేర్చవలసినవస్తువులు, వాటిప్రాముఖ్యతలు నిర్ణయింపబడినతరువాత ఆవస్తువులధరలను పోగుచేయుపద్ధతిని గమనించాలి. ఇందుకొరకై పంజాబులోను, మధ్యరాష్ట్రములలోను తప్ప మిగతా అన్నిచోట్ల ప్రత్యేకవ్యక్తులు నియమింపబడివున్నారు. మదరాసులో గుడ్డలధరలు ఒకచిల్లరవర్తకునివద్దనుండి తెలుసుకుంటారు; మాంసము, చేపలధరలు మూర్‌మార్కెట్ సూపరింటెండెంట్ ప్రతివారం ప్రచురించేపట్టికనుండి తెలిసికొంటారు. మిగిలినవన్నీ ఒక ప్రత్యేకగుమాస్తా ౫ మార్కెట్లనుండి వారానికి రెండుపర్యాయములు తెలిసికొంటారు. మిగిలినపట్టణాలలో వారానికి ఒక్కసారిమాత్రమే తెలిసికొంటారు. బొంబాయిలోను, అహమ్మదాబాదులోను, కాన్పూరులోను వారానికొకసారి, షోలాపూరులో పక్షానికొకసారి, మధ్యరాష్ట్రిలలో ప్రతినెల ౧౫వ తారీఖునకు, బీహారు, ఒరిస్సా, పంజాబులలో ప్రతినెలా ఆఖరురోజునకు ధరలు తెలిసికొంటారు. ఇంటిఅద్దెమాత్రం ఎల్లప్పుడూ మారదు గాబట్టి ఆధారకాలంలోవున్న అద్దెనే మార్పు చేయకుండా వుంచుతారు. ధరలన్నీ తెలిసికొన్నతరువాత పని ఘాతసూచీసంఖ్యను తయారుచేయుటయే.

మదరాసు, బొంబాయిరాష్ట్రములలోని ఘాతసూచీసంఖ్యలు (బ్రిటిష్ లేబర్ మినిస్ట్రీ) వారి ఘాతసూచీసంఖ్య తయారుచేయబడేపద్ధతి ననుసరించియే తయారుచేయబడుచున్నవి. వారమునకు రెండుసార్లు కనుగొనబడినధరలకు ముందు సగటుధర కనుగొనబడును. (ప్రతివస్తువుధరయు ముందుగా నిర్ణయింపబడిన ఒకమొత్తపు (Unit) పదార్థమునకే కనుగొనబడును) అట్లు ఒకవిభాగములోని వస్తువులన్నింటికి సగటుధరలు కనుగొన్నతరువాత, ఒక్కొక్క వస్తువుధరను ఆధారకాలంలోని ఆవస్తువుధరకు శాతముగా మార్తురు. అవచ్చినశాతమును price relative అంటారు. ఒకవస్తువుధర ఆధారకాలంలో ౧౦౦ న్నీ, ప్రస్తుతకాలంలో ౧౫౦ న్నూ అయివుంటే, price relative ౧౫౦/౧౦౦ × ౧౦౦ = ౧౫౦ అవుతుంది. అప్పుడు ఒక్కొక్కవస్తువుయొక్క price relative ను దానికి ఆవిభాగములోగల ప్రాముఖ్యతతో హెచ్చించెదరు. ఈవిధంగా ఆవిభాగంలోని అన్నివస్తువులకు price relatives × ప్రాముఖ్యతలు కనుగొని, వానినన్నింటిని ప్రాముఖ్యతలమొత్తములో భాగించెదరు. ఉదాహరణకు: ఆహారము విభాగములో ౩౧ వస్తువు లున్నవి. వానిప్రాముఖ్యతలమొత్తము ౧౦౦. కాబట్టి ఆ ౩౧ వస్తువుల price relatives × ప్రాముఖ్యతలు కనుగొని, కూడి, ౧౦౦ చే భాగించెదరు. అవచ్చినసంఖ్య ఆవిభాగపుఘాతసూచీసంఖ్య అంటారు. ఇదేవిధంగా ఐదు విభాగములకు ఐదుప్రత్యేకఘాతసూచీసంఖ్యలు తయారవుతాయి. ఒక్కొక్కవిభాగపు ఘాతసూచీసంఖ్యను ఆవిభాగపు ప్రాముఖ్యతతో హెచ్చించెదరు. అట్లు ఐదింటిని హెచ్చించగావచ్చిన ఐదుprice relatives × ప్రాముఖ్యతల మొత్తముకూడి ప్రాముఖ్యతలమొత్తముతో భాగింతురు. అవచ్చినసంఖ్యయే జీవనవ్యయపు ఘాతసూచీసంఖ్య.

ఇటువంటి ఘాతసూచీసంఖ్యలు ఒకేజీవితసౌఖ్యము ననుభవించుటకు వేర్వేరుకాలములందు కావలసిన డబ్బును సూచిస్తుంది. ఉదాహరణకు: ౧౯౩౬ జూన్ నెలలో ఒకకుటుంబము నిర్ధారితమైన సౌఖ్యము ననుభవించుటకు చేసిన వ్యయము ౧౦౦ గా భావించితే, ఆదేకుటుంబము ఆదేసౌఖ్యము ననుభవించుటకు ౧౯౪౬ ఫిబ్రవరి ౧౬ తో అంతమైన వారములో ౨౨౯ ఖర్చుపెట్టవలసియుండును. (ప్రతివారము ఘాతసూచీసంఖ్య ఎంతైనదీ అన్నిపత్రికలలోను ప్రచురిస్తారు) దీనినిబట్టి, జీవనవ్యయము పెరిగినకొద్దీ, ఆదాయము పెరగవలసివుంటుంది. ఉదాహరణకు: ఒకకార్మికుడు ౧౯౩౬ జూన్ నెలలో ౩౦ రూపాయిలు నెలకు కుటుంబఖర్చుకు వినియోగించెననుకొందము. ఈనాడు ఆకుటుంబము ఆదేమొత్తము సౌఖ్యము ననుభవించుటకు ఆకార్మికుడు ౨౨౯/౧౦౦ × ౩౦ = ౬౮·౭ రూపాయిలకుపైగా ఖర్చుచేయవలసియుండును. అతనిజీతము ౧౯౩౬ జూన్ నెలలో, నెలకు రూ ౩౦ లు అయివుండిన యిప్పుడు రూ ౭౦ లు అయివుండవలెను. అతని జీతము రూ ౪౦ లుగాని, రూ ౪౫ లుగాని అయివుంటే అతనికుటుంబము ఇదివరకంతసౌఖ్యము ననుభవించటం లేదనియర్థము: ఒకమూల మాడుచున్నదన్నమాట. కాని మనము మొట్టమొదటనే గమనించినట్లు ఒకఘాతసూచీసంఖ్య ఎంతజాగ్రత్తగా తయారుచేయబడినదో, దానియందు అంతఎక్కువ నమ్మకముంచి, అది సూచించుమార్గమును అనుసరింపవచ్చును.

౧౯౪౦ ఆగష్టునెలలో జి. ఐ. పి. రైల్వేపనివారల కరువుబత్తెపు తగాదా పరిష్కారమునకై నియమింపబడిన రావుకోర్టువారు మనదేశములోని జీవనవ్యయపు ఘాతసూచీసంఖ్యలు ఏవియు పూర్తిగా నమ్మదగినవి కావనియు, కరువుబత్తెములను నిర్ణయించుటకు ముందు పట్టణము, మధ్యరకముబస్తీ, పల్లెటూరులలో జీవనవ్యయపు ఘాతసూచీసంఖ్యలు నమ్మదగినవి తయారుచేయవలెననియు, ఈ పని ఇండియాగవర్నమెంటువారే చేయవలెననియు సిఫారుసుచేసినారు. ఈ విషయమై ఇండియా గవర్నమెంటువారు ఒకస్కీమును తయారుచేసి రాష్ట్రీయ గవర్నమెంటుల సలహాకోరగా వారందరూ ఉత్సాహపూరితములైన జవాబు లిచ్చినారు. ౧౯౪౩ జనవరిలో ఢిల్లీలో సమావేశమైన మూడవలేబరుమంత్రులసభ యీ ఘాతసూచీ సంఖ్యలన్నియు ఒకే విధముగా తయారుచేయబడవలెననీ, అన్నియు ఒకే యాజమాన్యముక్రింద ఉండవలెననియు సూచించినారు. ఇట్టి ఘాతసూచీసంఖ్యలను తయారు

చేయుటకు ఇండియాగవర్నమెంటువారు ఒక డైరెక్టరును నియమించినారు. ఘాతసూచీసంఖ్యలు తయారుచేయుటకు, మదరాసు సరిహద్దురాష్ట్రములుగాక మిగిలినదేశమునుండి ౪౮ ప్రదేశములను నిర్ణయించినారు. ఈ ౪౮ చోట్లనుండి షుమారు ౨౦,౦౦౦ కుటుంబవ్యయపట్టికలను పోగుచేయుటకు నిశ్చయింపబడినది (వీనినిబట్టి చేర్చవలసినపదార్థములు, ప్రాముఖ్యతలు నిర్ణయింతురు.) ఈ ప్రదేశములలోనే ప్రత్యేకముగా చిల్లరధరలఘాతసూచీసంఖ్యలు (**Retail price Index Numbers**) తయారుచేయుటకు నిశ్చయింపబడినది; అప్పుడే అవి తయారుచేయబడుచున్నవి. ఇట్లు ఈ రెండురకముల ఘాతసూచీసంఖ్యలను సరిగా తయారుచేసినచో మనదేశములోకూడ ఈ శాస్త్రము ఒక దారిలోనికి వచ్చిన దనవచ్చును.



యుద్ధకాలమందలి పారిశ్రామిక విధానము

❀

= శ్రీ కె. సన్యాసయ్య =

యుద్ధకాలమునందు కలిగిన అసాధారణపరిస్థితులలో ప్రతిదేశమును తన ఆర్థికవిధానమును సవరించుకొనినది. యుద్ధసంరంభములో మానవజీవితములోని శాఖోపశాఖలు నూత్నచైతన్యముతో విస్తరిల్లినవి. ఒకమూల యుద్ధకృషికి, వేరొకమూల నిత్యజీవితములోని అవసరములకు కావలసిన సరకులను ఉత్పత్తిచేయుటయందు దేశదేశములు విశేషముగా నిమగ్నములైనవి. యుద్ధమునకు ముందు కెనడా, ఆస్ట్రేలియాలు వ్యావసాయిక దేశములు. యుద్ధకాలమునందు ఆ దేశములలోకూడ పారిశ్రామికాభ్యుదయము సర్వతోముఖముగా వికసించినది. అట్లే మన దేశమునకూడ జరుగవలసినది.

కాని మన దేశమున కథ వేరుగా నడచినది. యుద్ధమూలమున అంతర్జాతీయ వ్యాపారము స్తంభించి దిగుమతులు పూర్తిగా ఆగిపోయినవి. మన పరిశ్రమలు స్వయంవికాసమును చెందుటకు ఇది ఒక గొప్ప తరుణము. ఉత్పత్తిని అధికముచేసి సామాన్యజనులకు సరకులను సరఫరాచేయుటకు ప్రభుత్వము పరిశ్రమలకు చేయూతనిచ్చియుండవలసినది. కాని ఉత్పత్తినంతయును నోట్లచలామణీ హెచ్చించి ప్రభుత్వము సైన్యావసరములకు సరఫరా చేసినది. నోట్ల సంఖ్య వృద్ధియగుటవలన తయారైన సరకులకు సామాన్యజనుల కొనుబడిశక్తి హెచ్చినది. సామాన్యజనులకుకూడ కావలసిన పదార్థములను సరఫరాచేయుటకు వెంటనే చేయవలసిన కృషి నూత్నపరిశ్రమలను యుద్ధకాలముననే స్థాపించుటయే. కాని ఈ పరిశ్రమలను స్థాపించుట యుద్ధానంతరపునర్నిర్మాణకార్యక్రమముగా ప్రభుత్వము వాయిదావేసినది. యుద్ధకాలమందు యుద్ధానంతరపారిశ్రామికాభ్యుదయము, ఆర్థికపునర్నిర్మాణము— ఇత్యాదిశీర్షికలపై ప్రకటనలు, చర్చలు మిన్నుముట్టినవి. యుద్ధకాలములో అద్యతనభావినిగూర్చిగాక యుద్ధానంతరసమస్యలనుగురించి ప్రభుత్వము శ్రద్ధకనుపరచినది. ఇది పెద్ద పొరపాటు. యథార్థముగా ఇవి యుద్ధకాలమునకు సంబంధించిన సమస్యలేకాని యుద్ధానంతరమందు పరిష్కరింపదగిన సమస్యలు కావు. ఈ కారణమువలన యుద్ధకాలమందు మన పరిశ్రమలు అభివృద్ధిపొందకపోవుటయేకాక, యుద్ధాంతమున క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనవలసివచ్చినది.

యుద్ధము ముగిసినది. చిరకాలమునుండి ప్రభుత్వ మెదురుచూచుచుండిన శాంతిసమయము శరవేగమున ఏతెంచినది. ప్రభుత్వము తన సుషుప్త్యవస్థనుండి ఒక్కసారిగా కనులునులుముకొని పరికించినది. యుద్ధాంతమునకు, శాంతిసమయమునకు మధ్య కొంత వ్యవధి యుండు ననుకొన్నది కాబోలు! ఇట్టి విషమపరిస్థితి నెదుర్కొనుటకు ప్రభుత్వపు

అసంసిద్ధత బట్టబయలయినది. ఒక నిర్ణీత కార్యక్రమము లేదు. ఈ నిస్సహాయతకు కారణము జర్మనీపతనానంతరమైనను యుద్ధాంతమువరకు వేచియుండక శాంతిమయ జీవనపునర్నిర్మాణమునకు ప్రభుత్వము పూనుకొనకుండుటయే.

యుద్ధము ముగిసినవెంటనే యుద్ధమునకు పూర్వముండిన శాంతిజీవనము తిరిగి నెలకొల్పబడునని చేసిన వాగ్దానములను కార్యరూపములో పెట్టుటకు నేటి ప్రభుత్వము వెర్రిపరుగులు పరుగెత్తుచున్నది. నిత్యజీవితావసరములకు కావలసిన సరకులను తయారుచేయుటకు మన దేశములో యంత్రాగారములు నిర్మించి, శాంతిపథకమును నిర్మించవలసినది. దీనికి కావలసిన యంత్రములను విదేశములనుండి దిగుమతి చేసికొనవలసినది. కాని దీనికి బదులు విదేశ యంత్రాగారములలో తయారైన సరకులను దిగుమతి చేయుటకు హైదరీ రాయబారమును ఇంగ్లండునకు పంపి కొన్ని ఏర్పాటులు చేసినది. ఈఏర్పాటులు మన పరిశ్రమలకు నష్టముకలిగించుటకే; భారత ప్రభుత్వము బ్రిటిష్ ప్రభుత్వమువారి తాఖీదులప్రకారము నడచుకొనుచున్నది అను భావములు ప్రబలుచున్నవి. అట్టి దురుద్దేశము తనకు లేదనియు, ప్రజానీకములో నిత్యావసరములను తీర్చుట తమ పరమోద్దేశమను ప్రభుత్వమువారి ప్రకటన అరణ్యరోదనమయినది. ప్రజల అవసరములకొరకై విదేశయంత్రాగారములలో తయారైన సరకులను దిగుమతిచేసికొనుటవలన మన పరిశ్రమాభివృద్ధికి వ్యాఘాతముసంభవింపదా? మన దేశమునే ఆవిషయములో స్వయంసంపూర్ణముగా చేయుట మనకు శ్రేయోదాయకము కాదా? మనకు కావలసిన యంత్రసామగ్రిని దిగుమతిచేయుటకు ఏమాత్రమును అవకాశములు కల్పింపని ప్రభుత్వము అట్టి యంత్రనిర్మితపదార్థములను దిగుమతి చేయుటకై ఎందుకంత శ్రద్ధవహింపవలెను? మన దేశ యంత్రాలయములవద్దనుండి ప్రభుత్వావసరములకు కొను సరకులు ఏల తగ్గింపవలయును? ఆవిధముగా చేసినయెడల ఆ యంత్రాలయములకు సామాన్యజనులకొరకై సరకులను తయారుచేయు అవకాశము ఏర్పడు ననుచున్నది ప్రభుత్వము; ఇది అర్థరహితము కాదా? ప్రతివిషయమునను ప్రభుత్వసహాయము సంపూర్ణముగా లభించినగాని మన యంత్రాలయములు ఉత్పత్తిని హెచ్చింపలేవనుట సుస్పష్టముకాదా?

యుద్ధకాలమందు ప్రభుత్వము పారిశ్రామికవిషయములలో శ్రద్ధ వహింపలేదనుట ఎక్కువగా రుజువుచేయనక్కరలేదు. ప్రభుత్వప్రోత్సాహము దొరకిన మన పరిశ్రమలు బాగుగా వృద్ధియయి, మన కిప్పుడేర్పడిన క్లిష్టపరిస్థితులు ఏర్పడెడివి కావు. మన పరిశ్రమలు బాగుగా వృద్ధిపొందియుండెడివి. క్రొత్తపరిశ్రమలు నెలకొల్పబడియుండెడివి. పరిశ్రమలు అభివృద్ధిపొందవలెననిన, ఉన్న పరిశ్రమలకు భద్రతాయుతమగు అనుకూలవాతావరణము కలిగించవలెను. ఈ విషయమై ప్రభుత్వము తన విధానమును, తన వైఖరిని స్పష్టముగా ప్రకటించవలెను. ప్రభుత్వమే కీలకపరిశ్రమలను నెలకొల్పి నడపుట సర్వజనీనమైన పద్ధతి. అట్లు చేసిన పరిశ్రమలు లాభముకొరకుగాక, జనుల

అవసరములకొరకు నడుపబడును. కాని అట్టి శుభసూచనలు మన దేశమందు మరికొంత కాలమువరకైనను పొడసూపునను ఆశలేదు. ఈపరిస్థితిలో ప్రత్యేకవ్యక్తులకు, ప్రత్యేక సంస్థలకు అవకాశములు కల్పింపబడవలెను. లేనియెడల మనము రెంటికిని చెడుట సంభవించును.

యుద్ధకాలమందు ప్రభుత్వము పరిశ్రమలకు ఎట్లు అంతరాయములు కల్పించెనో పరిశీలింతము.

ప్రస్తుతము ప్రభుత్వమువారి అనుమతి లేక క్రొత్త కంపెనీలను ప్రారంభింపకూడదను ప్రత్యేకశాసనము (**Capital Issue Control Ordinance**) కలదు. దీనిని సమర్థించుచు ప్రభుత్వమువారు ప్రస్తుతము దేశములో ధనోల్బణము (**Inflation**) ఎక్కువగా నున్నదనియు, అది తగ్గించుటకు ప్రభుత్వము బాండ్లను అమ్ముచున్నదనియు, దానికి ఈ శాసనము ఉపయోగించుచున్నదనియు చెప్పుచున్నారు. కాని దీనివలన విశేష లాభము లేదు సరికదా, తీరనినష్టము కలుగుచున్నది. ఏలన—ఒకరికి నిలువచేయుటకు తగినంత ధనము, ఆ ధనమును పెట్టుబడి పెట్టుటకు అభిలాష ఉన్నదనుకొందము. అతడు ఆ ధనమును మూడువిధములుగా ఉపయోగింపవచ్చును. **1.** ప్రభుత్వమువారి బాండ్లను కొనుట, **2.** ధనాగారములలో (**Banks**) నిలువచేయుట, **3.** కంపెనీల వాటాలను కొనుట. వానిలో ఏ మార్గము నవలంబించినను, చిట్టచివరకు ధనమంతయు ప్రభుత్వకోశాగారమునకే బాండ్లద్వారా తిరిగివచ్చును. పారిశ్రామికాది నిర్మాణోత్పత్తికార్యక్రమములకు వినియోగింపబడని ధనమంతయు ప్రభుత్వమునకే బాండ్లద్వారా తిరిగివచ్చునుకదా! కావున ఈ వాదమునకు అర్థములేదు. విదేశీయు లెవరైనను విదేశపు పెట్టుబడితో మన దేశమందు నెలకొల్పదలచినచో వారికి ఈ విధమైన ఆటంకములు లేవు. ఈ శాసనఫలము మన పరిశ్రమలను నిరుత్సాహపరచి, విదేశవ్యాపారస్థులకు మార్గము సరిచేయుటయే.

ఈ శాసనము మరికొన్ని క్రొత్తచిక్కులను తెచ్చిపెట్టుచున్నది. ప్రస్తుతము ప్రభుత్వమువలన పారిశ్రామికులకు కావలసిన యంత్రసామగ్రికొరకు అనుమతులను పొందవలసియున్నది. కంపెనీ ప్రారంభింపకపూర్వము యంత్రసామగ్రిని కొనుటకు ఎట్లు వీలగును? యంత్రసామగ్రి కొనినపిదప కంపెనీని ప్రారంభించుటకు అనుజ్ఞ దొరకకుండిన మిక్కిలి నష్టము సంభవింపదా? ఇట్టి అవ్యవస్థిత పరిస్థితులలో పరిశ్రమాభివృద్ధి ఎట్లు జరుగును? క్రొత్తకంపెనీలు స్థాపించుట ఎట్లు వీలగును? అంతేకాదు. యుద్ధకాలములో క్రొత్త కంపెనీలు వెనువెంటనే సరకులను తయారుచేయు ఉద్దేశముతో ప్రారంభింపదలచినచో వానికి అనుజ్ఞ దొరకలేదు. యుద్ధానంతరము సరకుల నుత్పత్తిచేయు కార్యక్రమము కలిగిన కంపెనీలకే అట్టి అనుజ్ఞ దొరకినది. అనగా యుద్ధకాలములో స్థాపింపబడిన క్రొత్తకంపెనీలు తమ వాటాలను అమ్మగా వచ్చిన ధనమును ప్రభుత్వమువారి బాండ్లలో పెట్టుబడిపెట్టవలెను. అనగా బాండ్ల అమ్మకమునకు ఏజెంట్లుగా పనిచేయవలెను. మన పరిశ్రమలు మన దేశస్థుల పెట్టుబడితో భారతీయుల ఆధ్వర్యమున స్థాపించుట కష్టము. ఈ పరిశ్రమలనే విదేశీ

యులు నిరాటంకముగా స్థాపింపవచ్చును! ఇది మన దేశపు పారిశ్రామికులకు తీరని నష్టము కల్గించుచున్నది.

నూతనపరిశ్రమలను నెలకొల్పుటకు ప్రభుత్వము కల్పించు అంతరాయములు ఇంకను కొన్ని కలవు. మచ్చునకు—ప్రతి స్థలమందును పరిశ్రమలు స్థాపించినయెడల కొన్ని నష్టములు కలవు. బొంబాయి రాష్ట్రమందు బట్టలపరిశ్రమ కలదు; సుంకముల ద్వారా బట్టలపరిశ్రమకు రక్షణనిచ్చినచో అన్నిరాష్ట్రములవారును ఎక్కువఖరీదులు పెట్టి బట్టలు కొనుట తటస్థించును. అందువలన ఇతర రాష్ట్రములవారందరును కొంత త్యాగముచేసి బట్టలపరిశ్రమకును, తద్వారా బొంబాయి రాష్ట్రమునకును మాత్రము లాభము సమకూర్చవలసివచ్చును. ఇట్లే పారిశ్రామికముగా వెనుకబడియున్న రాష్ట్రములన్నియు పారిశ్రామికముగా అభివృద్ధిచెందిన రాష్ట్రములకొరకు స్వార్థత్యాగము చేయవలసివచ్చును. అది ఇతర రాష్ట్రములకు కష్ట—లేదా, నష్ట—కారణము కావచ్చును. కాని అన్నిరాష్ట్రములును సమానముగా అభివృద్ధిచెందినచో ఇట్టి అంతఃకలవరములకు తావుండదు. ఆసాకును చెప్పి ప్రభుత్వము క్రొత్తకంపెనీలను స్థాపింపననుజ్ఞనీయుటలేదు. కాని వివిధపరిశ్రమలు ఏ ఏ రాష్ట్రములలో ఎక్కడెక్కడ స్థాపింపవలయు నను సువిచారము ప్రభుత్వము చేసియున్నదా? అట్టి ప్రణాళిక లేనంతకాలము ఈ మిషపై క్రొత్తకంపెనీలకు అంతరాయములు కల్పించుట హాస్యాస్పదము.

ఇంతేకాదు. ప్రభుత్వయంత్రము ప్రతివిషయమున పెళ్లివారి నడకను అనుసరించును. అక్కడి పెద్ద ఉద్యోగులందరును స్వతంత్రించి నిర్ణయములు సల్పుటకు అధికారములేనివారు. ఇక వారి తాబేదారుల మాట చెప్పవలయునా? ప్రతివిషయమునకును ఆలస్యము; అంతరాయములు. ఈ స్థితిలో పరిశ్రమాభివృద్ధి ఎట్లు జరుగును?

యుద్ధకాలములో మన పరిశ్రమలు విశేషలాభములు పొందినవి. కాని ఈ లాభము అధికోత్పత్తివలనగాక ధరలు విపరీతముగా పెరుగుటవలన సంక్రమించిన మిథ్యాసౌభాగ్యము. ఈ విషయము ఈ క్రిందిపట్టిక వలన స్వయంవ్యక్తముకాగలదు.

	బట్టలపరిశ్రమ-మిలియన్ గజములలో	జనుము పరిశ్రమ వేలటన్నులు	టీ-మిలియన్ పౌన్లు *	అమ్మకమైన విద్యుచ్ఛక్తి-వేలయూనిట్లు†
1938-39	4,269	1,222	385	1,681,827
1939-40	4,012	1,277	391	1,819,928
1940-41	4,269	1,108	415	1,940,624
1941-42	4,493	1,259	475	2,356,622
1942-43	4,109	1,042	553	2,416,004
1943-44	4,871	947	—	2,649,000
1944-45	4,683	975	—	2,887,900

* ఈ అంకెలు 1939-43 వరకు కేలెండరు సంవత్సరపు లెక్కలు.

† బ్రిటిష్ ఇండియాకు మాత్రము సంబంధించినవి. పి. డబ్ల్యు. డి. లోనూ, మిలిటరీ స్టేషన్లకు సంబంధించిన లెక్కలు మినహాగా.

ఇది ఎంత తాత్కాలికమో, అంత అయథార్థము. ఉన్న యంత్రములే ఎక్కువ కాల ముపయోగింపబడినందుననే, కొంచెముగానైనను ఉత్పత్తి హెచ్చినది. కాని ఈ యంత్రములు అరిగిపోయిన తరువాత క్రొత్త యంత్రములను, సరిక్రొత్తనమూనాయంత్రములను కొనుటకు తగినంత డబ్బును జాగ్రత్త పెట్టవలెను. ఇందుకు పారిశ్రామికసంస్థలపై విధించు పన్నులవిషయమై మార్పురావలెను. ఈ పన్నులను తగ్గించినయెడల ప్రభుత్వాదాయము తగ్గి ధనికులైన పెట్టుబడిదారుల ఆదాయము హెచ్చునను మాట నిజమే. దీనికి పరిశ్రమలపై మోయరాని భారము విధించుట విరుగుడుకాదు. పెట్టుబడిదారులకు ధనము చేకూరినను, పరిశ్రమలన్నియు ప్రభుత్వపరము కానంతకాలము ఈ మార్గము అనుసరింపకతప్పదు. మొన్న కేంద్రశాసనసభాసమావేశసందర్భమున అధికలాభములపై పన్నును తీసివేయుట, అరుగుదలపట్టీలలో (Depreciation Schedule) మార్పు ముదావహమైన విషయములు. ఈ సత్యమును నేటికైన ప్రభుత్వము గుర్తించుట భావిపరిశ్రమాభివృద్ధికి శుభశకునము.

ప్రభుత్వము పారిశ్రామికాభ్యుదయము కొరకు కొన్ని ప్రయత్నములు చేసిన మాట సత్యము. కాని ఈ పరిశ్రమలన్నియు ఒక సమగ్రవిధానమును బట్టిగాక, అలవోకగా (at random) చేసినవి. ఈ అవ్యవస్థితమైన ప్రయత్నములన్నియు ఏకముఖముగా ఒక లక్ష్యముపై ప్రసరించినతప్ప దేశము అభివృద్ధిచెందనేరదు. ఐనను ప్రభుత్వము ఈ మధ్య గావించిన ప్రకటనలను, ఏర్పాటులను పరిశీలించుట ముఖ్యమని మాత్రము విస్మరింపరాదు.

బొంబాయిలో పారిశ్రామికులు కొందరు ఒక సమగ్రప్రణాళికను **1944** జనవరి నెలలో ప్రకటించిరి. ఆర్థికరంగమున దేశీయుల వాంఛలకు రూపకల్పనలు దిద్దిన దీ బొంబాయిప్రణాళిక. పారిశ్రామికరంగమున నిర్ణీతపథకముతో జరుగవలసిన మహాకృషికి, కర్తవ్యతాజిజ్ఞాసకు ఈప్రణాళిక వేగుచుక్క. అప్పటినుండి దేశీయులు, పారిశ్రామికులు, పండితులు, ప్రభుత్వము భావిపారిశ్రామిక పథకముపై ఆలోచించుటకు మొదలుపెట్టినారు. ప్రభుత్వము వివిధపరిశ్రమలకు సంబంధించిన పారిశ్రామికసంఘములను (**Industrial Panels**) ఏర్పాటుచేసినది. నేడు ముఖ్యపరిశ్రమల విషయమై ఈ సంఘములు కృషి చేయుచున్నవి. ఇప్పుడు మన దేశమందులేని కొన్ని పరిశ్రమలవిషయమైకూడ ఇట్టి సంఘములు ఏర్పరుపబడుట ఒక విశేషము. ఈ సంఘములు ప్రత్యేకపరిశ్రమలకు సంబంధించిన విషయములపై—అనగా ఏఏపరిశ్రమలు ఎంతవరకు వృద్ధినందినవో, ఎంతవరకు వృద్ధినందుటకు అవకాశము లున్నవో, ఆ అభివృద్ధివిషయమై ఏ కార్యక్రమము అనుసరింపవలెనో, ఏఏపరిశ్రమలు ఎచ్చటెచ్చట నెలకొల్పబడవలెనో, ఇతరదేశములనుండి కావలసిన వైజ్ఞానికసహాయ మేదియో, ఇతరదేశమందలి కంపెనీలతో ఏఏ ఏర్పాటులు గావించవలెనో మొదలగు విషయములపై పరిశోధించి ప్రభుత్వమునకు సలహాల నీయవలెను. ఈసంస్థలు అన్నిపరిశ్రమలవిషయమై ఇంకను నెలకొల్పబడలేదు. ఇవన్నియు తమ నివేదికలను తయారుచేయునరికి మరి

యొక రెండుసంవత్సరములు పట్టవచ్చును. ఆసలహాలనన్నిటిని సమీకరించి ప్రభుత్వము అటుమీద విశ్రాంతిగా ఒక కార్యప్రణాళికను తయారుచేయునట!

ఈలోపున అట్టికార్యక్రమమును ఆచరణలలో పెట్టుట కుపకరించు నేర్పరులను తయారుచేయుటకు ప్రభుత్వము సమకట్టినది. అందులకు శాస్త్రీయవిద్యనభ్యసించుటకొరకు విద్యార్థులను విద్యాభృతులను (Scholarships) ఇచ్చి ఇంగ్లండు, అమెరికా, కెనడా దేశములకు పంపినది. 1945లో అట్టి విద్యార్థుల సంఖ్య 590. ఇంతేగాక అట్టి ఉన్నతవిద్య మన దేశమునందే గరపుటకు ఒక ప్రత్యేకసంస్థను నిర్మించువిషయానుశీలనకు ఒక సంఘమును శ్రీనళినీరంజనసర్కారు గారి అధ్యక్షతను ఏర్పాటుచేసియున్నది. ఆ కమిటీ ఈసంవత్సరములోపల తన నివేదికను ప్రకటింపనున్నది. ఈకమిటీ స్థాపింపబోవు విద్యాసంస్థనుగూర్చి సామాన్యసూత్రములను మాత్రము నిర్ణయించును. అందులోని వివరములు ఆసంస్థపర్యవేక్షకుని నియామకము జరిగినతరువాత చర్చింపబడును.

యుద్ధము పరిసమాప్తిచెందకమునుపే మనపారిశ్రామికవేత్తలు బ్రిటిష్‌పారిశ్రామికవేత్తలతోను, వ్యాపారస్థులతోను పరిచయముచేసికొనుటకును, తద్వారా పరస్పర సహాయము పెంపొందించుటకును ఇంగ్లండు అమెరికా దేశములలో ప్రభుత్వయాజమాన్యమున పర్యటనము సల్పిరి. బ్రిటిష్‌పారిశ్రామికవేత్తలు మన దేశమునందు పారిశ్రామికాభ్యుదయావసరముగుర్తించి, అందుకు తాము సహాయపడ సంసిద్ధులమైయున్నా మని తెల్పిరి. కాని మన దేశమునకు కావలసిన యంత్రసామగ్రి వెంటనే సరఫరాచేయుటలో తమ అసహాయతను విశదీకరించిరి. అంతేగాక బ్రిటన్ అమెరికాకంటె పారిశ్రామికముగా వెనుకబడియున్నది. అయినప్పటికిని అమెరికాలో యంత్రసామగ్రి ఖరీదు చాలా హెచ్చుగా నున్నది. ఆకారణమువలన కొంతకాలమువరకు మనకు కావలసిన యంత్రసామగ్రి దొరకుట దుష్కరము.

కొంతకాలముక్రిందవరకును మన నిర్మాణశాఖాసభ్యులుగానున్న శ్రీఅర్ధేశ్వరదళాల్ గారు కూడ ఇంగ్లండుదేశములో పర్యటన గావించి కొన్ని ముఖ్యవిషయములను చర్చించిరి. ప్రస్తుతము మన దేశములో అనేకవిదేశ వ్యాపారసంస్థ లున్నవి. ఆసంస్థల ప్రత్యేకహక్కులను సంరక్షించుచు, 1935 చట్టములో కొన్ని నిబంధనలు గలవు. ఈ ప్రత్యేకహక్కులను తొలగింపవలెనని మన దేశనాయకులందరు ఏకగ్రీవముగా కోరుచున్నారు. ఈ విషయమై కేంద్రశాసనసభలో ఒకతీర్మానముకూడ చర్చకువచ్చెను. ఈవిషయమై శ్రీదళాల్‌గారు సంప్రదింపులు గావించిరి. వీనిని తొలగించుటకు బ్రిటిష్ ప్రభుత్వము అంగీకరించలేదు; కాని రాబోవు రాజకీయపరిష్కారసందర్భమున ఈవిషయమై కొన్ని మార్పులు జరుగునని పలువురు విశ్వసించుచున్నారు.

అన్నిటికంటె ముఖ్యముగా పారిశ్రామికవిషయములపట్ల ప్రభుత్వము అవలంబింపబోవు విధానమును నిర్వచించినది. మన జాతీయాదాయమును వృద్ధిచేయుట, నిరుద్యోగము నరికట్టుట, దేశరక్షణలను సరియగు పునాదులపై నిర్మించుట—ఆప్రకటన

యందు సూచింపబడిన ముఖ్యాంశములు. అందులోనే జాతీయాదాయమును సక్రమముగా విభజించుట, సుంకముల విధానము, ప్రధానపరిశ్రమల స్థలనిర్ణయము, ఖనిజసంపత్తి మొదలగు విషయములుకూడ ప్రశంసింపబడినవి. అందలి ముఖ్యసూత్రములు సర్వసమ్మతములు. కాని వివాదాంశములపట్ల ఆప్రకటన మౌనముద్ర దాల్చినది. ప్రధానముగా పరిశ్రమాభివృద్ధి ఏఏసూత్రములపై ఆధారపడవలెను? కంట్రోలు ఏఏపద్ధతులపై జరగవలెను? పరిశ్రమల ప్రాధాన్యక్రమ (Industrial Priorities) మెట్టిది? మొదలగు అనేకవిషయములకు సమాధానము ఈప్రకటనయందు దొరకదు. కాని పరిశ్రమాభ్యుదయమే ప్రభుత్వముయొక్క పరమగమ్యమనియు, దానిని సాధించుటకు ప్రభుత్వము సర్వవిధముల ప్రయత్నించుననియు ప్రకటనగావించుట కిది ప్రథమపర్యాయము. పరిశ్రమలకు పెట్టుబడి సరఫరాచేయు ప్రత్యేకసంస్థలను—అనగా పారిశ్రామికధనాగారములను (Industrial Banks) ఆర్థికవిషయపరిశోధనగావించు సంస్థ ఏర్పాటుచేయబడుననియు ఇదివరకు గావించిన ప్రకటనలు ఇంతవరకు సఫలతనొందకపోవుట విషాదకరము.

ఇదిగాక యుద్ధకాలమున నెలకొని, యుద్ధకృషికి సహాయమొనర్చిన పరిశ్రమలకు యథోచితరక్షణ (Discriminating Protection) ఇచ్చువిషయమై పరిశోధనలు గావించుటకు ఒక టారిఫ్‌బోర్డు నిర్మాణము జరిగినది. ఈ బోర్డు మిగిలిన పరిశ్రమలను గూర్చికూడ పరిశీలించునట్టిదిగా నుండకపోవుట విచారకరము.

యుద్ధకాలమున ప్రభుత్వపారిశ్రామిక విధానము తప్పటడుగులలో తప్పటడుగులు వేయుచు గడపినది. నేడు యుద్ధము ముగిసినది. యుద్ధానంతరపునర్నిర్మాణప్రణాళికలకు శంఖుస్థాపనమాత్రము జరిగినది. ద్వితీయప్రపంచమహాసంగ్రామములో అగ్నికుండములో బడి ప్రపంచము అద్భుతపరివర్తనము చెందినది. విశ్వరాజ్యాంగరంగమున నూతనచైతన్యము తాండవించుచున్నది. యూరపుఖండమున వివిధరాజ్యముల సరిహద్దులు తారుమారైనవి. ప్రజానీకము రాజకీయమున గాకపోయినను ఆర్థికరంగముననైన సామ్యవాదసిద్ధాంతముల పట్ల మ్రొగ్గుచున్నది. బ్రిటనునందు కార్మికపక్షము అఖండవిజయమునందినది. ఇది రాజకీయపరిణామముమాత్రమే కాదు; ఆర్థికవిప్లవమని తద్జ్ఞులు వ్యాఖ్యానముచేయుచున్నారు. ఆసియాఖండములో, చైనాదేశమున అంతర్యుద్ధము ముగిసినది. ఇండోనీషియాలో స్వాతంత్ర్యాగ్ని రగుల్కొనినది. ఈమహాపరిణామములో కీలకపరిశ్రమలు ప్రభుత్వయాజమాన్యమున నిర్వహించి, జనానీకముయొక్క జీవితసౌభాగ్యమును పెంపొందింపవలెనను నది అంతర్వాహినిగా నినదించుచున్న మహాసిద్ధాంతము. బ్రిటనులో కొన్ని కీలకపరిశ్రమలను ప్రభుత్వము జాతీయమొనర్చినది. భారతదేశములో పరిశ్రమాభివృద్ధియే దేశములో ప్రతివ్యక్తికిని నిత్యజీవితములో భాగ్యభోగ్యములను కొంతవరకైనను పెంపొందింపగలదు. కావున ప్రభుత్వకర్తవ్యము పరిశ్రమాభివృద్ధియే.

మొట్టమొదట ప్రభుత్వము పరిశ్రమలకు కావలసిన ధనసహాయము చేయవలసియున్నది. లండనులో మన దేశముపేర ప్రోగైయున్న స్టెర్లింగ్ నిలువలను ఆర్థికపునర్నిర్మాణమునకు పెట్టుబడిగా మనము మార్చుకొనుటకు ఏఅభ్యంతరము ఉండరాదు. బ్రిటన్ మొన్న అమెరికానుండి 4,400 మిలియన్ డాలర్ల ఋణముతీసికొనినది. ఇందులో మన స్టెర్లింగుల మారకమువిషయమై మనతో సంప్రదించక చేసిన నిర్ణయములు మనను బంధింపకూడదు. యుద్ధమునకు మనము చేసిన కృషి అపారము. భారతదేశము చెమటోడ్చి సంపాదించిన ధనమును భారతదేశాభివృద్ధికై, భారతపరిశ్రమాభివృద్ధికై వినియోగించుటకు బ్రిటిష్ప్రభుత్వము ఏఅంతరాయములు కల్పింపకూడదు.



నిష్కారణ భయము

— శ్రీ కపిల వేంకటరావు —

"ఇప్పుడూ యుద్ధం ఆగిపోకపోయింది. అక్కడ అల్లరులు - ఇక్కడ అల్లరులు, ఆ ఊళ్లో కత్తిపోట్లూ - ఈ ఊళ్లో తుపాకికాల్పులూ అని రోజూ ఏదో కబురువస్తూనేవుందిమరి, అప్పుడు లేని ఉపద్రవాలు ఇప్పుడేమివచ్చాయి" అని యథాలాపంగా అంటే విశ్వనాథంగారు—ఆయన పశువులవైద్యంలో ప్రైవేటు ప్రాక్టీసవరు—ఇల్లా చెప్పారు:

"యుద్ధమా? యుద్ధానికీన్నీ, మీరు చెప్పిన వాటికీన్నీ సంబంధం ఏముంది? ఒక్కడిమీద కాల్చినా, అనేకమందిమీద కాల్చినా తుపాకికాల్చేవాడు చంపాలని కాలుస్తాడని తోచదు. జనం గుంపులుగుంపులుగా వచ్చారనుకోండి. నాశం చేసిపోతారో అని ముందు భయం పట్టుకుంటుంది ఇవతలివాడికి. వీడియొక్క జీవితచరిత్రనీ, అనుభవాన్నీ అనుసరించి ఉంటుంది వీడి భయం. ఒక్కొక్కవ్యక్తి తన నీడను చూసే భయపడతాడు. కలిగిన భయాన్ని తగ్గించుకుంటే సరేసరి. లేకపోతే భయంవల్ల ఆవ్యక్తి చేసే పనులకు ఆవ్యక్తియొక్క జవాబుదారీ యింతమాత్రం లేదు. భయమే అన్నిపనులూ చేయిస్తుంది. తనమీదికి అవతలివాడు వస్తున్నాడో, లేదో అనే జ్ఞానం ఉండదు. తన కర్ర, కత్తి, లేక తుపాకి ఎట్లాగుపట్టుకున్నాడో తనకు తెలియదు. దానితో ఏం చేస్తున్నాడో తనకు తెలియదు. ఇల్లా ఈ వ్యక్తి పనులు చేస్తుంటే అవతలివాళ్ల స్థితి ఎల్లా ఉంటుందో ఎరుగుదురా? ఒక్క మనుష్యుడేకాక, గుంపులేఅయితే చెప్పనే అక్కరలేదు. గుంపుగా చేరకముందే వాళ్లకి ఒకవిధమైన ఆవేశం కలిగిఉంటుంది. గుంపుతో కలిసి నడిచిపోతుంటే ఆ ఆవేశం అడుగడుగుకీ హెచ్చిపోతూంటుంది. అటువంటి గుంపుకి భయం కలిగితే ఇంక చెప్పాలా? భయంచేత వాళ్లు చేసే పనులన్నీ కక్షవల్లా, కోపంవల్లా చేసినట్లు మనకు కనబడుతుంది. ఆమాటకు వస్తే కోపం రావడం అనేది భయానికి లక్షణమే. లోపల ఎంత భయం ఉంటే అంత కోపం, లోకరింపుగొంతుక పెట్టుకుని అరవడమున్నూ, చెయ్యి చేసుకోవడమూను."

విశ్వనాథంగారి ఆసుపత్రిలో ఒక పెంకుటిపాక ఉంది. దానిదగ్గరకు నన్ను తీసుకునిపోయి ఆయన, చచ్చి ఒకమూల పడిఉన్న ఒక కుక్కకళేబరాన్ని చూపించాడు. అది చాలా బీభత్సంగా ఉంది. ఒక చెవి తెగిపోయింది. రెండవ చెవి మూడు చీలికలుగా వ్రేల్లాడుతూంది. గాయాలలో, నెత్తురు చారలలో ఒళ్లంతా పేరుకుని ఉంది. నోట్లో పళ్లు మూడో, నాలుగో ఊడిపోయివాయి. పెదవులవెంట ఎరుపు నలుపుకలిసిన రంగుగల ద్రవం కారుతూంది. బుర్రమీద గాయాలలో నెత్తురు ముద్దలుగా కనబడుతూంది. ఒక కాలికి బాగా దెబ్బతగిలి బ్రతికిఉన్నప్పుడు బాగా నొప్పిపెట్టి బాధపడింది కాబోలు, చచ్చినా ఆకుక్క ఆకాలు ఎత్తిపెట్టుకునే ఉంది. మొండితోక. తుంటిమీద ఒక గాయం. నడుముమీద ఒక బలమైన దెబ్బ. ఆదెబ్బ కదుము ఎత్తుగా కనబడుతూంది; మధ్యభాగం పుండుగా కూడా ఉంది. డొక్క ఎండుకుపోయి, ఎముకలు బయటికి వచ్చేట్టుంది. దాని ఒంటినిండా, నోటినిండా, గాయాలనిండా ఈగలూ, దోమలూ, మరేవో చిన్నచిన్న రెక్కలపురుగులూ. దాని చెవులలోంచి నేలమీద ఒక కన్నంవరకూ చలిచీమలబారు. నేను చీదరించుకున్నాను. డాక్టరు విశ్వనాథంగారు మళ్లీ మొదలుపెట్టారు:

"దీని చరిత్ర వినండి. నేను చెప్పిన మాటలో గల సత్యం తెలుస్తుంది. ఇది పూర్తిగా ఉత్తమజాతి కుక్క కాదుగాని, కేవలం నాటుకుక్క కూడా కాదు. ఆ మూతి చూడండి, ఆమొండెం పొడుగూ, కాళ్ల తీరూ, చెవులూ చూస్తే ఇది జాతికుక్కకూ, నాటు కుక్కకూ బయలుదేరిన సంకరజాతి దని నిశ్చయించు కోవచ్చును. దీనికిన్ని కొన్ని ప్రత్యేకమైన మంచి గుణాలు ఉండేఉంటాయి....

భవానీపురంలో పింఛను పావల్దారు పెంటూ సాహేబును ఎరుగుదురా? ఆయన మొన్న రాత్రి చచ్చిపోయాడు. హఠాత్తుగా పోలేదు. రోగంతో తీసుకు నే పోయి నాడు. ఒక రోజురోజల్లా ఉండే ప్రాణం, ఊడే ప్రాణంగానే ఉందట. ఆ రాత్రంతా ఈకుక్క మొర పెట్టుకొని ఏడ్చిందట. పెంటూసాహేబు మీనల్లు డొకడున్నాడు. వాడి పేరు మనకు తెలియదు. మరునాడు, అంటే నిన్న, ఉద యం ఎదురింట పంచక్రింద నీడలో పడుకొనిఉన్న ఈకుక్కని చూచి వాడు "ఎద్వాకుక్కా, హీడీ ఏడ్సీఏడ్సీ సంపింది మామామాకి"అని ఒక కర్ర పుచ్చుకుని చావగొట్టాడు. కొట్టింది చాలక, రోడ్డు మీద రెండు ఫర్లాంగులదాకా వెంటతరిమి మరీకొట్టాడు. కెవ్వు కెవ్వుమని అరుస్తూ ఇది పరుగెత్తింది. బహుశః అప్పుడు తగిలినవే ఆ నెత్తిమీద దెబ్బలూ, నడుమ్మీద పీని. కాలు కుంటిపోయిందికూడా అప్పుడే అయి ఉంటుంది. నెత్తురు కారుతూ, ఏడుస్తూ, మూడు కాళ్ల మీదనే నడుస్తూ ఇది ఓపికఉన్నంతసేపూ పరు గెత్తి, పొగాకుకంపెనీ గేటుదగ్గర ఉన్న చెట్టునీడని పడుకుందిట. దానిమానాన్ని అది పడుకుని, దెబ్బతిన్న కాలు నాకుకుంటూఉంటే గేటుజవానుతో మాట్లాడ డానికి వచ్చిన డేవిడ్ అనే మాలపిల్లవాడొకడు చూ చాడు దీన్ని. చూచి "జాకీ, జాకీ"అని పిల్చాడట. ఇది మొరిగింది. దీని వాలకమూ, అమొరగడమూ చూచి వాడు "పిచ్చికుక్క"అని కేకలువేసి, రాళ్లు రువ్వాడు. రాళ్లు తగలనానే కుక్క లేచి మళ్లీ పరు గెత్తింది. ఇది యింటివైపు పోదామని తిరిగితే అటు వైపునుంచి కొందరు పొగాకుపనివాళ్లు వస్తూ దీనిని బెదరించారు. దానితో ఇది బెజవాడవైపు దారి పట్టింది. మూడుకాళ్లమీద కుంటుకుంటూ ఇది ఒక ఫర్లాంగు నడిచిందో లేదో మళ్లీ దీని కర్మం మూడింది. యజమాని ఎన్నడూ బాగుచేయించని మోటారు బస్సు ఒకటి నడవనని భీష్మించగా దాన్ని నడిపించాలని ప్రయత్నాలుచేస్తూ దాని డ్రైవరూ, క్లీనరూ తంటాలు పడుతూ, ప్రయాణీకులనందరినీ దింపివేశారు. వాళ్లల్లో ఒక వితంతువు ఉంది. ఆవిడకుమారు డొక కుర్ర వాడు ఈకుక్కనిచూచి ఒక బెత్త పుచ్చుకుని, బెద రించాడు. కుక్క కేం వచ్చిందో, మిగిలిన శక్తితోటి ఆ కుర్రవాణ్ణి కరవబోయినట్టుగా నోరుతెరిచిందట. వితంతువు 'కుయ్యో మొర్రో'అని కేకలువేస్తూంటే, క్లీనరు తన చేతిలో ఉన్న ఇనపఊచతో కుక్కని ఒక్కదెబ్బ ఆ మొరిగే నోటిమీద కొట్టాడట. ఆ దెబ్బతోనే కాబోలు దీని పళ్లు ఊడిపోయింది. ఇది రోడ్డువిడిచిపెట్టి దక్షిణంగా పారిపోయి, కృష్ణగట్టు దాకా పోయింది. అక్కడ ఒక చెట్టునీడని పడు కుంది. భవానీపురంవాడొకడు గొల్లవాడు దారినే పోతూ, దీనిని గుర్తించి ముద్దుచేయబోయినాడు. ఇది భయపడింది. వాడు "పిచ్చెత్తిందా యేం"అను కుంటూ ముందుగా సాగిపోయినాడుగాని, వాని పిన తల్లి కొడుకు, వెనకాలే నడిచివస్తున్నవాడు, పిచ్చి కుక్కని బ్రతకనీయకూడదంటూ దీన్ని డొక్కలో ఒక్కతన్ను తన్నాడు. ఆ తన్నుతో ఇది లేచి గట్టెక్కి బెజవాడవైపు కుంటుకుంటూ వచ్చిందట. వాటరు వర్క్సులో ఒక డ్రైవరు తిండి తింటూ దీన్ని చూచి, రెండు ముద్దలు వేస్తే, తోకఆడించి, తినబోయి, మూచూచి, తినలేక ఏడ్చి అక్కడే మూతిప్రక్కని నీళ్లు కతికి పడుకునిఉందట యిది. కాసేపటికి ఎవరో అధికారి వచ్చి, "ఛీ, వెధవకుక్క, ఇది పిచ్చికుక్క లాగ ఉంది. ఒరేయి, దీన్ని కొట్టరా" అని నౌకరుకు అజ్ఞ ఇస్తే వాడు దీన్ని రాళ్లతో కొట్టాడు. ఇది లేచి రోడ్డుమీదికి వచ్చింది. అక్కడ ఉన్న ఊరకుక్కలు దీనిమీద కలియబడ్డాయి. దీనికి తిండి లేదు. ఒక కాలు లేదు. నోట్లో పళ్లు కొన్ని లేవు. ఎవరైనా చూచి ఆమిగిలినకుక్కల్ని అవతలికి తోలాడో

యేమో, బెజవాడ ఊళ్లో దరిదాపుకు వచ్చింది. డి.పి. డబ్ల్యు. వర్కుషాపుకు దగ్గరగా పనివాళ్ల ముఠా ఒకటి పనిచేస్తూంది. ఆ ముఠాలో ఒకడు దాచుకున్న కూటి మూటప్రక్కగా ఇది ఆగిపోవడం చూచి వాడు తనకూడెత్తుకుపోవడానికే వచ్చిందనుకుని, రాయి పుచ్చుకొని బలమైన దెబ్బ కొట్టాడు. కొట్టినందుకు వాడి భార్య వానిని కోపంచేసిందిట. అది పిచ్చికుక్క గనుక నేను కొట్టానని చెబుతూ వాడు సమర్థించుకున్నాడట. ఇది తిరుగుమొహం పెట్టి మళ్లీ భవానీపురంవైపు పరుగెత్తుతూంటే ఊరకుక్కలు మళ్లీ వచ్చిపడ్డాయి. ఇది యిటువైపు తిరిగి బెజవాడవైపే వచ్చేసింది. భార్య కోపంచేసిందని కాబోలు పనివాడు కుక్కని ఈ మారు నిరపాయంగా దాటిపోనిచ్చాడు. రోడ్డుమలుపు దాటి కాస్త నీడలో పడుకుందిట ఇది మళ్లీని. నీరసంగా ఉంది ఇది. అందుచేత ఒక పందులవాడు వచ్చి మెడకు త్రాడువేసి కట్టినా మొరగడం తప్ప యేమీ చెయ్యలేదు. దీని మొరుగులు వాడికి లక్ష్యమా? "ఎందుకా కుక్కని కడుతున్నావు? అది పిచ్చిదిలాగుంది. కరుస్తే మోసం" అని ఎవరో చెబితే తెగత్రాగి ఉండడంచేత ఆ పందులవాడు వినక, "ఇది పిచ్చిదిగాదు, బాబయ్యో, ఇది దొంగకుక్క బాబయ్యో, ఇది నా పందిపిల్లని పొట్టనెట్టుకుంది బాబయ్యో" అని యేడుస్తూ, రాగాలు తీస్తూ, తనవెంట తన గూడానికి తీసుకుపోయినాడు. తూలుతూ తూలుతూ, సంగీతం పాడుతూ వాడు; మూడుకాళ్లమీద కుంటుతూ ఇది. ప్రయాణంచేసి బందరుకాలువకు అవతలివైపున ఉన్న పందులవాళ్ల గుడిసెలలోకి పోయినారు. అక్కడ ఒక రాటకు కట్టేశాడు దీన్ని వాడు. అక్కడ అదివరకే ఉన్న కుక్కలు దీన్ని కరిచి గాయాలుచేశాయి... బెజవాడనుంచి కృష్ణసింగనే రొట్టెలవర్తకుడొకడు రోజూ గుంటుపల్లిదాకా సైకిలుమీద వెళ్లి రొట్టెలు వాడుకలకు ఇచ్చివస్తూఉంటాడు. అతడు దీనికి రోజూ ఊరికే ఒక రొట్టె ఇవ్వడం మామూలుట. నిన్న సాయంకాలం ఇది కనపడకపోగా అతడు వారినీ వీరినీ అడుగుతూ వచ్చి పందులగూడెంలో ఉన్న దీనిని విడిపించి నా దగ్గరకు తీసుకునివచ్చాడు. ఏవేవో మందులు వేశాను. లాభం లేకపోయింది. కృష్ణసింగుకు ఎంత కోపం వచ్చిందని? "చాలా మంచి కుక్కండీ సార్, చాలా సాధువు. అది పిచ్చికుక్క అనీ, కరుస్తుందనీ, అది కరిస్తే చస్తామనీ, నిష్కారణభయంపడి ఊరికే కొట్టారు సార్. చచ్చిపోయింది. నాకు ఋణం తీరిపోయింది." అని కళ్లనీళ్లు పెట్టుకుని కృష్ణసింగు వెళ్లిపోయినాడు. అతనే ఈ దర్యాప్తంతా చేసి నాకు చెప్పాడు. నేను మీకు చెప్పాను."



అరువత్తుమూవురు

= శ్రీ డా. చిలుకూరి నారాయణరావు =

దాక్షిణాత్యశైవసంప్రదాయములో సిద్ధాంత మెట్లా ఉన్నా, సాధారణజనులలో వ్యాపించినది భక్తిసంప్రదాయము. శైవ మతాదిగా భారతవర్షములో నెలకొన్నది. అది అనేకరూపములను పొంది, ఒక్కొక్క ప్రాంతములో ఒక్కొక్కవిధముగా వ్యాపించింది. అట్టి శైవసంప్రదాయాలలో దాక్షిణాత్య సంప్రదాయము ప్రత్యేకవిశిష్టతను పొందినది.

క్రీ. శ. ౪,౫ శతాబ్దములవరకున్ను దేశములో బౌద్ధ, జైనమతములు సుస్థిరములైనవి. వాటిమూలమున వైదికమతమునకు గొప్ప దెబ్బ తగిలినది. జైనబౌద్ధములకు పూర్వము తమిళ దేశములో నుండిన మతము లెట్టివో తెలియదుగాని, ఉత్తరమునుంచి బ్రాహ్మణులు వలసవచ్చిననాటినుంచిన్ని వాటిని వైదికమతముతో సంబంధించినవాటినిగా మార్చడానికి ప్రయత్నించి ఉంటారు. ఈ ఔత్తరాహవైదికమతమునకున్ను, దాక్షిణాత్యమతములకున్ను కలిగిన సమ్మేళనమువలన క్రొత్త సంప్రదాయము లీ ప్రాంతములలో ఏర్పడినవి. ఇవియే తమిళశైవసంప్రదాయము, తమిళవైష్ణవసంప్రదాయము అనేవి. తమిళశైవసంప్రదాయము నాయనార్ల మూలమునను, తమిళవైష్ణవసంప్రదాయము ఆళ్వారుల మూలమునను వ్యాప్తిపొంద నారంభించినవి. ఇప్పుడు మనకు ఆళ్వారులతో సంబంధము లేదు. నాయనార్లనుగురించి మాత్రమే ఈవ్యాసములో ముచ్చటిస్తాను. ఆళ్వారులను గురించి వేరే ఎప్పుడైనా వ్రాస్తాను.

బౌద్ధ, జైనమతములు స్థిరపడడానికి తోడ్పడిన ముఖ్యవిధానము "ఆహార - అభయ - భైషజ్య-శాస్త్ర దానము." వీటిలో ఆహార-అభయ-భైషజ్యములు జనులకు నిత్యమున్ను కావలసినవే. మిషనరీ లందరూ ఏ మతమువారైనా ఈమూడింటిని వినియోగించే తమ మతమును వ్యాప్తిలోనికి తెచ్చుకొనేది. ఆపద్ధతినే అవలంబించకపోతే శైవముకూడా వ్యాప్తిలోనికి వచ్చి బౌద్ధజైనమతప్రచారము నిలుపదని ఆకాలములో తోచినది. దానికి తోడు కేవలశాస్త్రముగాక భక్త్యావేశము కూడా పుట్టిస్తేగాని మొదటి మూడున్న నిష్ప్రయోజనము లౌతవని తోచినది. ఈపద్ధతుల నన్నిటిని ఆనాటి శైవమతావేశపరు లాచరణలోనికి తెచ్చినారు. అందులో భక్తివ్యాప్తికి భక్తచరిత్రములు చాలా ఉపయోగపడినవి. ఆశైవభక్తులకే 'నాయనార్లు' అని పేరు.

'నాయనారు' అంటే పూజ్యుడు అని అర్థము. శివభక్తులెవరైనా పూజ్యులే. అయినా, వారిలో ఎక్కువ ప్రసిద్ధిపొందినవారి పేళ్లు జనశ్రుతిలో స్థిరముగా నిలిచినవి. అసంఖ్యాతమాహేశ్వరులలో అరవైముగ్గుర పేళ్లుమాత్రము రానురాను జనుల వాడుకలోను, శైవ ప్రచారములోను నిలిచినవి. వీరినే "అరువత్తుమూవురు" అని అంటారు.

నాయనార్ల సంఖ్య అరవైమూడుగా ఏర్పడడానికి కారణము లేకపోలేదు. జైనబౌద్ధమత ప్రచారము నరికట్టడానికి పూనుకొనిన శైవమత ప్రచారకులు జనులలో స్థిరపడిఉన్న కొన్ని సంప్రదాయములను గమనించి నామసాదృశ్యమువల్లను, అర్థసాదృశ్యము వల్లను, కథాసాదృశ్యమువల్లను జనులకు సుపరిచితమైన దానికిన్ని, క్రొత్తదానికిన్ని స్థూలముగానైనా సామరస్యములు కల్పించవలసి ఉంటుంది. ఏక్రొత్తమతమైనా అవలంబించే పద్ధతి అదే. అందుచేత ఈ శైవ సంప్రదాయమువారు తత్పూర్వపు జైనబౌద్ధములలోని కొన్ని పోలికలను నూతన మతనిర్మాణములోనికి దిగుమతిచేసి జనులకు నమ్మకము పుట్టించిఉంటారు. అట్లు చేయడములో చిన్నచిన్న మార్పులు చేస్తే నమ్మకము

నకు ఎక్కువ ఆఘాతము కలుగదు. ఒకప్పుడున్న పేరునట్లే ఉంచి తత్సంబంధమైన కథను వేరేగా చెప్ప వచ్చునుకూడాను.

జైనసంప్రదాయములో త్రిషష్టిశలాకా పురుషు లున్నారు. ఈ త్రిషష్టి వలెనే శైవులు కూడా అట్లే ఉపయోగించుకొన్నారు. త్రిషష్టి శలాకాపురుషులలో ౨౪ గురు తీర్థంకరులు, ౧౨ గురు చక్రవర్తులు, ౯ గురు బలదేవులు, ౯ గురు వాసుదేవులు, ౯ గురు ప్రతివాసుదేవులు చేరినారు. మొత్తము అరవై ముగ్గురు. ఈ సంఖ్యను తప్పిస్తే కార్యము లేదు. కాబట్టి తమిళ నాయనార్లుకూడా అరవైముగ్గురు (అరువత్తుమూవురు) గా ఏర్పడినారు. వీరిలోని ౨౪ గురు తీర్థంకరులలోని మొదటివాడు ఋషభుడు. ఇతడు వీర శైవములో బసవడైనాడు. మూడోవాడు శంభవుడు. ఇతడు నాయనార్లలో శంభుచిత్తుడైనాడు. నాలుగోవాడు అభినందనుడు. ఇతడే అభిరాము డనే నాయనారయినాడు. ఇతడే నందుడుగకూడా మారి ఉంటాడు. ఏడో తీర్థంకరుడైన సుపార్శ్వునకున్న, ఇరవైమూడోవాడయిన పార్శ్వునికిన్ని మారుగా పూసలనాయనా రేర్పడినాడు. ఇతడు తొమ్మిదో తీర్థంకరుడైన పుష్పదంతునికికూడా శైవప్రతినిధి కావచ్చును. చంద్రప్రభు డనే ఎనిమిదో తీర్థంకరుడే చండేశనాయనారై ఉంటాడు. పదిహేనో తీర్థంకరుడు ధర్ముడు. ఇతడు నాయనార్లలో ధర్మభక్తుడైనాడు. పదిహేడో తీర్థంకరుడైన కుంథు అనేవాడు కుత్తువనాయనారుగా అరువత్తుమూవురులో చేరినాడు. పద్ధెనిమిదో తీర్థంకరుడైన 'అర' అనేవానికిన్ని, అరివాళు అనే నాయనారుకున్న నామసామ్యము పోల్చుకోవచ్చును. ఇరవైయో తీర్థంకరుడైన మునిసువ్రతునికిన్ని మొన్నయనార, వీరసింగమొనయార్ అనే నాయనార్లకున్న గల మేనమామ మేనత్తపోలికలను స్మరింపవచ్చును. ౨౧, ౨౨ తీర్థంకరులు నిమి, నేమి అనేవారు. వీరికిన్ని, నమినంది (నవనంది), నమిత్తాండి అనే నాయనార్లకున్న సంబంధము స్పష్టమే. ఋషభుడే ప్రథమతీర్థంకరుడు. వీరశైవము తలచూపినదాకా బసవడు కాలేదు. బసవేశ్వరునికి పూర్వసంప్రదాయములో ఆతడు ఋషభునికి నామాంతరమైన ఆదినాథునికి దగ్గర ఉచ్చారణ గల అతిభక్తుడు అనే పేరుతో నిలిచినాడు. ఈ అతిభక్తుడే అదిభక్త, అతిపత్తార్ అనే నామాంతరములలో కనబడుతున్నాడు. ఇటీవల గోమటుడు గోనాథుడుగా మారినట్లు తెలుస్తున్నది. ఇదిగాక నాయనార్లలో కొందరికి జైనమతముతోడి సంబంధము శైవసంప్రదాయములోకూడా విస్మృతము కాలేదు. వాగీశనాయనా రనే నామాంతరము గల అప్పరుకు ధర్మసేను డనే పేరుకూడ ఉన్నది. అప్పరు అనేక జైనగ్రంథములనుకూడా వ్రాసినాడు. జైనమతమునకున్న, శైవమునకున్న గల ఇట్టి పోలికల నింకా విస్తరించి వ్రాయవచ్చును. ఇట్లే బౌద్ధముతోడి పోలికలుకూడా ఈ శైవములో కనబడుతున్నవి. శాక్యనాథు డనే నాయనారు స్వయముగా శాక్యనాథుడైన బుద్ధభగవానుని ప్రతిబింబమే. అట్టి పోలికను మరుగుపెట్టడానికే పేరును సాంఖ్యతొండడుగా మార్చుకొన్నా సాంఖ్యతొండడే శాక్యనాథు డనే స్మృతి శైవసంప్రదాయమునుంచి తొలగిపోలేదు.

జైన బౌద్ధమతములతోనే కాక, ఆనాటి తమిళ శైవప్రచారమునకు ఆళ్వారులమూలముగా ఆదేప్రాంతములో తలచూపి భక్తిసంప్రదాయమునే అనుసరించి వ్యాప్తిలోనికి వస్తూఉన్న తమిళ వైష్ణవముతోకూడా సంఘర్షణము కలిగినట్టి సూచనలున్న కనబడుతున్నవి. పన్నిద్దరాళ్వారులు వైష్ణవములో ధర్మాచార్యులుగా ఏర్పడితే, వారిని తలదన్ని శైవములో నూట పన్నిద్దరు ధర్మాచార్యు లేర్పడినారు. ప్రచారపద్ధతిలో శైవులకున్న, వైష్ణవులకున్న ఎట్టి భేదమున్న లేదు. జైనబౌద్ధులకున్న, శైవులకున్న ఎట్టి బద్ధవైర మేర్పడినదో తరువాతి కాలములో శైవులకున్న, వైష్ణవులకున్నకూడా అట్టి పరమశత్రుత్వ మేర్పడినది. అయినా తొలుదొల్త ఈ రెండు సంప్రదాయముల వారున్న జైనబౌద్ధములపై సమానముగానే కత్తికట్టి అంతటి పోట్లాట పెట్టుకొనినట్టు కనబడుతుంది. తిరుజ్ఞానసంబందరు తిరుమంగై ఆళ్వారును మధురలోని విష్ణ్వాలయమున కాహ్వానించినట్టు ఒక ఐతిహ్య మున్నది.

నాయనార్లందరిలో మనకు చరిత్రలో కనబడతారు. కాని వీరందరున్ను అరువత్తుమూవురలో చేరలేదు. అరవైమూడు అనే లెక్కను సరిపెట్టడానికనేకు లనేకవిధములుగా ప్రయత్నించినారు. అరువత్తుమూవు రనే సంప్రదాయము మొదట తమిళ దేశములో పుట్టినది. తమిళము పేళ్లకు సంస్కృత నామములు కల్పించి సంస్కృత గ్రంథములలో చేర్చినారు. ఈ సంప్రదాయము తమిళ దేశమునుంచి కర్నాటకములోనికిన్ని, ఆతరువాత తెనుగు దేశములోనికిన్ని వ్యాపించినది. ఈ వ్యాప్తిలో ఆయా తమిళపుపేళ్లు అనేక వికారములకు లోనై వివిధరూపములను పొందినవి. ఈ పేళ్ల పట్టికలన్నిటిలోను సంపూర్ణముగా ౬౩ పేళ్లు లేవు. ఒక్కొక్కదానిలో కొన్ని ఎక్కువో తక్కువో ఉంటవి. ఆయా పేళ్లు గల వ్యక్తుల చరిత్రములలోను భిన్నత్వము కనబడుతూఉంటుంది. అందుచేత అరువత్తుమూవు రంటే ఎవరో సరిగా నిర్ణయించడానికి చాలా పరిశోధన కావలసిఉంటుంది. ఈ క్రింద అట్టి నిర్ణయముచేయడానికి ప్రయత్నిస్తాను. అట్టి నిర్ణయము చేయడాని కుపకరించే గ్రంథములివి.

తమిళము:— పెరియపురాణము: సేక్కిలారు విరచితము; ౧౨-వ శతాబ్దములోనిది.

సంస్కృతము:— ౧. స్కాందోపపురాణము, ౨. శివరహస్యము, ౩. శివభక్త మాహాత్మ్యము, ౪. హాలాస్య మాహాత్మ్యము, ౫. భువనకోశము.

కన్నడము:— ౧. అరువత్తు మూవర పురాతన చరిత్రె (వచనము), ౨. త్రిషష్టి పురాతనచరిత్రె, (కర్నాటకకవిచక్రవర్తి విరచితము, చంపూకావ్యము) ౩. అరువత్తుమూవర పురాతనశరణ చరిత్రె (విరూపాక్ష కవి విరచితము, పద్యకావ్యము), ౪. త్రిషష్టి పురాతనవిధి, (వచనము,) ౫. బసవ పురాణము.

తెనుగు:— ౧. హాలాస్య మాహాత్మ్యము, ౨. బసవపురాణము, ౩. పండితారాధ్యచరిత్రము.

పై గ్రంథములేకాక శాసనములున్ను ఈనిర్ణయమునకు తోడ్పడినవి.

మైసూరుఇలాకా నంజంగూడు గ్రామములోని నంజుండేశ్వరాలయములో ఈ అరువత్తుమూవుర విగ్రహములు నిలుపబడిఉన్నవి. ఇవి శిలావిగ్రహములుగాను, వాటికి ఉత్సవవిగ్రహములైన లోహవిగ్రహములుగాను రెండువిధములుగా ఉన్నవి. శిలావిగ్రహములపై మైనముపట్టి వాటి అందము మరుగుపడినది. ఈ మధ్య మైసూరుపురాతత్త్వశాఖవారు వాటిని చక్కచేసి ఛాయాచిత్రములను ప్రకటించినారు. వాటిలో కొన్నిటిని ఈవ్యాసముతో ప్రకటిస్తున్నాను. లోహవిగ్రహములు కూడా బాగానే ఉన్నవిగాని ఈ శిలావిగ్రహముల శిల్పచాతుర్యము వాటిలో కనబడదు. ఈవిగ్రహము లేకాలము వాటివో నిర్ణయించలేము. కాని వాటిని చెక్కి మూడు, నాలుగుశతాబ్దములయినా అయిఉంటుం దను కొంటున్నాను. ఈవిగ్రహముల అడుగుభాగమున ఆయా నాయనారు పేరుకూడా ఉండడముచేత పరిశోధకునికి కొంత సులభమయినది. కాని, ఈ విగ్రహము లక్కడ ౬౬ ఉన్నవి. వాటిలో ఒకదానికి పేరు చెక్కలేదు. అందుచేత అది ఏనాయనారుదో చెప్పలేము. ఈ అరవై ఆరింటిలో ఏమూటిని నాయనార్ల విగ్రహములు కావని పరిహరించవలెనో, నిర్ణయించడము కష్టము.

హాలాస్యమాహాత్మ్యములో అరవై మువ్వుర నాయనార్ల చరిత్ర మున్నదిగాని, ఈ నాయనార్లు మధుర నేలిన రాజులనిన్ని, వారి చరిత్రములు శివుని ౬౩ లీలలనిన్ని చెప్పబడిఉన్నది. కాని, నాయనార్లందరున్ను రాజులుగా తక్కిన గ్రంథములలో చెప్పబడలేదు. వారిలో కొందరు బ్రాహ్మణులు, కొందరు రాజులు, కొందరు వైశ్యులు, కొందరు శూద్రులు, కొందరు పంచములు, కొందరు స్త్రీలుకూడా కనబడుతున్నారు. కాబట్టి హాలాస్యమాహాత్మ్యము నీవిషయములో నెంతవరకు ప్రమాణముగా స్వీకరింపవచ్చునో నిర్ణయించలేము. కన్నడగ్రంథములలోని పట్టిక లసంపూర్ణములుగా ఉన్నవి. ఒకదాని కొకటి సంఖ్యలోను, కథలలోనుకూడా పొందదు. ఇక పాల్కురికి సోమనాథుని పండితారాధ్యచరిత్రములో అతడు అరువత్తుమూవురని సంఖ్యను చెప్పి ౫౩ గురు పేళ్లను మాత్రమే ఇచ్చినాడు. ఈపట్టికకు చేర్చవలసిన తక్కినపదిమందిన్ని ఎవరో తెల్పుకోవలసిఉన్నది.

పైని తెలిపిన అన్ని విషయములనున్ను గుర్తించి అరువత్తుమూవురనుగురించిన వృత్తాంతము నీక్రింద సంగ్రహముగా పొందుపరుస్తాను. ఆయా నాయనార్ల కాలనిర్ణయాదికమును తరువాత చేయ ప్రయత్నిస్తాను. సాధ్యమయినంతమట్టుకు పాల్కురికిసోమనాథుని పట్టికలోని పేర్లను అకారాదిగా ఉదాహరించి, ఒక్కొక్క పేరుక్రింద ఇతరాధారములవల్ల తెలియవచ్చేవిషయములను చేర్చుతాను.

౧. అదిభక్త



ఇతనికి తమిళములో అతిపత్తర్ అనిన్ని, సంస్కృతములో అతిభక్త అనిన్ని పేళ్లున్నవి. పండితారాధ్యచరిత్రములో ఇతని పేరుమాత్ర మున్నదిగాని అతనినిగూర్చిన ఇతర వృత్తాంత మేమిన్ని లేదు. ఇతడు జెస్తవాడనిన్ని, తనకు ప్రతిదినమున్ను దొరకిన మొదటి చేపను శివుని కర్పించేవ్రతము కలవాడనిన్ని, తనకొకనాడు బంగారుచేప దొరకగా సంకోచింపక శివునకు సమర్పించినాడనిన్ని, దానికి మెచ్చి శివు డతనికి కైలాసవాస మిచ్చినాడనిన్ని తమిళ గ్రంథములు చెప్పుతున్నవి.

౨. అమరనీతి

ఇతనియింటి కొకనాడొక వృద్ధశైవభక్తుడువచ్చి తనరెండుగోచీగుడ్డలను దాచనిచ్చినాడు. అందులో ఒకటి పోయినది. దానికిబదులుగా మరొక్కటి ఇస్తానంటే అది తనదానికంటె బరువు తక్కువదని హఠము పట్టినాడు. అందుచేత రెండోగోచీ అంతబరువు సరిగా ఉండడానికి దానిని త్రాసులో నొకప్రక్కనుంచి రెండోప్రక్క క్రొత్తగోచీ నుంచి తూచినారు. తుదకు



అమరనీతిన్ని, అతని పెండ్లామున్ను కూడా తక్కెడలో కూర్చుంటేగాని అది సరితూగినదికాదు. ఇట్లు వారిద్దరున్ను ఆముసలివానికి దాసభక్తులై పనిచేయవలసినవారైనారు. ఈకథ పెరియపురాణములో నిది. సోమనాథుడు అమరనీతిపేరును అరువత్తుమూవురిలో చేర్చినాడు గాని కథను చెప్పలేదు.

౩. అరివాళు

ఇతనికి తమిళములో అరివాళ్ తొండనాయనారనిన్ని, సంస్కృతములో సంకులాదాయుడనిన్ని పేర్లు. ఈసంస్కృతపుపేరెట్లావచ్చినదో తెలియదు. పండితారాధ్య చరిత్రములో ఇతనికథ సంపూర్ణముగా లేదు గాని—



"జగతిలో నరివాళ
కాల్యన్న మింపు
సిసురొత్తనారగించిన
చందమునను"

అని సూచితమైనది. ఇతడుశూద్రుడు. శివుని యారగింపుకోసము ఇతని భార్య అన్నమును తలపై పెట్టుకొనిపోవుచుండగా దారిలో పెద్దవర్షమువచ్చి, ఆమె బురదలో కాలుజారి పడడముచేత అన్నమంతా

బురదలో కలిసిపోయినది. ఈవిషయ మరివాళునకు తెలిసి తనతలనే కోసుకొని శివునకు సమర్పింప నుద్యుక్తుడై నాడు. శివుడు ప్రత్యక్షమై అతనిభక్తికి మెచ్చి కైలాస వాసమును అనుగ్రహించినాడుఅని పెరియపురాణపుకథ. తెనుగుబసవపురాణములోనికథ ఇట్లున్నది: అరివాళుడు త్రికాలములలోను శివునికి రాజనపుబియ్యపుటన్నము నారగింప బెట్టుతూఉండేవాడు. ఇంటిలో బియ్య మయిపోయినవి. అప్పటినుంచీ కొడవలిపట్టుకొని కూలికిపోయి రాజనములను సంపాదించి తనవ్రతమును సాగిస్తూఉండేవాడు. కొన్నాళ్ల కాకూలికూడా దొరక లేదు. అందుచేత అయిదుదినము లుపవాస మున్నాడు. మరుచటి దినమెట్లో రెండుకుంచములరాజనములు కూలి దొరకినవి. వాటిని సంభ్రమముతో ఇంటికి తెస్తూ ఉండగా కాలుజారి అవి క్రింద నెరియలలోపడి తిరిగీ ఎత్తడానికి వీలులేకుండాపోయినవి. అప్పు డతడు కొడవలితో గొంతుక కోసుకొనడాని కుద్యుక్తుడు కాగా, శివుడు ప్రత్యక్షమై అతనిని వారించి కైలాస వాసమును ప్రసాదించినాడు.

౪. అళియదంగుళినాయనారు

ఇతనికే మహాధనుడనికూడా పేరున్నది. తెనుగు బసవపురాణ, పండితారాధ్యచరిత్ర ములలోను, సంస్కృతబసవపురాణములోను ఈపేరిట్లే ఉన్నది. తమిళములో ఈ పేరు ఇళైయాండ కుడిమారనాయనార్ అనిన్ని, సంస్కృతములో ఇలా నందకుడిమారనాయనారనికూడా ఉన్నది. ఇత డొక శూద్రుడు. ఒకనా డొక వృద్ధశైవభక్తుడు అర్ధరాత్రివేళ వర్షములో వడవడ వడకుతూ ఆకలితో ఇంటికి రాగా, అతని నాదరించి, ఆ ఉదయమే పొలములో తాను చల్లిన వడ్లనేరితెచ్చి, దంచి, అన్నమువండిపెట్టి ఆకలి తీర్చినాడట. ఆ శైవభక్తు డన్నముతిని, ఆతడుండిన పాకను కాల్చి తెల్లవారేసరికి అదృశ్యుడైనాడట. పాకను కాల్చినవిషయము పెరియపురాణములో లేదు. ఈ నాయనారివిగ్రహము సంజుండేశ్వరాలయములో లేదు.

ఈ అళియదంగుళినాయనారున్నూ, ఇదంగళి నాయనారున్నూ కూడా ఒక్కరే అయిఉంటారా? ఇదంగళినాయనారిపేరు పెరియపురాణములో ఉన్నది. సంస్కృతములో ఇతనికి ఇదంక్రృషి అనిపేరు. ఇత డొక చోళరాజు. ఇతడు తనధాన్యపుకొట్లలోని ధాన్యము నొకదొంగ ఎత్తుకొనిపోగా వానిని రాజు ఎదుటికి తెచ్చినారు. రాజతనిని దండించక తనధాన్యపు కొట్లను, భండారమును శైవభక్తులు యథేచ్ఛగా విని యోగించుకోవలసినదని చెప్పి దొంగతనమే అనావశ్యక మయ్యేటట్టు చేసినాడు.

౫. ఇరువదాండారి

ఇతనికి సాహసప్రియుడనికూడా పేరున్నది. ఇతని సాహసమునుబట్టి ఈ సాహసప్రియుడనే పేరు వచ్చిఉం టుంది. ఇతని కిరువత్తునని కూడా ఇంకొక పేరున్నది. ఇరువోతుఅనే భక్తుడుకూడా ఇతడేనేమో! తమిళములో ఇత నికి ఇరిపత్తునాయనార్, ఇరిభక్తఅనిన్ని, సంస్కృత ములో పీరభక్త అనిన్ని పేళ్లు. పండితారాధ్యచరిత్ర ములో ఇతనిపేరుమాత్ర మున్నది. తెనుగు బసవపురా ణములోని యితనికథ యిది: ఇతడు శివద్రోహరగండ బిరుదాంకితుడు. శివద్రోహపాతకులను కారణము లేకుం డానే చంపుతాననే వ్రతము గలవాడు. ఒకనా డొక భక్తుడు శివపూజార్థమై పూవులను తీసుకొనిపోతూ ఉండగా ఆ ఊరిరాజయిన కరయూరిచోడనిఏనుగ అతని కెదురై, తొండముతో పైకెత్తి, క్రిందికివడ వైచి దంతములతో పొడిచినది. అతని ఆర్పును ఇరువ దాండారి విని వచ్చి ఏనుగును, దానిమావటిని చంపినాడు. రా జీవార్త వినివచ్చి భృత్యాపరాధమునకు స్వామియే దండనకర్త యని తానే ఆత్మవధ కుద్యుక్తుడుకాగా శివుడు ప్రత్యక్షమై రాజునకును, ఇరువదాండారికిని కైలాసప్రాప్తి కలుగజేసినాడు. తమిళపెరియపురాణము లోని కథలో రాజుపేరు పొగళ్ చోళుడని ఉన్నది. పొగళ్చోళునికి మనుచోళుడు, అనపాయచోళుడు అనేవి నామాంతరము లయినట్లు తమిళగ్రంథములవల్ల తెలియవస్తున్నది. మనుచోళ, పొగళ్ చోళు లెవరో శాసనములనుబట్టి నిర్ణయించలేము. కరయూరిచోళునికే ఈ పేళ్లు వర్తిస్తవేమో. కాని, త్రిభువనచక్రవర్తి కులోత్తుంగచోళదేవుడనే రాజకేసరివర్మ తంజావూరు జిల్లా, నాగపట్టణముతాలూకా, తిరువారూరుగ్రామ



ములో వేయించిన శాసనములో అతనిపేరు అనపాయుడని చెప్పబడినది. (ద. ఇం. ఎపి. రిపోర్టు ౧౯౦౧ సం. ౨౮౬ పుట.) ఈతడు రెండోకులోత్తుంగచోళుడు కాబట్టి, పెరియపురాణము వ్రాసిన సేక్కిలారునికి తరువాతివాడై పన్నెండోశతాబ్దము వాడై ఉండవలెను. ఒకవేళ పాల్కురికి సోమనాధునికి సమకాలికుడుకూడా అయి ఉంటాడేమో అని నా అభిప్రాయము. అనపాయుని కాలములో జరిగిన కథ అతనికాలమునకు చాలా ప్రాతబడిఉంటేనేకాని పెరియపురాణములోనికెక్కదుగదా. అయితే పెరియపురాణము తమిళములో ఉండడముచేత దానిలోని విషయములు పాల్కురికిసోమనాధునికి తెలిసిఉండవు. పెరియపురాణకథలో ఏనుగ శివకాముడనే భక్తుని చేతిలోని పూలదండను త్రెంచి కాలితో త్రొక్కినదని ఉన్నది.

౬. ఎళ్ళపు (అభూతచరుడు)

ఇతడెన్నడూ, ఎవ్వరూ చేయదలచుకోని కార్యములను చేసేవాడు కావడముచేత అభూతచరుడని పేరు వచ్చిఉంటుంది.



ఈ పేరికి (ఎళ్ళపు) పాఠాంతరముగా 'విల్వ' అనేదానిని వేటూరి ప్రభాకరశాస్త్రిలుగారు తెనుగు బసవపురాణపీఠికలో ఇచ్చినారు. ఈపేరుకు దగ్గరగా ఉన్న నాయనారి పేరు తమిళములో ఇహప్పగైయాండన మినార్ అనేది ఉన్నది. ఇతనికథ బసవపురాణపండితారాధ్య చరిత్రములలో లేదు. సంస్కృతములో ఇతనికి ఐహికరిపు, స్వభావరిపు అనేపేళ్లున్నవి. ఇతడొక రాజని కొన్ని గ్రంథములలోను, వైశ్యుడని కొన్నిటిలోను ఉన్నది. ఒకశైవభక్తునికి మనసుకాగా ఇతడు తనభార్యనే అతని కొప్పజెప్ప జెనదీయలేదనిన్ని, తనబంధువులు వారింపగా వారిలోచాలామందిని చంపినాడనిన్ని పెరియపురాణకథలో ఉన్నది.

ఇతని విగ్రహము నంజుండేశ్వరాలయములో లేదు.

౭. ఏనాధినాధుడు

అలుగుబూపులదండలయ్యె యొప్పెవనిన్ని, దీనులకు గృహదానము భూమిదానము అభిమతదానము లిచ్చేభక్తులలో ఇతడొకడనిన్ని పండితారాధ్య చరిత్రములో తెలుపబడినది. బసవపురాణములోని యితని కథ ఈరీతిగాఉన్నది: ఇతడేలాపురమునకు రాజు. దేశములు జయిస్తూ కప్పములను తీసుకొంటూ ఉంటే ఆదేశములవారొకదళవాయిని పంపినారు. ఏనాధినాధుడతని నెదురుకొన్నాడు. కాని అతనిభూతిరుద్రాక్షధారణమును చూచి ఖడ్గమును విడిచి అతనికాళ్ల మీద పడినాడు. వాడూరుకోకుండా ఖడ్గముతో నరుకుతూఉంటే 'శివ, శివ' అంటూ ఉండగా ఆనరకులతని కంఠములో పూలదండలయినవి. శివుడతనికి ప్రత్యక్షమై అక్షరత్వము నిచ్చినాడు. పెరియపురాణములో నీకథ కొంచెముమార్పులతో ఉన్నది. ఇతడు నానావిధాయుధ ప్రయోగనిపుణుడై ఒకనాడతిశూరుడనే యోధునితో ద్వంద్వయుద్ధము చేస్తూ అతడుధరించిన భూతిరుద్రాక్షములను చూచి శివభక్తుడని తెలుసుకొని తనఖడ్గమును విడిచిపెట్టినాడట.

'ఏనాదిమేర్కుడైయన్ పెరియనాయన్' లేక పాత్తపిరాయన్ అనేవాడు సుందరపాండ్య దేవుని పుణ్యముకోసము చేసినదానము చెంగల్పట్టుజిల్లా సైదాపేట తాలూకా, తిరువొట్రియూరులో ఉన్నది.

౮. ఒణుమూర్తి

దీనికి ఎణుమూర్తి అని బసవపురాణపాఠము. ఒణుమూర్తియే అణుమూర్తి అయిఉంటాడు.

"పారంపుటణామూర్తి సందసంబలరి
యారగింపక పోయినట్ల పోరాదు"

(పండి. I. ౧౩౭ పు.)

"ఆటుమూర్తియను భక్తుడరయు బ్రోచెయ్య
గణనాథు సానపై గదియించితివియ
సంధిల్లి మఱిరెండు సందంబు గాక
బంధురమహిమ శ్రీగంధంబు గాదె?"

(పండి. I. ౨౦౦ పు.)

ఇతడే స్కందనాథుడు.

ఇతనికథ తమిళ పెరియపురాణములో లేదు. బసవపురాణములో నికథ ఇట్లున్నది: ఇతడు శివప్రాణ లింగమునకు నిత్యమున్న మేలిచందన మర్పించే వ్రతము కలిగి దానిఆచరిస్తూ ఉండగా దగ్గరనున్న ధనమంతా వ్యయమయినది. తన వ్రతమును నిలుపుకొనడానికి తను తన మోచేతిని సానమీద నూరి అర్పిస్తే అదే శ్రీచందన మయినది. ఈ భక్తికి మెచ్చి శివు డతనిని తనవిమాన ములో కైలాసమునకు తీసుకొనిపోయినాడట.

ఇతనివిగ్రహము నంజుండేశ్వరాలయములో లేదు.

౯. కడమలనంబి



పెరియ పురాణములోని కలిసీతికథ ఇతని కథ వంటిదే గనుక ఈయిద్దరును ఒక్కరే అయిఉంటారని నా అభిప్రాయము.

ఇతడు శివునికి నిత్యం వేయేసిదీపములు వెలిగించే వ్రతముకలవాడై ధనమంతా వెచ్చపెట్టి, నూనెమిన్ని లేక పోగా తనజుట్టుకు నిప్పంటించుకొని తానే అఖండ దీపముగా వెలిగినాడని బసవపురాణములో ఈతని కథ చెప్పబడినది. ఇతడే పెరియపురాణములో ఉదాహరింపబడిన కణ్ణంపాల (కణోలప) నాయనారయి ఉండవలెను. ఆకథకూడా కడమలనంబి కథవలెనే ఉన్నది.

దీపదకళియారు కథకూడా ఇటువంటిదే.

౧౦. కన్నప్ప



ఇతడు కాళహస్తి వాడు. శివునికి తన కన్నులర్పించి ముక్కన్నుపొందిన సుప్రసిద్ధ భక్తుడు. బోయకులము వాడు. ఉడుమూరి కన్నప్ప అనిన్ని ఇతనికిపేరు. అరవములో ఇతనికి కణ్ణప్పన్, ముక్కణ్ణన్ అనిన్ని, సంస్కృతములో నేత్రార్పక అనిన్ని పేళ్లు.

౧౧. కరయూరి చోడడు

ఇతనికే ప్రతాపకారుడనికూడా పేరయి ఉంటుంది.

ఇతడే మనుచోళ, అనపాయచోళ, పొగళ్ చోళ అనేపేళ్లు గలవాడయి ఉంటాడు. అనపాయ అనేపేరు రెండోకులోత్తుంగచోళుని కుండడము చేత (చూడుడు : పైని ఇరువదారింటి వృత్తాంతము.) పన్నెండో శతాబ్దమువాడయి ఉంటాడు. ఇతడు శివశాసనధరులను తన ప్రాణలింగములుగా భావిస్తూ ఉండేవాడు. ఒకనాడీరాజు శత్రువులను చంపి వారి తలలను మూప్పయిపోణకలతో చేగా ఆతలలలో ఒకటి హరభక్తుని తలవలె జడలతో కనిపించినది. అదిచూచి రాజు తనతలను కోసి ఆతలపై ఉంచగా శివుడతనిని కైలాసమునకు తీసికొనిపోయినాడు. ఈ కథ బసవపురాణములోనిది. ఇదే కొంచెము మార్పులతో పెరియ పురాణములో ఉన్నది. పొగళ్ చోళనాయనారొక చోళరాజు. అతనిరాజధాని కావేరీ పోంబట్టణము.

గిరిదుర్గములో ఉన్న అధికుడనే రాజుమీద కితడు సేనతో దండనాయకుని పంపగా అతడు శత్రువుల తలలను తెచ్చినాడు. వాటిలో ఒకటి జడలతోను, భూతి రుద్రాక్షలతోను ఉండడము చూచి రా జగ్నిప్రవేశము చేయనుద్యుక్తుడైనాడు. శివు డతని కడ్డపడి వారించినాడు. కన్నడములో ఈ నాయనారి పేరు కరవూరి చోడడని ఉన్నది.

చోడుడు

ఈ పేర పండితారాధ్యచరిత్రములో అఱువత్తు మూవురపట్టికలో ఒక డుదాహరింపబడినాడు. ఇతడే చోడుడో తెలియదు.

"ధరణీకులమున గరికాళచోళు
గరయూరిచోడు, విక్రమచోడు వీర
చోడు, నయ్యుత్తుంగచోడు, నరేంద్ర
చోడు, నారాకేంద్రచోడు, నీశ్వరుకు
దవులక నిరవధిమ వంచకులను
దవిలెనే! భక్తికి ధరణిపల్ పెలియె!"

(పండి. చ. I. ౭౧౨)

అనే పంక్తులలో అనేక చోళరాజులు పరమ శివభక్తులుగా నుదాహరింపబడినారు. వీరిలో కరయూరి చోడునిగురించిన్ని, కులోత్తుంగచోడుని గురించిన్ని యింతకుముందు వ్రాసినాను. ఈ చోడుడు తక్కిన చోళులలో ఒకడయి ఉంటాడు. ఈ చోళులందరును సుప్రసిద్ధచారిత్రకపురుషులు.

వీరచోడడు

వీరచోడు లనేకులున్నారు. వారిలో నితడెవడో తెలియదు.

౧౨. కలగణనాథుడు

ఇతని పేరుమాత్రము పండితారాధ్యచరిత్రములో అరువత్తుమూవురలో పఠింపబడినది. బసవపురాణములో లేదు. పెరియపురాణము ప్రకార మీతడు శైవభక్తులకు నిరతాన్నప్రదానము చేసేవాడనిన్ని, తిరుజ్ఞానసంబంధరుకు సమకాలికు డనిన్ని తెలుస్తున్నది.

౧౩. కలిశామదేవుడు

ఇతడు చోళచోళరాజు సేనానాయకుడు. 'మానకంజనదీశుని అల్లుడు. సుందరనంబి ఇంటెతలతో కూడి భోగలోలుడగుట చూచి, అతనిమొగము చూడనని పంతముపట్టినవాడు. ఒకయనంబి ఇతనిని లంకెయింటికి పనిమీద పంపగా నితడు నిరాకరించినాడని బసవపురాణములో ఉన్నది.

౧౪. కళియంబ



పెరియపురాణములో నితని పేరు కలికంబ, కలికంప అని ఉన్నది. ఇతడు చోళచోళరాజు. ఇతడు కులమును విచారించకుండా, శివభక్తు డెవడైనా సరే కాళ్లు కడిగి పూజించేవాడు. ఒకనా డితని సేవకుడే శివభక్తులతో కూడి రాగా రా జతని కాళ్లు కడుగడాని కుద్యుక్తుడై భార్యను నీళ్లుపోయుమన్నాడు. ఆమె నిరాకరింపగా అతడామె రెండుచేతులను నరకించి తానే కాళ్లుకడిగి అందరితో పాటు వానికిన్ని విందుచేసినాడు. ఈ కథ బసవపురాణ, పండితారాధ్యచరిత్రలలో కూడా ఉన్నది.

౧౫. కారినాయనార్



ఇతనికి కారినాథుడని సంస్కృతపుపేరు. ఇతడు భిక్షాటనము చేసి తెచ్చిన ధనముతో చాలా శివాలయములను కట్టించినాడు. 'కారి' అనేపేరు శాసనములలో కనిపిస్తుంది. తిరువనికాళోలు నంజుండేశ్వరాలయములోని విగ్రహమును చెక్కినశిల్పి 'అవికారి' అనే చెక్కడపు పేరును కల్పించినాడు.

౧౬. కాళవ్వ

ఈమెకు కరికాళవ్వ అనికూడా పేరున్నది. తమిళములో కరికాళమ్మైయార్ అనిన్ని, సంస్కృతములో పూతవతి అనిన్నీ పేళ్లు. శివుడీమె యింట 'మామిడిపండుల మజ్జిగను నమలి'నాడట. (బస. పు రా.) పెరియపురాణముప్రకార మీమె వైశ్యస్త్రీ. భర్త తనకిచ్చిన రెండుమామిడిపండ్లను గంపలకొద్ది పండ్లనుగామార్చి శివుని కారగింపజెట్టినది. శివభక్తిమూలముగా గొప్పశక్తులను సంపాదించినది.

౧౭. కీర్తినాథుడు

ఇతనికి పొగర్తునైనాయనారని తమిళపుపేరు. ఇతడు బ్రాహ్మణశైవభక్తుడు. దేశములో కరవుపట్టి, తిండిలేక బలహీనుడై, లింగమున కభిషేకము చేస్తూ, బిందెను మోయలేక లింగముమీద ఎత్తివేసినాడట. దీనికి శివుడు సంతోషించి అతనికి కైలాసవాసము నను గ్రహించినాడు.

౧౮. కుత్తువనాయనార్

ఇతనికి కృతాంతకుడని సంస్కృతపుపేరు. ఇది తెలియక వంజుండేశ్వరాలయపు విగ్రహముమీద శిల్పి పురాంతక అని చెక్కినాడు. ఇతడొక చోళరాజు. ఇతడు దిగ్విజయముచేసి రాజ్యమును విస్తరింపజేసి రాజ్యములోని బ్రాహ్మణులనందరినీ ఆహ్వానించి పూర్వచోళరాజుల శైవకిరీటమును తన శిరస్సున నుంచవలసినదని ప్రార్థించగా వారట్లుచేయక దేశమువిడిచి పోయినారు. శివుడే అతనికలలోవచ్చి ఆకిరీటమును శిరస్సున నుంచినాడట. ఈ విషయము బ్రాహ్మణులకు తెలియగా వారు కేరళమునుంచి తిరిగీ వచ్చి కిరీటమును తామే ఉంచినారట.



౧౯. కులపత్సుడు

ఇతనికి కులబర్త నాయనారని తమిళపుపేరు. ఇతడు మధురరాజయిన కుబ్జపాండ్యునికిమంత్రియై అతనిని శైవునిగా మార్చుటానికి తిరుజ్ఞాన సంబంధరుకు తోడ్పడినాడు.

౨౦. కులుచ్చిరియారు

బసవపురాణములో ఇతనిపేరు కులచ్చిరియారని ఉన్నది. పిళ్లనాయనారు జైనుల నోడించి మధురరాజుకు శివదీక్షనిచ్చి జైనుల ననుపకూలములతో పొడిపించినప్పుడాకూలములను బాగుగా కాల్చి అందిచ్చిన మహాశివభక్తురాలు అని బసవపురాణకథ. ఈతనిపేరు పెరియపురాణములో లేదు. కాని ఈమెయే మంగయక్కరసి. మంగయక్కరసికి కులచ్చరి అని మరియొక పేరు. ఈమె సుందరపాండ్యునిభార్య. పొగళ్ చోళుని (కరయూర్ చోళుని) కూతురు. తనభర్తను శైవునిగా చేయుటములో తిరుజ్ఞానసంబంధరుకు తోడ్పడినది.

౨౧. కోట్పులి

ఇతనిపేరుకు బసవపురాణ పీఠికలో 'కొటుప్వలి' అని ప్రభాకరశాస్త్రిలుగారు పాఠమిచ్చినారు. పెరియపురాణములో ఇతనిపేరు కొట్పులినాయనార్ అనిన్ని, సంస్కృతములో వీరశార్దూలుడు అనిన్ని ఉన్నది. ఇతడొక చోళరాజుక్రింది మండలేశ్వరుడు. ఇతడు శివభక్తులకోసము గాదెలతో ధాన్యమును నిలువచేసి యుద్ధమునకు పోయియుండగా, అతనిభార్య కరవుపట్టుట వల్ల ఆధాన్యమును తనబంధువులకు వినియోగించినది. అతడు తిరిగి యింటికి వచ్చి వృత్తాంతమును తెలుసు

కొని భార్య రెండుచేతులను తెగగొట్టించినాడు. వీర శార్దూలునికే సురవ్యాఘ్రుడని సంస్కృతములో నామాంతరమై ఉంటుంది.

౨౨. గుగ్గుళుకళియారు

ఇతడే మానధనుడు.

ఇతనికి తమిళములో కంకుళినాయనారని పేరు. బసవపురాణములో ఇతనికథ ఇట్లున్నది. ఇతడు త్రికాలములలోను శివునికి గుగ్గులుధూపము వేసేవ్రతము గలవాడై, ధనమంతా వ్యయముకాగా తన ఆలిమంగళసూత్రమునుకూడా అమ్మివేసినాడు. తిరుపరంధామమనేపురములో ఉరగేశ్వరలింగముముందర ఉరగకన్య కలం పాడగా పారవశ్యముచేత లింగము ముంగుకు వ్రాలినది. లింగమును సరిగా నిలుపడానికి రాజెన్నో ప్రయత్నములు చేసినాడుగాని సాధ్యముకాలేదు. అప్పుడు గుగ్గుళుకళియారు రాజువద్దకుపోయి తనకు కావలసినంత గుగ్గిలమిస్తే లింగమును సరిగా నిలుపుతానన్నాడు. రాజొక గుగ్గిలపు రాశినివ్వగా, కళియారొక బట్టను చించి దాని ఒకకొనను లింగమునకున్ను, రెండోకొనను ఖడ్గమునకున్ను కట్టి, ఖడ్గమును మెడమీదపెట్టుకొని వెనుకకు నిగుడడముచూచి నాగేశు డెప్పటివలె నిలిచినాడు.

"ఘనకీర్తి గుగ్గుళుకళియారు దొల్లి
దనరెయెత్తుమహిసాక్షిదప్ప కీసునకు
నిచ్చలు వర్పించు నియతిమైననవం
గ్రచ్చుఅనొక నాఁడు ఘుటియిల్లకున్న
నత్తఱమహిసాక్షికై తనప్రాణ
మిత్తుఁబొమ్మనుచును గుత్తుకనలుఁగుఁ
గదియింప విఖ్యాతకమలసౌరభము
విదితమైపరగదె?"

అని పండితారాధ్యచరిత్రములో నున్నది.

౨౩. గోనాథుడు

ఇతడే పెరియపురాణములో తెలుపబడిన చొక్కనాయనారు. ఇతడొక ఆలకాపరి. తన పిల్లనగ్రోవిమీద శివగీతములను పాడుతూ పశువులను మేపేవాడట.

౨౪. చండేశుడు

ఇతడు బ్రాహ్మణుడు. ఆవులకాపరు లావులను హింసించడమును సహించక తానే ఆవులకాపరిగా నుండనొప్పుకొని వాటిని తీసుకొనిపోయి వాటిపాలను లింగముపైపిండి అభిషేకము చేస్తూఉండేవాడు. ఆవులకాపరు లతని తలిదండ్రులతో మొరపెట్టగా తండ్రిపోయి చండుని మందలించినాడు. చండునికి కోపము వచ్చి తండ్రిఅని గమనింపక అతని తలను తెగవేసినాడు. శివుడు మెచ్చుకొన్నాడు.

౨౫. చిఱుతొండడు

ఇతడు సుప్రసిద్ధ శివభక్తుడు. సెట్టికులమువాడు. ఒకచోళరాజు సేనానాయకుడు. పశ్చిమచాళుక్యుల రాజధానిఅయిన వాతాపి (బాదామి) దుర్గమును పట్టుకొని, దానిరాజయిన రెండోపులకేశిని తనరాజు కప్పగించినాడు. ఇతని కొడుకు శ్రీలాలుడు, లేక సిరియాలుడు. చిఱుతొండడు శివునికోరిక చొప్పున పసివాడయిన కొడుకును చంపి అతనిమాంసము నారగింపు చేసినాడు. ఆనిశ్చలభక్తికి మెచ్చి శివుడు సిరియాలుని బ్రదికించి



చిఱుతొండనికి కైలాసప్రాప్తి ననుగ్రహించినాడు. ఇతనికి సంస్కృతములో భద్రభక్తుడని పేరున్నది. శైవేతరు లితని పేరును తిరుగవేసి, వెక్కిరింపుకు దధ్ధభక్తుడని పిలుస్తారు. శైవులున్ను అదేపేరితో పిలువడమే వింత. సంజాండేశ్వరాలయ విగ్రహముపై నితని పేరు ధర్మకేతనుడు అనిఉన్నది. ఇది ధర్మభక్త నామమునకు పాఠాంతరము.

౨౬. చిఱుత్తొణ

'చిఱుతొణు' అని చిఱుత్తొణకు బసవపురాణ పీఠికలోని పాఠము. తమిళములో సరసింగమొనయర్,



నరసింగమునయార్, శిరత్తైనాయనార్ అనిన్ని, సంస్కృతములో రణమిత్రుడనిన్ని ఇతనికి పేర్లున్నవి. నరసింహముని శివభక్తుడయిన రాజనిన్ని, సుందరసంబని కొడుకుగా పెంచుకొన్నాడనిన్ని తమిళ పురాణము చెప్పుతున్నది. పెరియపురాణములో శివభక్తుడుగా తెలుపబడిన కళర్చింగనాయనారుకూడా ఈ నరసింగమునయరే. ఇతడే కాంచీపురాధీశుడైన పల్లవరాజా నరసింహవర్మ. ఇతనికి సింహాంక, పాదసింహ, పంచపాదసింహ అనికూడా పేర్లున్నవి.

ఇతనిభార్య శివనిర్మాల్యమైన పూలదండను చేతితో తీసి మూర్కొనగా ఆ దోషమునకు భార్య చేతులను నరికివేసినాడు.

౨౭. చిఱుపులి

తమిళములో శిఱుపులి అనిన్ని, సంస్కృతములో నిరోధశార్దూలుడనిన్ని ఇతనికి పేర్లున్నవి. నిరోధశార్దూలుడ్నే నిరుద్ధశార్దూలు డంటారు.

ఇతడు తనయింటికి వచ్చిన శివభక్తులందరికిన్ని నిరతాన్నదానము చేసే వ్రతము గలవాడు.



౨౮. చీరాలదేవుడు

మరియొక పేరు ధర్మకేతనుడు. శైవధర్మస్థాపనమునకై కేతనమెత్తుటచేత ఇతనికి ఈ ధర్మకేతనుడనే పేరు కలిగి ఉంటుంది.

ఇతడు చిఱుతొండని కొడుకు. తండ్రివలెనే గొప్ప శివభక్తుడును, సేనానాయకుడునై శైవభక్తి విస్తారకుడైనాడు.

తంజావూరుజిల్లా నన్నిలంతాలూకా తిరుచ్చెంగాట్టంగుడి గ్రామములో సీరాలదేవుని మంటపమున్నది. చిఱుతొండని గ్రామమువాడట. జ్ఞానసంబంధరుకు సమకాలికుడట. చిఱుతొండని విగ్రహము తంజావూరిలో ప్రతిష్ఠింపబడినది. ద. హిం. శా. ౨-౧౫౨౩; ద. హిం. ఎపి. రిపోర్టు ౧౯౧౩ సం. రము నం. ౫౭ లో చిఱుత్తొండనంబి సీరాలదేవుని భక్తుడని చెప్పబడినది. చిఱుతొండడు కొడుకు కీదేవుని పేరే పెట్టి ఉంటాడు.

౨౯. చెన్నయ్య



ఇతడే సత్యార్థుడై ఉంటాడు.

ఈతని పేరు పండితారాధ్య చరిత్రములో మాత్రము అఱువత్తుమూవురపట్టికలోని కెక్కినది. చెన్నయ్య యింటిలో శివుడు పులియంబకళమును జుఱ్ఱినాడట.

[సశేషము.]

కోర్టు మార్షల్

[కథానిక]

❀

— శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న —

అప్పటికి అప్పుడే పదకొండు దాటింది. ఎడారి యెండ; చెమటపొయ్యదు. పొయ్యిలో పెట్టిన రొట్టెలాగ లోలోపలే ఉడికించివేస్తుంది. అపరిమితమయిన దాహం. కాల్చిన సూదుల్లాగ యిసకరేణువులు చుర్రుమని ముఖాన్ని తాకి, లోనున్న తాపాన్ని మరీ యినుమడింపచేస్తున్నాయి. దిక్కుమాలిన స్టూడిబేకరు. లారీ అంతా యినుపమయం; దానికి తోడు ఆస్పీడుకి యిరుప్రక్కలనుంచీ కొలిమితిత్తులలోనుంచి ఊదినట్టు వేడిగాలుపు. ఆ సరికి అప్పుడే నాకు చెవులు ఘుకీయిలు వేసుకుపోయి, మొహం తిరగడానికి సిద్ధంగా వుంది. వాటరుబాటులులో ఒక్క చుక్కయినా మిగుల లేదు. టోపీక్రింద బుర్ర బరువుగా సీసంముద్దలాగ అనిపిస్తోంది; అలాగని ఆ టోపీ తీసెయ్యడానికి వీలు లేదు. తల దిమ్మెక్కిపోతోంది. ఎటు వెళుతున్నానో, ఎలా వెళుతున్నానో తెలియడం లేదు. అంతా నిర్మానుష్యమయిన ఎడారికనక, ఏక్సిడెంట్సు కలుగుతాయన్న భీతిమాత్రం లేదు. నా యంత్రంతోపాటు నేనూ యంత్రవతుగానే సాగిపోతున్నాను. మహావాపదోషేణ సుణా భవంతి!

ఇంక నాలుగుఫర్లాంగులు పోతే ఒక 'ఒయాసిస్సు' (Oasis) దగ్గిరవుంది సిబ్బందికేంద్రస్థానం. అదే గమ్యస్థానం. ఒంటిగంటలోపల వెళ్లి ఛార్జీ పుచ్చుకోవాలి. మేజర్లే కాలనియమతి పాటించకపోతే యిక ఫౌజుని ఏమని ఏం ప్రయోజనం? కొంచెం స్పీడు హెచ్చించేను. మకాముకి అద్దరినున్న శారకాముల సమీపంలోకి వచ్చేసరికి, కుడిప్రక్క ముందుచక్రం అటూ యిటూ అల్లల్లాడి, బ్రేకు వేసేలోగా ఎదరికి తూలిపోయింది. అయిదుటన్నుల లారీ యేమో, అమాంతంగా గొడ్డుపలుపులు తప్పిన బండీలాగ, ముందుకు వొరిగి పడిపోయింది. నా అవస్థకి నాకే జాలివేసింది. కాని ఏం చెయ్యను? సీటుక్రింద 'జాకీ' ఎక్కపీకి లారీని పొజిషన్‌లో వుంచి, చక్రాన్ని ముందు యిరుసుకి అతికేను. స్టీరింగుబుష్‌లు సరిచెయ్యడానికి లారీక్రింద దూరేసరికి, కాలిన యిసకలో శరీరం చుర్రుమని, ఒక్క గంతులో బయటకు వచ్చేసి, సీటుదిండ్లు క్రింద వేసుకుని మళ్లీ ఆరంభించేను మరామత్తుకి. అయినా కాలిన పెనంమీద పడుకున్నట్టే అనిపించింది. పట్టుకున్న యినపరెంచిమూలాన్ని అరచెయ్యి బొబ్బలెక్కింది. యెలాగో పనిముగించుకుని లారీ స్టార్టుచేసే వేళకి, కారప్పతీగలదగ్గరగా ఆ మండుటెండలో ఒక యిరవైయేళ్ల కుర్రాడు, చొక్కా అయినా లేకుండా, కొయ్యలు పాతుతూ కనబడ్డాడు. అతని శరీరం బాగా కమిలిపోయివుంది. పరకాయించి చూచేను. అది పటాలంలో శిక్షలు అనుభవించేవాళ్లు వుండే బారకాసు. అంత కఠినశిక్ష విధించిన రాతిగుండెల రాక్షసి యెవరు చెప్మా అని విస్తుపోయేను. అటువంటి క్రూరశిక్ష పాలు కావడానికి అతను ఏం నేరం చేసేడో?

లారీ స్టార్టుఅయిన అలజడికి కాబోలు, ఆ కుర్రవాడు తలయెత్తి నావంక పరిశీలనగా చూసేడు. అతను యింకా అలా చూస్తూవుండగానే వాహనం శరవేగంగా పరుగెత్తిపోయింది.

౨

సాయంత్రం ఏడున్నర అవుతుంది. గుడారం బయట మేజామీద టీ, బిస్కట్లూ, పచ్చిపళ్లూ పెట్టుకుని తింటూ, రేడియోవర్తమానాలప్రకారం ప్రోగ్రాములు వేసుకుంటూ కూర్చున్నాను. ఒక జమేదారు వచ్చి సెల్యూట్ చేసి మర్నాటి కార్యక్రమం యిచ్చేడు. మొట్టమొదటి అయిటెం ఒక హవల్దారు క్లార్కు కోర్టు మార్షలు! ఏమిశిక్ష విధించవలసివస్తుందో. ఏమిరా భగవంతుడా, ఛార్జి పుచ్చుకోగానే యిటువంటి పని తగిలిందీ అనుకున్నాను. తల అమ్ముకున్నతరవాత తప్పుతుందా?

పదినిమిషాలు అలాగే సిగరెట్టు కాలుస్తూ ఉండిపోయినాను. ఆ నెంబరు—2490526—కళ్లకి కట్టినట్టుగా వుంది. ఆవిషయం ఎంత మరిచిపోదామనుకున్నా మరుపురావడం లేదు. ఎందుకు మనస్సు అలా పీకులాడుతోందో వూహించుకోలేకపోయినాను. ఇంతలోకే సోహరాబ్-రుస్తుములకథ జ్ఞాపకంవచ్చి గుండె గుభేల్మంది. ఎందుకయినా మంచిదని ఆ నెంబరు గల ఆసామీ పేరు మాడమన్నాను గుమస్తాని పిలిచి. నా సన్నిహితబంధుడే. మా జగ్గడు! అతన్నేనా ఏమిటి చెప్మా నిన్న ప్రొద్దున్న పెరేడ్లో చూసేనా? కాని మావాడు అంత నల్లగా వుండేడే. ఏమో, యీ మిలిటరీవుద్యోగంలో చేరి, హితవయిన తిండీ తిప్పలూ లేక, ఎడారియెండల్లో బాధలుపడుతూ అలా అయిపోయేడేమో!

జగ్గడు! వాడి పరిస్థితులు తలుచుకుంటే ఎంత శిలామయమయిన హృదయమయినా ద్రవించి దయామయం అయిపోకమానదు. వాళ్లు బహు శ్రీమంతులు అవడంచేతా, జగ్గడి నాన్నగారు ముగ్గురు అన్నదమ్ములలోకీ పెద్దవాడు అవడంచేతా అతిగారాబంగా పెరిగేడు. తండ్రిపోయినకారణంగా ఆయన చిన్నతనంలోనే చదువులు చాలించుకున్నప్పటికీ, యిద్దరుతమ్ముళ్లకీ చదువులు చెప్పించి, పెళ్లిళ్లు చేసి, సిగపువ్వు వాడకుండా పెంచుకువచ్చి తండ్రిలేని కొరత తీర్చేడు. కొంతకాలం బాగానే జరిగింది. ఇద్దరుతమ్ములూ చేతికి అందుకువచ్చేరు; యిద్దరూ డాక్టర్లే. కాస్త పేరు కూడా సంపాదించుకుంటూ వుండడంవల్ల నిజంగా జగ్గడునాన్నగారికి ఆ తమ్ముళ్లని చూస్తే కొండ అందుకున్నట్టుండేది. ఆస్తి పంచేసుకుని వాళ్లు వేటాయింపు అయిపోయివారన్న సంగతి లోకానికి తెలియదంటే, ఆ అన్నదమ్ములు ఎంత అన్యోన్యంగా వుండేవారో వూహించుకోవచ్చు. ఇంతకూ యిద్దరుతమ్ముల ప్రాక్టీసూ, పలుకుబడీ బాగుండేవి. జగ్గడునాన్నగారిది మొదటినుంచీ దర్జాజీవితమే. వొచ్చిపోయేవాళ్లతోనూ, వాళ్ల మర్యాదలతోనూ, విందులతోనూ, సంతర్పణలతోనూ ఎప్పుడూ నిత్యకల్యాణం పచ్చతోరణంగా వుండేది జగ్గడునాన్నగారి యిల్లు; ముఖ్యంగా యీయన్నీ ఎందుకు చెప్పాలీ అంటే, యింటిపెద్దకనక ఆభం శుభం అన్నీ యీయననెత్తినే పడుతూవుండేవి. దానికితోడు కాస్త భారీచెయ్యి అవడంవల్ల అవసరానవసరాలతో ప్రమేయం లేకుండానే ఖర్చులూ తగులుకుంటూ ఉండేవి.

స్వార్జితం అనేది లేకపోయినతరవాత, కూర్చుని తింటూఉంటే ఎంతకాలం వస్తుంది? ఒకదశ తిరిగేటప్పటికి ఆయనదశ మారిపోతూన్నట్టు అవుపించింది. ఒకటిరెండుసార్లు యీయన రెండుమూడు సంచులు అప్పుచేసేడని తెలిసి, మరదళ్లలో మనోవికారాలు పొడగట్టేయని అంటారు. అయినా అన్నదమ్ముల సౌజన్యానికి ఏమీ లోటురాలేదు. ఏదో మారుమూల మడిచెక్క కరారావుడి చుట్టుకుపోయినా రాజసంమాత్రం యథాప్రకారంగానే బావుటాయెగిరించేది. మరొక్క నాలుగేళ్లు పోయేసరికి, చదువుకోవలసిన ముగ్గురు మొగపిల్లలమాటా అలా వుంచగా, ఎదిగిన ఆడపిల్లలు యిద్దరూ యింట్లో మెసులుతూవుండడం కొంచెం గుండెలమీద కుంపటిగా తోచింది. పిల్లలయితే కుందనపుబొమ్మలే. అయితే మాత్రం కట్నాలు యివ్వకుండా కళ్యాణాలు కలిసొస్తాయా? అప్పటికి అప్పుడే అప్పులపాలయిపోతున్నాడన్న అప్రతిష్ఠ గాఢంగా అలుముకుంటోంది.

ఇంతలోకే యుద్ధం వచ్చిపడింది. హిట్లరు యూరపుదేశాలని వరసగా ఆక్రమించుకుంటూన్న

రోజులు. అక్షరాజ్యాలు విక్రమయి విజృంభించేస్తాయనీ, భారతదేశానికి పెనుప్రళయం రానున్నదనీ అపోహపడిన కాలం అది. జగ్గడునాన్నగారికి పూర్తిగా కలికాలంగా పరిణమించింది. అప్పులవారి పోరు పడలేక ఉన్నదల్లా తెగనమ్మేడు; దాంతో ఆయనపరువు పూర్తిగా పీకిలిపడిపోయింది. నేలం జరీధోవతులు, పెద్దాపురం పట్టుకోట్లు ముతకఖద్దరుకి దారిచూపగా, కత్తిర మార్కు సిగరెట్టు కాకీయూనిఫారం ధరించి బీడీరూపకంగా ఆసరాఅయి నిలిచింది ఆయనకి. తన పిల్లలయినా చేతికి అందుకు వస్తారేమో నంటే యిద్దరు పెద్దవాళ్ళూ మానేసి వీళ్లు స్కూలు ఫైనలు వెలిగించి, యిహ చదువులకి పనికిరాకుండా పోయేరు. యిరవైయ్యేసి ఏళ్లు ఉన్నా ఆసరికి ఒక్కడికి మెడలోనూ జంధ్యప్పోచ పడలేదు. కాగా పద్ధెనిమిదేళ్ల పెద్దపిల్ల. ఆమె మనస్సులో పరిపరివిధాల కుమిలిపోయినా, తండ్రికి విచారం కలిగించకుండావుండాలని పైకిమాత్రం నిండుకుండలాగ ప్రవర్తించడంతోటే, ఆమెసౌశీల్యాన్ని చూచిన కొద్దీ జగ్గడునాన్నగారికి ఆవేదన అపరిమితం అయిపోయింది.

ఇంతలోకే ఒక తమ్ముడు హఠాత్తుగా మరణించేడు. రెండో తమ్ముడికి స్వకుటుంబభారం అధికం అవడంవల్లనో మరేకారణంచేతనో, సర్దుబాటు చెయ్యడానికి అవకాశం తప్పింది. కాకపోయినా, ఒక యావత్తు కుటుంబాన్ని యింకో కుటుంబీకుడు ఎంత కాలమని పోషించగలడు? తీరా చేస్తూవుంటే ఎలాగో సరిపుచ్చుకోడానికి బదులు 'పుణ్యానికి పెట్టినమ్మ నీ వెంగుడితో సమానంగా పెట్టవమ్మ' అన్నట్టు వుంటాయి ఆడవాళ్ల మనోభావాలు. ఉన్నవూళ్లో యింక తలయెత్తుకు తిరగలేక, మకాం యెత్తేసేడు ఆయన. బెజవాడ, బందరు, మదరాసు అన్నీ చూడడం అయింది. కాటికి కాళ్లు చాచుకొని వున్నవాడికి వుద్యోగం యెవరిస్తారు? యింతకూ చెప్పుకోతగ్గ ఉద్యోగం చెయ్యడానికి ఆ లైనులో యీయనకి వున్న అనుభవం ఎంత? నానాటికి పరిస్థితులు మరీ దుర్భరం అయిపోతున్నాయన్న సంగతి జగ్గడూ, వాళ్ల అన్నయ్యా గమనిస్తూనేవున్నారు. అడ్డమయినవాళ్ల కాళ్లా పట్టుకుంటూనే వున్నారు నౌఖరీలకోసం; కాని చదువులకి బాలారిష్టదోషం పట్టడంమూలాన్ని ఎక్కడా దారీ తెన్నూ కనిపించింది కాదు. ఒకనాడు వాళ్ల అమ్మ, పెద్దచెల్లీ ఉపోష్యం వుండి, తమ్ముడికీ, చిన్నచెల్లికీ అన్నంపెట్టడం కళ్లారా చూసేడు జగ్గడు. దాంతో వొళ్లు అంతా కైరులుపోకి నట్టనిపించి, ఎవ్వరితోనూ చెప్పకుండా ఆ రాత్రే మద్రాసువెళ్లి మిలిటరీలో చేరిపోయేడు. నాటినుంచీ ప్రతీనెలా ముప్పైయెన్నో, నలభైయెన్నో యింటికి పంపుతూవుండేవాడు తప్పనిసరిగాను. కుచేలుండి సంతతిలో వాడూ, తన లోకుపాకులు యెరిగినవాడూ కనక ఉద్యోగంలో బహుమెలకువగా వుండేవాడు. రాక రాక వచ్చిన ఉద్యోగాన్ని నిలబెట్టుకుని వృద్ధిచేసుకుందామని వాడికి చాలా పట్టుదలగా వుండేది. అయినా సంగతులు నాకు ఎడపాదడపా వచ్చిన రికార్డులలో తెలుస్తూవుండేవి కూడాను. మరి అలాంటివాడికి యీ కోర్టుమార్షలు ఏమిటి చెప్మా?

3

ఈ గతచరిత్ర అంతా సినీమాలో చూసినట్టు ఆ అరఘంటలోనూ దృగ్గోచరమయ్యేసరికి నాకు మరీ వుండబట్టిందికాదు; అలాగని పనికట్టుకుని బారక్సుకి వెళ్లి మనిషితో మాట్లాడి సందుగొమ్ముల అనుమానం తీర్చుకుందామంటే—పైస్థలం; ఎంత తాకేదారులయినా వున్నవాళ్లంతా పంజాబీవాళ్లు. ఎవడైనా ఏదైనా రూమరు పుట్టించిపోయేడంటే, వైర్లెస్‌కన్నా త్వరగా అది ఢిల్లీ చేరుకోవడం అలావుంచగా, నాకే యెసరువచ్చి మొదటికే మోసం కలగవచ్చు. వెంటనే జరగవలసిన ఉపకారం జరగడుసరేకదా, యింక యెన్నడూ యెవ్వరికీ ఏ సదుపాయమూ చెయ్యలేని పరిస్థితులు ఏర్పడవచ్చు.

ఆ రాత్రి నాకు నిద్దరపట్టలేదు. ఏ రెండుగంటలకో మాగన్నుపడిందేమో. మామూలుగా నాలుగున్నరకల్లా తెలివికొచ్చేసింది. ఆహ్నికాలు తీర్చుకుని, కాఫీ పుచ్చుకుంటూవుండగా చిన్న వుపాయం తట్టింది. క్రొత్తగా ఛార్జిపుచ్చుకున్నవాణ్ణి కనక నా క్రింద

రెటువంటి మనుషులు వున్నారో, ఎవరిని ఎంతవరకూ నమ్మవచ్చునో తెలుసుకోవడం అవశ్యకమన్న నెపంతో ఒక్కొక్కడి విషయం ఆరాతియ్యడం ఆరంభించేను. ఆ దెబ్బతో జగ్గడుగాడి వివరాలు చాలా తెలిసేయి. పాపం. మొదట్లో సిపాయిగా ప్రవేశించి, రెణ్ణెల్లు తిరగకుండానే హవల్దారుక్లార్కుగా ప్రమోషనుపొందేడు. మరొక్కయేడు తిరిగేటప్పటికి మూడో గ్రేడులోంచి మొదటిగ్రేడులోకి డబుల్ ప్రమోషనుగూడా సంపాదించుకున్నాడు. వీడి పని చూచిన ప్రతీ ఆఫీసరూ మంచే వ్రాసేడు. ఎక్కడా చెడుగులేదు—ఆ వేళ జరగనున్న కోర్టుమార్షలుతప్ప.

ఇదే మిలిటరీలో వుండే విశేషం. ఏసంగతీ మొత్తంగా చూడరు. మనిషితాలూకు ప్రవర్తన—నమ్మకలతో అసలే పనిలేదు. దీని క్కారణంకూడా లేకపోలేదు. ఇవాళ యిక్కడ వున్న ఆఫీసరు రేపు యింకోచోటికి బదిలీఅయిపోతాడు. దాంతో, వాడి మెహార్బానీ సంపాదిద్దామని చేసిన చాకిరీ అంతా బుగ్గి అయిపోతుంది అన్నమాట. వాడిస్థానే వచ్చినవాడు కర్కోటకుడే అవునో, కరుణామయుడే అవునో. యింతకూ ఆ వచ్చినవాడికి వీడియందు నమ్మిక కలగాలంటే కొంతకాలం పడుతుంది. అటువంటి సందర్భాలుకూడా జరపడొద్దూ? ఈలోగా ఏది ఎటునుంచి వచ్చినా గాలిలో దీపం పెట్టి 'దేవుడా నీదే భారం' అన్నట్టు అవుతుంది. అంచేతే యీక్షణంలో 'శహబాసు' అనిపించుకున్నవాడు ఉత్తరక్షణంలో ఓటికుండ అయి వూరుకుంటాడు. ఇదే ఏ సివిలుఉద్యోగమో అయితే అంత త్వరగా 'బ్లేకుమార్కు' పడుతుందా? అందులోనూ ఆదినుంచీ మంచిరికార్డు వున్నవాడికి పాటాపెట్టాలంటే ఎన్నిగుండెలు వుండాలి? కాని మిలిటరీలోమాత్రం యిటువంటివి బహుసామాన్యం. ఇవాళ కేప్టినుగా వున్నవాడు, ఓ. చుక్క ఎక్కువసేవించి, ఒళ్లు తెలియక పై ఆఫీసరుకి సెల్యూటు చెయ్యకపోతే ఆసాయంత్రమే వాణ్ణి లెఫ్టినెంటుగా దింపేస్తారు. మళ్లీ నాలుగురోజులు వొళ్లుదాచుకోకుండా పనిచేసే డసేసరికి వాడే తిరిగి కేప్టినో, లేకపోతే యింకా మేజరో అయిపోతాడు. ఫాక్టు మిలిటరీలో సంగతే యింతే. కాని క్రొత్తగా మిలిటరీలో చేరినవాడికి యిటువంటి అసందర్భం ఏదైనా తటస్థిస్తే తలతీసేసినట్టుగా వుంటుంది. ఆఫీసర్లకతే యిలా గడ్డలయిపోతూవుంటే హవల్దారుక్లార్కులని చూచేదెవరు?

నాకు వొళ్లు కంపమెత్తిపోయింది. కుర్రనాగమ్మ పొరపాటుచేసేడే అనుకోండి; పూర్వాపరాలు చూడొద్దూ? ఆదినుంచీ అష్టకష్టాలు అనుభవించి, ఎలాగో ఒకఉపాధి సంపాదించి, సాటివారిలో 'ఓ' అనిపించుకుంటూ, తనవాళ్లంతా తనమీదనే ఆధారపడివున్నారన్న జ్ఞానంతో, తల్లిదండ్రుల ఋణం తీర్చుకుందామనే దృఢసంకల్పంతో, సునిశితంగా నాటుకుపోయిన ఆత్మప్రబోధంతో శ్రమిస్తున్న మనిషి. కొత్త పరాకు పడగానే—అది అయినా బుద్ధిపూర్వకంగా చేసిన తప్పిదంకాదు—దివ్యంగా వున్న పూర్వచరిత్ర అంతా విస్మృతం అయిపోవలసినదేనా? నిజంగా వొళ్లువొంచి పనిచేసేవాడికే అన్ని యిబ్బందులూను. ఇదే సహృదయుడయిన ఆఫీసరుహయాంలో అయితే యిలా జరుగుతుందా? పాపం. వాడికృషికీ, తత్ఫలితానికీ అమితానందగర్వాలని పొందుతూ తారాజువ్వలాగ తారాపథంలోకి జొచ్చుకుపోవలసిన తేజోమూర్తిని నాలుగుగోడలమధ్యా బంధించి, సరియైన తిండి పెట్టక, ఆ ఎడారిమంకుటెంటలో, పైన చొక్కా అయినా లేకుండా ఏకొయ్యలు పాతమనో, లాటిపిటలకి మాలీసుచెయ్యమనో నియోగించి, ఎందుకూ పనికిరాని వాణ్ణిగా మార్చివేసేరు. ఆ అమాయికహృదయం ఎన్నివిధాల విలపించి తపించిపోతున్నదో.

౪

ఇటువంటి పర్యాలోచనలతో ఎనిమిది గంటలదాకా తెలియకుండానే కాలం గడిచిపోయింది. బేరరు వచ్చి స్నానానికి లెమ్మన్నాడు. అభ్యంగనం, ఛోటాహాజ్రీ ముగించుకుని, తొమ్మిదింబావుకల్లా లైన్సుకి వెళ్లేను. నేనే అధ్యక్షుణ్ణి ఆ కోర్టు మార్షలుకి. ఇరుప్రక్కలా యిద్దరు కేప్టెనులు కూర్చున్నారు న్యాయపరిశీలనలో నాకు సహాయం చెయ్యడానికి. నేరస్థుడు ఎదురుగా నుంచుని సెల్యూటుచేసేడు. హెడ్

క్లార్కు ఛార్జిషీటు పుచ్చుకుని నేరం చదివేడు. నేరం, సర్కారు మిలిటరీలో వుండి కాన్వాయిని తీసుకువెళ్ళే సందర్భంలో కనబరచిన ప్రమత్తత. సందర్భాన్ని పరిశీలించడానికి ఆరంభించేం.

బర్మా యుద్ధం తీవ్రంగా సాగుతూ వున్నప్పుడు ఒకసారి అచటికి కొన్ని యుద్ధపరికరాలు పంపవలసిన అవశ్యకత కలిగింది. వ్యవహారం అర్జంటు అవడంచేతా, అందరిలోకీ జగ్గుకింద అప్పుడున్న ఆఫీసరుకి మంచి గురిఉండడంచేతా, వీణ్ణి ఆ కాన్వాయిని తీసుకువెళ్లి కలకత్తాలో వప్పచెప్పడానికి నియోగించేరు. అహోరాత్రాలు నిద్రావిశ్రాంతులు లేకుండా ఏడు వందల మైళ్ళూ లారీలు నడిపించుకుని నెమ్మదిగా కలకత్తా పొలిమేర చేరుకున్నాడు బహుభద్రంగాను. ఇంక తన గమ్యస్థానం చేరుకుంటూ వుండగా ఒక మద్రాసీ హోటలు కనిపించింది వీడికి. కష్టానికి ఓర్చుకోలేని చిరుతప్రాయం; అప్పటికి అప్పుడే మూడు రోజుల బట్టీ ఆత్మత్యాగం చేస్తూన్న వ్యక్తికి; ఉదయం ఎనిమిది గంటల వేళ; మిగతా లారీడ్రైవర్లకి అందరికీ తను వస్తు వుంటూన్నా భోజనసదుపాయం చేసేవన్న ఆత్మజ్ఞానం. అటువంటి సందర్భంలో వీడికి కాస్త కాఫీపుచ్చుకుందామని మనస్సు పీకులాడింది అంటే అందులో ఆశ్చర్యం ఏమీ కనబడదు. "ఓస్, ఒక పావుగంట ఆలస్యం అయితేమాత్రం కలుసుకోలేకపోతానా, యింతకూ నాలారీ పొట్టిదేకదా" అన్న ధీమాతో హోటలులో జొరబడ్డాడు. ఇడ్లీ, దోసె, కాఫీ — అప్పటికి మూడేళ్లయి మొహంవాచి ఉన్నాట్ట వీటి కోసం — పుచ్చుకొని బయటికి వచ్చేసరికి వీడి లారీ కనపడలేదు. మనిషికి ముచ్చెమటలు పోసిపోయినాయి. నిమిషాలు గడిస్తూన్న కొద్దీ నిలువునా నీరయిపోతున్నాడు. ఏమీ పాలుపోయింది కాదు. యింతలోకే హోటలు వెనక గోడతట్టున యింకో లారీ — అదీ మూడు టన్నుల లారీయే, నల్ల టార్పాలినుతో వున్నదే — కనుపించగా, తనదే ఎవడో అక్కడ పెట్టేడన్న భావంలో పడి (అన్ని లారీలూ కవల పిల్లలలాగ వుంటాయి మిలిటరీలో), యింతకూ లారీ దొరికింది బ్రతుకుజీవుడా అని, ఒక్కఊపున ఝామ్మని వెళ్లి కాన్వాయిని కలుసుకుని గమ్యస్థానం చేరుకున్నాడు జగ్గడు.

అక్కడ సెక్యూరిటీ ఆఫీసరు సామగ్రి అంతా లెక్కవప్పచెప్పుకుని, ఏడులారీలూ సక్రమంగా వచ్చేయని కాయితం సంతకంచేసి యిచ్చెయ్యడంతోనే తన అదృష్టానికి సంతోషిస్తూ లోపలికి పోయేడు వాడు టీ పుచ్చుకోడానికి.

మరొక్క పదినిమిషాలకి అమెరికన్ బేసుకేంపు నించి టెలిఫోనువచ్చింది. ఫలానా నెంబరు గల వాళ్ళ లారీ కనిపించడంలేదు కనుక, యిక్కడ వీళ్లవద్దనున్న లారీ నెంబర్లు సరిచూసి, ప్రమాదవశాత్తూ అక్కడికి చేరుకుందేమో తెలియచెయ్యవలసిందంటూను. ఆవేళ మన వాడి కాన్వాయిలారీలు తప్ప యింకేవీ అప్పటికి చేరుకోలేదు; యీసంగతి సెక్యూరిటీ ఆఫీసరుకి తెలుసును. ఫలానా కేంద్రంనుంచి వచ్చిన మా లారీలే గాని మావి యేవీ రాలేదని వెంటనే వర్తమానం చేసేద్దా మనుకున్నాడు గాని, ఎందుకయినా మంచిదని కాన్వాయి లారీనెంబర్లు తనిఖీ చెయ్యడం ఆరంభించేడు. ఏయే నెంబరు లారీలు కాన్వాయిగా ఏర్పరిచేరో జగ్గడి గాడి డ్యూటీస్లిప్పులోనే వుంటుంది. సెక్యూరిటీ ఆఫీసరు మొదట్లో లారీల సంఖ్యమాత్రమే చూచేడు; నెంబర్లు తనిఖీ చెయ్యలేదు. తీరా అపనికి పూనుకునేసరికి ఒక లారీనెంబరు భేదించింది. ఆ భేదించిన నెంబరూ, అమెరికన్ బేసుకేంపువాళ్లు యిచ్చిన నెంబరూ సరిపోయినాయి. సెక్యూరిటీ ఆఫీసరుకి తలాతోకా తెలియలేదు.

ఇంతలోకే ఒక అమెరికన్ ఆఫీసరుకూడా దిగబడ్డాడు, మూడుటన్నుల లారీ ఒకటి వేసుకుని. ఆ శకటాన్ని చూడగానే జగ్గడి ప్రాణాలు నిలువునా ఎగిరిపోయినాయి. అయినా యింక చెయ్యగలిగింది ఏమీ లేదనుకుని గంభీరంగా వూరుకున్నాడు.

చూస్తూవుండగా ఆ అమెరికను తిన్నగా సెక్యూరిటీఆఫీసరువద్దకి వెళ్లి, "ఫలానాచోట కాఫీ పుచ్చుకుని బయలుదేరే సమయంలో మా లారీకి బదులుగా మీదాన్ని తీసుకుపోయినాను; కాస్తదూరం పోయేసరికి లారీలో పెట్టుకున్న నాసిగరెట్టుటిన్ను కని

పించలేదు. దానికోసం తడుముకుంటూ తరకాయించి చూసేసరికి బంపరుమీద నెంబరునిబట్టి యిది మీది అని తెలిసింది. తీసుకోండి. మాది ఫలానాలారీ గైరుహాజరీ అయిపోయిందని మా కేంద్రస్థానానికి టెలిఫోనుచేసేను. ఈవ్యవహారంలో మీకు యేమయినా యిబ్బందికలిగితే మన్నించండి" అంటూ అతిపెద్దమనిషితరహాగా చెప్పేడు.

౫

ఆ వారాఖ్యాలం సెక్యూరిటీఆఫీసరు యిచ్చేడు. జగ్గడు చెప్పినవన్నీ కూడా అందులో వివరాలన్నీ నిజమేనని. మిలిటరీడ్యూటీలో ప్రమత్తతగా వున్నావన్న నేరంమీద యింక శిక్షవిధించాలి. కథ అంతా విని మిగతా యిద్దరుమెంబర్ల ముఖాలూ చూసేను, వారి అభిప్రాయాన్ని ఆహ్వానిస్తూను. యిద్దరూ నేరాన్ని స్థిరపరిచేరు.

నాకు వొళ్లు మండిపోయింది. "కేసు పరిష్కరించే సందర్భంలో మీర్లు మూలకారణాన్ని ఎత్తుకోవడమే లేదు. మీరు డ్యూటీలో వుండగా దారిమధ్యస్థంలో ఎందుకు ఆగేడు అన్నది వేరేప్రశ్న. దాన్ని తరవాత ఎత్తుకుంటాను. ఆదిని నేను అడిగేది ఏమిటీ అంటే, జగ్గడు నిలిపిన లారీ అక్కడనుంచి ఎందుకు కదలాలని ఆవరలవాడు ఆఫీసరు. జవాబుదారీ ఎవర్కవవున్న వ్యక్తి. తన లారీ ఎక్కడవుంచేడో తనకే తెలియలేదూ? ఎదరగా వచ్చినవాడే పెళ్లికొడుకా? రేపు యింకోసంగతి జరిగినా యిలా పరిష్కరించబోవలసిందేనా? ఆ ఆఫీసరు ప్రమత్తప్రవర్తనకి ఏమి సంజాయిషీ వచ్చింది? అసలు యీప్రసక్తి అమెరికనువారితో ఎత్తుకున్నారా? లేకపోతే, ఎందుకు లేదు? ఆ లారీయే అక్కడ వుంటే యీగొడవే లేకుండునే!

"ఇహ కాగాపోగా, జగ్గడు హోటలుదగ్గర ఎందుకు పెర్మిషన్ లేకుండా ఆగేడూ అని. ఒక యూనిట్లు వొదిలి రెండోయూనిట్లు చేరుకోకముందు స్వయం రాజా స్వయం మంత్రీన్ని. ఇంతకూ పెర్మిషన్ పుచ్చుకోడానికి అక్కడ మధ్యేమార్గంలో పై అధికారులు యెవరున్నారని? దురుద్దేశ్యం ఏమయినా కనిపించిందేమోనంటే, చెడుగు లేదు సరికదా, నిర్ణీత కాలానికి వస్తువులు గమ్యస్థానం చేరకోవాలనే దృఢనిశ్చయంతో మిగతాలారీలని వాడు ఆపుచెయ్యలేదన్నది మెచ్చుకోవలసిన విషయం. పైగా, లారీ కనుక్కున్నానని అనుకున్న వెంటనే రివ్వున పోయి వాటిని చేరుకుని భద్రత కనబరిచేడు. ఆ లారీ కనుక్కోవడంలో పొరపాటు జరిగిందని అంటారు. ముందుగా యింకొకరివల్ల జరిగిన పొరపాటుకి యిది అనుబంధం అని నేనంటాను. మీరే అపాశంగా లారీపోయిందని ఫోనులో చెబితే యేమవును? దీర్ఘప్రయాణంలో కాన్వాయి ఏ ప్రదేశంలోనూ ఆగకూడదని రూల్సు వున్నాయా! అలా ఆగినప్పుడు యీప్రమాదం జరగడం అసంభవమా?"

అరఘంట మాట్లాడినా, ఇద్దరిలోనూ ఒక్కడూ ఉలకడు, పలకడు. కేసు కొట్టేసేను. ఈ రికార్డు పైకి వెళ్లిన పదిరోజుల్లో నాకు సింగపూరు బదిలీఅయిందని వార్త వచ్చింది. ఇద్దరు కెప్టెనులూ ముసిముసినవ్వులు నవ్వుకున్నారు. వీడ్కోలుసమయంలో సెల్యూటు తీసుకుని కరస్పర్శ చేస్తూ అన్నాను: "అక్కడా ఎవడో వుండివుంటాడు, నాచేతుల్లో శిక్షవిధుందలకావడానికి" అని. ఆకాశంలో నక్షత్రాల్లాగ వాళ్ల కళ్లు ఒక్కమారు మెరిసేయి. మన పటాలంమొహంమీద చిరునవ్వు చంద్రవంకయి వెలిసింది!

నెం. ౧౦, డౌనింగ్ స్ట్రీట్

[ఏకాంకిక]

✽

— శ్రీ తెన్నేటి సూరి —

రంగము ౧

[ఆఫీసుగది. ఒక పెద్దబల్ల. దానిమీద చిందర వందరగా పాత న్యూసు పేపర్లు పారేసివుంటాయి. ఆ బల్లకు వెనకప్రక్క ఒక రివాల్వింగ్ చైర్‌లో జారిగిలబడి చర్చిల్ కూర్చునివుంటాడు. లావుపాటి చుట్టఒకటి కొరికిపట్టి పెదవిమీద వ్రేలాడబడివుంటుంది. అతని నిస్పృహ అంతా ఆ చుట్టలో కనబడుతూ వుంటుంది. తుపానుదెబ్బ తిన్నట్టు చికాకుగా వుంటాడు. పెద్దకారాబోటీకోటు తొడుక్కునివుంటాడు, గుండీలు పెట్టుకోకుండా. కోటుకాలరు పైకిలేచి గందరగోళంగా వున్నట్టు కనుపించుతాడు. వెనకప్రక్క గోడ దగ్గిర ఒకవైపున చిన్న బల్లమీద 'స్టౌ'మీద కాఫీ కాగుతూవుంటుంది. రెండవప్రక్క ఒక జాకీకొయ్యల చెక్కల రాకులో కొన్ని పాతఫయిల్సు దుమ్ముకొట్టుకొనివుంటయ్. మధ్యగా ఒక చిన్న దిడ్డిదరవాజా వుంటుంది. ఈ గోడకు యెడంచేతివైపు వున్న గోడకు ఆనుకుని శెక్రటరీ టేబుల్ వుంటుంది. దానిమీద ఒక ఓల్డుమోడల్ "ఉడ్‌వర్తు" టైప్ మెషిన్ కొయ్యమూతతో మూసివుంటుంది.

"ప్చ్!" అని నిస్పృహతో న్యూసు పేపర్ బల్లమీద పారేసి, నిట్టూరుస్తూ లేస్తాడు చర్చిల్.

చర్చిల్ ప్రైవేటు శెక్రటరీ మేరీ — ౨౫ సంవత్సరాల వయసుగల పడుచు—ఒక గుప్పెడు ఉత్తరాలు, ఒక ఫైలు పట్టుకుని తొందరతొందరగా ప్రవేశిస్తూ—]

మేరీ—వెధవజనం...వెధవజనం...

చర్చిల్—(ఆదుర్దాగా) ష్! మతిపోతోందా యేమిటి మేరీ! యీ లెక్షన్సు వచ్చి పీకమీద కూర్చున్నయ్ ... జనాన్ని వెధవలు గిధవలు అంటూ, మామూలుపంథాలో మాట్లాడుతూవుంటే కొంపలంటుకుంటయ్...అసలు యేమిటీ గందరగోళం?

మేరీ—వెధవజనం...

చర్చిల్—ష్!

మేరీ—బండెడు ఉత్తరాలు తెసులడ్డై. (చరచరా పోయి తనబల్లదగ్గిర కూర్చుంటుంది.)

చర్చిల్—(కంగారుగా) ఆ! బండెడు ఉత్తరాలూ తెసులడ్డై...ఆఫీసు ఉత్తరాలే!...చచ్చాం...కొంపపోయిందిరా భగవానుడా!

మేరీ—ఏమిటండీ సార్! మాట అర్థంచేసుకోకుండా ప్రతిదానికీ కంగారుపడతారు ... సమాధానం వ్రాయవలసిన ఉత్తరాలు ఒక బండెడు ఉన్నాయన్నాను.

చర్చిల్—(కన్ను చరుచుకుని) కర్మం...కాలిపోయాయేమోనని కంగారుపడి చచ్చాను...జనమంటావేమిటి?

మేరీ—బోలెడంత పనుందని పెందరాళే బయలుదేరి వస్తున్నాను. మధ్య...ట్రెఫాల్గర్ స్క్వేర్ దగ్గిర ...వెధవజనం...

చర్చిల్—ష్!...ఏమిటది?...ఆమాట వాడొద్దనలేదూ?

మేరీ—త్రోవయిస్తేనా? రెండుగంటలసేపక్కడ పడివున్నాను...చివరికి ఒక కానిస్టేబుల్

---

*జార్జి బెర్నార్డుషాకు కృతజ్ఞతతో.

చూసి...జనంలోనుంచి కొంచెం యివతలికి జారవేస్తే బ్రతికి బయటబడ్డాను.

చర్చిల్—ట్రెఫాల్గర్ స్క్వేర్ దగ్గర జన మెం దుకు మూగారు ?

మేరీ—ఆఁ!...అలగాడు–లాస్కీ ఏదో మా ట్లాడుతున్నాడు...పనిలేని జనమంతా యేముందీ, చుట్టూ మూగారు...ఆఘోష వింటానికి.

చర్చిల్—అయితే వాళ్లప్పుడే కత్తులునూరటం ప్రారంభించారన్నమాటా !

మేరీ—కత్తులు నూరటంకాదు...గోడగడ్డలూ కాదు...వట్టి భజగోవిందం...అసలు మీలో వుంది పెద్దరూ యీ పెంకెతనం. మీరు మెత్తమెత్తగా వూరుకుంటూంటే వాళ్లు మరీ నెత్తికెక్కుతున్నారు.

చర్చిల్—వూరుకోక ఉరిబెట్టుకోమంటావా ? యేమిటి చెయ్యటం ?

మేరీ—పోలీసుడిపార్టుమెంటంతా ఏమైంది ? కమీషనరును పిలవరాదూ ? చేతులో అధికారం వుండ గానే నిస్సృహతో చేతులు కట్టుక్కూర్చోవట మేమిటండీ ?

చర్చిల్—మాటమాటకీ పోలీసుల్ని పిలిస్తే వాళ్లుమటుకు విసుగెత్తుకురాదూ ?...(నెమ్మదిగా ఫోను తీసుకుంటాడు)హల్లో...ఆ...నేనే...ట్రెఫాల్ గర్ స్క్వేర్ వ్యవహారం...ఫరవాలేకపోవటమేమిటండీ బండలు. ఒకసారి వచ్చి కనిపించిపొండీ!...(ఫోను క్రిందబడేస్తాడు) అబ్బా! పనవదికాదు. బుర్ర వే డెక్కుతోంది. (బుర్ర తడుముకుంటాడు)

మేరీ—లైమ్‌జ్యూసన్నా రాసుకోండి... ఇవ్వాళ బోలెడంత పని వుంది. అప్పుడే వేడెక్కితే యెలా ?

చర్చిల్—లైమ్‌జ్యూసూ వద్దు, మట్టీవద్దు. (పోయి కొంచెం కాఫీ కప్పులో పోసి తెచ్చుకుని మళ్లా కుర్చీలో కూలబడతాడు) కావాలని కొనితెచ్చు కున్నాం మొయ్యలేని ఈ గాడిదబరువు. ఇప్పుడు తెంగపడితే లాభమేమిటి ?...తియ్య...తియ్య... ఇవ్వాళ యేమేం గందరగోళా లున్నాయో తియ్య.

మేరీ—ఇవ్వాళ చర్చిలో సాయంత్రం అయిదు గంటలకు మీస్పీచ్ వుంది. అది ముందు ప్రిపేర్ చెయ్యాలి.

చర్చిల్—మన అధికారాలు నిలుపుకోటానికి మనం వాళ్లని ఉపయోగించుకోవాలని చూస్తుంటే ఈ బిషప్పులు మనల్ని కట్టుకు వేళ్లాడాలని చూస్తారేమిటి? ...తోగి తోగి రాచుకుంటే బుట్టెడు బూడిద రాలిం దట. (చారాగా) ఈవెధవస్పీచ్ నాతో చెప్పకుండా యెందుకు యేర్పాటుచేశావు?...ఏదో మిడిమేలం తెచ్చి పెడుతూవుంటావు...

మేరీ—(గింజుకుని) చిత్తం...అది నేను తెచ్చి పెట్టిన మిడిమేలం గాదు...'ఆహ్వానపత్రిక' అని స్వయంగా మీరు తెచ్చుకుంటే...బిషప్ గారు వచ్చి అడగ్గానే... మర్యాదకి...ఓ, దానికేం అనేశారు. మీరు నెత్తిమీదికి తెచ్చుకుంటూవుండేదీ...నామీదికి తోస్తూవుండేదీ... ఛీ! ఛీ! వెధవఉద్యోగం–ఎక్కడన్నా కూలిచేసుకు బ్రతకటం మేలు.

చర్చిల్—మేరీ!...పెద్దతనంలో ఏదో మతి లేక అన్నముక్కకి అంత గింజుకుంటావేమిటి ?

మేరీ—పెద్దతనమేమిటండీ! పెంకెలు...అంత మతిపోయిన పెద్దతనంలో సూర్య్యడస్తమించని ఈ అఖండసామ్రాజ్యచక్రాన్ని నడిపించటానికి పూనుకో వటం అఘాయిత్యమే నా...మరేమన్నానా ?

చర్చిల్—ఆహాహా! మేరీ!...వట్టి పెర్రి మేరీ! అసలువిషయం నీ కింకా అర్థంకాలేదన్నమాట. బ్రిటిష సామ్రాజ్యచక్రాన్ని యెవ్వడూ నడిపించనక్కరలేదు. దానంతట అదే గాడితప్పకుండా పాతరైలుపట్టాల మీద పరుగెత్తుతూ వుంటుంది. అధికారం యెవడికి వచ్చినా దాని గమనాన్ని యెవ్వడూ మార్చలేడు. మనం...ఆచక్రం యిరుసుమీద వాలిన ఒక ఈగ అన్న మాట...దుమారం రేపుతూ చక్రం పోతుంటే ఈ తుపానుకంతకూ నేనే కారకుణ్ణని చంకలుకొట్టుకోటం మినహా మనం నడిపే ద్లేమిటి మేరీ అది ?

మేరీ—ఈ ఉపన్యాసం ఆపించండి సార్, బోలె డంత పని వుంది...ఇంతవరకూ శ్రీరామ లేదు.

చర్చిల్—అవునవును...పనిచూడాలి ముందు ...కొండంత పని వుంది నెత్తిమీద...సరే తియ్యి... గ్యాస్‌తో లాభంలేదు...పనిచెయ్యాలి...కట్టి పాడి పని గావాలి...'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్నాడు.

మేరీ—ఆఁ! నాముఖం అన్నాడు; ఈస్పీచ్ సంగతి చూడండి...అప్పుడే పదకొండుగంటలుకూడా దాటింది.

చర్చిల్—ఏస్పీచీ ?

మేరీ—(నిస్పృహగా) ఓరి భగవానుడా!

చర్చిల్—క్షమించు మేరీ!...ఏస్పీచీ ?

మేరీ—సాయంత్రం చర్చిలో మీస్పీచి మాటండీ.

చర్చిల్—అవునవును...మరిచిపోయాను. సరే వ్రాయి...హుఁ! (గొంతు సవరించుకుని యేమీ తోచక బుర్ర గోక్కుంటాడు.) సాయంత్రం అక్కడ చర్చిలో యేం మాట్లాడితే బాగుంటుంది?...బ్రిటిష్ ఆర్థికమహాసూత్రాలనుగురించి మాట్లాడితే ...ప్చ్... అక్కడివాళ్లకి యీ పెనవచెత్త నచ్చదు...పోనీ... 'క్రీస్తు'నుగురించి మాట్లాడితే...భాభా! అది చర్చిగా మల్లు...(ఆలోచించి)అవును చర్చిగనక 'బైబిలు గ్రంథ రాజముయొక్క విశిష్టత'అని మాట్లాడితే? చాలా బాగుంది. ఈసబ్జెక్టు యెక్కెలెంటన్నమాట. మేరీ! సరే ప్రారంభించు...సోదరసోదరీమణులారా! భగవంతుని ఔరసపుత్రులైన ఓ మతాధికారులారా!...

మేరీ—ఆస లాసబ్జెక్టు పనికిరాదండీ!

చర్చిల్—నీకేమన్నా పిచ్చా యేమిటి మేరీ! ...దివ్యమైన సబ్జెక్టు, దాని కేమిటి?

మేరీ—అది కాదండీ. అక్కడ మాట్లాడవలసిన సబ్జెక్టు బిషప్పుగారే నిర్ణయించారు...సబ్జెక్టూ, దానికి కావలసిన సూచనలూకూడా వారే పంపారు.

చర్చిల్—ఏమిటీ...సబ్జెక్టూ తనే యిచ్చి, సూచనలూ తనే చేసినవాడు ఈ కాస్తా తనే మాట్లాడితే పోదూ—మళ్లా నాచేత వాగించటం దేనికి ?

మేరీ—మళ్లా మొదటికొచ్చారు ... చర్చిని రాజ్యాంగం ఎలా ఉపయోగించుకుంటున్నదో, రాజ్యాంగప్రపలంబబడిని తామూ అలా ఉపయోగించుకుందామని...ఇందులో కొత్తేముంది?...ఇసకతక్కెడ పేడతక్కెడ.

చర్చిల్—మొదటికి రావటమేమిటి మేరీ?... మొదట్లోనుంచి మనం అసలు కదిలితేగా యెక్కడకన్నా రావటానికీ, పోవటానికీ...సరే యేమి టాసబ్జెక్టూ?...ఏదీ ఆకాగితం తియ్యి.

మేరీ—(కాగితం తీసి చదువుకుంది) "సోషలిజంవల్ల ప్రపంచం తగులబడిపోవును."

చర్చిల్—నాకెన్నమ్న...ఎవరన్నా రామాట?

మేరీ—ఎవరూ అనలేదండీ ... బిషప్పుగారు సాయంత్రం మిమ్మల్నే ఆసభలో అనమన్నారు.

చర్చిల్—నాకేమన్నా మతిపోయిందనా ఆయన ఉద్దేశం? పోనీ, నేను మాట్లాడితేమటుకు ఈ లేకి మాటలు వినటానికి యెవడు కూర్చున్నాడు ఈరోజుల్లో—వేరే తాటాకు లక్కర్లా..."చెప్పెడివారు చెప్పినన్ వినియెడివారికి లేకుంటే వివేకముకల్గదె యింత యేటికిన్" అన్నాడు.

మేరీ—మనం మాట్లాడుతున్న చెత్తంతా ప్రజలు అంగీకరిస్తున్నారా యేమిటండీ ఆమాట కొస్తే? ...యేదో 'అశ్వత్థామా హతఃకుంజరః'అనేసెయ్యండి, శిసదతీరిపోతుంది.

చర్చిల్—అల్లా వీల్లేదు మేరీ! నా కిష్టంలేదు. ఆముక్క నేను మాట్లాడను.

మేరీ—మీరీవిషయంలో మొండిపట్టు పట్టుకు భీష్మించుకుకూర్చుంటే లాభంలేదు...మనకు స్వాతంత్ర్య లెక్కడేడిసిందండి?...మన ఆత్మల్ని మన్నించటానికి వారికీ అవకాశాలు లేవు; వారి ఆత్మల్ని మన్నించటానికి మనకూ అవకాశాలులేవు. ఈ సుడిగాల్లో వాళ్లూ, మనంకూడా గిరగిరా తిరిగిపోవాల్సిన ఖర్మ...చుట్టజుట్టి ఈ సుడిగాలి మన్నందర్నీ చివరికి యేకొండకొమ్ముకో వేసి ఒక్క బాదు బాది వదిలిపెడుతుంది...అందాకా మన మిలా గిరగిరా ఊపిరాడకుండా తిరుగుతూవుండాలిసిందే. ఇది కర్మ...

చర్చిల్—సాయంత్రం అప్రసంగం చెయ్యక పోతే...నాకే దేం తెగిపోతుందంటావ్ ?

మేరీ—మీకె తెగిపోయే దేముంది ? మన ఉద్యో వాయించటానికి ఆయన్ని రమ్మన్నప్పుడు ఆయన మాటుకు రేపు భరిస్తారంచడూ? ఇందమ్మా అంటే అందమ్మా...

చర్చిల్—ప్రారబ్ధం... తప్పదంటావ్... హర హరా ! దేంఖర్మం వచ్చిందిరా బాబూ !

మేరీ—పోనీ చెవులుమూసుకు మాట్లాడుదురు గాని లెండి...ఫరవాలేదు.

చర్చిల్—సరే...కానీ ... తప్పుతుందీ...మన కర్మ. (స్పీచ్ పోజులో నిలబడి డిక్టేట్ చేస్తూ) "సోదర సోదరీమణులారా ! భగవంతుని శౌరసపుత్రులైన ఓ మతాధికారులారా ! సోషలిజంవల్ల ప్రపంచం తగుల బడిపోతుంది." (ఆలోచించి) అబ్బా...ఎట్టా తగులబడి పోతుంది మేరీ?...అసంభవం ...ఆయన పంపిన నోట్సు మింటో తియ్యి.

మేరీ—(కాగితం తీసి చదువుతుంది) "బ్రిటిష్ జాతీయతకు మూలకందం బ్రిటిష్‌గృహం—బ్రిటిష్ గృహానికి మూలబీజం స్త్రీ—సోషలిజంవల్ల స్త్రీ కట్టు తప్పి పాడైపోతుంది—దాంతో బ్రిటిష్‌గృహవ్యవస్థ నాశనమౌతుంది. గృహవ్యవస్థ నాశనమైపోతే, బ్రిటిష్ జాతే పతనాన్ని పొందుతుంది. బ్రిటిష్‌జాతే పోతే బ్రిటిష్‌సామ్రాజ్య మేం గావాలి—సూర్య డస్తమిం చని సామ్రాజ్యమే పోతే సూర్యు డేంగావాలి—సూర్యుడే పోతే సూర్యునిమీద ఆధారపడివున్న ఈ సమస్తలోకాల గతీ రేమిటి ? సోషలిజమనే ప్రళ యాగ్ని యీ విశ్వాన్ని విధ్వంసంచేయకమునుపే సో సోదరసోదరీమణులారా ! కళ్లు తెరవండి. సోషలిజం మీ స్త్రీలను పాడుచేస్తుంది. మీ స్త్రీలను మీకు కాకుండా చేస్తుంది. మీ స్త్రీలను మీరు కాపాడు కోండి-బ్రిటిష్‌స్త్రీ ప్రపంచం బ్రతికివుండటానికి పట్టు కొమ్మ...సోదరులారా ! కావలిస్తే సరిసమానంగా ఆస్తులను పంచండి, మెషిన్లను పంచండి, అధికారాల్ని పంచండి, తోటల్నీ దొడ్లనూ పంచండి, పందుల్ని పంచండి, కుక్కల్ని పంచండి...కాని స్త్రీలనుమాత్రం పంచకండి..."

చర్చిల్—ఏమిటి మేరీ ఈ భజన ?...మరీ చెక్కభజనగా వుంది. ఈ వాక్యాలన్నంతా నేను వ్రాగా ల్నిందే ?...నాన్సెన్స్.

మేరీ—ధోరణి బాగానే వుందండీ...అసలది చెడిపోతుందంటే హడిలిచస్తారు జనం. ఆ మాట ఉద్ఘా టించటం మొదలుపెడితే ... మతిచెడి...మీరు యేం మాట్లాడుతున్నదీ యోచించేశక్తి నశించి తలలు వూపే స్తారు.

చర్చిల్—సరే ఈభజనంతా వ్రాసెయ్... ఇందులో మన సొంతంకూడా రెండుకు కొంత... కాళిదాసుకవిత్వం కొంత, నాపైత్యం కొంతా అని.

మేరీ—షేక్సుపియర్‌మీద తియ్యబాల్డుయమెం డేసమలాగు దీనికి ఒక చిన్న ముక్కకూడా తగిలిస్తే రేపు యెలెక్షన్ మాని ఫెస్టోకు ఇది ప్రాతిపదికగా వుంటుంది.

(ఎలెక్ట్రిక్ బెల్ మోగుతుంది)

మేరీ—పోలీస్‌కమిషనర్ వచ్చినట్టున్నాడు: లోపలికి పంపించుతాను (బయటికి వెడుతుంది).

(చర్చిల్ చాలా తొందరపనిలో వున్నట్టు నటించుతాడు. ఒక పెన్సిల్ తీసుకుని చరచరా వ్రాస్తూవుంటాడు తలెత్తిచూడకుండా. పోలీస్‌కమిష నర్ ప్రవేశించి మిలిటరీశాల్యూటు పెడతాడు)

చర్చిల్—(వ్రాసుకుంటూ, తలెత్తి చూడ కుండానే) నమస్తే...కూర్చోండి. వన్ సెకండ్—

కమిషనర్—చిత్తం, చిత్తం. (కూర్చుంటాడు)

చర్చిల్—(నెమ్మదిగా తలెత్తి) ట్రెఫాల్గర్ స్క్వేర్‌లో యేమిటీ గందరగోళం...

కమిషనర్—అక్కడ యేమీ గందరగోళం లేదు. అక్కడ ఊకదంపుగా కొన్ని ఉపన్యాసాలు జరుగుతున్నయ్. ప్రజలు తెల్లముఖాలు వేసుకు విం టున్నారు. అది చాలా మంచిదే లెండి.

చర్చిల్—ఏం మంచడీ నాముఖంమంచి ! చివరికి ఏం మునుగుతుందో—డిస్పర్సు చేయలేక పోయారా ?

కమిషనర్—ఏం మునుగుతుందండీ ? ఏమీ మునగదు. నాకంటే ఈవిషయం మీకింకా బాగా తెలియవలసింది.

చర్చిల్—(తీవ్రంగా) ఏమిటయ్యా నా కింకా తెలియవలసింది ?

కమిషనర్—అదిగాదు సార్ !—ఏ స న్యా ఉపన్యాసాల హోరు సాగుతున్నప్పుడూ, వాటిని వింటూన్నప్పుడూ ప్రజలు నిర్జీవంగా కూర్చునిపోతారు. అల్లాంటప్పుడు ప్రజలవల్ల యేమీ ప్రమాదం రాదు. అది నాకు బాగా తెలుసు. అల్లాకాకుండా నిమ్మకు నీ రెత్తినట్టుగా వున్నట్టు ప్రజలు కనపించిరే అడుగున యేదో తుఫాను లేసుతోందన్నమాట. ప్రజల మనస్థితి నర్థంచేసుకున్న ప్రతివ్యక్తికీ యీవిషయం బాగా తెలుసు. ఉపన్యాసాల హోరు సాగుతూన్నంతసేపూ ప్రజలవల్ల యేప్రమాదం రాదు. మీరు సుందెలమీద చెయ్యివేసుకుని హాయిగా నిద్రపోవచ్చు.

చర్చిల్—ఏమో ! మీ ఆర్గ్యుమెంటు మా కంత నచ్చలేదు. (అధికారపు దర్జాతో) అసలు ఇంత గొడవ లేనుతుంటే మీ రేం చేస్తున్నారో నేను తెలుసుకో వచ్చునా ?

కమిషనర్—(తీవ్రంగా) మాడ్యూటీ మేం సక్రమంగా నిర్వర్తించుతూ నేవున్నాం సార్. వీలైనంత మంది ఊకదంపుగాళ్లను ఉత్సాహపరిచి ఉపన్యాసాలు నఖముఖాలా సాగేటందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజలవల్ల యేప్రమాదమూ రాకుండా సామ్రాజ్యాన్ని కాపాడుతున్నాం. మీరు మాకు యింకా సహాయం చేయదలచివుంటే మరికొందరు పార్లమెంటరీ గ్యాసురాయుళ్లను, మతోపన్యాసాలో, సాంఘికోపన్యాసాలో, ఆర్థికోపన్యాసాలో, సామ్రాజ్యవాదోపన్యాసాలో, ప్రజాస్వామికోపన్యాసాలో, సామ్యవాదోపన్యాసాలో — చివరికి బోల్షివిక్ ఉపన్యాసాలైనా సరే—ఏదో ఒక దంపు సాగుతూవుండటానికి ఉత్సాహపరచి పంపుతూవుంటే ప్రజలవల్ల యేప్రమాదమూ రాదు—నాదీ పూచీ.

చర్చిల్—ఘనత వహించిన పార్లమెంటు మెంబర్లను చులకనగా మాట్లాడటం అదొక వ్యసనప్రాయమై పోయింది ప్రతివాడికీ. పార్లమెంటు మెంబర్లంటే మీకు రవ్వంతైనా గౌరవం లేకుండా మాట్లాడటం నాకు చిత్రంగా వుంది.

కమిషనర్—వావా టలా వుంచండి—అసలు ఎవరికైనా కొందరికి ఉండంటారా?—సరే అదలా వుంచండి. క్రైఫాల్ గర్ స్క్వేర్ వ్యవహారంలో మా పంథా మీకు నచ్చినట్టు లేదే ?

చర్చిల్—ఛ్ఛ !...(లేదని సూచిస్తూ పెదవి విరుస్తాడు)

కమిషనర్—నచ్చకపోతే మరేం చెయ్యమంటారో ఆజ్ఞాపించండి. డిస్పర్సు చెయ్యమంటారా ?... చెప్పండి అదెంతపని... రెండు మెషీన్‌గన్‌లు ఇప్పించండి... టప్ టప్ టప్... రెండునిమిషాలు... ఫినిష్—ఆజ్ఞాపించండి.

చర్చిల్—పరెసర్లే... మెషిన్‌గన్ల వ్యవహారం మటుకు రొంత్తికం డిప్పుడు... ఎలెక్షన్లూ, మట్టీ ఎన్ని గందరగోళా లున్నాయ్ ! బాధ్యతలేకుండా అంత నిర్లక్ష్యంగా మాట్లాడుతారేం ?

కమిషనర్—పోలీసువాళ్లకు ఎలెక్షన్ల బాధ్య తేముంది సార్ !

చర్చిల్—సరేబాబూ ! మీరు ఇక వెళ్లండి... జాగ్రత్తగామటుకు కనిపెడుతూవుండండి. ఉపన్యాసాల హోరుమటుకు ఆపే లేపకండి...గుడ్‌బై.

కమిషనర్—గుడ్‌బై. (బయటికి పోతాడు)

చర్చిల్—(ఆరిపోయిన చుట్టపీక జాగ్రత్తగా తోలుకేసులో దాస్తూవుంటాడు)

మేరీ—(ప్రవేశించి) ఛీ! ఛీ! ఆదేమిటి అసహ్యం. ఆ ఎంగిలిపీక దాచుకుంటున్నా రేమిటి ? ఏంకర్మం వచ్చింది. అవతల పారెయ్యగూడదూ ?

చర్చిల్—బ్రిటిష్‌పార్లమెంటు మహామంత్రికి వున్న బాధ్యతేమిటో అణుమాత్రమైనా గుర్తించకో

కుండా మాట్లాడావు. ఎంగిలిచుట్టను దాచటమంటే బ్రిటిష్‌జాతీయసంపదను పొదుపుచెయ్యడ మన్నమాట ఇది తప్పంటావా సెక్రటరీ?

మేరీ—లేదు ప్రీమియర్ సాబ్! నేను యీ ఆర్థిక మహామంత్రాన్ని అర్థంచేసుకోలేక అలా అన్నాను... అజ్ఞానం క్షమించండి. సరైన ఆర్థికవ్యవస్థను స్థాపించలేనప్పుడు ఎంగిలిపీకెల్ని దాచటం అది ఉత్కృష్టమైన ప్రజాసేవక్రిందే జమకట్టవలసివుంటుంది.

చర్చిల్—బాగా గ్రహించావ్! చూశావా నా తెలివితేటలు...అసలు ఒక శాసనంకూడా పార్లమెంటులోకి తేవాలని చూస్తున్నాను.

మేరీ—ఏమిటది? నాతో చెప్పారుకారేం? చిత్తు డ్రాఫ్టుతయారుచేసేవాన్ని.

చర్చిల్—ఆఁ, ఏమీ లేదు. రోడ్లమీదా, పార్కుల్లోనూ పారేసివున్న సిగరెట్టుపీకలన్నీ యేరించటం; వాటిని మళ్లా క్రొత్తసిగరెట్లక్రింద తయారుచేయించటం—దీంతో రెండుకార్యాలు సాధింపబడతాయి. ఒకటి—జాతీయసంపదను పొదుపుచెయ్యటం, రెండు—యీపీకెలన్నీ యేరటానికి కోలెడంతమంది కూలీలు కావలసివస్తారు. అనెంప్లాయ్‌మెంటు సాల్వయిపోతుంది. చూశావా నా తడాఖా! ఒక్క దెబ్బకు రెండుపక్షులు!

మేరీ—వారేవా! యమస్కీం యెత్తారండీ.

చర్చిల్—స్కీమంటే స్కీమా—రేపు యెలెక్షన్‌మ్యానిఫెస్టోలో ఈస్కీముకు ప్రకటిస్తే లాస్కీ గీస్కీ తెల్లముఖాలువేసి, తిలలూ నీళ్లూ జాగ్రత్త పడాలిసిందే.

మేరీ—సరే...ఈస్పీచ్ సంగతి చూడండి.

చర్చిల్—అవునవును. అదో మిడీ మేలమందిగా. ...సరే వ్రాయి. (డిక్టేటు చెయ్యటానికి కూర్చుంటాడు) పోనీ, మేరీ...ఈరోజెంగిలిపీకెల స్కీముసుగురించే మాట్లాడితే?

మేరీ—వద్దుబాబూ! మళ్లా కొత్తదెందుకు చంపుతారు. కొంతవరకు వ్రాశానుగా. సోషలిజం ప్రపంచాన్ని తినులబెట్టెయ్యడమే కొట్టండి.

చర్చిల్—సరే!...మనమిప్పు డెక్కడున్నాం?

మేరీ—(సందేహంగా) ఏమిటండోయ్...ధోరణి మారుతోందే!...నేను బయటికి వెళ్లినప్పుడేమైనా కొంచెం జల్సా చేశారాయేమిటి?

చర్చిల్—నానెన్నను......స్పీచ్‌లో ఎక్కడున్నాం అన్నాను.

మేరీ—ఆఆ! స్త్రీలను పంచేసుకోటంలో వున్నాం.

చర్చిల్—ఛీ! ఛీ! ఏమిటా వెధవమాటలు. స్త్రీలను పంచెయ్యడమేమిటి?...స్కాండలస్.

మేరీ—అదేనండీ. బిషప్పుగారు మిమ్మల్ని సాయంత్రం చర్చిలో మాట్లాడమన్నదీ.

చర్చిల్—ఇవాళ ఇది మాట్లాడమంటాడు—రేపొక బ్రోతెల్ రన్ చెయ్యమంటాడు.

మేరీ—బిషప్పుగారి మహాపవిత్రమైన ఆశీస్సు వుంటే బ్రోతెల్ రన్‌చేస్తేమటుకు తప్పేమిటి, స్వర్గం తలుపులు అమాంతం తెరుచుకోవూ, మీకోసం!

చర్చిల్—ముసలాడికి మృత్యువుసంగతి జ్ఞాపకం చెయ్యటం...అది...చిలిపితనం ... నాకు స్వర్గంవద్దు నిర్గం వద్దుగాని, పదికాలాలపాటు ఈ ప్రీమియర్‌షిప్ ఊడకుండా వుండేవిధానం చూద్దురూ—'కృష్ణా రామా' అంటూ ఇలాగే ఏదో చుట్టపీక తగలేసుకుంటూ కూర్చుంటాను. (మరొక చుట్ట తీసి వెలిగించుతాడు.)

(తెరలో—"కన్సర్వేటివ్ ప్రభుత్వం నశించాలి, నశించాలి, నశించాలి—చర్చిల్ మంత్రిత్వం పోవాలి—పోవాలి పోవాలి" అని కొండకేకలు.)

చర్చిల్—ఏ...డి...శారు ...సరేగాని, మేరీ ఆ ఫ్రాకు అంత పైకి కుట్టించావేం? గుడ్డ చాలా బాగుంది. ఇండియాసిల్కా? గుడ్డలేక ఇండియాలో జనం యేడుస్తారుగాని...యుద్ధం వచ్చేదీ...ప్రళయం వచ్చేదీ నీకుమటుకు కరువురాదు. బ్రిటిష్‌సామ్రాజ్యం, నాప్రీమియర్‌షిప్పూ చల్లగా వుండాలని నేననడం దేనికి...దీనికే. చర్చిల్ ప్రభుత్వం పోవాలిట! పో...వా...లి, పోతే...ఏంతింటారు...ఇనుమా? రాక్షసబొగ్గా?

(మళ్లా బెల్ మోగుతుంది.) మళ్లా యెవడోయ్! మిడిమేలం? (గడియారం చూచుకుని) ఒంటిగంటకూడా కొట్టారే...(తీవ్రంగా) చిలిపితనంగా టైమంతా తగలేశావ్...నీ సిల్కు ఫ్రాకుసంగతీ, అదీ నాకెందుకు?

మేరీ—(రెట్టింపుతీవ్రంగా) ఏరా రా! నే నా సిల్కు ఫ్రాకుసంగతీ,అదీ యెత్తిందీ...టైముతగలేసిందీ?

(మళ్లా గంట మోగుతుంది)

చర్చిల్—ఈ మిడిమేలమేమిటో క్రొత్తది వచ్చింది...చూసిరా...

(మళ్లా సీరియస్‌గావున్నట్టు కూర్చుని తొందర పనిలో వున్నట్టు నటించుతాడు.)

మేరీ—(లోపలికి వెళ్లి...కొంచెం ఆగి తిరిగి వచ్చి) ఇండియాలీగ్ రాయబారవర్గం.

చర్చిల్—ఏడిచినట్టుగానే వుంది...ఇప్పుడు నా ఘోష వింటూకూర్చుంటే సాయంత్రం స్పీచ్ గతేం కావాలి! ఇప్పుడు మాట్లాడటానికి వీల్లేదని చెప్పి పంపెయ్యి.

మేరీ—ఇవ్వాళ రమ్మన్నారుటగా?

చర్చిల్—(విసుగ్గా) ఎవరు రమ్మన్నారూ?

మేరీ—మీరు రమ్మనలేదా?...అలాగైతే వీల్లేదు పొమ్మంటాను.

చర్చిల్—ఆగాగు...జ్ఞాపకం లేదు...రమ్మన్నా వల్లే వుంది...ఏమిటి గత్యంతరం (బుర్ర గోక్కుంటాడు.)

మేరీ—నవ్వుకుంటారేం మరి...రమ్మన్నా రన్న మాటా. తీరా రమ్మని యిప్పుడు మాట్లాడను పొమ్మంటే ఎలా...లోపలికి పంపుతాను.

చర్చిల్—వద్దు మేరీ...వద్దు...హిందూదేశం సంగతి నాకేం తెలుసు...దాని యెల్లలే నాకు సరిగా తెలియవ్...వాళ్లతో యేంమాట్లాడేది?

మేరీ—మరెలా?

చర్చిల్—సరే ఒకపని చెయ్యి. ప్రీమియర్ నిద్రపోతున్నారు, ఒక అర్ధగంట ఆగండని వాళ్లతో చెప్పి, వైటగదిలో కూర్చోబెట్టు. అర్జంటుగా వెళ్లి ఆమెరీని కుడిపక్కదరవాజావెంట లోపలికి పంపు.

(మేరీ వెళ్లిపోతుంది)

అంతా గందరగోళంగా వుంది...లాభంలేదు... ఈతడవ యెలెక్షన్‌లో తక్షణ దిగయ్యాలిపొచ్చేట్టేవుంది (బల్లమీద పెట్టుకున్న కర్ర తీసి బల్లమీద పెట్టుకుని దానిమీద వ్రేళ్లతో వాయించుతూ)లాభంలేదు—

భజ గోవిందం, భజ గోవిందం
గోవిందం భజ మూఢమతే,
సంప్రాప్తే సన్నిహితే కాలే
నహినహి రక్షతి డుకృఞ్ కరణే॥భ॥

(వెనకవున్న చిన్న తలుపు తెరుచుకుని రాడ్డీ పోజులో నెక్‌టై సర్దుకుంటూ ఆమెరీ ప్రవేశించుతాడు...రెస్లెస్‌గా కనుపించుతాడు)

ఆమెరీ — ఏమిటండోయ్! తాతగారూ? మాంచి మూడోకాలంలో వున్నారు!—

చర్చిల్—వచ్చావురా బాబూ! నీకోసమే యెదురుచూస్తున్నాను.

ఆమెరీ—ఏం?

చర్చిల్—చిన్న మిడిమేలం తెచ్చుకున్నాను.

ఆమెరీ—ఏమిటది?

చర్చిల్—ఓక తెలివితక్కువ పని చేశాను.

ఆమెరీ—కొంపదీసి హిందూదేశానికిస్వాతంత్ర్య మిస్తానని యేపెద్దమనిషితోనూ అనలేదుగదా?

చర్చిల్—పిచ్చివాడా యేమిట్రా బాబూ! అల్లాంటి తెలివితక్కువప్రసంగాలు చెయ్యడానికి?

ఆమెరీ—ఓస్! అదొకటే నోరుజారకపోతే మరేం ఫరవాలేదు—మిడిమేలమంటారేమిటి?

చర్చిల్ — ఇండియాలీగురాయబారవర్గంవారు వచ్చారు.

ఆమెరీ—ఓస్! దానికేనా ఇంత కలవరపడ్డారూ! ఏదో కళ్లనీళ్లు తుడిచి పంపెయ్యండి.

చర్చిల్—లాభం లేదురా అబ్బీ! ఇండియా సంగతంటే నాకు మతిపోతుంది ... ముచ్చెమటలు పోస్తయ్.

ఆమెరీ—ఆఁ! దీని కింత కలవరపడతారేమిటి?—నేనేదో బుకాయించి అవతలికి పంపుతా నుండండి.

చర్చిల్—అదుగో! అదే వద్దన్నాను. అదే చావు నీతో యేమాట చెబుదామన్నా. అంత రెక్లెస్ గా మాట్లాడతావేమిట్రా బాబూ! నీ కీకుర్రతనం యెప్పటికి వదుల్తుందిరా అబ్బీ!...తొందరపడకోయ్!... దిక్కుమాలిన గొడవా...! ఆ బుకాయించేదేమిటో నాజూగ్గా బుకాయించాలిగాని రెక్లెస్ గా మాట్లాడ్డం మంచిదిగాదు.

ఆమెరీ—సున్నితంగా బుకాయించే దేమిటండి—బ్రిటిష్ ప్రభువులకూ!...హాఁ...యూర్ పుళీ!... (మీసాలు మెలిపెడతాడు) భారతదేశమంటేనూ, ఈ రాయబారవర్గాలంటేనూ మన కోలక్కా.

చర్చిల్—(హడిలిపోయి, కుర్చీమీద గొంతుకూర్చుని రెండుచేతులూ నెత్తిమీద పెట్టుకుని) ఓరి బాబూ! నువ్వెళ్లు—నేనే యెలాగో ఒకలా సర్దుకుంటాను. ఇదంతా చెడనూకి తెసగచేసేపేలా వున్నావ్, నీ అఘాయిత్యం, నీదుడుకుతనం చూస్తే.

ఆమెరీ—ఖరవా లేదులెండి. నే నేమన్నా హిందూదేశస్థు లేమీ నొచ్చుకోరు. నేను భారతదేశానికి మిత్రసత్తముణ్ణనీ, ఒక గుడ్ బాయ్—అంటే ఒక మంచిపిల్లవాణ్ణనీ వాళ్లంతా అనుకుంటున్నారు.

చర్చిల్—ఏమిట్రోయ్ బాబూ! చెప్పావు కావేం?...ఇదెప్పటినుంచి?...ఇంకేం, మళ్లీ కొన్నాళ్లపాటు కోటలో పాగావేసి హైరాయించామన్నమాటే ...ఈమాట యెవళ్లన్నారురా బాబూ!

ఆమెరీ—పేరుమోసిన వాళ్ల నాయకులే అంటున్నారు.

చర్చిల్—ఆ రి పిడుగా! అల్లాగైతే భారతదేశంనుంచి మన కిప్పట్లో చలనం లేదన్నమాటే.

ఆమెరీ—కాకపోతేమటుకు మనం వదుల్తాంటండీ...వాళ్ల పిచ్చగాని.

చర్చిల్—అవునవును. బ్రిటిష్ వాడంటే యేమిటి నక్కురుకాయరకం ...కాలువదిస్తే చెయ్యి, చెయ్యి వదిస్తే మెడా లాగాగడుటోయ్. సరేగానీ... కొన్ని కొలికపూసవాక్యాలు చెబుతాను. వాట్ని ముడిపెట్టుకుని-ఆ వేళ ఉద్ఘాటించు ఒకదాని తరవాత ఒకటి. ఒకటి—భారతదేశం స్వతంత్రదేశం కావాలని మేం అహోరాత్రులూ అఘోరిస్తున్నామనీ; రెండు—హిందూముస్లింలు, సంస్థానాధీశ్వరులూ ఒక నిర్ణయానికి వస్తే వెంటనే స్వాతంత్ర్యమివ్వటానికి ముంజేతిచివర సంచిలో తాకించుకుకూర్చున్నామనీ; మూడు—ప్రభుత్వం చెయ్యగలిగిందంతా ఆలోచిస్తుందనీ—పొరపాటున చెయ్యగలిగిందంతా చేస్తుందనేవు; చేయగలిగిందంతా ఆలోచిస్తుందను—ఈ మూడువాక్యాలూ ఒకదానితరవాతొకటి బాదెయ్యి. విసుగెత్తి వాళ్లే లేచిపోతారు.

ఆమెరీ—సరే, వాళ్లని లోపలికి పంపించండి మాట్లాడతాను.

చర్చిల్—పిలుస్తాను...ఆ సిగరెట్టు గబగబా రెండుదమ్ములు లాగి అవతల పారేసి నువ్వు మర్యాదగానూ, హుందాగానూ కుర్చీలో కూర్చో.

(ఆమెరీ గబగబా రెండు దమ్ములు లాగి సిగరెట్టు మూలకు విసిరేసి, కుర్చీలో దర్జాగా కూర్చుంటాడు. చర్చిల్ అతణ్ణి కొంచెం సర్దుతూ) ఆ! ఆ! అలా కూర్చోవాలి. శహబాస్ రే బిడ్డా!...హుషార్ గా వుంటుంది కొంచెం కాఫీకూడా వేస్తావాయేమిట్రా అబ్బీ!

ఆమెరీ—అక్కర్లేదండీ. మనకి వాళ్లంటే ఓ లెక్కా...ఊపేస్తాను చూడండి.

చర్చిల్—(తనుకూడా ఠీక్ గా మరోకుర్చీలో కూర్చొని) మేరీ! వాళ్లని లోపలికి పంపు.

(చరాల్న తెర దిగిపోతుంది.)

రంగం ౨

[ఒక పార్కులో రేడియో—మేగఫోనులో నుంచి వార్తలు. ప్రజలు కూర్చుని వింటూవుంటారు. కొందరు వస్తూ-కొందరు పోతూ వుంటారు. మేగఫోనులోనుంచి ఇలా వినపించుకూవుంటుంది.

ఆలిండియా రేడియో—తెలుగులో వార్తలు. ఈ వేళ లేబరు ప్రధాని క్లెమెంట్ అట్లీ బ్రిటిష్ పార్లమెంటులో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఇలా అన్నారు—

'భారత సమస్యను వెంటనే పరిష్కరించేందుకు మంత్రిత్రయాన్ని భారతదేశానికి పంపుతున్నాం. సిమ్లా సమావేశంలాగా ఈ సమావేశం ఈసారి విఫలం కానీయం. ఎన్ని చిక్కులు వచ్చినా వాటిని యెదుర్కొని మంత్రిత్రయం భారత స్వాతంత్ర్యాన్ని భారతీయులకు వప్పగింత చేస్తుంది. భారత స్వాతంత్ర్యాన్ని వాయిదా వేయటానికి ఇక వీల్లేదు. భారతదేశంలో యెన్ని రాజకీయ విభేదాలున్నా స్వాతంత్ర్యసంపాదన విషయంలో భారతీయులందరిదీ ఒకేమాట. మనం వారి స్వాతంత్ర్యాన్ని వారి కివ్వకపోతే వారే బలవంతంగా పుచ్చుకుంటారు. ఆ మర్యాద మనం దక్కించుకుని భారతదేశంతో స్నేహబాంధవ్యాలను బలపరచుకోవటం బ్రిటిష్ ప్రజకు శ్రేయం. ప్రపంచ శాంతిభద్రతలకు అది మూలసూత్రం. బ్రిటిష్ లేబరు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణంనుంచీ దాన్ని ప్రథమ కర్తవ్యంగా గుర్తించి, కృషి జేస్తోంది. కాని మన మార్గం చాలా కంటకమయం. సామ్రాజ్యవాదశక్తులూ, ఫాసిస్టుశక్తులూ, ధనికవాదశక్తులూ కొంతవరకు దెబ్బతిన్నా అవి పూర్తిగా నశించాయని మనం అనుకోగూడదు. అవి చెలరేగి భయంకరంగా విధ్వంసచర్యలకు పూనుకుంటున్నయ్. మన కార్యక్రమాన్ని ఛిన్నాభిన్నం చెయ్యటానికి తమ దుష్టశక్తులన్నిటినీ కేంద్రీకరించుకుంటున్నయ్. మన్ని తప్పుదారులు పట్టించడానికి అనేక పిచ్చికేకలు వేస్తున్నయ్. కాని బ్రిటిష్ లేబరు ప్రభుత్వం వాటిని లక్షించదు. బ్రిటిష్ కార్మిక ప్రజాబాహుళ్యంయొక్క యావత్తుబలం తనవెనుక వున్నదనే ధైర్యంతో ఈ దుష్టశక్తులన్నిటినీ ఎదుర్కొని విజయం సాధించుతుంది.' అని చెప్పారు. ఇంతటితో వార్తలు సమాప్తి. తరువాతి కార్యక్రమం వెంటనే ప్రారంభమవుతుంది.

(ఎక్కడివాళ్లక్కడ నెమ్మదిగా లేచి వెడుతూవుంటారు. తెర నెమ్మదిగా దిగుతుంది.)

రంగం 3

[లండన్—విహారాశ్రయం. చర్చిల్ ఒక తోలు సంచీ పుచ్చుకు నడుస్తూవుంటాడు. ప్రయాణసన్నాహంలో వుంటాడు.

'జాన్ బుల్' వస్తాడు. బాగా లావుపాటి పొట్టి మనిషి. చర్చిల్ ను సమీపించి వెక్కి వెక్కి యేడుస్తాడు.]

చర్చిల్—బుల్ గారూ! ఎందుకూ—ఏమిటీ? —ఎందుకూ అలా తెంబేలుపడుతున్నారు?

జాన్—(మరికాస్త వెక్కి వెక్కి యేడుస్తాడు.)

చర్చిల్—మీ కొచ్చిన ఫరవా యేమీ లేదు. నే నింకా బ్రతికేవున్నానుగా — అసలు విషయం యేమిటీ?

జాన్—పిల్లా మేకా ఇక మేం బ్రతికే దెల్లా బాబూ!

చర్చిల్—అయ్యో వెర్రిబాగుల తండ్రీ, ఇదా గొడవా? సంవత్సరానికి పదిలక్షల పౌనుల ఆదాయం వస్తుంది గుడ్డలవ్యాపారంలో మీకు...మీకు బ్రతుకు తెరువుకు లోటేమిటండీ!

జాన్—ఇంకా వ్యాపారమేమిటి స్వామీ! మా కింక దిక్కేముంది? పాలించే ప్రభువులు అన్నదాతలు, తమకుకూడా ఉద్యాపన చెప్పేశారు. ఈ దిక్కుమాలిన లేబర్ గవర్నమెంటు ఇంకా మమ్మల్ని బ్రతుకనిస్తుందా బాబూ! బ్లాక్ మార్కెట్ చేస్తే డొక్క చీలుస్తామంటున్నారు — అధికలాభాలమాట యెత్తితే...అసలు...పీకలు కోరుకుతా మంటున్నారు.

చర్చిల్—వీళ్లు డొక్క చీల్చేం దెంతమందినీ? ...పీకలు కోరికేం దెంతమందినీ? పైనుంచి క్రిందిదాకా రాజ్యాంగయంత్రమంతా బ్లాక్ మార్కెట్ రాయళ్లతో నిండివుంటే వీళ్లు పీకలు కోరికే దేమిటండీ! మట్టి!... అసలు అంతర్యంలో బ్లాక్ మార్కెట్టును అరికట్టాలని వీళ్లెవళ్లకీ లేదు...వున్నా, దాన్ని సాధించటం వీళ్లవల్లయ్యేపని గాదు...ఇవ్వన్నీ ప్రజల కళ్లనీళ్లు తుడవటానికి వూదే వట్టిబాజాలూ, బాకాలూ.

జాన్ బుల్—ఏమో బాబూ! రాజ్యాంగవిధానమంతా తల్లక్రిందుచేస్తామనీ, దేవలోకంలోనుంచి

స్వర్గాన్ని వదలాక్కొచ్చి భూమ్మీద పారేయ్యబోతు న్నామనీ అంటున్నారు బాబూ!

చర్చిల్—మిస్టర్ బుల్! (భుజంతట్టి) బ్రిటిష్ సామ్రాజ్యవిధానంలో వున్న ఒక పరమరహస్యం మీకు చెబుతాను వినండి—లక్ష లేబరుపార్టీలు అధికారంలోకి వచ్చినా - బ్రిటిష్‌సామ్రాజ్యవిధానం చస్తే మారదు... మీరు ఇంటికి పోయి గుండెలమీద చెయ్యివేసుకుని హాయిగా నిద్రపోండి.

జాన్—ఏమో బాబూ! మీ మొండిధైర్య మేమిటో గాని వాళ్ల చిందులూ శివాలూ చూస్తే గుండెలు జారిపోతున్నయ్.

చర్చిల్—ఏమిటండీ వీళ్ల శివాలూ? - పలుకు బడంతా మన పెట్టుబడిదారుల చేతుల్లో వుంది. వ్యాపారమంతా మన చేతుల్లో వుంది. పత్రికలన్నీ మన చేతుల్లో వున్నయ్. అసలు రాజకీయరహస్యాలన్నీ మన చేతుల్లో వున్నయ్... ఈ లేబరుప్రభుత్వాన్ని గీబరుప్రభుత్వాన్ని నిల్చుని నీళ్లుత్రాగనిస్తామటండీ, మీ పిచ్చి గానీ—

జాన్—హిందూదేశాన్ని కూడా వాళ్లేది వాళ్లకి పారేస్తామంటున్నారేమిటి బాబూ? కొంపలుపోతాయి గాని మరేమన్నానా?

చర్చిల్—అరె వెర్రిబాగులతండ్రీ! అదా నీ సంబరగోళం. అదీ... భారతదేశానికి కాళ్లు చంకల్లు కొంచెం పట్టుకేసి చేతులనూ, మెడనూ తగిలించటానికి... మనం వేసిన పాచికేనండీ అది. (రహస్యంగా) 'కూప్లెండుప్లానూ'... 'కూప్లెండుప్లానూ'...

జాన్—అమ్మయ్యమ్మయ్యా! కాస్త వెన్ను చరవయ్యా బాబూ! నిజంగా భంగపరుస్తారేమో నని ఖంగారుపడి చచ్చాను.

చర్చిల్—(వెన్ను చరిచి) అంతకంటే మరేం సంబరగోళం లేదండీ. ఆ కూప్లెండుప్లాన్నే ముంకేటి చివర తోలుపంచీలో తగిలించుకుని మనవాళ్లు 'చిరు చిక్కుచిక్' ఆడుతున్నారు.

జాన్—నీయిల్లు చల్లగా పదికాలాలపాటు వర్ధిల్లు బాబూ! నీవొకడివి పట్టుకు కూర్చున్నావుగాని లేకపోతే యీ బ్రిటిష్‌సామ్రాజ్యంలో ఎక్కడో ఓ అక్కడ ఈపాటికి సూర్యు డస్తమించేవాడే.

చర్చిల్—మిస్టర్ బుల్! (మీసం మెలిపెట్టి) మిస్టర్ బుల్! ఈ ప్రపంచాన్ని బ్రతుకనిస్తానని మీ రను కోవద్దు. ఈ యావత్తుప్రపంచాన్నీ హిరణ్యాక్షుడులా ఒక చాపచుట్టుక్రింద చుట్టి...మళ్లా యుద్ధదావాగ్ని జ్వాలల్లో విసరివేస్తున్నాను చూడండి. (అవి వెళ్లి పోతూ, మళ్లా వెనక్కు తిరిగి) హుషార్‌ కరో! మీకు కావలసినవన్ని బ్లాక్ మార్కెట్లు. డైనమీట్—ఇదిగో ఇప్పుడే అమెరికాకు మోసుకుతున్నాను. ప్రళయం ఘూర్ణిల్లేలా యాటంబాంబు ఛాంకరిస్తుంది. గుడ్ బై. (నిష్క్రమిస్తాడు)

జాన్—(మోకరిల్లి నమస్కరిస్తూ) నమః శ్రీ సామ్రాజ్యవాదాయ.

[తెర నెమ్మదిగా దిగుతుంది]



మూడవవిజయాదిత్యుని సీసలితామ్రశాసనము

*

= శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ =

[గతసంచిక తరువాయి]

ప్రతిగ్రహీత :—దోయూరునివాసియు, తైత్తిరీయ చరణుడును, కౌండిన్యగోత్రుడును అయిన మేండయ అను బ్రాహ్మణు డొకడు కలడు. అతడు కావ్యగీతములు విని వికసితవదనుడై, తన సర్వద్రవ్యమును యాచకజనార్థ మిచ్చివేసి స్వగృహమును విడిచివచ్చెను. ఇతనికి రాజాదిత్యుడు, విక్రమధవళుడు, బిజ్జణ, కొండమశర్మ, నూరెయ అని అయిదుగురు కుమారులు కలరు. రాజమయ్య, ధవలయ్య, బిజ్జన్న, కొండమ, నూరెయ అని వీరి నామాంతరములు. వీరు వేదాధ్యయనసంపన్నులు; భార్గవ, ఆంగిరస నామములు గల రాజవిద్యలందు, అనగా శుక్రనీతి, బృహస్పతినీతిశాస్త్రములయందు ప్రవీణులు; వ్యాకరణతత్త్వమును జక్కగా దెలిసినవారు (వైయాకరణులు); వేదవిహితకర్మలను జేయువారు; శత్రుసైన్యమథనవిధానమున కుంతీపుత్రులతో సమానులు;[11] సత్య, అభిమాన, శౌచ, ప్రతాపవంతులు; చాళుక్యకుల సంభూతులైన రాజులనేకాని అన్యనృపతులను సేవించియుండనివారు; షట్కర్మనిరతులు; అరిషడ్వర్గములను జయించినవారు; విభవ మను పద్మముచే సంతుష్టులైన బంధుజనులను భ్రమరముల నినదములతో మార్మ్రోగు గృహములు కలవారు; సర్వశాస్త్రవిదులు. వీరు మూడవ విజయాదిత్యభూపతి చేసిన అగ్రహార దానమును ప్రతిగ్రహించిన ప్రతిగ్రహీతలు.

శాసనకాల నిర్ణయము :—మూడవ విజయాదిత్య మహారాజు ఈదానమును శాంత్యర్థముగా సూర్యగ్రహణ నిమిత్తమున జేసెను. ఇతడు క్రీ. శ. ౮౪౮-౪౯ నుండి క్రీ. శ. ౮౯౨-౯౩ వఱకు నలుబదినాలుగు సంవత్సరములు వేంగీదేశమును పాలించెను. ఈదీర్ఘ పరిపాలనకాలమునందు సూర్యగ్రహణము ఏయేట, ఏమాసమున బట్టినదో మనకు తెలియదు. మన శాసనము మహారాజు రాజ్యపాలనవర్షమునుకాని, శకవర్షమునుకాని యొసగదు. అందువలన నుడికి బారెడు హెచ్చుతగ్గుగా అంచనావేసి శాసన కాలమును స్థూలముగా తేల్చవలసియుండును. ఇట్లు చేయుట కీశాసనమున గొంత యవకాశము కలదు. అదియే ఈ శాసనమువిశిష్టత.

మన శాసనమువలన మూడవ విజయాదిత్యుని శత్రువు నృపతుంగు డొకడని మనకు దెలియును. ఇంత వరకు ప్రకటితములైన ఈ మహారాజుశాసనములు వేనియందును నృపతుంగుడు పేర్కొనబడలేదు. ఈ నృపతుంగప్రస్తావము చాల ముఖ్యమయిన విషయము. రాష్ట్రకూటవంశ్యుడగు నాలుగవ గోవిందరాజు తన కాంబేతామ్రశాసనమున[12] తన పూర్వుడయిన మొదటి అమోఘవర్షుడు వింగవల్లి యనుచోట చాళుక్యులను సంహరించి యమునికి సంతర్పణచేసెనని చెప్పియున్నాడు. రాష్ట్రకూట అమోఘవర్షునికి నృపతుంగుడనియు, అతిశయధవళు డనియు, వీరనారాయణు డనియు నామాంతరములు కలవు. ఇతని శాసనముల ననుసరించి యీ రాష్ట్రకూటాధిపతి క్రీ. శ. ౮౧౪ నుండి క్రీ. శ. ౮౭౮ వఱకు రాజ్యమేలినట్లు విశదమగుచున్నది. ఈ కారణమున ఈ నృపతుంగుడే మన సీసలి శాసనము మూడవ విజయాదిత్యుని శత్రువుగ పేర్కొనబడిన నృపతుంగు డనియు, విజయాదిత్య, నృపతుంగులు సమకాలికు లనియు స్పష్టమగుచున్నది. విజయాదిత్యునికంటె నృపతుంగుడును సుదీర్ఘకాలము రాజ్యమేలినాడు. రాష్ట్రకూటశాసనములు వేంగీశునిచే నర్చితుడైనవాడని నృపతుంగుని వర్ణించుచున్నవి (వంగాంగమగధ మాళవ వేంగీశైరర్చితో అతిశయధవళః).

11. చూడుడు, శాసనపాఠము మూలమున ౩౧ వ ఫుట్టునోటు.

12. Ep. Ind. Vol. vii p. 27 ff.

కాని బింగవల్లి సంగ్రామవిజయముకాని, నృపతుంగుని ఇతర విజయములుకాని యీతని దీర్ఘ పరిపాలనకాలమున సరిగా నెప్పుడు సమకూరినదియు దెలుపవు. పూర్వచాళుక్యశాసనములయం దీయాయిరాజుల కొసగిన రాజ్యపాలనవర్షముల ననుసరించి చూడగా మూడవ విజయాదిత్యుని తండ్రి సార్ధసంవత్సరము పాలించిన కలివిట్టరుని రాజ్యకాలము క్రీ. శ. ౮౪౬-౪౮ అనియు, నలుబదేండ్లు ధరాతలము నేలిన విజయాదిత్యుని పితామహుడు నరేంద్రమృగరాజ (రెండవ) విజయాదిత్యుని రాజ్యకాలము క్రీ. శ. ౮౦౬ నుండి క్రీ. శ. ౮౪౬ వఱకు ననియు మనము కొంచె మించుమించుగ సరిగనే నిర్ణయించుకోవచ్చును. పైని తెలిపిన ఈ రాజ్యకాలముల ననుసరించి చూడగా నృపతుంగ అమోఘవర్షుడు పూర్వచాళుక్యవంశజులైన విజయాదిత్య, కలివిట్టర, మూడవ విజయాదిత్యులకు సమకాలికు డనుట విశదము. ఇతని రాజ్యపరిపాలనము మూడవ విజయాదిత్యుని రాజ్యకాలమున క్రీ. శ. ౮౭౮ లో అంతమగుచున్నది. నృపతుంగుని వెనుక రాష్ట్రకూట సింహాసనము నధిష్ఠించి, రాష్ట్రకూటరాజ్యమును క్రీ. శ. ౯౧౪ వఱకు పాలించినవాడు అతని కుమారుడు (రెండవ) కృష్ణవల్లభుడు. పైనుడివిన విషయముల ననుసరించి మూడవ విజయాదిత్యభూవరుని రాజ్యకాలము ఆరంభము, అనగా క్రీ. శ. ౮౪౮ నుండి నృపతుంగుని మరణకాలము క్రీ. శ. ౮౭౮ వఱకు ముప్పది సంవత్సరములకాలము ఉభయనృపులును సమకాలికులని తేలుచున్నది.

విజయాదిత్యుడు తన రాజ్యకాలము కడపటి పదునాల్గుసంవత్సరములును రాష్ట్రకూట రెండవ కృష్ణవల్లభుని ప్రతిస్పర్ధి. ఈ విషయమే మొదటి చాళుక్య భీమమహారాజు అత్తిలి తామ్రశాసనము[13]నందలి "కృష్ణం రణే జయ ద్వక్తుం క స్సమర్థో సుసాహసం" అన్న పద్యపాదమువలన ధ్రువపడుచున్నది. మొదటి అమ్మరాజ విష్ణువర్ధనుని ఈడేరు (Ederu) తామ్రశాసనము[14]నందలి—

"కృష్ణం సంకిలమంకితాఖిలబల
ప్రాప్తోరు సద్విక్రమే,
భీత్యాక్తా(ర్తం)వ విధాయ తత్పురమరం
యోనిర్దదాహ ప్రభుః"

అన్న శ్లోకార్థముకూడ దానిని బలపఱుచుచున్నది. సంకిలునితోగూడిన కృష్ణుని భీత్యార్తుని గావించి అతని పురమును ప్రభువైన మూడవ విజయాదిత్యుడు తగులబెట్టెనని ఈ కడపటిపద్యార్థము అర్థము. పై శాసనశ్లోకభాగములందుదాహృతుడైన కృష్ణుడు రాష్ట్రకూట రెండవ కృష్ణవల్లభుడే. ఈ కృష్ణ, సంకిల విజయము మొదటి చాళుక్యభీమమహారాజు ధర్మవరము పద్యశాసనమున[15] నిట్లు తెలుపబడినది :

"కన్నరభూపతి వెన్నాజిలో జూచె
సంకిలం డను సేని బింక మడిచె"

ఈ కన్నరభూపతియు కృష్ణవల్లభుడే. ధర్మవరముశాసనము ఈ విజయములను మూడవ విజయాదిత్యభూపతి సైన్యాధిపతియైన పండరంగుని కారోపించుచున్నది. నిజముగా ఈ విజయములను సంపాదించినది అతడే కావలయును. రెండవ అమ్మరాజు మలయంపూండిశాసనము[16] పైతము ఈ విజయములు పాండరంగుడు సాధించినవే యని—

"కిరణపుర మధాక్షీ త్కృష్ణ రాజాస్థితం యః
స్త్రీపురమివ మహేశః పాండరంగః ప్రతాపో,
తదహిముఖసహస్రై రన్వితస్యా ప్యశక్యం
గణన మమలకీర్తేస్తస్య సత్సాహసానామ్."

అను శ్లోకమున దెలుపుచున్నది. అందువలన రాష్ట్రకూటనృపతుంగునివలెనే అతని కుమారుడు కృష్ణవల్లభుడును మూడవ విజయాదిత్యునికి అతని రాజ్యకాలము కడపటిభాగమున సమకాలికుడనుట నిస్సంశయము.

మన సీసలిశాసనము నృపతుంగుని పేర్కొనుచుండుటచేత ఇది క్రీ. శ. ౮౪౮, ౮౭౮ సంవత్సరముల నడిమికాలమునాటి దనుటకు సందియము లేదు. మూడవ విజయాదిత్యుడీయగ్రహారదానమును తన రాజ్యకాలము మొదటి ముప్పదిసంవత్సరములలో నేదో యొక వర్షమున బట్టిన సూర్యగ్రహణపుణ్యకాలమున దానముచేసియుండవలెను. ఇంతకంటె సూక్ష్మముగా ఈ సీసలిశాసనకాలమును నిర్ణయింపనవకాశము లేదు.

13. ఆం. సా. ప. ప., సం. ౬, పుట ౨౪౧ నుండి; C. P. No. 14 of 1917-18.

14. S. I. I., p. 39 ff.

15. భారతి.

16. Ep. Ind. Vol IX p. 47 ff ll. 43-44.

ఈ విజయాదిత్యభూపతి గుంటూరు తామ్రశాసనమున17 కృష్ణభూపతి పేర్కొనబడియుండుటచేత అది క్రీ. శ. ౭౪౭, ౭౯౩ సంవత్సరములకు నడుమ పుట్టినది కావచ్చును.

స్థలనిర్దేశము:—విజయాదిత్యభూపతి అగ్రహారము చేసియిచ్చిన గ్రామము ఉమికిలి. ఈ గ్రామము పాగునార విషయములోనిదిగ నూహింపవచ్చును. విషయమన్నది దేశవిభాగమునకు ప్రాచీననామము. ఈ విషయమును పేర్కొను స్థలమున శాసనాక్షరములు చాల చెడిపోయినవి. అయినను 'పాగున' అన్నమాట స్పష్టముగ గానవచ్చుచున్నది. ఒక గ్రామమును దానమిచ్చునపుడు దానిమీద దనకు గల హక్కు భుక్తులు అంతటినుండి ప్రతిగ్రహీతకు జెందగలవను విషయమును తెలియజేయుటకు దాతయైన మహారాజు దత్తగ్రామము ఏ విషయములో ఉన్నదో ఆ విషయమునందలి కుటుంబినులను, రాష్ట్రకూటప్రముఖులను (సేద్యముచేయువారిలో మోతుబరులైన పెత్తనదారులను) పిలిచి, తాను గ్రామమును దానమిచ్చిన విషయమును తెలియజేసి, అంతవరకు తనకు జరుగుచుండిన మర్యాదలు ప్రతిగ్రహీతకు జరుగవలెనని యాజ్ఞాపించుట పురాతనాచారము. ఈ యాచారము ప్రకారము మన మూడవ విజయాదిత్య మహారాజుకూడ పాగుణవారవిషయనివాసులను పిలిచి వారి కీదానవిషయమును తెలియజెప్పి వారి కాజ్ఞ చేసెను. శాసనమున ఈ సందర్భమున చెడిపోయిన పాఠము ఈ విషయమును తెలియజెప్పునదే.

ఈ శాసనమునకు పూర్వమునను, పరమునను బుట్టిన అనేకశాసనములలో పాగునార విషయము పేర్కొనబడినది. క్రీస్తుశకము ఏడవశతాబ్దివాటిదని యూహింపబడుచున్న పృథ్వీమహారాజు తాండివాడ శాసనమున18 ఈ విషయము మొట్టమొదటిమారు గోచరించును. పృథ్వీమహారాజు పాగునారవిషయములోని తాండివాడగ్రామమును బ్రాహ్మణులకు దానముచేసెను. ఈ విషయములోని గ్రామములను అగ్రహారములు చేసియిచ్చిన పూర్వచాళుక్యులరాజులు అనేకులుకలరు. అట్టివారిలో సర్వలోకాశ్రయనామాంతరమున బరగు మంగియువరాజు ప్రప్రథముడు. ఇతడు దానముచేసిన గ్రామముపేరు బొంటాడకొఱ్ఱు.19 ఇది సీసలిగ్రామమున కనతిదూరమున నున్న ఇప్పటి బొండాడ (భీమవరము తాలూకా) గ్రామమే. మంగియువరాజు పుత్రుడు మూడవ విష్ణువర్ధనుడును, పౌత్రుడయిన మొదటివిజయాదిత్యుడును, మొదటి చాళుక్యభీమమహారాజుపౌత్రుడయిన రెండవ భీమమహారాజును, ఇతని కుమారుడు రెండవ అమ్మరాజవిజయాదిత్యుడును బ్రాహ్మణుల కగ్రహారములు చేసియిచ్చిన పెర్మందిలి,20 దినకాడు,21 దిగ్గుంబఱ్ఱు,22 తాండేఱు23 గ్రామములు ఈ పాగునార విషయములోనివే. పగునవార, ప్రాకునార, పావునవార అనునవి పాగునారపదమునకు పూర్వచాళుక్య తామ్రశాసనములలో గానవచ్చు రూపాంతరములు. వీనిలో పగునవారరూపము దుష్టమయిన దనియు, ప్రాకునారరూప మొకవేళ ప్రాచీనరూప మయియుండు ననియు, ప్రాకునారపదమే కాలక్రమమున పాగునార, పావునవారములుగా మాఱియుండుననియు దోచుచున్నది. పాగునవరము (రెండవ చాళుక్యభీమ మహారాజుశాసనములోనిది) పావునవారమునకు పూర్వరూపము. పైనుడివిన గ్రామములు మాత్రమేకాక తనుకు,24 మెట్టగుములూరు,25 కోండేఱు,26 రావిపఱ్ఱు గ్రామములుకూడ శాసనములందు పావునవారములోనివిగనే తెలుపబడినవి. పావునవారవిషయము పదునైదవ శతాబ్దివాటికి పానారవిషయమై, పానారదేశమని, పానారసీమ యని వ్యవహారమున రూఢమైనది. కొట్టాలపఱ్ఱు,27 మాకేడేరు, సంగిపూండి, పెనుకొండ, వెలుపవాడ, మొనంబఱ్ఱు, తామరవాడ, విల్లూరు, అసంట,

17. CP. No. 5 of 1911-12.
18. J. O. R. Vol. IX, pp. 188 ff.
19. J. A. S. P. P., Vol. II, pp. 215 ff.
20. CP. No. 6 of 1913-14.
21. J. A. H. R. S., Vol. V, p. 56.
22. Ind. Ant., Vol. XIII, pp. 213 ff.
23. Ep. Ind., Vol. IX, pp 131 ff.
24. S. I. I., Vol. IV, No. 1298.
25. Ibid, Vol. V, No 75.
26. Ibid, Vol. VI, No. 148.
27. Ep. Ind., Vol XIV, pp. 83 ff.

దేవ—ఈ గ్రామములను పానార దేశములోనివే. ఈ విషయములోనిదిగ దెలుపబడిన గ్రామములు ఎచ్చట నున్నదియు గుర్తించినచో పూర్వపు పాగుణార దేశము ఇప్పటి ఏయే తాలూకాలకు వర్తించునో తెలియగలదు. శాసనములవలన దెలియనగు ఈ విషయమునందలి గ్రామములును, వాటి యిప్పటి పేర్లును, అవి యిప్పుడే యే తాలూకాలలో నున్నదియు ఈ క్రిందిపట్టికలో దెలుపబడినది.

గ్రామము ప్రాచీన నామము.	గ్రామము ఆధునిక నామము.	గ్రామమున్న తాలూకా.
దిగ్గుంబల్లు	దిగుమర్రు	నరసాపురము
మొట్టపలితి	మట్టపర్రు	నరసాపురము
పెర్మఞ్చిలి	పెనుమంచిలి	నరసాపురము
క్రొఞ్చ	కాజ	నరసాపురము
మెట్టుగుమలూరు	గుమ్మలూరు	నరసాపురము
కోంజేఱు	కోఠేరు	నరసాపురము
విల్లూరు	విల్లూరు	నరసాపురము
ఆసంట	ఆచంట	నరసాపురము
దేవ	దేవ	నరసాపురము
బొండాడనొత్రి	బొండాడ	భీమవరము
వేతిపూండి	వేతపూడి	భీమవరము
ప్రాందొత్ర	పాంగువర్ర(?)	భీమవరము
తాంజేఱు	తాడేరు	భీమవరము
రాఖుతేరం	రాకుదురు	భీమవరము
తనుకు	తణుకు	తణుకు
కొట్టాలపల్లు	కొతాలపల్లు	తణుకు
మారేజేరు	మారుటేరు	తణుకు
నంగిపూండి	నెగ్గిపూడి	తణుకు
పెనుకొండ	పెనుగొండ	తణుకు
చెలుకువాడ	చెలుకువాడ	తణుకు
మొనంబల్లు	మునమల్లు	తణుకు
తామరవాడ	తామరాడ	తణుకు

ఈపైనిచ్చినవి కాక ఇంకను కొన్ని గ్రామము లున్నవి. వాటిలో దినకొడు, క్రమూకి, తొండివాడ, రావిపల్లు, పలకొనులు ఇప్పటి ఏగ్రామములకు సరిపోవునో తెలియరాకయున్నది. రావిపల్లు నరసాపురము తాలూకాలోని యిప్పటి రావిపాడు అగునేమో. పలకొలనకు పలకొను అని తప్పుగా వ్రాయబడిన. మొదల అది యిప్పటి పాలకొలను (పాలకొల్లు—నరసాపురము తాలూకా) కావచ్చును. మిగిలినవి బొత్తుగా గుర్తింపరావు. స్థానికులు వీటిజాడ తీయగలరేమో.

ఈ పైపట్టిక ననుసరించి చూచినయెడల ఇప్పటి నరసాపురము, భీమవరము తాలూకాలును, తణుకు తాలూకాలోని గొంతభాగమును ఆక్రమించిన ప్రదేశమునకు పూర్వకాలమున పాగుణారవిషయమని, పావునవారవిషయమని, పానారదేశమని, పానారసీమయని వ్యవహార ముండినట్లు విస్పష్టమగుచున్నది.28 ఈ పాగు

28. పాగునారవిషయమునుగురించి గొనర్మెంటు శాసనశాఖవారు తమ ౧౯౨౧-వ సంవత్సరపు శాసనవార్షికనివేదికలో (Annual report on Epigraphy for 1921) ఇట్లు వ్రాసియున్నారు:

"We have met with the territorial division called Pagunara Vishaya in certain inscriptions of the Andhra country. Among the earliest epigraphical references to this division is the copper-plate grant No. 6 of 1916-17 (See Annual Report on Epigraphy for 1917, page 132, paragraph 52). Among the inscriptions of this year are a few, Viz. Nos. 734, and 736 of 1920, dated in Saka 1082 and No. 744 of 1920 bearing no date, which come from Juttiga in the Tanuku Taluk which refer to the Pavanavara Vishaya, through which the river Gudhastani flowed and in which the village Duttika (modern Juttiga) was situated. The Pavanavara Vishaya must be the same as the Pagunara Vishaya referred to above and either of these names might be the original of the Prannadu to which a sect of Andhra Brahmans are now said to belong. The territorial division must have included within it the modern Tanuku Taluk or a part of it." (Vide para 88.)

కొరవిషయము వసిష్ఠగోదావరికి దక్షిణకటమున నున్న దేశము. మనశాసనమున దెలుపబడిన గ్రామములు భీమవరము, లేణుకు, నరసాపురముతాలూకాలలో సంచరించెను.

దానమిచ్చిన గ్రామము ఉమికిలి. ఇది యిప్పటి గోస్తనదికి ప్రాచీననామమని ఇదివరలో తెలిపిన గూణ్తని (గూఅ్తని) అను నదికి పడమటిదిక్కున నున్నది. ఈగ్రామమునకు తూర్పున అండలూరు, అగ్నేయదిశను కొండయపూండి, దక్షిణమున వేంద్ర, పడమట మొంగొలని పెంజెఱువుకట్ట, వాయవ్యదిశను కోర్కొలను, ఉత్తరమున ఆరువల్లి అను గ్రామము లున్నవి. మొంగొలని పెంజెఱువుకట్ట యనగా మొంగొలను గ్రామమునకు చెందిన పెద్దచెఱువుకట్టు అని యర్థము. ప్రాచీన గ్రామనామములలోని చివరిపదమైన కొలను కాలము గడచగా నేటికి కొల్లుగా మారినది. అందువలన మొంగొలను మొంగొల్లు అయి, జనవ్యవహారమున మోగల్లు అయినది. ఇట్లే పూర్వపు కోర్కొలను ఇప్పుడు కోర్కొల్లు (కోరుకొల్లు)ను, పాలకొలను ఇప్పుడు పాలకొల్లును అయినవి. కొండయపూండి నేటికి కొండేపూడిగా మారినది. ఈమార్పులను గమనించినచో ఈ సరిహద్దుగ్రామముల నన్నిటిని నేడు గుర్తింపవచ్చును. అండలూరు, కొండేపూడి, వేంద్ర, మోగల్లు, కోర్కొల్లు గ్రామములు భీమవరముతాలూకాలో నున్నవి. మన శాసనమునందలి ఆరవల్లి తణుకుతాలూకాలోని యిప్పటి అరవిల్లి యే. ఈగ్రామములమధ్య ఇప్పుడున్న ఉనికిలియే మన శాసనమునందలి దత్తగ్రామమగు ఉమికిలి యనుటకు సందియము లేదు. తొమ్మిదవ శతాబ్దినుండి ఈయిరువదవ శతాబ్దివరకు గల పదునొకండు శతాబ్దుల కాలమున జనవ్యవహారమున ఉమికిలి ఉనికిలి యైనది.

శాసనపాఠమును పరిష్కరించుటలో నా కత్యంతముగ తోడ్పడిన మిత్రులు విద్వాన్ శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారికి కింరుమూలమున నా కృతజ్ఞతాభివందనములను దెలుపుకొనుచున్నాను.

పాసువార, పావనవారములు ప్రాజ్ఞటి ప్రాచీనరూపములై యుండునని పైని వ్రాసిన విషయము సరియైనదికాదు. ప్రాజ్ఞటి ఆంధ్రబ్రాహ్మణులున్నారుకాని వారికి, పాసువార (పావనవార)మునకును సంబంధము లేదు. అట్లే పాసువార, పావునవారములకును, ప్రాజ్ఞటికిని సంబంధము లేదు. ఈరూపములు ప్రాజ్ఞడు ప్రాచీనరూపములుకావు.

'ప్రాజ్ఞడు'కు తెలుగు 'తూర్పువాడు'. ముసుండూరనగ్రామము తూర్పువాటిలో (ప్రాజ్ఞటిలో)(ఉన్నదని బాపట్లలోని యొక శాసనము(S.I I., Vol. VI, No. 179) తెలుపుచున్నది. ముసుండూరు ఇప్పుడు ముసునూరు (ముసున్నూరు) అయినది. ఈ గ్రామము నెల్లూరుజిల్లా కావలితాలూకాలోని దగుటచేత ప్రాజ్ఞడు కావలిప్రాంత మనుటకు సందియము లేదు. కమ్మనాడు, ప్రాజ్ఞడులు ఇరుగుపొరుగు విషయములు.



మూలము[1]

మొదటిరేకు : రెండవపేడ



1. స్వస్తి [॥*] శ్రీమతాం సకలభువన సంస్తూయమాన మానవ్యస గోత్రాణాం హారీతిపు [త్రా] ణాం కౌశి
2. కీవర ప్రసాదలబ్ధ రాజ్యానాం మాతృగణ పరిపాలితానాం స్వామిమ [హాసేనపాదా] నుధ్యాతానాం భగవ
3. న్నారాయణ ప్రసాదసమాసాదిత వరవరాహలాఞ్ఛనే [క్ష] ణ [క్ష] ణ [వశీకృతా] రాతిమణ్డలానాం అ [శ్వమే]
4. ధావభృథస్నాన పవిత్రీకృత వపుషాం చాళుక్యా [నాం కులమలంకరి] ష్ణో [ః సత్యా శ్రయ] వల్లభేన్ద్రి [స్య భ్రా]
5. తా, కుబ్జవిష్ణువర్ద్ధనః అష్టాదశవర్షాణి [।*] తస్య సూ [నుః జయసింహ*] వల్ల [భః త్రయస్త్రింశద్వర్షాణి । తస్యా*]
6. నుజస్య ఇన్ద్రిభట్టారకస్య ప్రియతనయః విష్ణురాజః న [వ*] వ [ర్షాణి । తస్యా త్మజః మం*]గి [యువరాజః పఞ్చవిం*]
7. శతివర్షాణి [।*] తస్యా [2] సుతః సకలలోకాశ్రయః జయసింహ [వల్లభః త్రయో దశవర్షాణి । తస్యానుజః కొక్క*]

---

1. నా దగ్గఱకు వచ్చిన రేకుల ననుసరించి వ్రాసినట్టిపాఠ మిది. కాని పాఠపరిష్కారసమయమునకు ఈ శాసనపు ప్రతిబింబములేకాని రేకులు నావద్ద లేకపోయినవి. రేకులమీది పంక్తుల మొదటి, చివర భాగము లందును, శాసనము చెడినచోట్లను ప్రతిబింబము లెంత ప్రయత్నించినను చక్కగా రాలేదు. ఈ పాఠమున అట్టి సందర్భములందు గల యక్షరములలో ఒకవేళ పొరపాటులు దొర్లిన దొర్లియుండవచ్చును. అవియైనను అల్ప స్వల్పముగనే. అట్టివున్నచో మరియొకతడవ రేకులతో సరిచూచి సవరింపగలను.

[*] ఈ కుండలీకరణమున శాసనమువూలమున లేనివియు, మూలమున నుండియు పూర్తిగ చెడి కానరానివియు జూపబడినవి.

[ ] ఈ కుండలీకరణమునందలివి మూలమున నుండి చెడిపోయి లీలగా గానవచ్చునవి. చెడిన భాగమునందలి యక్షరములు తెలియరాని సందర్భములయందు వీలయినచోటుల నితరశాసనసాధారమున పూరింపబడినవి.

2. 'తస్య' అని చదువవలెను.

రెండవ రేకు : మొదటిపెడ



8. మాతురగ కోకిలిః షణ్మాసాన్ [।*] తస్యాగ్రజో విష్ణువర్ధనః [సప్తత్రింశద్వర్షాణి । తస్య పుత్రః విజయాదిత్యః*[3]]
9. ఏకాన్నవింశతి వర్షాణి [।*] తస్య సూనుః విష్ణువర్ధనః షట్త్రింశద్వర్షా [ణి । తస్య ప్రియతనయః విజయాదిత్యః*[3]]
10. [అష్టో*] త్తరం యుద్ధశతం జిత్వా లబ్ధయశోజయః[4] [।*] చాళుక్యార్జునభూ [పాలో రాజా చాళుక్యవంశజః[5] ॥౧॥ నరేన్ద్రమృగ*]
11. రాజః శ్రీ విజయాదిత్యభూపతిః [।*] త్యాగీ భోగీ [మహోద్యోగీ] [నిత్యసత్యా శ్రయాన్వయః ॥౨॥ అష్టో*]
12. [త్త] రం యుద్ధశతం యుద్ధ్వా తత్పాపనుత్తయే [।*] తత్తద్యుద్ధ ప్రదేశేషు [వేంగీ] దేశే [సమన్తతః] [॥౩॥ అగ్రహార*]
13. [ప్ర*] పారామ తటాకోపవనానిచ [।*] నరేన్ద్రేశ్వరనామాని సేశ్వరాయతనానిచ [॥౪॥*] [నవ్య] [త్త*] [గీతసత్రాణి చా*]
14. [ష్టో] త్తరశతాని యః [।*] కృతవాన్స సదా భాతి భూతలఖ్యాత [సాహసః[6] ॥౫॥ ఏకచత్వారింశ ద్వర్షాణి । తస్య సుతః*]

---


3. మొదటి రెండుపంక్తులలోను చివరిభాగములకు కొంత విరిగిపోయినది. ప్రకటితములైన ప్రతిబింబ ములననుసరించియే ఈ విషయము గ్రహింపవచ్చును.

4. 'జయా' అని చదువవలెను.

5. ఇచ్చటినుండి శ్లోకము లారంభము. శ్లోకసంఖ్య నేను వేసినది; శాసనము మూలమున నీయలేదు. ఎచటనైన ఛందోనియమములకు అల్పమైన భేదములుండినను ఉండవచ్చును; నడకనుబట్టిచూడగా నివి శ్లోకములే యనుటకు సందియము లేదు.

6. ఇక్కడికి శ్లోకము లైదు.

రెండవ రేకు : రెండవ పెడ



15. కలివిట్ట [రనామా] వింశతిమాసాన్ వేంగీమణ్డల మన్వపాలయత్ [।*] తస్య [జ్యేష్ఠో విజయాదిత్యః దినక*]

16. రఇవ పద్మానన్దకరః వైనతేయ ఇవ వినతానన్దజననః అనేకధను [ష్మత్సహ] [యోప్యఖ్యాతని*]

17. శాతతరవారిసనా[7]థ కరైక[8] సహాయః రామఇవ సీతానన్దకరః [యుధిష్ఠిరఇవ భీమా ర్జునయశోధి*]

18. కః చన్ద్రిఇవ సన్మార్గనయాయీ కలాధరో ప్యదోషాకరః [లక్ష్మిప్రియోపి కువధూ ప్రియః అయ*]

19. తిమానపి సువృత్త [ః*] మాతంగ ప్రియోపి శుద్ధచరితః [అహీనోప్య (?) వ్యా (?)..........................[9] *]

20. రాష్ట్రి [కూటా] ధిప స్యేన్ద్రిభట్టారకస్య హిమవతో భవనీవ[10] పితు [ఃభూధర మాన్యతాం జనయన్తి జలధే * [11]]

21. ల్లనక్ష్మీరివ జనకా త్సీతేవ శీలాదిగుణాన్వితత్వా [చ్ఛీలకే త్యనన్వర్థనామవ త్యజని తస్యా ఉమాయీూ ఇవ *] [11]

---

7. 'సనాథ' అని చదువవలెను.

8. 'కరైక'లోని చివరి 'క'ను లేఖకుడు మొదట వ్రాయమఱచి పిదప 'రై' 'స'ల నడుమ పంక్తికి దిగువను వ్రాసినాడు.

9. పంక్తిచివర జోర్తుగా తెలియవచ్చుట లేదు.

10. 'భవానీవ' అని చదువవలెను.

11. చివరిభాగమున రేకు ముక్కపోయినది.

మూడవరేకు : మొదటిపెడ



22. శరవణభవా[12] ప్రతిహతశక్తి [:*] స్వతను సమధృతానేక తులాభార దానధారా [ప్రక్షాలిత కల్మషః *[13]]
23. స్వవిక్రమన్యక్కృతానేక వక్రరాతి[14] చక్రవిక్రమః [।*] భ[15] ద్రఘటా కల్పపాద పచిన్తామణికామ [ధేను] [షు*]
24. గతాసు జీవన్త్యధనాః కథమితి దిత్సురివ[16] భూ [త్రిభువన] కన్దర్పః [॥౬॥*] బలి శిబి దధీచకర్ణాంగు [ప్త] [శ్చ*]
25. తే [ప్రి] థగ్గతా[17] స్త్యాగే [।*] యాచకజనభాగ్యవశా [త్సంఘస్తే] షామి వాభవ గ్గుణగః [॥౭॥*] చతురుదధి [వృ*]
26. తధరాయా న్నమదరినివహాయ నృపతి మార్తాణ్డః [।*] న దదాతి పాదమేక స్త్యగమ[18] [హం] [గ్రహావ?*] రశ్చ తచ్చిత్ర [మ్ ॥౮॥*]
27. యస్య విజేతు శ్చరతశ్చాశ్చ మహాశబ్దసంహతి స్స్వపతి పురా అరసంకకేసరీ [.స్య...... రిపు సంఘదా (?)*[19]]
28. రణఇతి వదతీవ [॥౯॥*] యస్యచ సితాతపత్రన్తరవారి హాతారికరి ఘటస్యా [స్ర] జలైః [।*] అభిషిక్తాయాంల

12. 'శరవణభవో ప్రతిహత' అని చదువవలెను.

13. మొదటి రెండుపంక్తుల చివర భాగముల రేకు విరిగిపోయినది కొంత.

14. 'వక్రారాతి' అని చదువవలెను.

15. ఇచ్చటినుండి మరల శ్లోకము లారంభము.

16. 'దిత్సురివాభూ[త్స...]' అని చదువవలెను.

17. 'పృథగ్గతా' అని చదువవలెను.

18. 'పాదమేకస్త్యాగ' అని చదువవలెను.

19. కుండలీకరణమునందలి యక్షరములు స్పష్టముగా లేవు. ఈ శ్లోకము ఈ విజయాదిత్యుని ఉరువుటూరు శాసనమునందును, పాములపాడుశాసనమునందునుగూడ గలదుకాని, ఉత్తరార్ధమున వ్యత్యాసము కలదు. ఉరువుటూరుశాసనమున తప్పులతో ఉత్తరార్ధపాఠ మిట్లు : "పరనృపకాకరివిదాణదరసంకకేసరీ శ్రీవిజయాదిత్యః." ఈ భాగమే పాములపాటిశాసనమున నిట్లున్నది : "పరనృపకకరివిధా(దా)రణ అరసంకకేసరీ శ్రీవిజయాదిత్యః" పరనృపతులను కరిసంఘమును చీల్చుటచేత ఈ మూడవ విజయాదిత్యునికి 'అరసంకకేసరి'యను బిరుదము కలిగి యుండవచ్చును.

మూడవరేకు : రెండవపెడ



29. త్మ్నః కరధృతసిత కమలపుష్పమివ భాతి రణే [॥౧౦॥*] యస్యభుజన్నృపతు[20]ఙ్గః ప్రతిదిన మభ్యర్చ్చ్యర్ఘ్య భవతి రిపున్నృ [ప]
30. తుఙ్గః [।*] త్రిజగన్నారాయణతాం ప్రభవతి యస్మాత్సతా పునారాయ [ణ *?] తా [21] [॥౧౧॥ *] యశ్చోదయేతిరక్త స్సకళ స్సమ్పూర్ణ్ణమ [22]
31. ణ్డలో రాజతమః [।*] ఉష్ణకరతా పితాకులకుముదోద్భాసీ శశీవ వి[జయాదిత్య] [ః॥౧౨॥ *] అతిధృతి విర్ణ్ణనతోదితన [త్రి? *]
32. యః కుటిలవృత్తి మనస్సు భయంకరః [। *] గరుడవేష ఇవాచ్యుత శాసనః త్రిభువ నాంకుశ [ధన్యన? *]
33. యశ్చ సః [॥౧౩*॥] బిరుదంక భీమనామ శ్రవణహతారాతి గర్వ్వ [ః*] తో మనుసదృశః [।*] శ్రీమా న్విజయాదిత్య [............]
34. నృపరాజ్య రక్షణోద్యత బహుః [23] [॥౧౪॥*] సంగ్రామ నిర్జ్జితరిపు ప్రమదావిలో లనే త్రాంబుపాత [24] దమనీ [క............] [25]
35. వహ్నిః [ః। *] మంగ్యాఖ్య రావణమనివ్వ్య యశోవతంసం హత్వారణే భ [వ *] తి యః పరచక్రరామః [॥౧౫॥ *] నిమ్మర్ [(?)...... [26]]

---

20. "నృపతుఙ్గ"లోని 'తు' లేఖకుడు మొదట వ్రాయమటచి పిదప దానిని పంక్తికి దిగువ 'ప', 'ఙ్గ' లకు నడుమ వ్రాసెను.

21. అర్థ మస్పష్టము. ఈ శ్లోకమునందలి యుత్తరార్థము దోషదూషితముగను గానవచ్చును.

22. "సమ్పూర్ణ్ణమణ్డలో రాజతమః" అన్న పాఠము సరియైనది కాదు. మూలమున నక్షరము లాక్రమమున గానవచ్చుచుండుటచేత అట్లు వ్రాయబడినది.

23. "బాహుః" అని చదువవలెను.

24. "విలోలస్నేత్రాంబుపాత" అని చదువవలెను.

25. "దమనీకృతదావవహ్నిః" అన్న సరిపోవును; కాని మూలపాఠ మది యగునో కాదో.

26. "నిమ్మర్"కు దరువాత అక్షరములు స్పష్టముగా లేవు.

నాలుగవ రేకు : మొదటి పెడ[27]



36. ......ణా (?) సు ప్రబధ్య సుస్థిత ఇత్థం ఆజ్ఞాపయతి సర్వాన్నాగుణ......
37. తమిదమస్తు భవతాణ్డో [28] (?) యూరుకృతాస్పదో గుణాభ్యధికతమః................
38. స్థ్రిమాన్యాంశ్రితయా చరణేన తైత్తిరీయో గోత్రేణ కుణ్డినేషు...తమస్య...స్య......
త్ర......
39. విషయాఇవ చిత్తహారిణః పఞ్చన్యణా [ం*] యో మేణ్ణ యాభిధానః కావ్యగీత
న్నిశమ్య వికసితవదనః
40. యాచకజనాయ సర్వద్రవ్య ద్దత్వా వినిర్గత [ః*] స్వస్యగృహాత్ [29] తస్యతు
రాజాదిత్యో విక్రమధవళః ప్ర [థి]
41. తబిజ్యణనామా కొండమళమ్మా శూరసూరెయనామేతి పఞ్చపుత్రా ఆసన్ వేదా
ధ్యయన సమృద్ధాః రాజ్ఞా [ం*]
42. విద్యాసు భార్గవాంగిరసాఖ్యాః వ్యాకరణ తత్వకుశలాః కర్తారో వేదవిహితక
[ర్మణ] [ణాం*] [30] సమస్త అయ్యణస్య [య్యాణ]

---

27. అక్షరములు చాల చెడిపోయి పాఠము నిర్ణయించుటకు సరిగా కుదరకపోవుటచేత ఈ పెడనుండి శ్లోకవిభాగము చేయుట కనబడుటలేదు.

28. "భవతాణ్డేయూరు" అను పాఠమునకు అవకాశము కలదు.

29. ఇక్కడికి శ్లోక మంతమైనట్లు తోచుచున్నది.

30. ఇచ్చటినుండి పాఠార్థము అస్పష్టము.

నాలుగవ రేకు : రెండవ పెడ



43. [31]సుతామే (?) కా (?) ర్యాకార్యా విచార్య్యా సత్కృత్తర: రిపుబలమథనవిధానే కున్తీపుత్రై స్సమాన కర్మ్మాణోస్మి

44. న్ సత్యాభిమాన శౌచ ప్రతాపవన్తో మహీశ్వరాణా మ్మాన్యాః చాలుక్యకుల సము ద్భవ రాజాదన్యన్న సేవితా

45. రో నృపతిః [32] [||*] పట్కామ్మాణ నిరతేభ్య శ్చారుయశోభ్యో జితారి షడ్వర్గాభ్యః విభవారవిన్దనన్దిత బన్ధుజనభ్రమర

46. నినదవద్వసతిభ్యః సూర్య్యా గ్రహణనమిత్తే [33] శాస్త్రర్తాం [34] సర్వ్వశాస్త్ర విద్భ్యస్తేభ్యః ఉమికిలినామాగ్రా

47. మ స్సోదకపూ [ర్వ్వా*] మ్మయా గ్రహారో దత్తః [|*] ఇత్థం సూర్య్యా గ్రహణ నిమిత్తే రాజమయ్య ధవలయ్య బిజ్యణ్ణ కొండమ్మ

48. నడుపెయ శూరెయ నామధేయేభ్యః [35] పంచభ్యో దత్త స్యోమికిలి నామధేయ స్యావధయః కథ్యన్తే [|*] పూర్వ్వతః అ

---

31. అక్షరములు స్పష్టముగ దెలియవచ్చుటలేదు. అర్థ మస్పష్టము. ఇది ఈ యైదుగురు సోదరులును ఒక వైశ్యయువతిని వివాహముచేసికొని రను భావమును సూచించుచున్నట్లున్నది. ఈ సోదరులు రిపుబలమథనవిధానమున కుంతీపుత్రులతో సమానమైనవారని పై పాఠము తెల్పుచున్నను వారికిని, కుంతీపుత్రులకును సాటువ ఒక్క రిపుబలసంహారమునమాత్రమే కాక వివాహవిషయమునను గలదేమోయని యనుమానము పొడముచున్నది; ఏలన, "ఆర్యసార్యాసుతామేకా (ం?)" అని సుతాశబ్ద మేకవచనముగనే ప్రయుక్తమైనది. సు, తా రెండక్షరములును సుస్పష్టముగ నున్నవి. ఇట్టి దనులోమవివాహముక్రిందికి వచ్చును. బ్రాహ్మణుడు మిగిలిన మూడువర్ణములవారినుండి వివాహమాడుట ధర్మశాస్త్రసమ్మతము. అయినను ఇదే ఈ పాఠముభావమని రాయిగ్రుద్దినట్లు చెప్పుటకు కుదురదు; అనుమానముమాత్రమే. ఈ పాఠ మింకను విచారింపదగినది. "సుతా మేకాం భార్యార్థం కార్యార్థ విచార్య్య" అని యుండదగునేమో పాఠము. విజ్ఞులు పరిశీలింతురుగాక.

32. "నృపతిం"అని చదువవలెను.

33. "నిమిత్తే" అని చదువవలెను.

34. "శాస్త్రర్థిణం" అని చదువవలెను.

35. ఇంతకుపూర్వము రాజాదిత్య, విక్రమధవళ, బిజ్యణ, కొండమ, శూరనూరెయలని పేర్కొనబడినవారు ఇచట రాజమయ్య, ధవలయ్య, బిజ్యణ్ణ, కొండమ్మ, నడుపెయనూరెయలని చెప్పబడినారు.

49. ణ్డలూరు గుఱ్ఱతని పూర్వ్వభాగః సీమ [।*] ఆగ్నేయతః కొణ్డయపూణ్డి గుఱ్ఱతని పూర్వ్వభాగవేవ [।*] దక్షిణతః

అయిదవరేకు : మొదటిపేడ



50. వేణ్ణ స్యాపేవ నద్యా దక్షిణత [ట*] భాగోవధిః [।*] నైరిత్యా మున్రకపాడలు [।*] పశ్చిమతః మోంగోలను
51. పెంజెఱువుకట్ట [।*] వాయవ్యతః కోక్కాణాలను [।*] ఉత్తరతః అరువల్లిపూ [ర్వ్వో] త్తరో 36 గూఱ్ఱతనీనామ సరిత్ [॥*] ఏ
52. తేషా మ్మధ్యవర్త్తినః 37 అస్యోపరి నకేనచి ద్బాధా కరణీయా [।*] యః కరోతి స పఞ్చమహాపాతక సంయుక్తో
53. భవతి [॥*] వ్యాసేనా ప్యుక్తం [॥*] 38 [బహు] భి వ్వసుధా దత్తా బహుభి [శ్చాను] పాలితా [।*] యస్య యస్య యదా భూమి [స్త]
54. స్య తస్య తదా ఫలం [॥*] స్వదత్తాం పరదత్తాంవా యో హరేత వసున్ధరాం [।*] షష్టిం వర్షసహస్రాణి విష్టాయాం జాయతే [క్రి]39
55. మిః [॥*] న విషం విషమిత్యాహుః బ్రహ్మస్వం విషముచ్యతే [।*] విష మేకాకినం హన్తి బ్రహ్మస్వం పుత్రపౌత్రికం [॥*] ఆజ్ఞప్తి [ర]
56. స్య ధర్మ్మస్య పణ్డరంగో గుణాధిక [॥*] విజయాదిత్య భూపాల పదపద్మా శిలీ ముఖః [॥*] శ్రీ విజయః నామమాలేఖ్య (?) 40

---

36. "పూర్వోత్తర" అని చదువవలెను.
37. "ఏ తేషా మ్మధ్యవర్త్తిన" అని చదువవలెను.
38. ఇక్కడినుండి శ్లోకములు.
39. "క్రిమిః" అని చదువవలెను.
40. ఈ చివరియక్షరములు సరిగా తెలియవచ్చుటలేదు. "శ్రీ విజయనామా చాలేఖ్యమ్" అని యుండదగునేమో. ఇట్లయిన శ్రీ విజయ అన్నది దానిపాలుగా గైకొనదగును; లేక ఇది శ్రీ విజయుడు వ్రాసినది అనుదాని కపపాఠమేమో.



మద్రాసు కాంగ్రెసు ప్రధాని
శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు

మద్రాసులో మొన్న ఏర్పడిన కాంగ్రెసు మంత్రి వర్గములో తొలినాడు ప్రమాణ స్వీకారముచేసిన
మరి ముగ్గురు తెలుగు మంత్రులు



శ్రీ క. కోటిరెడ్డి.



శ్రీ వి. కూర్మయ్య.



శ్రీ వి. వి. గిరి.